# శ్రీ వాల్మీకి రామాయణము

తేటతెలుగులో

రచన

**డా. అద్దంకి శ్రీనివాస్**

ప్రకాశకులు

చల్లా సాంబిరెడ్డి

B.A;LLB

అధ్యక్షులు

శ్రీపావని సేవాసమితి

హైదరాబాదు

**2021**

# శ్రీవాల్మీకి రామాయణము
## తేటతెలుగులో


రచన : **డా. అద్దంకి శ్రీనివాస్**

**చరవాణి** : 9848881838

**ఇమెయిల్** : draddanki@gmail.com

**పంచమ ముద్రణ** : 2021

**ప్రతులు** : 1000



**హక్కులు** : ప్రకాశకులవి



**ప్రకాశకులు**

**అధ్యక్షులు : చల్లా సాంబిరెడ్డి**
**శ్రీపావని సేవా సమితి**
ఇం.నెం. : 3-6-499ఎ,
రోడ్ నెం. 7, హిమాయత్‌నగర్
హైదరాబాదు - 500 029.
sripavanisevasamithi@gmail.com

**ముద్రణ :**

**వై.వి. రెడ్డి ప్రింటర్స్ & బైండర్స్,**
దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ - 500 036.
సెల్ : 9391015317
yvr.postpresssolutions@gmail.com

**వెల** : అమూల్యం

## శ్రీరామాయణపఠన ప్రారంభ ధ్యాన శ్లోకాలు

కూజంతం రామ రామేతి మధురం మధురాక్షరమ్,
ఆరుహ్య కవితాశాఖాం వందే వాల్మీకికోకిలమ్.

గోష్పదీకృతవారాశిం మశకీకృతరాక్షసమ్,
రామాయణమహామాలారత్నం వందేఽనిలాత్మజమ్.

రామాయ రామభద్రాయ రామచంద్రాయ వేధసే,
రఘునాథాయ నాథాయ సీతాయాః పతయే నమః.

నమోఽస్తు రామాయ సలక్ష్మణాయ దేవ్యై చ తస్యై జనకాత్మజాయై,
నమోఽస్తు రుద్రేంద్రయమానిలేభ్యో నమోఽస్తు చంద్రార్కమరుద్గణేభ్యః.

## శ్రీరామాయణపఠన ముగింపు శ్లోకాలు

స్వస్తి ప్రజాభ్యః పరిపాలయంతాం న్యాయ్యేన మార్గేణ మహీం మహీశాః,
గోబ్రాహ్మణేభ్యః శుభమస్తు నిత్యం లోకాస్సమస్తాః సుఖినో భవంతు.

చరితం రఘునాథస్య శతకోటిప్రవిస్తరమ్,
ఏకైకమక్షరం ప్రోక్తం మహాపాతకనాశనమ్.

ఆపదామపహర్తారం దాతారం సర్వసంపదామ్,
లోకాభిరామం శ్రీరామం భూయో భూయో నమామ్యహమ్.

మంగళం కోసలేంద్రాయ మహనీయగుణాబ్ధయే,
చక్రవర్తితనూజాయ సార్వభౌమాయ మంగళమ్.

కాయేన వాచా మనసేంద్రియైర్వా బుద్ధ్యాత్మనా వా ప్రకృతేః స్వభావాత్,
కరోమి యద్యత్ సకలం పరస్మై నారాయణాయేతి సమర్పయామి.

యదక్షరపదభ్రష్టం మాత్రాహీనం చ యద్భవేత్,
తత్సర్వం క్షమ్యతాం దేవ నారాయణ నమోఽస్తు తే.

**॥ శ్రీరామ జయరామ జయ జయ రామ ॥**

# శ్రీరామస్తుతి

సీ. నీలమేఘచ్ఛాయఁ బోలు దేహమువాఁడు
ధవళాబ్జపత్ర నేత్రములవాఁడు
కంబుసన్నిభమైన కంఠంబు గలవాఁడు
చక్కని పీనవక్షంబువాఁడు
తిన్ననై కనుపట్టు దీర్ఘబాహులవాఁడు
ఘనమైన దుందుభిస్వనమువాఁడు
పద్మరేఖలు గల్గు పదయుగంబులవాఁడు
బాగైనయట్టి గుల్ఫములవాఁడు

గీ. కపట మెఱుఁగని సత్యవాక్యములవాఁడు
రమణి! రాముండు శుభలక్షణములవాఁడు
ఇన్ని గుణముల రూపింప నెసఁగువాఁడు
వరుససౌమిత్రి బంగారు వన్నెవాఁడు.

– మొల్ల రామాయణము, సుందరకాండ – **102**

# వినుడు! వినుడు! శ్రీరామాయణ గాథ

**పి**ల్లలూ.. పిల్లల్ని తీర్చిదిద్దే పెద్దలూ..

శ్రీరామాయణం ఒక గొప్ప గ్రంథం. మొట్టమొదటి కావ్యం. అందులో శ్రీరామచంద్రుని చరిత్ర ఉంది. సీతమ్మతల్లి చరిత్రా ఉంది. కేవలం చరిత్ర మాత్రమే కాదు. మానవుడు అప్పటికీ ఇప్పటికీ ఎప్పటికీ ఎలా నడుచుకోవాలో ఉంది. ఇంకా చెప్పాలంటే రామాయణం మన ప్రాచీన భారతదేశ చరిత్ర. మానవుడు ఆచరించవలసిన ధర్మాలకూ నియమాలకూ అది నిలయం.

వేదాలు చెప్పే నీతులు అందరికీ అర్థం కావు కదా! అందుకే ఆ వేదమే వాల్మీకి నోట కావ్య మయ్యింది. అదే రామాయణం.

మనం ధర్మాన్ని కాపాడితే (ఆచరిస్తే) అది మనల్ని కాపాడుతుంది. దానికి ఉపద్రవం కలిగిస్తే అది మనల్ని హింసిస్తుంది (ధర్మ ఏవ హతో హన్తి ధర్మో రక్షతి రక్షితః). అందుకే ధర్మాన్ని కాపాడమని చాటిచెప్పడమే ఈ కావ్యంలోని పరమార్థం.

శ్రీరామాయణానికి సాటి రామాయణమే. ఎన్ని భాషల్లో ఎన్ని రూపాల్లో ఎందరు శ్రీరామాయణాన్ని రాసినా చదివినా ఎంతకీ తనివి తీరనిది శ్రీరామకథ.

శ్రీరాముడు అంటే ధర్మానికి రూపం. సత్యానికి దీపం. కాబట్టి, ప్రతి ఒక్కరూ శ్రీరాముణ్ణి చూసి ఎంతో నేర్చుకోవాలి. ఎవరు, ఎక్కడ, ఎలా, ఎంతవరకూ ప్రవర్తించాలో తెలుసుకోవాలి. మంచి ప్రవర్తన, లోకానికి మంచి చేయాలనే ఆలోచన, త్యాగం, దానం, శౌచం, క్షమలాంటి సుగుణాలెన్నో రామాయణ కావ్యాన్ని చదవడం వల్ల కలుగుతాయి. కలగాలి. అదే మా లక్ష్యం.

ఈ లక్ష్యాన్నే ఊపిరిగా శ్వాసిస్తున్న శ్రీరామకార్యధురంధరులు మాన్యశ్రీ చల్లా సాంబిరెడ్డిగారు. ఈ రామాయణం – సంగ్రహంగా ఉన్నా సమగ్రసుందరంగా ఉండాలని వారు ఎంతగానో తపించారు. శ్రమించారు కూడా. వారే నా ఈ రచనకు కర్త, కర్మ, క్రియ. వారికీ అలాగే శ్రీపావని సేవాసమితి బృందానికీ నా కైమోడ్పు.

ఈ గ్రంథంలో ఔచిత్యానికి పెద్దపీటవేస్తూ, ఈనాటి సమాజానికి ఏది కావాలో దానినే అందించాం. మా ప్రయత్నాన్ని స్వాగతిస్తూ.. రండి! శ్రీరామరసాన్ని ఆస్వాదిద్దాం. ఆదర్శలోకాన్ని నిర్మిద్దాం.


– డా. అద్దంకి శ్రీనివాస్

draddanki@gmail.com

# ప్రకాశకుల మనవి

మన భారతదేశం ఒకానొక పురాతన కాలంలో జగద్గురువుగా మాత్రమే గాక జగచ్చక్రవర్తిగా గూడా వెలుగొందింది అనే విషయాన్ని భాగవతాది పురాణాలు ప్రవచిస్తున్నాయి.

దానికి కారణం ఆనాటి ప్రజలు వేదాలలో దాగివున్న భౌతికాభౌతిక సత్యాలను యథాతథంగా గ్రహించి, వాటిని ఆచరణలో పెట్టగలగటమే.

యుగాల ప్రభావంలో ఏకఖండంగా వున్న భూఖండం సప్త ఖండాలుగా విభక్తమైంది. ఈ ప్రకృతి సంక్షోభ సన్నివేశాలలో భరత ఖండానికి గల వేదవైభవం ఒకింత బలహీనమైంది. దానివల్లనే భరతఖండ ప్రభావం సన్నగిల్లింది.

ప్రజలకు వేదార్థ గ్రహణంలో గల సామర్థ్యం క్షీణించటాన్ని గమనించిన మహర్షులు దయామయులై వేదోపబృంహణం కోసం వేదానికి సమాంతరంగా నూతన లౌకిక సాహితీప్రవాహాన్ని ఒకదాన్ని ప్రవర్తింపచేశారు. రామాయణం వంటి కావ్యాలు, భాగవతం వంటి పురాణాలు, భారతం వంటి ఇతిహాసాలు మొదలైనవన్నీ ఆ ప్రవాహంలోని తరంగాలే.

వీటన్నింటిలోకీ సర్వాదిమమైనది శ్రీరామాయణం. దీని కర్త వాల్మీకిమహర్షి. ఆయనకే మరో పేరు ప్రాచేతసుడు. *'వేదః ప్రాచేతసాదాసీత్ సాక్షాద్రామాయణాత్మనా'* (వేదవేద్యుడైన పరమాత్మ శ్రీరాముడుగా అవతరించేసరికి, వేదం వాల్మీకి ద్వారా శ్రీరామాయణంగా అవతరించింది) – అని వాల్మీకిని సమకాలీనులైన మహర్షులే కీర్తించారు.

ఇట్టి వాల్మీకి రచించిన రామ జీవితమే శ్రీరామాయణం. అడుగడుగునా ధర్మ పరీక్షలే రామజీవితం.

విద్యార్థిదశ పూర్తి అవుతూ వుండగానే విశ్వామిత్రాగమన రూపంలో ఒక ధర్మపరీక్ష. ఇంకా పదహారేళ్ళు నిండని లేత వయసులో శ్రీరాముడు ఆ పరీక్షలో నెగ్గి సీతాదేవిని చేబట్టాడు.

మరో పన్నెండేళ్ళు గడిచేసరికి, చేతికి అందిన మహాసామ్రాజ్యం చేజారి పోవటమే గాక, పద్నాలుగేళ్ళ వనవాసప్రాప్తి మరో మహాపరీక్ష. ఆ పరీక్షా కాలంలో

నానా సంకటాల పాలైన శ్రీరాముడు చివరికి సీతామహాసాధ్విని అగ్నిపరీక్షకు గురి చేయవలసి రావటం మరో ఘోర ధర్మపరీక్ష!

అరణ్యవాసం తీరి, సామ్రాజ్య పట్టాభిషేకం పొందిన కొద్ది రోజులలోనే దేశంలోని నలుమూలలా ప్రజలనేకులు శ్రీరాముణ్ణి ఇంద్రియలోలుడని అధిక్షేపిస్తూ వుంటే, దానివల్ల వ్యక్తిధర్మానికీ, రాజధర్మానికీ పోటీ యేర్పడగా, గుండెను బండగా మార్చుకొని రాజధర్మానికే తలవొగ్గవలసి రావటం మరో ఘోరాతిఘోరమైన ధర్మపరీక్ష!

ఆ తరువాత రాజుగా పదివేల సంవత్సరాలపైగా జీవించి, ప్రపంచంలోనే ప్రప్రథమంగా వికేంద్రీకృత రాజ్యవ్యవస్థ (Federal System of Governance) ను రూపొందించి, రామరాజ్య వ్యవస్థాపన చేసి, ఉత్తర దక్షిణ భారతదేశాలను రాజకీయంగా, ధార్మికంగా, సాంఘికంగా సాంస్కృతికంగా సమన్వయపరచటంలో లెక్కకు మించిన ధర్మపరీక్షలు!

ఇదీ స్థూలంగా శ్రీరాముడి ధార్మికపరీక్షా జీవధార!

ఈ పరీక్షాపరంపరలో శ్రీరాముడు ఒకసారి గూడా ఓడిపోలేదు, తూలిపోలేదు, కుంగిపోలేదు, కూలిపోలేదు. విద్యార్థిగా, వ్యక్తిగా, పుత్రుడుగా, సోదరుడుగా, భర్తగా, రాజుగా ఆయన సర్వోన్నతుడుగా నిలిచాడు.

అందుకే శ్రీరామకథ ఇన్ని యుగాల తరువాత కూడా ఇంత దేదీప్యమానంగా వెలుగొందుతోంది. ఒక్క భారతదేశంలోనే కాదు; ఖండ ఖండాంతరాల్లో గూడా!

ఇలాంటి ఈ శ్రీరామచరిత్రను హృదయానికి అందించుకోగలిగినవాడే నిజమైన భారతీయుడు. వాడే తన జీవన ప్రస్థానంలో ధర్మసంకటాలెదురైనప్పుడు మేరుశిఖరంలాగా నిశ్చలుడై నిలవగలుగుతాడు, గెలవగలుగుతాడు. వాడే ప్రపంచ సోదరులందరికీ మార్గనిర్దేశనం చేయగలుగుతాడు. వేదాలలో నిగూఢంగా నిక్షిప్తమై వున్న సమస్త ధర్మ రహస్యాలనూ అలవోకగా వివరించగలుగుతాడు. జాతి, కుల, మతాది పరిధులకు అతీతంగా విశ్వమానవుడై వెలుగొందగలుగుతాడు.

మన సమాజంలోని యువతీయువకులందరూ అలాంటి స్థాయిని ఆడుతూ పాడుతూ అందుకోగలగాలనేదే శ్రీ పావని సేవాసమితి తపన. దానికోసమే ఈ

సంగ్రహ శ్రీరామాయణ సంపుటిని సంతరించి ప్రజార్పణం చేస్తోంది. మన సమాజంలోని ప్రతి యింటినీ మాత్రమే గాక, ప్రతి చేతినీ గూడా ఈ గ్రంథం అలంకరించాలని శ్రీ పావని సేవాసమితి ఆరాటపడుతోంది.

ఈ శ్రీరామాయణసారాన్ని హృదయంలోకి ఆస్వాదించిన ప్రతి పౌరుడూ దేశ భక్తుడవుతాడు. ప్రతి మహిళా ఉత్తమ మాత అవుతుంది. ప్రతి అధికారీ ధర్మబద్ధు డవుతాడు. ప్రతి నాయకుడూ నిస్స్వార్థతకు నిలయమవుతాడు. ఇది త్రికాల సత్యం. సత్యమే ధర్మం. సత్యమేవ జయతే. ధర్మ ఏవ జయతే.

మేము తలపెట్టిన ఈ శ్రీరామాయణ ప్రచార కార్యంలో మాకు ఇప్పటివరకు పలువురు మహనీయులు తమ అమూల్యమైన సలహాలు, సహకారం అందించారు. వారందరికీ మా హార్దిక ధన్యవాదాలు. విశేషంగా, ఇప్పుడు మీకు అందిస్తున్న శ్రీరామాయణం డా. అద్దంకి శ్రీనివాస్ గారి కృషి ఫలితం. ప్రధాన కథకూ, అందులో వివిధ పాత్రల ద్వారా వాల్మీకి మహర్షి మనకు అందించిన మహోపదేశాలకు ఏమాత్రం లోటు కలుగకుండా ఆయన శ్రీరామాయణ గ్రంథాన్ని సంగ్రహపరచి, మధురాతిమధురమైన భాషలో దీన్ని తీర్చిదిద్ది పాఠకులకు అందించారు. వీరి కృషికి మేము ఏమిచ్చినా ఋణం తీరదు. వీరు సహనశీలురు. ఎంతో సౌజన్యంతో సహకరించి మా అంచనాలకు తగిన రీతిలో ఈ గ్రంథం అందించినందుకు వారికి సమితి పక్షాన నా కృతజ్ఞతాంజలులు.

ఇట్లు

**చల్లా సాంబిరెడ్డి**

అధ్యక్షుడు, శ్రీ పావని సేవాసమితి

# విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | బాలకాండ | ..... | 1 |
| 2. | అయోధ్యాకాండ | ..... | 29 |
| 3. | అరణ్యకాండ | ..... | 67 |
| 4. | కిష్కింధాకాండ | ..... | 99 |
| 5. | సుందరకాండ | ..... | 131 |
| 6. | యుద్ధకాండ | ..... | 167 |
| 7. | ఉత్తరకాండ | ..... | 203 |
| | అనుబంధం<br>శ్రీరామాయణ నీతిచంద్రిక<br>(పద్యాలు) | ..... | 234 |

# బాలకాండ

**పూ**ర్వం గంగానదీ తీరంలో ఒక పవిత్రమైన ఆశ్రమం ఉండేది. అక్కడ వాల్మీకి అనే పేరుగల గొప్ప ఋషి తపస్సు చేసుకొంటూ ఉండేవాడు.

## నారద మహర్షి ఆగమనం

అటువంటి వాల్మీకి మహర్షి ఆశ్రమానికి ఒకరోజు నారదమహర్షి స్వయంగా విచ్చేశాడు. నారదముని నిత్యం వేదాన్ని అధ్యయనం చేస్తాడు. మంచి వక్త. ఋషులలో గొప్పవాడు. అంతటి నారదమహర్షే తనవద్దకు రావడంతో వాల్మీకి మహర్షికి పట్టరాని ఆనందం కలిగింది. ఆ ఆనందంలో తలమునకలౌతూ ఇలా అడుగుతున్నాడు–

'మహర్షీ! మహా గుణవంతుడూ, మేటి పరాక్రమవంతుడూ, గొప్ప ధర్మాత్ముడూ, చేసిన మేలు మర్చిపోనివాడూ, నిత్యమూ సత్యాన్నే మాట్లాడేవాడూ, గట్టి పట్టుదల కలవాడూ, అన్ని ప్రాణుల పట్లా దయ చూపేవాడూ, పండితుడూ, సమర్థుడూ, చూడచక్కనివాడూ, ధైర్యవంతుడూ, కోపాన్ని గెలిచినవాడూ, అసూయ లేనివాడూ, కోపం వచ్చిందంటే దేవతలైనా గడగడలాడించే శక్తి ఉన్నవాడూ.. ఎవరయినా ఈ లోకంలో ఉన్నారా..? ఉంటే. దయచేసి చెప్పరూ..' వాల్మీకి మహర్షి మాటల్లో కుతూహలం వ్యక్తమయింది.

అది విన్న నారదమహర్షికి ముచ్చటేసింది. వాత్సల్యం చివురు తొడిగింది. చిరునవ్వు చిందిస్తూ – "వాల్మీకి మహర్షీ! ఎంతటి మహాపురుషులకైనా మీరు అడిగిన సద్గుణాలన్నీ ఉండడం అసాధ్యం. అయితే ఇక్ష్వాకువంశంలో పుట్టిన ఒక మహనీయుడిలో అన్ని మంచిగుణాలూ రాసిపోసినట్లు ప్రకాశిస్తున్నాయి. చెప్తాను వినండి.

అతడి పేరు శ్రీరాముడు. ఆ రఘుపతి మహావీరుడు. లోక ప్రసిద్ధుడు. మనోనిగ్రహం కలవాడు. అన్ని విద్యలలోనూ ఆరితేరినవాడు. అతనికి లేని సంపద

లేదు. ఎంత గట్టి శత్రువైనా అతనిముందు మట్టికరవాల్సిందే. ఈ ప్రపంచాన్ని పోషించి, రక్షించగల సత్తా ఉన్నవాడు. సముద్రమంతటి గంభీరుడు. ధైర్యంలో హిమవంతుడు. సహనంలో భూదేవి. పరాక్రమంలో విష్ణుమూర్తి. చూడడానికి చంద్రుడిలా చల్లగా ఉంటాడే కానీ కోపం వచ్చిందా కాలాగ్నే.

శ్రీరామచంద్రుడు పరాక్రమం, ధైర్యం, కాంతి కలవాడే కాదు, బుద్ధిమంతుడు. నీతిమంతుడు. వాక్చాతుర్యం కలవాడు. సకలధర్మాలూ తెలిసినవాడు. ఆడిన మాట తప్పడు. ఎప్పుడూ లోకహితాన్నే కోరుకుంటాడు. పరిశుద్ధుడు. ఎప్పుడూ ఎవరినీ మోసం చెయ్యడు.

ఇన్నిన్ని సద్గుణాలే కాదు ఎన్నో శుభలక్షణాలూ మూర్తీభవించిన రూపం దాశరథిది. విశాలమైన మూపు, పొడవూ దృఢత్వమూ కల బాహువులూ, శంఖంలాంటి కంఠం, ఉన్నతంగా ఉండే చెక్కిళ్ళ పైభాగం, కండలుతేరిన విశాల వక్షఃస్థలం కలవాడు. ఆజానుబాహుడు. గొప్ప ధనువును ధరించి హెచ్చుతగ్గులులేని అవయవపుష్టితో అలరారుతూ ఉంటాడు. చూడముచ్చటైన శిరస్సూ, నుదురూ, అంత పొట్టీ అంత పొడుగూ కాని శరీరం, చక్కని ఛాయ, తేజస్సూ, చారెడు కళ్ళూ ఇలా సాముద్రికశాస్త్రంలో చెప్పిన అన్ని శుభలక్షణాలకీ ఒక ఆకృతి ఇస్తే అది కౌసల్యాతనయుడైన శ్రీరాము డవుతాడు.

సాక్షాత్తూ ఆ శ్రీమహావిష్ణువే చెడ్డవాళ్ళను శిక్షించి, మంచివాళ్లను కాపాడడం కోసం ఇలా శ్రీరాముడుగా అవతరించాడు. అంటూ శ్రీరామకథను సంగ్రహంగా పలుకుతున్నాడు నారదుడు.

## సంక్షేప శ్రీరామాయణం

అనగనగా ఒక రాజు. పేరు దశరథుడు. అతడికి భార్యలు ముగ్గురు. కౌసల్య, సుమిత్ర, కైకేయి. వీరికి నలుగురు పుత్రులు. శ్రీరామ భరత లక్ష్మణ శత్రుఘ్నులు. వీరిలో పెద్దవాడు శ్రీరాముడు. అతనికే పట్టాభిషేకం చేయాలను కొన్నాడు దశరథుడు. చిన్న భార్య అయిన కైకేయి దానికి అడ్డుపడింది. ఎప్పుడో ఇచ్చిన వరాలను ఇప్పుడు కోరింది. దశరథుడికి మాట అంటే ప్రాణం. ఆమె వరాలను తోసిపుచ్చలేకపోయాడు. కాళ్లావేళ్ళా పడ్డాడు కానీ ప్రయోజనం మాత్రం శూన్యం. ఫలితం – శ్రీరామునికి వనవాసం తప్పలేదు.

శ్రీరాముని భార్య సీతాదేవి అన్నులమిన్న. శ్రీరామునికి ఆమె అంటే ప్రాణం. సర్వలక్షణసంపన్న, అందాలరాశి అయిన సీతాదేవి, తానూ వనవాసానికి బయలుదేరింది. శ్రీరామునికి లక్ష్మణుడు ఆరోప్రాణం. అతడూ వస్తానన్నాడు.

ముగ్గురూ వనవాసానికి బయలుదేరారు. గంగాతీరం చేరుకొన్నారు. దారిలో గుహుణ్ణి కలిశారు. భరద్వాజమహర్షి ఆశ్రమాన్ని సందర్శించారు. చిత్రకూటంలో పర్ణశాల నిర్మించుకొని నివసిస్తున్నారు.

అక్కడ అయోధ్యలో దశరథుడు రాముణ్ణి ఎడబాసి చిక్కి శల్యమయ్యాడు. చివరికి స్వర్గస్థుడయ్యాడు.

తాతగారి ఇంటినుండి వచ్చాడు భరతుడు. జరిగిన దారుణాలు తెలుసుకొని బాధపడ్డాడు. వసిష్ఠాది మహర్షులు భరతునికి పట్టాభిషేకం చేస్తామన్నారు. అయినా వినలేదు భరతుడు. శ్రీరాముణ్ణి ఎలాగైనా తీసుకువస్తానని పరివారంతో సహా అడవికి వెళ్ళాడు. శ్రీరాముడు రాననడంతో నీ పాదుకలే రాజ్యపాలన చేస్తాయంటూ శ్రీరామ పాదుకలతో తిరిగి అయోధ్యకు వచ్చాడు. నందిగ్రామంనుంచే పాలన సాగిస్తున్నాడు.

తరువాత శ్రీరాముడు సీతాలక్ష్మణసమేతుడై చిత్రకూటం విడిచి దండకారణ్యం లోనికి ప్రవేశించాడు. అక్కడ విరాధుడు అనే రాక్షసుణ్ణి సంహరించాడు. శరభంగ, సుతీక్ష్ణ, అగస్త్య మహర్షుల ఆశ్రమాలను సందర్శించి వాళ్ళని సేవించుకొన్నాడు. ఆ తరువాత జనస్థానం వెళ్ళాడు. అక్కడ శూర్పణఖ అనే ఒక రాక్షసి శ్రీరామునిపై మనసుపడింది. అన్నగారి ఆజ్ఞ. లక్ష్మణుడు శూర్పణఖ ముక్కూ చెవులూ కోసి తగిన శాస్తి చేసి పంపాడు.

అవమానభారంతో రగిలిపోయింది శూర్పణఖ. ఖరుణ్ణీ దూషణుణ్ణీ త్రిశిరస్కుణ్ణీ వెంటబెట్టుకొని మళ్ళీ శ్రీరామలక్ష్మణులుండే చోటుకి వచ్చింది. వాళ్ళే కాదు అదనంగా మరో పద్నాలుగువేలమంది రాక్షసులూ వచ్చారు. వచ్చి శ్రీరాముని చేతిలో అంతా ప్రాణాలు కోల్పోయారు.

ఈ సమాచారమంతా విన్న రావణుడు – మారీచుణ్ణి మాయలేడిగా పంపాడు. మాయలేడిని చూసింది సీతాదేవి. తెచ్చిపెట్టమని శ్రీరాముణ్ణి కోరింది. విల్లు చేతపట్టి కదిలాడు శ్రీరాముడు. కొంతసేపయ్యాక శ్రీరామునికోసం లక్ష్మణుడూ వెళ్ళాడు. ఇదే అదనుగా వచ్చిన రావణుడు సీతాదేవిని అపహరించుకుపోయాడు.

సీతాదేవికోసం వెదుకుతూ, దారిలో ఎదురైన కబంధుణ్ణి వధించి, పంపాతీరం చేరుకొన్నారు శ్రీరామలక్ష్మణులు. అక్కడ కలిసిన హనుమంతుడు ఋష్యమూక పర్వతంపై ఉంటున్న సుగ్రీవుని చెంతకు వారిని చేర్చాడు. అగ్నిసాక్షిగా సుగ్రీవుడితో శ్రీరామలక్ష్మణులకు మైత్రి కుదిరింది. శ్రీరాముడు వాలిని సంహరించి సుగ్రీవుణ్ణి వానరరాజ్యానికి రాజుని చేశాడు. సుగ్రీవుడు సీతాదేవిని అన్వేషించడానికి వానర వీరుల్ని నాలుగు దిక్కులకూ పంపాడు. వారిలో హనుమంతుడు సముద్రాన్ని లంఘించాడు. లంకకు చేరుకొన్నాడు. సీతాదేవిని దర్శించి, శ్రీరాముడు ఇచ్చిన ఉంగరాన్ని ఆమెకు సమర్పించాడు. సీతాదేవి ఇచ్చిన చూడామణిని తీసుకొని శ్రీరాముని దగ్గరకు బయలుదేరాడు. వస్తూ వస్తూ అశోకవనాన్ని ధ్వంసం చేసి, అక్షకుమారుణ్ణీ ఇంకా కొంతమంది రాక్షసుల్నీ సంహరించి గాల్లోకి ఎగిరాడు. శ్రీరాముణ్ణి చేరుకున్నాడు. సీతాదేవిని చూశాను ప్రభూ! అంటూ సీతాదేవి జాడను శ్రీరామునికి అందించి అతణ్ణి ఆనందింపజేశాడు.

తరువాత సముద్రంపై వారధిని నిర్మించారు వానరులు. వానరసేన లంకను ముట్టడించింది. శ్రీరామరావణ సంగ్రామం అనన్యసామాన్యంగా లోకభీకరంగా సాగుతోంది. శ్రీరాముడు ఎందరో రాక్షసవీరుల్నీ చివరిగా రావణుణ్ణీ సంహరించి, విభీషణుణ్ణి లంకా రాజ్యానికి రాజుని చేశాడు. పరివారసమేతుడై పుష్పక విమానంలో నందిగ్రామం చేరుకొన్నాడు.

అప్పటికి వనవాసం పూర్తి అయ్యింది. శ్రీరామునికి పట్టాభిషేకం జరిపించారు వసిష్ఠాది మహర్షులు. అయోధ్యను చేరుకొని పదకొండువేల సంవత్సరాలు జనరంజకంగా రాజ్యాన్ని పాలించాడు శ్రీరాముడు.”

ఇదయ్యా శ్రీరామకథ. అని నారదుడు చెప్పడం ముగించాడు.

వాల్మీకిముని శ్రద్ధగా విన్నాడు. అమితానందభరితుడయ్యాడు. ఒళ్ళు పులకించింది. చెప్పలేనంత ఉత్సాహంతో మనస్సు గంతులు వేసింది.

## శోకం – శ్లోకం

నారదమహర్షి వెళ్ళిపోయాడు. అప్పటికే మధ్యాహ్నం కావస్తోంది. మాధ్యాహ్నిక విధులు ఆచరించాలనుకున్నాడు వాల్మీకిముని. గంగానది ఒడ్డుకి

బయలుదేరాడు. శిష్యుడు భరద్వాజమహర్షి వెంట ఉన్నాడు. గంగకు దగ్గరలో అక్కడే తమసా అనే పేరుగల ఒక నది ఉంది. ఆ నదిని చూసిన వాల్మీకిముని –

'ఈ నదిలోని నీరు చూశావా! భరద్వాజా! మంచివాడి మనస్సులా ఎంత స్వచ్ఛంగా ఉందో! ఈ నదిలోనే మనం స్నానం చేసి సంధ్యవార్చుకుందాం! ఏదీ నారచీరలు అందుకో!' అని లోపలికి దిగాడు స్నానానికి.

నదిలో నిలబడి చుట్టూ చూశాడు వాల్మీకిముని. ఎంతో ఆహ్లాదకరంగా ఉంది ఆ వనం. ఆహా! ఏమి ఈ వనం! అనుకున్నాడు మనస్సులో.

అక్కడే ఒక చెట్టుమీద రెండు క్రౌంచపక్షులు (ఆడ – మగ) జతకట్టి ఉండడం చూశాడు వాల్మీకిమహర్షి. చూస్తుండగానే మహర్షి సమక్షంలోనే ఒక ఘోరం జరిగింది. ఒక బాణం రివ్వున దూసుకొచ్చి మగ పక్షి గుండెల్లోకి చొచ్చుకొని పోయింది. ఇదీ చూశాడు వాల్మీకిముని. బాణందెబ్బకు ఆ పక్షి విలవిలలాడి పోయింది. పాపం! రెక్కలు టపటపా కొట్టుకుంటూ నేలపై పడిపోయింది. వాల్మీకి ముని మనసూ విలవిలలాడిపోయింది. తట్టుకోలేకపోయాడు. బాణం వేసిన బోయవానిపై పట్టరానంత కోపం ముంచుకొచ్చింది. వెంటనే శోకం గుండెల్లోంచి ఉప్పొంగింది. అప్రయత్నంగా –

**మా నిషాద! ప్రతిష్ఠాం త్వ మగమః శాశ్వతీః సమాః,**
**యత్క్రౌంచమిథునా దేక మవధీః కామమోహితమ్. (1-2-15)**

'ఓ బోయవాడా! అనవసరంగా – అభం శుభం తెలియని ఈ క్రౌంచపక్షిని బాణంతో నిర్దాక్షిణ్యంగా కొట్టి చంపావే.. దుర్మార్గుడా! ఇంత పని చేసిన నువ్వు ఎంతోకాలం బతకవు (శాశ్వతంగా అపకీర్తి పాలవుతావు)' అని శపించాడు. అసంకల్పితంగా వచ్చిన ఆ మాటలు శ్లోకరూపంలో అనుష్టుప్పు అనే ఛందస్సులో ఉన్నాయి.

## బ్రహ్మోపదేశం

సంధ్యావందనాది కార్యక్రమాలు ముగించుకొని ఆశ్రమానికి తిరిగి వచ్చారు వాల్మీకిభరద్వాజు లిద్దరూ. ఆ శ్లోకమే వాల్మీకి మహర్షి మనసులో పదే పదే మెదులుతోంది.

సరిగ్గా అప్పుడు వాల్మీకి దగ్గరకు సాక్షాత్తు బ్రహ్మదేవుడే విచ్చేశాడు. చతుర్ముఖుణ్ణి చూసి ఆశ్చర్యమూ ఆనందమూ కలిగాయి వాల్మీకిమహర్షికి. లేచి బ్రహ్మదేవుడికి స్వాగతం పలికి, ఆసనం చూపి, అర్ఘ్యపాద్యాలతో గౌరవించాడు.

బ్రహ్మదేవుడు కూడా ఆనందంతో వాల్మీకిమహర్షిని కూర్చోమని ఆసనం చూపించాడు. ఇంకా వాల్మీకి మహర్షి మనస్సులో ఆ బోయవాడి దుష్టచేష్టే మెదులుతోంది. అప్రయత్నంగా ఆ శ్లోకం బ్రహ్మదేవుడి సమక్షంలో మళ్ళీ వాల్మీకిముని నోటినుండి వచ్చింది.

బ్రహ్మదేవుడు చిరునవ్వు చిందిస్తూ – 'మహర్షీ! నువ్వు అల్లినది శ్లోకమే. ఇది నా సంకల్పమే. నారదమహర్షి నీకు చెప్పిన శ్రీరామకథనే అందంగా కావ్యంగా రచించు. ధర్మాత్ముడూ భగవంతుడూ అయిన ఆ శ్రీరాముని చరితాన్నీ అలాగే తక్కినవాళ్ళ వృత్తాంతాల్నీ వివరించు. ఆ కథలో నీకు అందరి స్వభావాలూ తెలుస్తాయి. నీకు తెలియనిదంటూ ఉండదు. నీ కావ్యంలో ఎక్కడా అసత్యం తొంగిచూడదు. అంతేకాదయ్యా! శ్రీరామకథ సకల పాపాలనూ రూపుమాపుతుంది. విన్నంతనే పరమానందాన్ని కలుగజేస్తుంది. శ్రీమద్రామాయణ రచన ఆరంభించు. మరింక ఆలస్యం దేనికి? శుభస్య శీఘ్రం.

**యావత్ స్థాస్యన్తి గిరయః సరితశ్చ మహీతలే,**
**తావత్ రామాయణకథా లోకేషు ప్రచరిష్యతి. (1-2-36)**

ఈ లోకంలో పర్వతాలూ నదులూ ఎంతకాలం ఉంటాయో అంతవరకూ శ్రీరాముని కథ ప్రచారంలో ఉంటుంది.' అని దీవించి వెళ్ళిపోయాడు బ్రహ్మదేవుడు.

## కుశలవుల నోట శ్రీరామాయణం పాట

నారదుడు చెప్పిన శ్రీరామాయణ కథ వాల్మీకిముని మనస్సులో సుస్పష్టంగా తిరుగుతోంది. ఆశ్రమంలో ప్రతిచోటా ప్రతినోటా పదే పదే అదే శ్లోకం. ఎంత చదివినా తనివితీరదే!

దర్భలు పరచుకొని పద్మాసనంలో కూర్చున్నాడు వాల్మీకిమహర్షి. కావ్య రచనకు శ్రీకారం చుట్టాడు. ఎంత నిష్ఠగా కావ్యరచన మొదలుపెట్టాడో అంతే నిష్ఠగా పూర్తిచేశాడు. 24 వేల శ్లోకాలు. 500 సర్గలు. ఉత్తరకాండతో ఏడు కాండలు.

లోకాభిరాముడైన శ్రీరాముని కథ ఒక రత్నాకరం. చతుర్విధపురుషార్థాల సారం. ఎంతో విపులంగా రచించాడు వాల్మీకిముని. ఈ కావ్యానికే రామాయణం, సీతాచరితం, పౌలస్త్యవధం అని మూడు పేర్లు.

శ్రీరామాయణం 'పాఠ్యే గేయే చ మధురం'. చక్కగా చదువుకోవచ్చు. అందంగా పాటలుకట్టి పాడుకోనూవచ్చు. వాల్మీకి మహర్షి రామాయణకావ్యాన్ని తన శిష్యులు కుశలవులకు నేర్పించాడు.

గానగంధర్వులైన కుశలవులు మొదట ఋషులదగ్గరా సత్పురుషులదగ్గరా పాడారు. వీనులవిందుగా ఉన్న వారి గానం ఆ నోటా ఈ నోటా ఆశ్రమం దాటి అయోధ్యానగరం దాకా పాకింది. శ్రీరాముడి రాజప్రాసాదందాకా వెళ్ళింది. శ్రీరామాయణ కథను శ్రీరామ, భరత, లక్ష్మణ, శత్రుఘ్నుల ఎదుట కుశలవులు ఇలా గానం చేస్తున్నారు.

## వినుడు వినుడు

సరయూనది ఒడ్డున కోసలదేశం ఉండేది. ఆ దేశానికి రాజధాని అయోధ్య. ముచ్చటైన ఆ నగరం చక్కటి నిర్మాణంతో సాటిలేని సిరిసంపదలతో విలసిల్లుతూ ఉండేది. ఆ కోసల దేశానికి రాజు దశరథ మహారాజు. ఇక్ష్వాకువంశానికి చెందినవాడు. ఆ రాజుకి ముగ్గురు భార్యలు. కౌసల్య, సుమిత్ర, కైకేయి.

ఆ రాజుకు వసిష్ఠుడు, వామదేవుడు వంశపారంపర్యంగా వస్తున్న ప్రధానపురోహితులు. మంత్రులు ఎనమండుగురు. ధృష్టి, జయంతుడు, విజయుడు, సిద్ధార్థుడు, అర్థసాధకుడు, అశోకుడు, మంత్రపాలుడు, సుమంత్రుడు. వీళ్ళే రాజుకు రాజ్యపాలనలో వెన్నంటి ఉంటూ సహాయసహకారాలు అందించేవాళ్ళు.

***ఈ మంత్రులు కోర్కెల్ని జయించారు. వీళ్ళు రాజభక్తులే కాదు అన్ని మేటిగుణాలూ ఉన్నవాళ్ళూ, అబద్ధం ఆడనివాళ్ళూనూ. ఎక్కడ ఏం జరిగినా జరగబోతున్నా వీళ్ళకి తెలియవలసిందే. తప్పులేకపోతే శత్రువునైనా దండించరు. తప్పుచేస్తే కన్నకొడుకునైనా ఉపేక్షించరు. దుష్టశిక్షణ, శిష్టరక్షణ వీళ్ళ కర్తవ్యం. హుందాగా ఉండే వేషం, భాష వీరికే సొంతం. ఎప్పుడు సంధిచేసుకోవాలో, ఎప్పుడు యుద్ధం చెయ్యాలో వీరికి బాగా తెలుసు. సహజంగానే సంపన్నులు.***

***మంత్రాంగాన్ని గోప్యంగా ఉంచడంలో వీళ్ళని మించినవాళ్ళు లేరు. చురుకైన బుద్ధి కలవాళ్ళు. అందుకే వీళ్ళని గురించి దేశదేశాలలో చెప్పుకుంటారు.***

ఆ రాజ్యంలో ఎవరికీ ఆకలిదప్పికల బాధలు లేవు. అందరూ ధనవంతులూ విద్యావంతులూ. ఏ ఒక్కరూ అబద్ధం అన్నది ఆడరు. అందరూ ధర్మపరులే.

వృద్ధుడైనా దశరథమహారాజుగారికి పిల్లలు కలుగలేదు. ఒకరోజు తన మంత్రులలో ఒకడైన సుమంత్రుని ద్వారా సుయజ్ఞుడు, వామదేవుడు, జాబాలి, కాశ్యపుడు, పురోహితుడు వసిష్ఠుడూ ఇంకా పెద్దలందర్నీ పిలిపించి చర్చించాడు దశరథమహారాజు. వారి అనుమతితో సరయూ నదీ తీరంలో అశ్వమేధయాగం తలపెట్టాడు. యాగనిర్వహణ బాధ్యత వసిష్ఠులవారిదే. వెంటనే సుమంత్రుణ్ణి పిలిచి –

'సుమంత్రా! అన్నిదేశాలనుండీ ప్రజలందరినీ సాదరంగా యాగానికి ఆహ్వానించు. మహావీరుడూ, పరమనిష్ఠాగరిష్ఠుడూ అయిన మిథిలాధిపతి జనక మహారాజునూ, మన రాజుగారికి ఆప్తుడూ మధురభాషీ అయిన కాశీరాజునూ, అలాగే మన రాజుగారి మామగారైన కేకయరాజునీ, ఆయన పుత్రుణ్ణీ నువ్వే స్వయంగా వెళ్ళి సాదరంగా ఆహ్వానించు. తరువాత దశరథుని మిత్రుడు రోమపాదుణ్ణీ ఆహ్వానించు. ఇంకా సింధు, సౌవీర, సౌరాష్ట్ర దేశాల రాజుల్నీ, దక్షిణదేశరాజుల్నీ అందరినీ దూతల్ని పంపి మరీ ఆహ్వానించు. అంతేకాదు; మనరాజుగారి మిత్రులందరినీ బంధువులతో పరివారంతో సహా రమ్మను.' అని ఆజ్ఞాపించాడు వసిష్ఠముని. సుమంత్రుడు మహర్షివాక్కులను తూచా తప్పకుండా అమలు చేశాడు.

* * *

పనులన్నీ చకచకా జరిగిపోతున్నాయి. ఆయా పనుల్లో నియమితులైన వాళ్ళు వచ్చి తమ తమ విధుల్ని వసిష్ఠుడికి విన్నవిస్తున్నారు. అప్పుడు వసిష్ఠమహర్షి వారిని ఉద్దేశించి – ***'అతిథులకు భోజనం పెట్టేటప్పుడూ, బహుమానాలు ఇచ్చేటప్పుడూ ఆదరంగా, శ్రద్ధగా ఇవ్వాలి. అలా కాక అనాదరంగానీ అశ్రద్ధగానీ, విసుగు, కోపం, చులకనభావం లాంటివిగానీ ప్రదర్శించకూడదు. మీరు గనక అలా చేస్తే మనరాజుగారికి పాపం చుట్టుకుంటుంది. ఒకవేళ అతిథులు***

***కోపగించుకున్నా మీరు కోపం తెచ్చుకోకూడదు. ప్రసన్నమైన ముఖంతో మర్యాదలు చేయాలి. ఏ లోటూరాకుండా భక్తిశ్రద్ధలతో అతిథిసేవ చెయ్యాలి. మీరంతా రాజభక్తులు. కాబట్టి జాగ్రత్తగా అతిథులను గౌరవించి, సేవించండి.'*** అని హితవు పలికాడు.

ఆహ్వానాలు అందరికీ అందాయి. అందరూ యాగానికి తరలి వస్తున్నారు. అనేకదేశాలనుండి రాజులూ చక్రవర్తులూ అనేక రత్నాలను తీసుకొని రాజధానికి చేరుకొన్నారు. వారందరికీ ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి.

ఒకరోజు సుమంత్రుడు దశరథుడితో – 'మహారాజా! కశ్యపమహర్షి మనుమడూ, విభాండకుడి పుత్రుడూ అయిన ఋష్యశృంగుడు అంగరాజ్యంలో ఉన్నాడు. ఆ రాజ్యానికి రాజు రోమపాదుడు. ***అతడు ఒకప్పుడు ధర్మం తప్పిన కారణంగా అతడిరాజ్యంలో వర్షాలు కురవకుండా గొప్ప కరవు సంభవించింది.*** **ఆ కరవును తీర్చడంకోసమే రోమపాదుడి ఆహ్వానంపై ఆ రాజ్యానికి వచ్చాడు ఋష్యశృంగముని.**

***ఎక్కడ మహాత్ములు ఉంటే అక్కడ దేశం సుభిక్షంగా ఉంటుంది. ఈతిబాధలు దరిచేరవు. అందుకే మహాత్ముడైన ఋష్యశృంగమహర్షి అడుగుపెట్టడంతోటే రోమపాదుడిరాజ్యంలో వర్షాలు కురిశాయి. దేశం పాడిపంటలసమృద్ధితో కళకళలాడింది.*** ఆ ఋష్యశృంగమహర్షి రోమపాదుడి కుమార్తె శాంతను పెళ్ళి చేసుకొని ఇప్పుడు అక్కడే ఆ రాజ్యంలోనే ఉన్నాడు. నువ్వు వెళ్ళి అడిగావంటే ఆయన తప్పకుండా వస్తాడు. ఈ ఋష్యశృంగుడి ద్వారా నువ్వు యాగం చేస్తావనీ పుత్రుల్ని పొందుతావనీ సనత్కుమారుడు చెప్పాడు కదా! కాబట్టి ఋష్యశృంగుణ్ణి ఆహ్వానించు. యాగాన్ని నిర్వర్తించు.' అన్నాడు.

## అశ్వమేధం – పుత్రకామేష్టి

వసిష్ఠులవారి పర్యవేక్షణలో ఋష్యశృంగుడే ప్రధాన ఋత్విక్కుగా సరయూ నదికి ఉత్తరాన యజ్ఞం ప్రారంభమయ్యింది. పూజలూ దక్షిణలూ దానాలూ సత్కారాలూ సన్మానాలూ సంతర్పణలూ అన్నీ యథావిధిగా జరుగుతున్నాయి. యాగం చేసి గుర్రాన్ని విడిచిపెట్టారు. ఏడాది గడిచింది. ఆ గుర్రం తిరిగి రావడంతో యజ్ఞం పూర్తయ్యింది.

రాజు తన సర్వస్వాన్నీ యజ్ఞం చేసిన ఋత్విక్కులకు దానంగా ఇచ్చి మళ్ళీ వారి కోరికపై రాజ్యం వెనక్కి తీసుకున్నాడు. అందుకు ప్రతిగా ఒక్కొక్కరికీ వేలసంఖ్యలో ఆవుల్నీ, కోట్లు విలువచేసే వెండి బంగారాల్నీ దానంగా ఇచ్చాడు.

దశరథుని అభ్యర్థనపై ఋష్యశృంగుడు 'పుత్రకామేష్టి'ని తలపెట్టాడు. హవిర్భాగాలు తీసుకోవడం కోసం బ్రహ్మదేవుడు మొదలైన దేవతలూ, గంధర్వులూ, సిద్ధులూ, మహర్షులూ అందరూ వచ్చి అదృశ్యంగా అక్కడే ఉన్నారు. అప్పుడు దేవతలు – 'బ్రహ్మదేవా! నువ్వు ప్రసాదించిన వరగర్వంతో రావణుడు ముల్లోకాల్నీ గడగడలాడిస్తున్నాడు. వాడి ఆగడాలను భరించడం మావల్ల కావడంలేదు. శరణు శరణు,' అన్నారు. దానికి విధాత – 'దేవతలారా! వర ప్రభావం వల్ల దేవ – దానవ – యక్ష – రాక్షస – గంధర్వుల చేతిలో వాడికి మరణం లేదు. కాబట్టి మానవుడి చేతిలోనే వాడు మరణిస్తాడు. బాధపడకండి.' అన్నాడు.

ఇంతలో అక్కడికి జగన్నాథుడైన శ్రీమహావిష్ణువు విచ్చేశాడు. బ్రహ్మదేవుడితో కలిసి అక్కడ సుఖాసీనుడయ్యాడు. అప్పుడు దేవతలందరూ వచ్చి శ్రీమహావిష్ణువుకు సాష్టాంగనమస్కారం చేసి ఇలా విన్నవించుకున్నారు.

'ఓ నారాయణా! శ్రీమహావిష్ణూ! లోకకల్యాణం కోసమే మేము నిన్ను అభ్యర్థిస్తున్నాం. అయోధ్యాపతియైన దశరథమహారాజు సమర్థుడు. ధర్మాత్ముడు. ఉదారస్వభావం కలవాడు. మహర్షులతో సాటివచ్చే తేజస్సు అతడిది. అతడి ముగ్గురు భార్యలూ దక్షకన్యలైన హ్రీ శ్రీ కీర్తులతో సమానమైనవాళ్ళు. వారికి నాలుగురూపాలలో నువ్వు పుత్రుడివి కా. రావణుడు వరగర్వంతో లోకకంటకుడయ్యాడు. దేవతలెవ్వరూ అతణ్ణి సంహరించలేరు. నువ్వు మానవునిగా అవతరించి యుద్ధంలో అతణ్ణి హతమార్చు.' అని వేడుకొన్నారు. అప్పుడు దేవదేవుడైన ఆ శ్రీమహావిష్ణువు –

'దేవతలారా! భయపడకండి. మీకు నేను భద్రత చేకూరుస్తాను. క్రూరుడూ, దుర్మార్గుడూ అయిన రావణుణ్ణి, అతని చుట్టూ ఉన్నవారిని అందరినీ సంహరిస్తాను.' అని అభయమిచ్చి అంతర్ధానమయ్యాడు.

## ప్రాజాపత్యపురుషుడు – పాయసపాత్ర

యాగం జరుగుతోంది. అది సమాప్తమయ్యే దశలో– చేతిలో బంగారు పాయసపాత్రతో ప్రాజాపత్య పురుషుడు యజ్ఞకుండం నుంచి ప్రత్యక్షమై –

'దశరథా! ఇదుగో! దేవతలే సిద్ధంచేసిన ఈ దివ్యపాయసాన్ని నీ భార్యలకు పంచిపెట్టు. నీకు కొడుకులు పుడతారు.' అన్నాడు.

దశరథుడు ఆనందంతో పాయసపాత్ర అందుకొన్నాడు. ప్రదక్షిణనమస్కారం చేశాడు. అంతటితో ఆ దివ్యపురుషుడు అంతర్ధానమయ్యాడు.

అంతఃపురానికి వచ్చిన దశరథుడు ఆ పాయసంలో సగం (1/2) కౌసల్యకూ, మిగిలిన సగంలో సగం (1/4) సుమిత్రకూ, ఆ సగంలో సగం (1/8) కైకకూ, ఇచ్చాడు. ఇక మిగిలిన సగభాగాన్ని (1/8) మళ్ళీ సుమిత్రకే ఇచ్చాడు. పాయసం ప్రభావంవల్ల రాణులు ముగ్గురూ గర్భవతులయ్యారు.

శ్రీమహావిష్ణువే శ్రీరామునిగా అవతరిస్తుంటే బ్రహ్మదేవుడి ఆదేశంతో ఇంద్రుడు వాలినీ, సూర్యుడు సుగ్రీవుణ్ణీ, బృహస్పతి తారుణ్ణీ, కుబేరుడు గంధమాదనుణ్ణీ, విశ్వకర్మ నలుణ్ణీ, అగ్ని నీలుణ్ణీ, అశ్వినీదేవతలు మైందద్వివిదులనే వానరుల్నీ, వరుణుడు సుషేణుణ్ణీ, పర్జన్యుడు శరభుణ్ణీ సృష్టించారు. వేగంలో గరుత్మంతుడికి సాటి వచ్చేలా వాయుదేవుడు హనుమంతుణ్ణి సృష్టించాడు. దేవతలూ యక్షులూ సిద్ధులూ సాధ్యులూ విద్యాధరులూ ఉరగులూ అందరూ ఇలా వేలమంది వానర వీరులను మహాబలవంతులను సృష్టించారు. మేరు మందర పర్వతాల్లా ఉన్న వానరులు ఉత్సాహంతో ఉరకలు వేస్తున్నారు.

## పరమపురుషుల జననం

చైత్రశుక్ల నవమినాడు పునర్వసు నక్షత్రంలో కర్కటక లగ్నంలో ఆ శ్రీమహావిష్ణువే కౌసల్య కడుపున శ్రీరామునిగా జన్మించాడు. ఆ మర్నాడు, దశమినాడు, సూర్యోదయానికి ముందు కైకేయికి భరతుడు పుట్టాడు. అదేరోజు సూర్యోదయం తరువాత సుమిత్రకు లక్ష్మణ శత్రుఘ్నులు పుట్టారు. విష్ణువే శ్రీరామునిగా, ఆదిశేషుడే లక్ష్మణునిగా అవతరించారు. శంఖ చక్రాలే భరత శత్రుఘ్నులు. ఆకాశంనుంచి పూలవాన కురిసింది. అయోధ్యానగరం నిండా ఆనందం విరిసింది.

* * *

పన్నెండోరోజున కౌసల్యా పుత్రునికి శ్రీరాముడు, కైకేయీ పుత్రునికి భరతుడు, సుమిత్ర కొడుకులకు లక్ష్మణుడూ, శత్రుఘ్నుడూ అని వసిష్ఠులవారే నామకరణం చేశారు.

కాలచక్రం తిరుగుతోంది. శ్రీరామ భరత లక్ష్మణ శత్రుఘ్నులు పెరిగి పెద్దవాళ్ళవుతున్నారు. కులగురువు వసిష్ఠముని దగ్గర వేదవేదాంగాల్నీ, ధనుర్విద్యనూ ఆపోశనం పట్టారు.

లక్ష్మణుడంటే శ్రీరామునికి బయటి ప్రాణం. శ్రీరామునికీ తిండీ నిద్రా అన్నీ లక్ష్మణుడితోనే. శ్రీరామునికి లక్ష్మణుడెలాగో భరతునికి శత్రుఘ్నుడూ అంతే. నలుగురూ చూడముచ్చటగా ఉన్నారు. దశరథుని ఆనందానికి అవధులు లేవు.

## విశ్వామిత్రమహర్షి రాక

పెరిగి పెద్దవాళ్ళైన ఆ నలుగురూ విద్యాభ్యాసం పూర్తిచేసుకొని పెళ్ళీడుకి వచ్చారు. వివాహాలు జరిపించాలని పెద్దలతో దశరథుడు చర్చిస్తున్న సమయంలో విశ్వామిత్రమహర్షి అక్కడికి విచ్చేస్తున్నాడన్న వార్త వచ్చింది.

రాజు ఎదురువెళ్ళి మహర్షిని ఆహ్వానించాడు. ఆదరించి, అర్చించాడు. 'మహర్షీ! ఆజ్ఞాపించండి. మీరు ఏం చెప్పినా చేయడానికి నేను సిద్ధంగా ఉన్నాను' అన్నాడు. దశరథుని ఆదరణకు విశ్వామిత్రమహర్షి పరవశించిపోతూ –

'దశరథా! నేను చేస్తున్న యజ్ఞానికి మారీచసుబాహులు అనే ఇద్దరు రాక్షసులు ఆటంకం కలిగిస్తున్నారు. రక్తమాంసాలు కురిపిస్తూ అపవిత్రం చేస్తున్నారు. అందుకే నా యాగానికి రక్షణగా శ్రీరాముణ్ణి పంపించు.' అన్నాడు.

దశరథుడికి నోట మాట రాలేదు. వణికే పెదవులతో మెల్లగా అన్నాడు. 'మహర్షీ! శ్రీరాముడు నాకు లేకలేక కలిగిన సంతానం. ముక్కుపచ్చలారని ఈ బాలుణ్ణి ఆ క్రూరులైన మారీచ సుబాహుల దగ్గరికి ఎలా పంపను?'

విశ్వామిత్రమహర్షికి కోపం వచ్చింది. ఆ కోపానికి భూమి కంపించింది. వెంటనే వసిష్ఠమహర్షి కలుగజేసుకొని – ***'ఓ దశరథమహారాజా! మీ కోరిక తీరుస్తాను అని ముందుగా మాట ఇచ్చి ఆ మాటపై నిలబడనివాడికి వాడు అశ్వమేధయాగం చేసిన ఫలం నశిస్తుంది. దానితోపాటు బావులూ, చెరువులూ తవ్వించడం లాంటి ధార్మికకార్యక్రమాలవల్ల సంపాదించుకున్న పుణ్యఫలమూ నశించిపోతుంది. కాబట్టి విశ్వామిత్రమహర్షి వెంట నువ్వు శ్రీరాముణ్ణి నిస్సంకోచంగా పంపించవచ్చు.***

శ్రీరాముని రక్షణబాధ్యత విశ్వామిత్రుడే చూసుకుంటాడు. మహర్షి సామాన్యుడు కాడు. చాలా గొప్పవాడు. రూపుదాల్చిన ధర్మం. గొప్పశక్తిసామర్థ్యాలు కలవాడు. మహా ప్రజ్ఞావంతుడు. మునిశ్రేష్ఠుడు. పైగా బ్రహ్మర్షి. ఎన్నో శస్త్రాల ప్రయోగాలు అతడికి తెలుసు. అంతేనా?! భృశాశ్వుడు ప్రసాదించిన వంద దివ్యాస్త్రాలు కూడా ఉన్నాయి అతనిదగ్గర. ముల్లోకాల్లో అస్త్రవిద్యలో అతణ్ణి మించినవాడు లేడంటే నమ్ము! అంతటివాడు తనే స్వయంగా అడుగుతున్నాడంటే ఏదో పరమార్థం ఉండే ఉంటుంది. పంపించు! అంతా మంచే జరుగుతుంది'. అన్నాడు.

వసిష్ఠుడి మాటలకు దశరథుడు తేరుకొని ఆనందంగా శ్రీరాముణ్ణి విశ్వామిత్ర మునికి అప్పగించాడు. లక్ష్మణుడు తోడురాగా శ్రీరాముడు విశ్వామిత్రమహర్షి వైపుకు వచ్చి నిలబడ్డాడు. వాయుదేవుడు శుభసూచకంగా ఏ దుమ్మూ రేపకుండా మెల్లగా చల్లగా వీస్తూ సుఖాన్ని కలిగించాడు.

## విశ్వామిత్రముని వెంట అన్నదమ్ముల జంట

విశ్వామిత్రముని వెంట శ్రీరామలక్ష్మణులు వెళ్తుంటే పూలవాన కురిసింది. దేవదుందుభులు మ్రోగాయి. బ్రహ్మదేవుడి వెనుక అశ్వినీదేవతల్లా, శివుని వెంట స్కందవిశాఖుల్లా ఉన్నారు విశ్వామిత్రముని వెంట వెళ్తున్న శ్రీరామలక్ష్మణులు. మూడుతలల పాములా వారి నడక సరయూనదికి దక్షిణతీర ప్రాంతం వైపు చరచరా సాగుతోంది. శ్రీరామలక్ష్మణులకు ఆకలిదప్పులు మొదలైన బాధలు లేకుండా ఉండడంకోసం విశ్వామిత్రమహర్షి బల – అతిబల విద్యలు వాళ్ళకి నేర్పాలను కున్నాడు. సరయూతీరానికి చేరుకున్నాక విశ్వామిత్రముని ఆదేశంపై ఆచమనం చేసి వచ్చిన శ్రీరాముడు బల – అతిబల విద్యలు స్వీకరించాడు. ఇప్పుడు శ్రీరామునిలో దివ్య తేజస్సు రెట్టింపయ్యింది. 'శ్రీరామా! వీటి ప్రభావం వల్ల ఆకలి దప్పులు బాధించవు. రూపకాంతులు తరగవు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఏ రాక్షసులూ నిన్ను ఏమీ చేయలేరు' అని మహర్షి చెప్పారు. మహర్షి అనుమతితో ఆ విద్యల్ని లక్ష్మణునికీ ఉపదేశించాడు శ్రీరాముడు. శ్రీరాముడు ముందుముందు చేయవలసిన రాక్షససంహారాన్ని దృష్టిలో ఉంచుకొని రకరకాల శస్త్రాలను ఉపదేశిస్తూ వాటిని

ఎలా ప్రయోగించాలో ఎలా ఉపసంహరించాలో కూడా నేర్పించాడు విశ్వామిత్రమహర్షి. రాత్రికి అక్కడే వారు విశ్రాంతి తీసుకున్నారు. తెల్లవారింది. గడ్డిపాన్పుపై నిద్రిస్తున్న శ్రీరాముణ్ణి విశ్వామిత్రమహర్షి చూసి –

**కౌసల్యాసుప్రజా రామ పూర్వాసంధ్యా ప్రవర్తతే,**
**ఉత్తిష్ఠ నరశార్దూల! కర్తవ్యం దైవమాహ్నికమ్. (1-23-2)**

'శ్రీరామా! కౌసల్యాతనయా! నిద్రలేవయ్యా! సంధ్యావందనాది దైవకార్యాలు మనం నిర్వర్తించుకోవాలి కదా!' అంటూ మేల్కొల్పాడు. శ్రీరామలక్ష్మణులు నిద్ర చాలించి, లేచారు. కాలకృత్యాలు తీర్చుకొని బయలుదేరారు. సాయంకాలానికి అంగదేశంలోని గంగాతీరప్రాంతంలో ఉన్న పరమశివుని ఆశ్రమం చేరుకున్నారు. ఒకప్పుడు శివుడు తపస్సుచేసిన ప్రదేశం అది. తరువాత ఎందరో ఋషుల తపస్సుకు వేదిక అయ్యింది. ఆ రాత్రి అక్కడ బసచేసి, ఆతిథ్యం స్వీకరించి మరుసటిరోజు అక్కడి మునులు ఏర్పాటుచేసిన నావ మీద గంగానదిని దాటుతున్నారు.

దారిలో ఎక్కడిదో నీళ్ళ సవ్వడి వినిపిస్తోంది. దాని వైనం విశ్వామిత్రమహర్షి ఇలా చెప్పసాగాడు.

'శ్రీరామా! కైలాస శిఖరంపై ఉన్న మానససరోవరం బ్రహ్మదేవుడి సృష్టి. ఆ సరస్సునుంచి జాలువారే నది సరయు. అలా జాలువారింది కాబట్టే సరయు అనే పేరు వచ్చింది ఆ నదికి. ఆ నదే ఇక్కడ గంగానదిలో కలుస్తోంది. అందుకే ఈ ఘోష. ఈ నదికి నమస్కరించండి.' అన్నాడు విశ్వామిత్రమహర్షి. వాళ్ళు నమస్కరించారు.

తరువాత ఒక భయంకరమైన అరణ్యంలోనికి ప్రవేశించారు. అక్కడ శిథిలావస్థలో ఉన్న రెండు జనపదాలు కనిపించాయి. పూర్వం, ఇంద్రుడు వృత్రాసురుణ్ణి సంహరించాడు. అందువల్ల అతడికి బ్రహ్మహత్యాపాతకం చుట్టుకుంది. అతనికి ఇక్కడే అభిషేకం చేసి ఆ మాలిన్యాన్నీ, దాహాన్నీ వదిలించారట ఇక్కడి మహర్షులు. ఇంద్రుడు ఆనందంతో ఆ రెండు జనపదాలకూ మలదమూ, కరూశమూ అని నామకరణం చేశాడు.

'ఈ జనపదాలు ఒకప్పుడు సిరిసంపదలతో కళకళలాడేవి. సుకేతువు కూతురు తాటక అనే ఒక యక్షిణి తన కొడుకు మారీచునితో కలిసి వీటిని ధ్వంసం చేసి పారేసింది. అది సామాన్యురాలు కాదు. వెయ్యి ఏనుగుల బలం దానిది. తాటక భర్త సుందుడు. అగస్త్యమహర్షిశాపం కారణంగా మరణించాడు. దానికి ఈ తల్లీకొడుకులు రెచ్చిపోయి, అగస్త్యుణ్ణి చంపబోయారు. అప్పుడు అగస్త్యుడు మారీచుణ్ణి రాక్షసునిగా, తాటకను కురూపిగా శపించాడు.

ఆ తాటక అప్పట్నుంచీ ఇక్కడే ఉంటూ దారినిపోయే వాళ్ళను పట్టుకొని తినేస్తోంది. **'స్త్రీహత్య మహాపాతకం అని వెనుకంజ వెయ్యకు శ్రీరామా! లోకకల్యాణం కోసం అవసరమైతే స్త్రీలనైనా వధించాల్సిందే. ఇంతకు ముందు మంథర అనే స్త్రీని ఇంద్రుడూ, శుక్రాచార్యుని తల్లిని విష్ణువూ వధించారు. కాబట్టి, శ్రీరామా! ఈ తాటకను నువ్వే సంహరించు.'** అన్నాడు విశ్వామిత్రమహర్షి.

ఆ మాట వినీవినగానే అల్లెత్రాడును వింటికి బిగించాడు రఘుపతి. శబ్దవేధిని సంధించి ఆ మాయలమారి తాటకతో ఘోరయుద్ధం చేశాడు. బాణాలు కురిపించాడు. చివరికి కోదండరాముడు వేసిన భీకరాస్త్రానికి తాటక కుప్పకూలి, గిలగిలా తన్నుకుంటూ అసువులు బాసింది.

దేవతలు జయజయ ధ్వానాలు చేశారు. విశ్వామిత్రమహర్షి ఆనందంతో శ్రీరాముణ్ణి అక్కున చేర్చుకున్నాడు.

శ్రీరాముడు ఇంకా దేవకార్యాల్ని నిర్వర్తించవలసి ఉంది. కాబట్టి భృశాశ్వుడు సృష్టించిన గొప్ప గొప్ప అస్త్రాలను అతడికి ప్రసాదించాలన్నది విశ్వామిత్రమహర్షి ఆలోచన. అందుకే ప్రీతిపూర్వకంగా ఇలా అంటున్నాడు.

'శ్రీరామా! దండచక్రం, ధర్మచక్రం, కాలచక్రం, విష్ణుచక్రం నీకు ప్రసాదిస్తున్నాను. అలాగే శివుడి శూలాస్త్రం, బ్రహ్మశిరోనామక అస్త్రం, వజ్రాస్త్రం కూడా నీ వశం చేస్తున్నాను. ఇవిగో! మోదకి, శిఖరి అనే గదలు. రా! పాశుపతాస్త్రం, నారాయణాస్త్రం కూడా ఇస్తున్నాను. తీసుకో! వీటితోపాటు దేవ దానవులదగ్గర ఉండే శక్తిమంతమైన అన్ని అస్త్రాలనూ నీకు అనుగ్రహిస్తున్నాను.' అన్నాడు.

అంతే మరుక్షణం ఆ అస్త్రదేవత లందరూ వారి వారి స్వరూపాలతో శ్రీరాముడిముందు ప్రత్యక్షమయ్యారు. అప్పుడు రామభద్రుడు సంప్రీతుడై –

'ఓ అస్త్రదేవతలారా! నేను అవసరమైనప్పుడు మిమ్మల్ని తలుస్తాను. అప్పుడు విచ్చేయండి' అని చెప్పి వారికి సాదరంగా వీడ్కోలు పలికాడు.

* * *

ఈసారి శ్రీరామలక్ష్మణుల నడక వామనుని ఆశ్రమం వైపు సాగింది. దారిలో విశ్వామిత్రమహర్షి చెప్తున్నాడు–

'శ్రీరామా! వామనావతారానికి ముందు శ్రీమహావిష్ణువు తపస్సు చేసింది ఇక్కడే. ఆ పద్మనాభుడు అదితి – కశ్యప దంపతులకు పుత్రునిగా జన్మించాడు. వామనునిగా బలిచక్రవర్తి యాగవాటికకు వెళ్ళాడు. బలిని మూడు అడుగుల నేల అడిగి తీసుకొని ముల్లోకాలనూ ఆక్రమించాడు. త్రిలోకాధిపత్యాన్ని ఇంద్రునికి తిరిగి ప్రసాదించాడు.

శ్రీరామా! కశ్యపుని తపస్సు సిద్ధించిన ఈ సిద్ధాశ్రమమే నా నివాసం. అయితే ఇక్కడా రాక్షసబాధ తప్పడంలేదు. దాన్ని నువ్వే తీర్చాలి. రా నాయనా!' అంటూ శ్రీరామలక్ష్మణులను ఆశ్రమంలోనికి తీసుకువెళ్ళాడు విశ్వామిత్రమహర్షి.

యాగం ప్రారంభమయ్యింది. విశ్వామిత్రమహర్షి మౌనదీక్షలో ఉన్నాడు. కాపలా శ్రీరామలక్ష్మణులే. అయిదురోజులు గడిచిపోయాయి. ఆరో రోజు. యాగం కొనసాగుతోంది. ఇంతలో పెద్దగా చప్పుడు. ఆకాశాన్ని కారుమేఘాలు కమ్మేసినట్లుగా భీకర ఆకారాలు రెండు ఆకాశంలోంచి హఠాత్తుగా ఊడిపడ్డాయి. వాళ్ళే మారీచ సుబాహులు. అనుచరులతో సహా వస్తూ వస్తూనే నెత్తుటివాన కురిపిస్తున్నారు. అది చూసిన శ్రీరాముడు –

'లక్ష్మణా! చూడు.' అంటూ శీతేషువును సంధించి, మానవాస్త్రంతో అభిమంత్రించి మరీ కొట్టాడు. అది నేరుగా మారీచుని గుండెల్లో దిగబడింది. దెబ్బకు మూర్ఛపోయిన మారీచుడు వందయోజనాల దూరం ఎగిరి సముద్రంలో పడ్డాడు. సుబాహునిపై ఆగ్నేయాస్త్రాన్నీ, తక్కిన రాక్షసులపై వాయవ్యాస్త్రాన్నీ సంధించి చకచకా ప్రయోగించాడు. అంతే! ఆ రాక్షసుల్లో ఒక్కడుంటే ఒట్టు.

యాగం పూర్తి అయ్యింది. అందరిముఖాల్లోనూ ఆనందం. విశ్వామిత్ర మహర్షి ఆనందంగా – 'హే మహాబాహో! నేను కృతార్థుణ్ణి. నువ్వు గురువాక్కును ఆచరించావు. అటు నీ తండ్రి ఇచ్చిన మాటనూ, గురువుకు నువ్వు ఇచ్చిన మాటనూ నిలబెట్టావు. ఇది సిద్ధాశ్రమం అన్న మాటనూ నిజం చేశావు.' అన్నాడు.

* * *

మరునాడు ఉదయం ముగ్గురూ కొందరు మునులతో కలిసి మిథిలా నగరానికి బయలుదేరారు. సాయంత్రానికి శోణానదీతీరం చేరుకున్నారు. అది విశ్వామిత్ర ముని పూర్వులు ఏలిన ప్రాంతం. అక్కడ విశ్వామిత్రమహర్షి – "శ్రీరామా! విను. ఒకప్పుడు బ్రహ్మకుమారుడైన కుశుడు భూలోకాన్ని పాలిస్తున్నాడు. విదర్భరాజ కుమార్తె అతని భార్య. వీరికి కుశాంబుడు, కుశనాభుడు, అధూర్తరజసుడు, వసువు అని నలుగురు పుత్రులు. కుశమహారాజు కొడుకులకు రాజ్యం అప్పగించాడు. వాళ్ళు ఒక్కొక్కరూ ఒక్కొక నగరాన్ని నిర్మించుకొని చక్కగా పరిపాలన సాగిస్తున్నారు. వారిలో వసువు నిర్మించిన నగరం గిరివ్రజపురం. ఇప్పుడు మనం ఉన్నది ఇతని రాజ్యంలోనే.

ఆ నలుగురు పుత్రులలో కుశనాభుడు ధర్మాత్మురాలైన ఘృతాచిని పెండ్లాడాడు. వీరికి నూరుగురు అందమైన కుమార్తెలు కలిగారు. రూప, యౌవన, సౌభాగ్యాలు కల ఆ యువతుల్ని చూసి మోహించిన వాయుదేవుడు వాళ్ళతో ఇలా అన్నాడు –

'నేను మిమ్మల్నందరినీ వివాహం చేసుకోవాలనుకుంటున్నాను. మానవరూపంపై మమకారాన్ని కట్టిపెట్టి నన్ను పెళ్ళాడి, దేవతలు కండి.'

దానికా కన్యలు ఇలా సమాధానం చెప్పారు–

'ఓ సురశ్రేష్ఠా! నువ్వు చాలా గొప్పవానివి. సమస్తప్రాణులకూ నువ్వే ఆధారం. మాకు తెలుసు. ఎందుకు మమ్మల్ని అవమానిస్తున్నావు? మేము కుశనాభుడి కుమార్తెలం. మేమూ మా తపశ్శక్తితో నిన్ను నీ అధికారంనుండి తొలగించగలం. ఆ సామర్థ్యం మాకు ఉంది. కానీ ఆ పని చేసి మేము మా తపశ్శక్తిని వ్యర్థపరుచ కోము. **మా తండ్రి నిర్ణయించిన వరుణ్ణే మేము భర్తగా స్వీకరిస్తాం. ఆయన ఎవరికి కన్యాదానం చేస్తే అతడే మా భర్త.'**

ఆ మాటలకు కోపగించిన వాయుదేవుడు వాళ్ళని మరుగుజ్జులు కమ్మని శపించాడు. వాయుదేవుడి శాపానికి కన్నీరు మున్నీరుగా విలపిస్తూ ఆ కన్యలు తండ్రి దగ్గరికి వచ్చి –

'ఓ మహారాజా! వాయుదేవుడు ధర్మాన్ని విడిచిపెట్టి, మేము తండ్రిచాటు బిడ్డలమని చెప్తున్నా వినకుండా మమ్మల్ని బలాత్కరించాలని ప్రయత్నించి అది కుదరకపోవడంతో ఇలా శపించాడు'. అని కుశనాభునికి చెప్పారు ఆ కన్యలు. అప్పుడు కుశనాభుడు ఎంతో బాధపడి–

**'తల్లుల్లారా! ఓర్పుకలవాళ్ళు చేయవలసినపనే మీరూ చేశారు. మన వంశగౌరవం నిలబెట్టారు. *క్షమాగుణమే గొప్ప భూషణం. ఓర్పును మించిన ఆభరణమూ ఆయుధమూ లేదు. అదే యజ్ఞం, అదే సత్యం, అదే కీర్తి, అదే ధర్మం. దానం, సత్ప్రవర్తన, యజ్ఞం మొదలైనవాటివల్ల కలిగే గొప్పఫలాలన్నీ క్షమవల్లనే లభిస్తాయి. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ ప్రపంచమంతా ఓర్పులోనే ఉందమ్మా!'*** అని వారిని మెచ్చుకొన్నాడు. చివరికి కాంపిల్యదేశానికి రాజైన బ్రహ్మదత్తునితో వారికి వివాహం జరిపించాడు. ఆ బ్రహ్మదత్తుడి కరస్పర్శతో ఆ కన్యలు సహజ రూపాన్ని పొందారు.

ఆ కుశనాభుడు కొడుకులకోసం పుత్రకామేష్టి చేస్తే అతనికి గాధి జన్మించాడు. ఆ గాధిరాజే మా తండ్రి." అంటూ ఇంకా తమ తండ్రితాతల పుట్టుపూర్వోత్తరాలన్నీ వివరంగా చెప్పుకొచ్చాడు విశ్వామిత్రమహర్షి.

మరుసటిరోజు బయలుదేరి మధ్యాహ్నానికి గంగాతీరాన్ని చేరుకున్నారు. అక్కడ విశ్వామిత్రమహర్షి గంగావతరణ గాథ చెప్పడం మొదలు పెట్టాడు–

## గంగావతరణ గాథ

'శ్రీరామా! పూర్వం మీ ఇక్ష్వాకువంశంలో సగరుడు అనే ఒక గొప్ప చక్రవర్తి ఉండేవాడు. కేశిని, సుమతి అతని భార్యలు. కేశినికి ఒక క్రూరుడైన కుమారుడు కలిగాడు. వాడి పేరు అసమంజుడు. సుమతికి అరవైవేలమంది పుత్రులు కలిగారు. వీళ్ళు మహాపరాక్రమవంతులు.

అసమంజుని ఆగడాలను సహించని సగరుడు అతడికి దేశబహిష్కరణ శిక్ష విధించాడు. అయితే ఆ అసమంజుడి కడుపున ధర్మాత్ముడైన ఒక కుమారుడు జన్మించాడు. అతడే అంశుమంతుడు.

ఒకసారి సగరుడు అశ్వమేధయాగం చేశాడు. ఆ యాగాశ్వాన్ని ఇంద్రుడు అపహరించాడు. ఎలాగైనా వెదికి తీసుకురమ్మని తన కొడుకుల్ని పంపాడు సగరుడు. అరవైవేలమందీ వెళ్ళారు. వాళ్ళు భూమికి జల్లెడ పట్టారు. అశ్వం ఆచూకీ దొరకలేదు. పోనీ పాతాళంలో ఉందేమోనని భూమిని తవ్వుతూ తవ్వుతూ పాతాళం దాకా వెళ్ళిపోయారు.

అక్కడ కపిలమహర్షి రూపంలో తపస్సులో ఉన్న వాసుదేవుడు కన్పించాడు. ఆ పక్కనే యాగాశ్వమూ కనిపించింది. అది చూసిన సగరుని కొడుకులు కపిలుడే దొంగ అనుకొని, కోపంతో అతనిమీద దాడిచేశారు. కపిలమహర్షి కోపంతో కళ్ళు తెరిచాడు. అంతే! వాళ్ళు భస్మమైపోయారు.

ఎంతకీ కొడుకులు రాకపోయేసరికి సగరుడు తన మనుమడైన అంశుమంతుణ్ణి పంపాడు. అంశుమంతుడు తండ్రులు వెళ్ళిన దారిలో వెళ్ళి పాతాళంలో బూడిదకుప్పలుగా పడి ఉన్న తన పినతండ్రుల్నీ యాగాశ్వాన్నీ చూశాడు.

సగరపుత్రుల తల్లి సుమతికి గరుత్మంతుడు అన్న. గరుత్మంతుడే వచ్చి జరిగినదంతా అంశుమంతునికి చెప్పాడు. అంశుమంతుడు బాధపడి అశ్వాన్ని తీసుకొని వెళ్ళిపోయాడు.

సగరుడు యాగం పూర్తిచేశాడు. సగరుడి తరువాత అంశుమంతుడు రాజయ్యాడు. కానీ కుమారుడు దిలీపుడికి రాజ్యం అప్పగించేశాడు. తాను హిమాలయాలకు వెళ్ళి ముప్పయి రెండువేల సంవత్సరాలు తపస్సు చేసి సిద్ధిని పొందాడు.

దిలీపునికి పరమ ధార్మికుడైన భగీరథుడు జన్మించాడు. భగీరథుడు తన తాతలను తరింపజేయడానికి కంకణం కట్టుకొని తపస్సు చేశాడు. బ్రహ్మదేవుణ్ణి మెప్పించి గంగను భూమికి రప్పించమని అడిగాడు భగీరథుడు. దానికి పరమేష్ఠి అనుగ్రహించాడు. గంగ కూడా వస్తానంది.

మళ్ళీ తపస్సు చేసి ఈసారి భగీరథుడు శివుణ్ణి మెప్పించాడు. గంగ వేగాన్ని తగ్గించడం కోసం శిరస్సుపై ధరించడానికి అతణ్ణి ఒప్పించాడు.

శివుని తలపైకి దూకిన గంగ ఏకంగా శివుణ్ణే పాతాళానికి తోసుకుపోదా మనుకుంది. అది గ్రహించిన త్రినేత్రుడు తన జటాజూటాన్ని గుహలా చేసి గంగను లోపలే బంధించాడు.

భగీరథుడు మళ్ళీ తపస్సు చేశాడు. మెచ్చిన శివుడు గంగను విడిచిపెట్టాడు. అది ఏడు పాయలుగా విడివడింది. హ్లాదిని, పావని, నళిని అనే మూడూ తూర్పువైపూ; సీత, సుచక్షువు, సింధువు అనే మరో మూడూ ఉత్తరంవైపూ; గంగ ఏడవ పాయ భగీరథుడి వెంటా నడిచాయి.

ముందు భగీరథుడు. ఆ వెనుక గంగ. దారిలోనే ఉన్న జహ్నుమహర్షి యజ్ఞవాటికను ముంచెత్తింది గంగ. మహర్షి కోపించి గంగాజలం మొత్తాన్నీ తాగేశాడు. దేవతలూ మునులూ ప్రార్థించడంతో కనికరించి చెవుల్లోంచి విడిచిపెట్టాడు. అప్పటినుండి గంగకు జాహ్నవి అనే పేరూ వచ్చింది.

తరువాత గంగ, సగరపుత్రులు తవ్విన సొరంగంలోనికి ప్రవహించి సాగరం అయ్యింది. అలా చివరికి గంగ పాతాళం దాకా ప్రవహించింది. సగరపుత్రుల పాపం వీగిపోయింది. అందరూ స్వర్గానికి వెళ్ళారు. అప్పుడు బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై భగీరథునితో–

'భగీరథా! ఇకనుంచీ ఈమె నీ కుమార్తె. పేరు భాగీరథి. ఆకాశం, భూమి, పాతాళాలలో ప్రవహించడం వల్ల త్రిపథగ అయ్యింది.' అని వెళ్ళిపోయాడు బ్రహ్మదేవుడు." అని విశ్వామిత్రమహర్షి చెప్పడం ముగించాడు.

## సప్తమరుత్తులు

తరువాత మళ్ళీ నడక సాగించి వాళ్ళు మరో ప్రదేశానికి చేరుకున్నారు. అది రాక్షసుల తల్లి దితి తపస్సు చేసిన కుశప్లవం. ఆ ప్రాంతాన్ని చూపిస్తూ విశ్వామిత్రమహర్షి –

"శ్రీరామా! మందరపర్వతం కవ్వంగా, సర్పరాజు వాసుకి ఆ కవ్వానికి తాడుగా దేవదానవులు వెయ్యేళ్ళు క్షీరసాగరాన్ని అమృతంకోసం మథించారు.

వరుసగా హాలాహలం, ధన్వంతరి, అరవైకోట్లమంది అప్సరసలు, అసంఖ్యాకంగా చెలికత్తెలు, వారుణి, ఉచ్చైశ్రవం, కౌస్తుభం ఇలా ఎన్నో క్షీరసాగరంనుంచి పుట్టుకొచ్చాయి.

చివరికి అమృతం పుట్టింది. దీనికోసం దేవదానవులమధ్య పెద్ద యుద్ధమే జరిగింది. శ్రీమహావిష్ణువు మోహినీ అవతారం ఎత్తి ఆ అమృతాన్ని హరించాడు. రాక్షసుల్ని సంహరించిన ఇంద్రుడు దేవరాజ్యానికి తిరుగులేని అధిపతి అయ్యాడు.

తన పుత్రుల మరణానికి తల్లడిల్లిన దితి కశ్యపుని అంగీకారంతో ఇంద్రుణ్ణి సంహరించగల పుత్రునికోసం వెయ్యేళ్ళు తపస్సు చేసింది. అయితే తపస్సు పూర్తయ్యే వరకూ ఆమె శుచిగా ఉండాలి. ఇది నియమం.

దితి తపస్సు చేస్తున్న కాలంలో ఇంద్రుడు వచ్చి ఆమెకు సపర్యలు చేయడం మొదలుపెట్టాడు. దానికి ఆమె ఆనందించి – 'దేవేంద్రా! పుట్టబోయే బిడ్డకూ నీకూ వైరం లేకుండా చూస్తానులే!' అని ఇంద్రుణ్ణి అనుగ్రహించింది.

దితి చేస్తున్న తపస్సు ముగింపు దశకు చేరుకుంది. ప్రసవ సమయమూ సమీపించింది. ఒకరోజు దితి బాగా అలసిపోయి కాస్సేపు నడుం వాల్చింది. అలా పడుకోవడంలో కాళ్ళవైపు తలా, తలవైపు కాళ్ళూ పెట్టుకొని పడుకుంది. దురదృష్టం. అది తపస్సు పూర్తి అయ్యే సమయం. అలా పడుకోవడంవల్ల ఆమె మైలపడింది. ఇదే సమయం అనుకొని ఇంద్రుడు విజృంభించాడు. దితిగర్భంలోనికి ప్రవేశించి, గర్భస్థ శిశువును తన వజ్రాయుధంతో సప్తఖండాలు చేసేశాడు. లోపల శిశువులు ఏడుపు మొదలుపెట్టారు. ఇంద్రుడు **'మా రుదః మా రుదః' (ఏడవకు ఏడవకు)** అంటున్నాడు.

ఇంతలో దితికి మెలకువ వచ్చి విషయం గ్రహించింది. తన బిడ్డల్ని చంపవద్దని ఇంద్రుణ్ణి వేడుకుంది.

ఇంద్రుడు బయటకు వచ్చి – 'అమ్మా! నువ్వు అశుచిగా ఉన్నందువల్లనే ఇదంతా నేను చేయవలసి వచ్చింది.' అన్నాడు.

అప్పుడు దితి – 'సరే! నాయనా! తప్పు నాదే! పోనీ ఈ ఏడుగురూ సప్తమరుత్తులై స్థానపాలకులయ్యేట్టుగా అనుగ్రహించు. నువ్వే మారుదః మారుదః

అన్నావు కాబట్టి వీళ్ళు ఆ పేరుతోనే సప్తమరుత్తులని ప్రసిద్ధి వహిస్తారు. నాలుగు దిక్కులలోనూ అలాగే బ్రహ్మేంద్రవాయులోకాలలో వీళ్ళు ఏడుగురూ దివ్యరూపాలతో సంచరించే అవకాశం కల్పించు.' అని వేడుకుంది. ఇంద్రుడు అందుకు సమ్మతించాడు.

శ్రీరామా! ఆ ఏడు ఖండాలూ ఏడుగురు దివ్యపురుషులై దితితో కలిసి స్వర్గం చేరుకున్నారు. ఆ దితి తపస్సు చేసిన పుణ్యస్థలమే ఈ ప్రదేశం. ఆ తరువాత ఈ ప్రాంతాన్ని విశాలుడు అనే రాజు పరిపాలించాడు. ఇక్కడే విశాలానగరాన్ని నిర్మించాడు. ఇతడు మీ పూర్వికుడు. ఇక్ష్వాకునికి పుత్రుడు.

విశాలుని తరువాత వరుసగా హేమచంద్రుడు, సుచంద్రుడు, ధూమ్రాశ్వుడు, సృంజయుడు, సహదేవుడు, కుశాశ్వుడు, సోమదత్తుడు, కాకుత్స్థుడు, సుమతి ఇలా తరతరాలుగా ఆ విశాలుని వంశీయులే ఈ రాజ్యాన్ని పరిపాలిస్తున్నారు. వీళ్ళంతా పరమధార్మికులు. ఇప్పుడు పరిపాలిస్తున్న రాజు పేరు సుమతి." అన్నాడు విశ్వామిత్రమహర్షి.

అప్పటికే వీళ్ళ రాక తెలుసుకొన్న విశాలానగరచక్రవర్తి సుమతి తానే స్వయంగా వారిని ఆహ్వానించి, ఆ రాత్రికి ఆతిథ్యం ఇచ్చాడు.

## అహల్యాగౌతములు

మరునాడు అందరూ మిథిలవైపు నడక సాగించారు. కనుచూపుమేరలో మిథిల. ఆ పక్కనే గౌతమమహర్షి ఆశ్రమం. విశ్వామిత్రమహర్షి చెప్పడం ప్రారంభించాడు.

"శ్రీరామా! గౌతమమహర్షి భార్య అహల్య. బ్రహ్మమానసపుత్రిక. అయోనిజ. అనేక సంవత్సరాలుగా అహల్యాగౌతములు ఇక్కడే తపస్సుచేసుకొంటూ నివసిస్తున్నారు. దేవతలు కూడా పూజించే ఆశ్రమం ఇది. ఇంద్రుడు గౌతమమహర్షి తపస్సును భంగపరచాలనుకున్నాడు. గౌతమమహర్షి జితేంద్రియుడు. దేనికీ లొంగడు. కాబట్టి ఒక పన్నాగం పన్నాడు ఇంద్రుడు. గౌతమమహర్షి ఆశ్రమంలో లేని సమయంలో ఇంద్రుడు ఆ మహర్షి వేషంలో అహల్యదగ్గరికి వెళ్ళి తనను సుఖపెట్టమని కోరాడు. దానికి అహల్య–

'ఓ దేవేంద్రా! నా దాంపత్య జీవితం ఎంతో తృప్తికరంగా ఉంది. నువ్వు వెంటనే ఇక్కడనుంచి వెళ్ళిపో. అప్పుడే నీకూ నాకూ గౌరవం.' అంది.

ఇంతలో గౌతమమహర్షి రావడం, విషయం గ్రహించడం, ఇంద్రుణ్ణి శపించడం వెంట వెంటనే జరిగిపోయాయి. ఆ క్రోధావేశంలోనే గౌతమమహర్షి అహల్యను కూడా శపించాడు. 'వేలసంవత్సరాలు అన్నపానాలు లేకుండా గాలిని మాత్రమే భోజనంగా స్వీకరిస్తూ, దుమ్ములోనే పడుకొంటూ ఈ ఆశ్రమంలోనే పడి ఉండు.' అని. ఇంద్రుని పన్నాగం ఫలించింది. శాపం ఇవ్వడంతో గౌతమమహర్షి తపస్సు క్షీణించింది" అంటూ అహల్యా వృత్తాంతాన్ని చెప్పి, విశ్వామిత్రమహర్షి శ్రీరాముణ్ణి తీసుకొని ఆశ్రమంలోనికి దారితీశాడు.

శ్రీరాముడు ఆశ్రమంలో అడుగు పెట్టాడో లేదో శ్రీరామ దర్శనంతో అహల్య పవిత్రురాలై ధూళిలోంచి నిజరూపంతో పైకి లేచింది. తేజస్సుతో వెలిగిపోతూ శ్రీరామలక్ష్మణులకు అతిథి సత్కారాలు చేసింది. శ్రీరామలక్ష్మణులు ఆమెకు నమస్కరించారు. శాపవిమోచనం జరిగింది కాబట్టి అన్న మాటప్రకారం అక్కడికి వచ్చాడు గౌతమమహర్షి. అహల్యను స్వీకరించాడు.

* * *

మళ్ళీ ప్రయాణం. అదుగో! జనకమహారాజుగారి యజ్ఞవాటిక.

జనకమహారాజు ఎదురు వచ్చి వీరికి స్వాగతం పలికి – 'మీ దర్శనభాగ్యం వల్ల నా యాగం సఫలమయ్యింది' అంటూ పక్కకి చూసి – 'దేవతలతో సమానమైన పరాక్రమం కలవాళ్ళలాగా ప్రకాశిస్తున్నారు ఈ మునిబాలకులు. ఎవరు వీళ్ళు?' అని ఆశ్చర్యపోతూ అడిగాడు.

విశ్వామిత్రమహర్షి – రాక్షసుల్ని సంహరించడం మొదలు అహల్యా శాప విమోచనం దాకా జరిగినదంతా వివరంగా చెప్పి వాళ్ళను పరిచయం చేశాడు. అక్కడే గౌతమమహర్షి కొడుకు శతానందుడూ ఉన్నాడు. తన తల్లి అహల్యకు శాపవిమోచనం కలిగించిన శ్రీరాముణ్ణి చూడగానే అతడి హృదయం ఉప్పొంగింది. ఆప్యాయంగా శ్రీరామునికి స్వాగతం పలికి – విశ్వామిత్రముని గొప్పదనం శ్రీరామునికి చెప్పడం మొదలుపెట్టాడు.

## బ్రహ్మర్షి అయిన విశ్వామిత్రుడు

'శ్రీరామా! ఈ విశ్వామిత్రమహర్షి సకలశాస్త్ర కోవిదుడు. ఒకసారి తన సైన్యంతో వసిష్ఠమహర్షి ఆశ్రమానికి వచ్చి, అక్కడ శబల అనే హోమధేనువును చూసి తనకు ఇవ్వమని అడిగాడు. ఇవ్వనన్నాడు వసిష్ఠమహర్షి. బలవంతంగా ఎత్తుకుపోవాలని చూశాడు విశ్వామిత్రమహర్షి, కానీ ఆ ధేనువే విశ్వామిత్రముని సైన్యాన్ని చీల్చిచెండాడింది. ఆ అవమానభారంతోనే పట్టుదలగా ఘోరతపస్సు చేశాడు విశ్వామిత్రుడు. తరువాత తన తపశ్శక్తిని ధారపోసి త్రిశంకు మహారాజు కోసం మరో స్వర్గాన్నే సృష్టించాడు. సంసారసుఖలోలుడైనా, త్రిశంకు మహారాజు కోసం తపశ్శక్తిని ధారపోసినా, వసిష్ఠుని కుమారుల్ని శపించినా, మేనకపై మోహం పెంచుకున్నా, ఇలా మొదట తన తపశ్శక్తిని వృథాగా ఖర్చుచేసినా, తన లోపాలన్నింటినీ తపశ్శక్తితో అధిగమించి ఎలాగైతేనేం? వసిష్ఠుడే తనను బ్రహ్మర్షీ! అని పిలిచేలా చేసుకొన్నాడు. ఇదీ విశ్వామిత్రముని ఘనత' చెప్పాడు శతానందుడు.

## ఫెళ్ళుమన్న శివుని విల్లు

తరువాత రోజు జనకుడి ఇంట్లో శ్రీరామలక్ష్మణులు. జనకమహారాజు శివధనువు చూపుతూ శ్రీరామలక్ష్మణులతో–

'ఈ విల్లు చాలా మహిమ గలది. పూర్వం దక్షయజ్ఞాన్ని ధ్వంసం చేసినప్పుడు శివుడు అవలీలగా ఎత్తిన విల్లు ఇది. ఆ శివుడు దీన్ని దేవతలకు ఇస్తే, దేవతలు మా వంశీయుడైన చక్రవర్తి దేవరాతునికి ఇచ్చారు. అదలా ఉంచండి. కొన్నేళ్ళక్రితం నేను యాగభూమి దున్నుతుంటే నాకొక ఆడపిల్ల దొరికింది. ఆమెకు సీతాదేవి అని పేరు పెట్టుకొని అల్లారుముద్దుగా పెంచుతున్నాను. ఈ శివధనువు ఎక్కుపెట్టిన వీరునికే సీతాదేవి భార్య కావాలని నిశ్చయించాం. ఎందరో ప్రయత్నించారు గానీ ధనువు ఎత్తలేకపోయారు. కనీసం కదపనైనా కదపలేకపోయారు' అని జనక మహారాజు చెప్తున్నాడు. అంతలో అయిదువేలమంది హేమాహేమీలు అతికష్టంమీద ఆ ధనువు ఉంచిన పెట్టెను యజ్ఞవాటికకు తీసుకువచ్చారు.

చూశాడు శ్రీరాముడు. విశ్వామిత్రముని అంగీకారంతో ముందుకువచ్చి ఆ విల్లును తాకాడు. అంతా చూస్తున్నారు. ఒకటే ఉత్కంఠ. శ్రీరాముడు ఆ విల్లును విలాసంగా మధ్యలో పట్టుకొని, అవలీలగా పైకి ఎత్తాడు. చివాలున నిలబెట్టి,

అల్లెత్రాడు తగిలించాడు. అంతే! రెప్పపాటుకాలంలో ఆ విల్లు ఫెళఫెళమంటూ విరిగిపోయింది.

విశ్వామిత్రమహర్షి, జనకమహారాజు, శ్రీరామలక్ష్మణులు తప్ప అంతా మూర్ఛపోయారు.

జనకుడైతే పులకించిపోవడమే తరువాయి.

## పెళ్ళి సందడి

'ఆహా! కౌశికా! నా ప్రతిజ్ఞ నెరవేరిందయ్యా! వీర్యశుల్క అన్నాను కదా! ఇదిగో! సీతాదేవి. నా కూతురు. నా ప్రాణానికి ప్రాణం. శ్రీరామునికి సమర్పిస్తాను. నువ్వు అనుజ్ఞ ఇవ్వు. ఇప్పుడే ఈ వార్త అయోధ్యకు చేరవెయ్యాలి. దశరథుణ్ణి ఆహ్వానించాలి.' ఆనందంగా అంటున్నాడు జనకమహారాజు.

అయోధ్యకు వర్తమానం వెళ్ళింది. వసిష్ఠునితో సహా అందరూ మిథిలకు తరలి వచ్చారు. మిథిల అయోధ్య అయ్యింది. ఇరుపక్షాలవారూ సమావేశమయ్యారు. **శ్రీరాముని పక్షాన వసిష్ఠమహర్షి ప్రసంగిస్తూ శ్రీరాముని వంశవృక్షాన్ని ఇలా వివరిస్తున్నాడు.**

'బ్రహ్మ, మరీచి, కాశ్యపుడు, వివస్వంతుడు, మనువు, ఇక్ష్వాకువు, కుక్షి, వికుక్షి, బాణుడు, అనరణ్యుడు, పృథువు, త్రిశంకువు, దుందుమారుడు, యువనాశ్వుడు, మాంధాత, సుసంధి, ధ్రువసంధి, ప్రసేనజిత్తు, భరతుడు, అసితుడు, సగరుడు, అసమంజుడు, అంశుమంతుడు, దిలీపుడు, భగీరథుడు, కకుత్థ్సుడు, రఘువు, ప్రవృద్ధుడు, కల్మాషపాదుడు, శంఖణుడు, సుదర్శనుడు, శీఘ్రగుడు, మరుత్తు, ప్రశుశ్రుకుడు, అంబరీషుడు, నహుషుడు, యయాతి, నాభాగుడు, అజుడు, దశరథుడు, శ్రీరామభరతలక్ష్మణశత్రుఘ్నులు. ఇదీ వీరి వంశక్రమం. జనక మహారాజా! ఈ శ్రీరామలక్ష్మణులకు నీ ఇద్దరి కుమార్తెలను ఇవ్వు.' అన్నాడు.

**జనక మహారాజు లేచి నిలబడి తన వంశక్రమం చెప్పడం మొదలుపెట్టాడు.**

'ముల్లోకాలలోనూ ప్రఖ్యాతుడైనవాడు నిమిచక్రవర్తి. నిమి కొడుకు మిథి. మిథిలను నిర్మించింది ఇతడే. ఇతడి పుత్రుడు జనకమహారాజు. అందుకనే మాది జనక వంశం. ఆ తరువాత వరుసగా ఉదావసువు, నందివర్ధనుడు, సుకేతువు,

దేవరాతుడు, బృహద్రథుడు, మహావీరుడు, సుధృతి, ధృష్టకేతువు, హర్యశ్వుడు, మరువు, ప్రతింధకుడు, కీర్తిరథుడు, దేవమీఢుడు, విబుధుడు, మహీధ్రకుడు, కీర్తిరాతుడు, మహారోముడు, స్వర్ణరోముడు, హ్రస్వరోముడు. ఈయనే మా తండ్రిగారు. ఆ తరువాత నేనూ మా తమ్ముడు కుశధ్వజుడు. ఓ మునిపుంగవా! ఇదయ్యా మా వంశక్రమం. నా పుత్రికలు సీతాఊర్మిళలను శ్రీరామలక్ష్మణులకు ఇస్తున్నాను.' అన్నాడు. అప్పుడు విశ్వామిత్రమహర్షి – 'జనకమహారాజా! నీ తమ్ముడు కుశధ్వజుడి కుమార్తెలు మాండవీశ్రుతకీర్తులున్నారు కదా! వారిని భరత శత్రుఘ్నులకు ఇచ్చి ఇదే ముహూర్తానికి వివాహం జరిపించు.' అన్నాడు. సరేనన్నాడు జనకమహారాజు.

వివాహసందర్భంగా దశరథుడు తన ఒక్కొక్క పుత్రునితోనూ దూడలతో కూడిన నూరువేల గోవులను దానం ఇప్పించాడు. తానూ దానం చేశాడు.

## సీతారాముల కల్యాణం

మరుసటి రోజు వివాహవేదికపై నలుగురు పెళ్లి కొడుకులూ నలుగురు పెండ్లికూతుళ్ళూ ప్రకాశిస్తున్నారు. వివాహ ప్రక్రియ ప్రారంభం అయ్యింది. జనకమహారాజు–

'సౌందర్యవతి, సుకుమారి, లావణ్యవతీ అయిన ఈ సీతాదేవి అయోనిజ. ఈమె మా వంశానికి ప్రతీక.

**ఇయం సీతా మమ సుతా సహధర్మచరీ తవ**
**ప్రతీచ్ఛ చైనాం భద్రం తే పాణిం గృహ్ణీష్వ పాణినా (1-7-27)**

**ఇదిగో! ఈ సీతాదేవి నా పుత్రిక. నీకు సహధర్మచారిణియై ధర్మ, అర్థ, కామాలు అనే త్రివర్గాల ఆచరణలోనూ, కష్టసుఖాలలోనూ నీకు తోడూ నీడగా ఉంటుంది. ఈమెను స్వీకరించు. నీకు శుభమగుగాక!**

**పతివ్రతా మహాభాగా ఛాయే వానుగతా సదా**
**ఇత్యుక్త్వా ప్రాక్షిపద్రాజా మంత్రపూతం జలం తదా (1-7-28)**

**సర్వసౌభాగ్యవతీ, పతివ్రత అయిన ఈమె నిరంతరమూ నీకు నీడలా వెన్నంటి ఉంటుంది.'** అంటూ జనకమహారాజు ఆమెను శ్రీరాముడి చేతిలో పెట్టాడు. అలాగే–

'లక్ష్మణా! రావయ్యా! ఊర్మిళను స్వీకరించు. భరతా! రావయ్యా! మాండవిని స్వీకరించు. శత్రుఘ్నా! రావయ్యా! శ్రుతకీర్తిని స్వీకరించు. మీకు శుభమగుగాక!' అన్నాడు.

కన్నుల పండుగ. నాలుగు జంటలకూ పాణిగ్రహణం మహోత్సవంగా జరిగింది. ఆకాశం నుండి పుష్పవృష్టి కురిసింది. దేవదుందుభులూ వాద్యఘోషలూ మిన్నంటాయి. అప్సరసల నాట్యం. గంధర్వుల గానం. లోకమంతా ఆనందమే ఆనందం.

## కల్యాణరాముడూ– భార్గవరాముడూ

మర్నాటికి అంతా సద్దుమణిగింది. ఎక్కడివారు అక్కడికి బయలుదేరు తున్నారు. దశరథుడూ, పుత్రులతోనూ సమస్త పరివారంతోనూ కలిసి అయోధ్యకు బయలుదేరాడు. దారిలో ఏవో అపశకునాలు తోస్తున్నాయి. పెనుగాలి వీచింది. సూర్యుడు మసకబారాడు. భూమి కంపిస్తోంది. చెట్లు కూలిపోతున్నాయి. సైన్యంమీద దుమ్మూధూళీ ఆవరించింది. కారణం, మహాపరాక్రమవంతుడూ తపస్వీ అయిన పరశురాముడు వస్తున్నాడు.

పరశురాముడు వస్తూనే శ్రీరాముణ్ణి చూసి – 'దాశరథీ! శివధనువు ఎక్కుపెట్టావని విన్నాను. పూర్వం విశ్వకర్మ రెండు ధనుస్సులు సృష్టించాడు. వాటిలో ఒకదానిని త్రిపురాసుర సంహారంకోసం శివుడు ఉపయోగించాడు. నువ్వు ఎక్కుపెట్టిన ధనువు అదే. ఇదుగో ఇది రెండోది. ఇది హరిధనువు. దీనిని ఋచీకమహర్షికి ఇచ్చాడు. ఆ ఋచీకుడు మా తాత. అతనినుండి నా తండ్రి జమదగ్నికి, నా తండ్రినుంచి నాకూ సంక్రమించింది.

నా తండ్రిని చంపిన కార్తవీర్యార్జునుణ్ణీ ఇంకా సమస్తక్షత్రియుల్నీ సంహరించి ఈ భూమిని గెలిచినవాణ్ణి నేను. ఆ గెలిచిన భూమిని యజ్ఞంలో కాశ్యపునికి దక్షిణగా ఇచ్చి మహేంద్రగిరికి వెళ్ళిపోయాను. నువ్వు శివధనువు విరిచావని విని వచ్చాను. ఏదీ ఈ విల్లు ఎక్కుపెట్టి, నీ శక్తిని చూపించు. నువ్వు పరాక్రమ వంతుడివైతేనే నీతో నేను ద్వంద్వయుద్ధం చేస్తాను.' అన్నాడు.

శ్రీరామునికి కోపం వచ్చింది. విల్లు తీసుకొని, చిటికెలో ఎక్కుపెట్టాడు. బాణం సంధించి – 'భార్గవా! చెప్పు ఏం చేయమంటావు ఈ బాణాన్ని? నీ

పాదగమనాన్ని ఖండించమంటావా? లేక నువ్వు తపస్సు చేసి సంపాదించిన పుణ్యలోకాలనా? అన్నాడు. వెంటనే–

“శ్రీరామా! నువ్వే శ్రీమహావిష్ణువు. విల్లు ఎక్కుపెట్టడంతోనే తెలుసుకున్నాను. స్వస్తి! పూర్వం, నేను సమస్తభూమండలాన్ని జయించి, కశ్యపమహర్షికి సమర్పించాను. అప్పుడు ఆ ముని – ‘ఇక నువ్వు నా దేశంలో ఉండవద్దు’ అని నన్ను ఆజ్ఞాపించాడు. అందువల్ల నేను ఒక్క రాత్రి కూడా కాశ్యపునికి దానం చేసిన ఈ నేలపై ఉండకూడదు. అది నా ప్రతిజ్ఞ. కాబట్టి నా పాదగతిని ఖండించకు. నేను తపస్సు చేసి సంపాదించిన పుణ్యలోకాలను సంహరించు (నేను మళ్ళీ వాటిని తపస్సుతో సాధించుకోగలను).” అన్నాడు పరశురాముడు.

* * *

అంతా చూస్తున్నారు. రఘుపతి బాణం విడిచిపెట్టాడు. రెప్పపాటుకాలంలో పరశురామునికి తపస్సువల్ల లభించిన లోకాలు నశించిపోయాయి. దాశరథికి ప్రదక్షిణం చేసి మనోవేగంతో మహేంద్రగిరికి వెళ్ళిపోయాడు పరశురాముడు.

మళ్ళీ ప్రయాణం. అందరూ అయోధ్య చేరుకొన్నారు. కొత్త దంపతులకు మంగళహారతి పట్టి గృహప్రవేశం చేయించారు. అంతా సుఖసంతోషాలతో కాలం గడుపుతున్నారు.

కొన్నాళ్ళ తర్వాత భరతుడు దశరథుని అనుమతితో శత్రుఘ్నుణ్ణి వెంటబెట్టుకొని మేనమామ యుధాజిత్తు ఇంటికి వెళ్ళాడు.

అయోధ్యలోనే ఉంటూ శ్రీరామలక్ష్మణులిద్దరూ తండ్రి సేవలో తరిస్తున్నారు.

సీతారాములూ పరస్పరం అనురాగంతో అన్యోన్యంగా జీవిస్తున్నారు.

లక్ష్మీసమేతుడైన శ్రీమహావిష్ణువు లాగా శ్రీరామచంద్రుడు ప్రకాశిస్తున్నాడు. కాలం గడుస్తోంది.

# అయోధ్యాకాండ

## శ్రీరామపట్టాభిషేక సంరంభం

అప్పుడే పన్నెండేళ్లు గడిచిపోయాయి. శ్రీరామలక్ష్మణులు అయోధ్యలో తండ్రిగారి దగ్గర ఉన్నారు. కాలం తెలియకుండానే గడుస్తోంది. అక్కడ భరత శత్రుఘ్నులూ తాతగారింట్లో అంతే హాయిగా ఉన్నారు.

దశరథునికి నలుగురు కొడుకులూ నాలుగు భుజాలే కానీ రాముడంటే ఎక్కువ ప్రీతి. ఆ ప్రేమ రోజురోజుకీ ఎక్కువ అవుతోందేగానీ తగ్గడం లేదు. అందుకు కారణం శ్రీరామునిలోని గొప్ప గుణాలే.

రఘువీరుడు బలవంతుడే కానీ గర్వం ఏ కోశానా లేదు. అబద్ధం ఆడడు. అందరినీ అలరిస్తాడు.

అసలు కోపమే ఉండదు. దీనులంటే వల్లమాలిన దయ. ధర్మం తెలిసి నడుచుకుంటాడు. నిగ్రహమా? కావలసినంత. పట్టువిడుపులూ అతడికి బాగా తెలుసు. న్యాయవిచక్షణుడు, ఆదాయవ్యయాల లోతుపాతులు బాగా ఎరిగినవాడు. బుద్ధిలో బృహస్పతి. పరాక్రమంలో ఇంద్రుడు. అంతెందుకు? ఒక్క మాటలో చెప్పాలంటే తండ్రిని మించిన తనయుడు. అందరి మనసులనూ ఇట్టే ఆకట్టు కొంటున్నాడు.

దశరథరాముడు సహజసుందరుడు. ఆయనలోని మంచిగుణాలు కేవలం తల్లిదండ్రులకే కాదు, ప్రజలందరికీ ప్రీతిపాత్రాలయ్యాయి. అందరి మనస్సులనూ దోచుకున్నాయి. అలా మంచి లక్షణాలతో అలరారుతూ ఉన్న ఆ శ్రీరాముడు సూర్యభగవానునిలా ప్రకాశిస్తున్నాడు. అందుకే ఈ రఘువరుడే మాకు ప్రభువు కావాలని భూలోక ప్రజలందరూ కోరుకుంటున్నారు.

శ్రీరామునికీ ప్రజలకూ మధ్య ప్రేమాభిమానాలు పెరిగాయి. అది గమనించిన దశరథుడికో ఆలోచన వచ్చింది. తాను ఉండగానే శ్రీరామునికి యౌవరాజ్య పట్టాభిషేకం చేస్తే బావుంటుందనిపించింది. అందరినీ పిలిచి చర్చించాడు.

సభాసదులకు పట్టరాని ఆనందం. శ్రీరాముడు యోగ్యుడంటూ ఇలా పొగుడుతున్నారు. 'మహారాజా! నీ తర్వాత రాజ్యాన్ని పాలించడానికి అన్నివిధాలా శ్రీరాముడు అర్హుడు. అతడికే పట్టాభిషేకం చెయ్యండి' అన్నాడు. అప్పుడు దశరథుడు 'అయితే నా పరిపాలన బాగాలేదా?' అన్నాడు పౌరులతో. ఆ మాటకు ప్రజలు – 'మహారాజా! మీ పరిపాలన బాగుంది. అయితే శ్రీరాముణ్ణే ఎందుకు కోరుకుంటున్నామంటే – శ్రీరాముడు ఎప్పుడు అవకాశం వచ్చినా అందరినీ ఎంతో ఆప్యాయంగా పలకరిస్తాడు. యోగక్షేమాలు విచారిస్తాడు. మేము బాధపడితే తానూ బాధపడతాడు. మేము ఆనందిస్తే తండ్రిలా తానూ ఆనందిస్తాడు. శ్రీరాముని చేతుల్లో రాజ్యం పెడితే ఆ రాజ్యానికి ఏ లోటూ ఉండదు. రక్షణ కల్పించగల సామర్థ్యం శ్రీరామునికి ఉందన్నది మా ప్రగాఢ విశ్వాసం. ఎందుకంటే శ్రీరాముడు ఆజానుబాహుడు. మహాబలసంపన్నుడు. అనేక కల్యాణగుణాలకు పెన్నిధి. రాముని సద్గుణాలు లోకానికి ప్రీతికరమైనవి. ఆనందదాయకమైనవి. అంతేకాదు; సకల జనుల హితాన్నీ కాంక్షిస్తూ ఔదార్య గుణంతో ఒప్పే శ్రీరాముణ్ణి మాకు పాలకుడుగా పట్టాభిషేకం చెయ్యి.' అన్నారు పౌరులంతా ముక్తకంఠంతో.

దశరథుని సంబరం చూడాలి. పట్టరానంత ఆనందంతో వసిష్ఠ వామదేవుల వైపు చూసి – 'ఈ చైత్రమాసంలోనే శ్రీరామ పట్టాభిషేకం. ఏర్పాట్లు చూడండి.' అన్నాడు.

సుమంత్రుని పిలుపుమేరకు శ్రీరాముడు తండ్రిగారి దగ్గరకు వచ్చి కాళ్ళకు నమస్కరించాడు. దశరథుడు ఆప్యాయంగా శ్రీరాముణ్ణి లేవనెత్తి, కౌగిలించుకొని మణులు పొదిగిన బంగారు సింహాసనంపై కూర్చోబెట్టాడు.

ఆ సింహాసనంపై శ్రీరాముడు మేరుశిఖరంపై ఉన్న సూర్యునిలా ఉన్నాడు. శరత్కాలం నాటి ఆకాశంలోని చంద్రునిలా వెలిగిపోతున్నాడు. అచ్చం తండ్రిలాగే ఉన్నాడు. అలా ఉన్న శ్రీరాముణ్ణి చూసి, ప్రజలూ మంత్రులూ వింటూ ఉండగా దశరథుడు–

'శ్రీరామా! నువ్వు ఇంకా ఇంకా వినయసంపన్నుడవు కావాలి. ఇంద్రియాలను జయించాలి. కామక్రోధాలవల్ల పుట్టుకొచ్చే వ్యసనాలను త్యజించాలి. ప్రత్యక్షంగా కాకుండా చారుల ద్వారా అన్ని వార్తలను సేకరించు. అందుకు తగిన విధంగా ప్రవర్తించు. నీ పరిపాలన, అమాత్యుల్నీ, సేనాపతుల్నీ, పట్టణవాసుల్నే కాదు జానపదుల్నీ అలరించేలా ఉండాలి. కోష్ఠాగారాన్ని ధనధాన్యాలతో నింపు. అలాగే ఆయుధాగారాన్ని ఆయుధాలతో పరిపుష్టం చెయ్యి. సామంతులతో సహా రాజ్యంలోని అన్ని విభాగాలకూ నీ అనురాగాన్ని పంచు. అలా పరిపాలించే రాజును చూసి సామంతులు మొదలైన వాళ్ళు అమృతాన్ని పొందిన దేవతల్లా సంతోషిస్తారు. ఇవన్నీ గుర్తుకు ఉంచుకొని మనోనిగ్రహంతో రాజ్యపాలన సాగించు.' అన్నాడు.

శ్రీరాముడు అలాగేనంటూ తండ్రిగారివద్దనుండి సెలవు తీసుకొని తన మందిరానికి బయలుదేరాడు. ప్రజలూ సంతోషంతో తమ తమ నివాసాలకు కదిలారు.

వాళ్ళు వెళ్ళిన తరువాత దశరథుడు మంత్రులందరినీ కూడా సాగనంపి, మళ్ళీ శ్రీరాముణ్ణి తనవద్దకు రప్పించుకుని – 'శ్రీరామా! నేను చాలాకాలం ఈ రాజ్యపాలన చేశాను. సకల భోగాలూ అనుభవించాను. నా విధులన్నింటినీ సక్రమంగా పాటించాను. దేవ, ఋషి, పితృ ఋణాలను తీర్చాను. దుష్టగ్రహాలు నా జన్మ నక్షత్రాన్ని ఆక్రమించాయట. దైవజ్ఞులు చెప్పారు. దాని ప్రభావం వల్ల నాకు ఎప్పుడు ఏమౌతుందో తెలీదు. నాకు దుశ్శకునాలు కూడా గోచరిస్తున్నాయి.

నువ్వు నా పెద్ద కొడుకువి. ఉత్తమునివి. నీ గుణాలకు మెచ్చారు ప్రజలు. నిన్నే రాజుగా కావాలంటున్నారు. పుష్యనక్షత్రయుక్తమైన శుభలగ్నంలో అంటే రేపే నీకు పట్టాభిషేకం చెయ్యబోతున్నాను. మరో మాట! ఎవరి బుద్ధి ఎప్పుడు ఎలా ఉంటుందో! వెంటనే పట్టాభిషేకం జరిగిపోవాలి. అదీ భరతుడు తాతగారింటి నుండి వచ్చేలోగానే.' అంటూ తగిన జాగ్రత్తలు చెప్పి రాముణ్ణి పంపివేశాడు.

* * *

పురప్రముఖులకీ, ప్రభుత్వాధికారులకీ ఆహ్వానాలు అందాయి.

'జనకమహారాజుకీ అలాగే కేకయరాజుకీ ఆహ్వానాలు పంపేందుకు సమయం లేదనీ తర్వాత ఈ వార్త వాళ్ళకీ తెలుస్తుందిలే' అనీ చెప్పాడు దశరథుడు.

శ్రీరాముడి ప్రియమిత్రులు ఈ శుభవార్తను కౌసల్యాదేవికి చెప్పారు. ఆవిడ ఎంతగానో ఆనందించింది. వాళ్ళని బహుమానాలతో ముంచెత్తింది.

రాజాజ్ఞ. ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి.

* * *

శ్రీరాముడు తన మందిరానికి వచ్చిన తరువాత తల్లి కౌసల్యాదేవి దగ్గరకు వెళ్ళాడు.

కౌసల్యాదేవి పూజగదిలో ఉంది. సుమిత్ర, లక్ష్మణుడు, సీతాదేవి కూడా అక్కడే ఉన్నారు. అప్పుడు శ్రీరాముడు కౌసల్యాదేవితో – 'అమ్మా! రేపు పట్టాభిషేకం కాబట్టి ఈ రాత్రికి నేనూ సీతా ఉపవాసం ఉండాలని తండ్రిగారి ఆజ్ఞ. ఇంకా ఏమేం చెయ్యాలో చెప్పు.' అన్నాడు.

కౌసల్యాదేవి కళ్ళల్లో ఆనందబాష్పాలు. ఎప్పటిదో ఈ కల. ఇప్పటికి నెరవేరుతోంది. 'చిరం జీవ! చిరం జీవ! నువ్వు ఇక్ష్వాకు సామ్రాజ్యానికి రాజువవుతున్నావయ్యా' అంటూ మురిసిపోయింది.

లక్ష్మణుణ్ణి చూసి స్నేహంతో శ్రీరాముడు – 'లక్ష్మణా! ఈ రాజ్యం నాదే కాదు. నీది కూడా. నువ్వూ పాలించాలి. నాకు సహకరించాలి' అన్నాడు.

అందరి దగ్గరా సెలవు తీసుకొని సీతారాములు తమ మందిరానికి బయలుదేరారు. వసిష్ఠమహర్షి నేరుగా శ్రీరాముని మందిరానికే వచ్చి వాళ్ళచేత దీక్ష పట్టించి వెళ్ళాడు. తరువాత శ్రీరాముడు శ్రీమహావిష్ణుహోమం చేశాడు. ఆ రాత్రికి దర్భలతో అల్లిన చాపలపై సీతారాములు నిద్రపోయారు.

అయోధ్యానగరం ఆనందంలో తేలుతోంది. అందరి నోటా ఇదే మాట. శ్రీరామ పట్టాభిషేకం! శ్రీరామపట్టాభిషేకం! వీథులూ ఇళ్ళూ అన్నీ అలంకరణలతో కళకళలాడుతున్నాయి. పట్టాభిషేకానికి వస్తున్న జనసందోహంతో పట్టణం క్రిక్కిరిసిపోతోంది. జనఘోష పున్నమనాటి సముద్రఘోషలా ఉంది.

## మంథర పన్నాగం

ఇంతలో మంథర అనే ఒక దాసి అక్కడికి వచ్చింది. అది ఎక్కడ పుట్టిందో! ఎక్కడ నుంచి వచ్చిందో! ఏమోగానీ కైకేయికి అరణపు దాసి. అందుకే ఆమె అంటే కైకేయికి చాలా ఇష్టం.

రాజప్రాసాదంవైపు కదిలింది మంథర. ఊరంతా ఒకటే కోలాహలం. చెప్పరాని ఆనందం. చూసి నివ్వెరపోయింది. మొత్తానికి విషయం రాబట్టి, కైక దగ్గరికి విసవిసా వచ్చింది.

* * *

'కైకా! కైకా!!' అరుస్తోంది మంథర.

కైక హంసతూలికాతల్పంపై కులాసాగా ఉంది. అది చూసిన మంథర – 'మూఢురాలా! ఏమిటి? ఇంకా నిద్రపోతున్నావా? లే! అయిపోయింది. సర్వనాశన మయిపోయింది.' అంది. కైక ఆశ్చర్యపోతూ – 'మంథరా! ఏమంటున్నావు నువ్వు? ఒంట్లో బాగాలేదా ఏమిటి? ఏమిటా మాడుముఖం? ఏమైంది?' అని అడిగింది.

'ఇంకేముందే కైకా! నీకు పోయేకాలం దాపురించిందిలే! దశరథుడు శ్రీరామునికి యువరాజపట్టాభిషేకం చేస్తున్నాడట! ఆ మాట వింటేనే నా కడుపు రగిలిపోతోంది. దుఃఖంతో మనస్సు బరువెక్కిపోతోంది. నీ కేమో చీమకుట్టినట్టైనా లేదు. నీ భర్త సామాన్యుడు కాదే కైకా! మాయలోడు. నిన్ను మభ్యపెట్టి సంపదంతా ఆ కౌసల్యకే దోచిపెడుతున్నాడే పిచ్చిదానా! దశరథుడంటే నీ భర్త కాదే! ఒడిలో ఉన్న పాము. తెలుసుకో! ఈ పట్టాభిషేకం గనక జరిగిందా! అంతే! నీ గతీ నీ కొడుకు భరతుడి గతీ అధోగతే. అప్పుడు నువ్వు చచ్చిన పాముతో సమానం. నీ సవతీ, ఆమె కొడుకూ మహారాజుల్లా వెలిగిపోతుంటే నీకు ఆనందం ఎక్కడిది? లే! ఏదో ఒకటి చెయ్యి. త్వరగా మేలుకో!' అంది. మంథర నెత్తీ నోరూ బాదుకుందిగానీ కైక మాత్రం చిరునవ్వు చిందిస్తూ – 'ఎంత మంచి వార్త తెచ్చావే మంథరా! ఇదుగో బహుమతి. ఈ ఆభరణం తీసుకో. నాకు రాముడొకటీ భరతుడొకటీనా?' అంది.

ఆ మాటలకి మంథర కోపం తారాస్థాయికి చేరుకుంది. కైక ఇవ్వబోయిన ఆభరణాన్ని తిప్పికొట్టి –

'అమాయకురాలా! నిన్ను చూస్తుంటే నాకు నవ్వొస్తోంది. సవతి కొడుకు వృద్ధిలోనికి రావడం అంటే నువ్వు మరణిస్తున్నట్టే. శ్రీరామునికి భరతుని వల్లనే భయం. భయపడిన శ్రీరామునివల్లనే భరతునికి ప్రమాదం పొంచి ఉంది. అందుకే

నా బాధంతా. **భయపడ్డవాడే కదా భయపెడతాడు.** శ్రీరామునునికి పట్టాభిషేకం జరిగితే భరతుడు శ్రీరామునికి తొత్తు కాక మరేమిటి?'

మంథర నూరిపోస్తోంది. నూరిపోస్తున్న కొద్దీ కైక శ్రీరాముని గుణాలను మెచ్చుకొంటోంది. చివరికి 'నాకు భరతుని కంటే రాముడే ఎక్కువ' అనీ అంది కైక.

'శ్రీరాముడు గనక రాజు అయితే నీకూ, నీ కొడుక్కీ పుట్టగతు లుండవు' అని మంథర పదే పదే జోరీగలా లేనిపోనివన్నీ చెప్పి చెప్పి కైకను రెచ్చగొట్టింది. కొంతసేపు వాదోపవాదాలూ తర్జనభర్జనలూ జరిగాయి.

'నువ్వు అవమానాల్నుంచి తప్పించుకోవాలంటే భరతునికి పట్టాభిషేకం, శ్రీరామునికి దేశబహిష్కరణ జరగాలి. అందుకేదైనా ఉపాయం ఆలోచించు' అంది మంథర.

మంథర మాటలు పనిచేశాయి. కైక ఆలోచనల్లో మార్పు వచ్చింది. ముఖం కందగడ్డలా కోపంతో ఎర్రబడింది. వేడి వేడి నిట్టూర్పులు విడుస్తూ – 'మంథరా! నువ్వే ఏదైనా ఉపాయం చెప్పు' అంది. ఆమె మాటల్లో కరుకుదనం.

'కైకా! ఒకసారి శంబరాసురుడి చేతిలో నీ భర్త మూర్ఛపోతే నువ్వే అతణ్ణి రక్షించావు. గుర్తుందా? అప్పుడు రాజు నీకు రెండు వరాలు ఇచ్చాడు. వాటిని నువ్వు ఇప్పటిదాకా వాడుకోలేదు కదా! ఇప్పుడు అడుగు. ఒకటి– భరతుడి పట్టాభిషేకం. రెండు– శ్రీరామునికి పద్నాలుగేళ్ళ వనవాసం. ఈ పద్నాలుగేళ్ళలో భరతుడు రాజుగా నిలదొక్కుకుంటాడు. శ్రీరాముణ్ణి ప్రజలు మర్చిపోతారు. అప్పుడు భరతుడే శాశ్వతంగా రాజు అవుతాడు.'

మంథర వ్యూహానికి కైక ముఖంలో ఆనందం. 'మంథరా! నువ్వు నిజంగా గొప్పదానివేనే. అలాగే నువ్వు చెప్పినట్లే చేస్తాను' అంటూ అగ్నిశిఖలా వెలిగిపోతూ కైక మంథరను పొగుడుతుంటే అది ఉబ్బితబ్బిబ్బైపోతోంది.

## కైక కోరిన వరాలు

కైక కోపగృహంలోనికి ప్రవేశించింది. నల్లచీర కట్టింది. నగలు విసిరి కొట్టింది. కటిక నేలపై పడుకుంది. ఆ భవనం మొత్తం నక్షత్రాలు లేని కాళరాత్రి నాటి

ఆకాశంలా ఉంది. సంబరంగా వచ్చిన దశరథుడు కైకేయి ఉన్న పరిస్థితిని చూసి అవాక్కైపోయాడు. మనసు ఏదో కీడు శంకించింది. అడిగాడు–

'దేవీ కైకా! ఏమిటీ అవతారం! ఎందుకు కోపంగా ఉన్నావు? దెయ్యం పట్టిందా ఏమిటి? ఒంట్లో బాగాలేదా? రాజవైద్యుల్ని రప్పించనా? నిన్నెవరైనా ఏమైనా అన్నారా? ఏం చెయ్యమంటావో చెప్పు? నీకోసం ఏదైనా చిటికెలో చేసేస్తాను.'

కైక ఉలుక లేదు. పలుకనూ లేదు. పదే పదే అడిగాడు. చివరిగా అన్నాడు–

'శ్రీరాముడు తప్ప నీకంటే నాకు ఎవరెక్కువ కైకా ? నువ్వేం అడిగినా చేస్తాను.'

కైక ముఖం వికసించి – 'రాజా! నన్నెవరూ ఏమీ అనలేదు. నాకే అనారోగ్యమూ లేదు. నాకో కోరిక ఉంది. దానిని తీరుస్తానని నువ్వు ప్రతిజ్ఞ చేస్తే అదేమిటో చెప్తాను.' అంది. అందుకు దశరథుడు స్థిరంగా ఇలా అన్నాడు. 'సరే కైకా! శ్రీరాముడి మీద ప్రమాణం చేస్తున్నాను. తప్పక తీరుస్తాను చెప్పు.'

అప్పుడు కైక – **'ఓ దేవతలారా! దిక్పాలకులారా! పంచభూతాల్లారా! వినండి.** మీరే సాక్షులు.

ప్రాణనాథా! ఒకప్పుడు నాకు రెండు వరాలు ఇచ్చావు. అవి ఇప్పుడు అడుగుతున్నాను తీరుస్తావు కదా! విను.

శ్రీరామునికి నిర్ణయించిన ముహూర్తానికే భరతునికి పట్టాభిషేకం జరగాలి. శ్రీరాముడు నారచీరలు ధరించి పద్నాలుగు సంవత్సరాలు దండకారణ్యంలో తపస్సు చేస్తూ జీవించాలి. ఇవే నా రెండు కోర్కెలు. ఎప్పుడో కాదు. ఈ రోజే.. ఈ క్షణమే.. జరగాలి. లేదంటే నీ కళ్ళ ముందే నేను ప్రాణత్యాగం చేస్తాను. చెప్పు; మాట తప్పుతావా? నిలబెట్టుకుంటావా?'

ఆ మాటలు విన్న దశరథుడు ఉన్నవాడు ఉన్నట్లే కుప్పకూలిపోయాడు. ఇది కలా? నిజమా? లేక మతిభ్రమా? అర్థం కాలేదు. సివంగిని చూసిన లేడిపిల్లలా కైకను చూసి గజగజలాడిపోయాడు. నోట మాట రాలేదు. కాళ్ళు, చేతులు ఆడలేదు. ఏమనాలో తెలియడం లేదు. బాధ, కోపం, అసహనం అన్నీ మూకుమ్మడిగా ముంచెత్తుతున్నాయి.

'కైకేయీ! నీకీ విపరీతపు బుద్ధి ఎందుకు పుట్టింది? ఏమయ్యింది నీకీ రోజు? ఆ మాట అనడానికి నీకు నోరెలా వచ్చింది. దుష్టురాలా! మేం నీకు ఏం అపకారం చేశామని ఇంతటి దురాలోచన చేస్తున్నావు. నిన్ను కన్నతల్లిలా భావిస్తున్న శ్రీరామునికి ఇంతటి కీడు తలపెడుతున్నావా? ఎవర్ని వదిలెయ్యమంటావో చెప్పు? కౌసల్యనా? సుమిత్రనా? రాజ్యాన్నా? ప్రాణాల్నా? వెంటనే ... వెంటనే వదిలేస్తాను. కానీ శ్రీరాముణ్ణి మాత్రం వదలలేను. శ్రీరామునికి పట్టాభిషేకం చేస్తానని అందరిముందూ మాట ఇచ్చాను. దాన్ని ఇప్పుడెలా తప్పమంటావు?'

'కైకా! కైకా...' అంటూ ఆమె కాళ్ళపై పడి వేడుకొన్నాడు దశరథుడు. కైక మనసు కరగలేదు. తిట్టాడు. దండం పెట్టాడు. కనికరించమన్నాడు. బతిమాలాడు. బామాలాడు. చివరికి మూర్ఛపోయాడు.

కైకలో చలనం లేదు. జాలి అంతకన్నా లేదు. స్థిరంగా ఉంది. భయం లేదు. మళ్ళీ అదే మాట.

'రాజా! ఏం కోరినా తీరుస్తానని దేవతల సాక్షిగా ప్రతిజ్ఞ చేసి, తీరా నా కోరిక విన్నాక కుంటిసాకులు చెప్తున్నావు. ఏడుపుగొట్టు మాటలు మాట్లాడుతున్నావు. నువ్వేదో పెద్ద ధర్మాత్మునివని లోకం అంతా అనుకుంటోంది. ఆడిన మాటను తప్పడమేనా నీ ధర్మజ్ఞత? నీ ప్రవర్తన రాజవంశానికే పెద్ద కళంకం. ఆలోచించుకో.' అంటూ సూటిపోటిమాటలతో దశరథుణ్ణి గుచ్చిగుచ్చి చంపుతోంది.

ఎంత బతిమాలాడో దశరథుడు. శ్రీరాముడు వనవాసానికి వెళ్తే వచ్చే అపకీర్తి గురించీ, కష్టనష్టాల గురించీ ఎంతగానో నచ్చ చెప్పాడు. చేయగలిగింది ఏమీ లేక కుమిలి కుమిలి ఏడుస్తున్నాడు. కాడికీ చక్రానికీ మధ్య నలిగే ఎద్దులా ఉంది అతడి పరిస్థితి. కొంతసేపు స్పృహలో ఉంటున్నాడు. కొంతసేపటికి స్పృహ కోల్పోతున్నాడు. స్పృహలో ఉన్నంత సేపూ కైకను తిట్టిపోస్తూనే ఉన్నాడు. మరోవైపు అర్థిస్తూనే ఉన్నాడు.

'దేవీ! నేను వృద్ధుణ్ణి. దీనుణ్ణి. సాధుస్వభావం కలవాణ్ణి. ఇన్నింటికీ మించి మహారాజుని. నాపై దయ చూపించు. శ్రీరాముణ్ణి అనుగ్రహించు.' ప్రాధేయ పడుతున్నాడు దీనాతిదీనంగా.

'కైకేయీ! నిన్ను అగ్నిసాక్షిగా వివాహం చేసుకున్నాను. ఈ క్షణమే నిన్నూ నీ కొడుకునూ విడిచిపెట్టేస్తున్నాను' అని బెదిరించాడు కూడా.

'గుఱ్ఱాలమీదా ఏనుగులమీదా తిరిగే నా శ్రీరాముణ్ణి ఎలా పాదచారిగా నడిపించమంటావు? ఎలా దండకారణ్యంలోనికి పంపించమంటావు? షడ్రసోపేత భోజనానికి బదులు నా శ్రీరాముణ్ణి ఎలా కందమూలఫలాల్ని తినేలా చేయమంటావు? చెప్పు కైకా చెప్పు?' అన్నాడు. విలపించాడు. మొత్తుకున్నాడు. నెత్తీ నోరూ బాదుకున్నాడు.

కైకేయి తొణకలేదు. బెణకలేదు. కనికరించలేదు. ఇలా హితవు పలికింది.

***'రాజా! శిబిచక్రవర్తి ఒక డేగకు ఏకంగా తన శరీరాన్నే కోసి ఇచ్చాడు. అలర్కమహారాజు ఒక విప్రుడికి తన కళ్ళనే దానం చేశాడు. సత్యసంధుడైన సముద్రుడూ చెలియలికట్టను దాటకుండా ఉంటున్నాడు. ఎందుకో తెలుసా? సత్యం కోసమే. ఆడిన మాటను తప్పితే మీ వంశప్రతిష్ఠ ఏంకాను?***

**సత్యమేకపదం బ్రహ్మ సత్యే ధర్మః ప్రతిష్ఠితః**
**సత్యమే వాక్షయా వేదాః సత్యేనై వాప్యతే పరమ్ (2-14-7)**

***రాజా! ధర్మవేత్తలంతా సత్యమే ధర్మమని అంటారే! సత్యమే బ్రహ్మ. సత్యం మీదనే ధర్మం ఆధారపడి ఉంది. సత్యమే అక్షయవేదాలు. సత్యం వల్లనే పరమపదమూ లభిస్తుంది. అటువంటి సత్యం మీద నీ బుద్ధిని నిలుపు.'*** అంది.

ఆ రాత్రి దుర్భరంగా గడిచింది. తెలతెలవారబోతోంది. పట్టాభిషేకానికి అంతా సిద్ధమేనని వసిష్ఠమహర్షి సుమంత్రుడి ద్వారా దశరథుడికి కబురుపంపాడు. అందుకోసం కైకేయీ మందిరానికి వచ్చాడు సుమంత్రుడు. అతణ్ణే పంపి శ్రీరాముణ్ణి అక్కడికి పిలిపించింది కైక.

## శ్రీరాముడి పితృవాక్యపరిపాలన

శ్రీరాముడు వచ్చాడు. వినయంగా తల్లిదండ్రులకు పాదాభివందనం చేశాడు. శ్రీరాముని ముఖమైనా చూడలేక పోయాడు దశరథుడు. కనీసం పెదవి విప్పి పలకరించలేక పోయాడు. దశరథునికి దుఃఖంతో గొంతు పూడుకు పోయింది. నోరు పెగలడం లేదు.

అక్కడి వాతావరణం, తండ్రి పరిస్థితీ చూసి శ్రీరాముడు నిర్ఘాంతపోయాడు. భయం వేసింది. ఒక్కసారిగా పాము కాటువేసినట్లు అనిపించింది. తనను చూడగానే ఉప్పొంగిపోయే తండ్రి, అంతవరకూ ఎంతకోపంగా ఉన్నా తను కనిపించగానే శాంతమూర్తిగా మారిపోయే తన తండ్రి దశరథుడేనా? ఇప్పుడు ఇలా? ఏమిటిది? అసలు ఏమై ఉంటుంది? ఆలోచనలు శ్రీరాముణ్ణి ఊపిరితీసుకోనివ్వడం లేదు. కైకతో –

'అమ్మా! ఏమైంది? తెలిసో తెలియకో నేను ఏదైనా తప్పు చేశానా? నాన్నగారు ఎందుకు నాతో మాట్లాడరు? తమ్ముళ్ళకేమైనా అయ్యిందా? లేదా నేను ఎవరి ఆజ్ఞనన్నా జవదాటానా? చెప్పు. నిజంగా తప్పు నాదే అయితే ఒక్క క్షణం కూడా బతకనమ్మా?' అడుగుతున్నాడు శ్రీరాముడు. కైకేయి మెల్లగా అంది.

'రామా! మీ నాన్నగారి మాట, అది ఏదైనా సరే నెరవేరుస్తానని నువ్వు మాట ఇస్తే చెబుతాను. చెప్పు; మాట ఇస్తావా?' అంది.

దానికి శ్రీరాముడు – *'అమ్మా! నాన్నగారు చెప్తే నేను ఏది కాదంటాను? నిప్పుల్లో దూకమంటే దూకనా? విషం తినమంటే తిననా? సముద్రంలో పడమంటే పడనా?*

**తద్ బ్రూహి వచనం దేవి! రాజ్ఞో యదభికాంక్షితం,**
**కరిష్యే ప్రతిజానే చ రామో ద్విర్నాభిభాషతే.** (2–18–30)

*అమ్మా! చెప్పు. తండ్రిగారి కోరిక ఏమిటి? అది ఏదైనా సరే. నెరవేరుస్తాను. ఇదే నా ప్రతిజ్ఞ. ఈ రాముడు రెండు రకాలుగా మాట్లాడడు'.*

కైక ఇలా అంది – 'రామా! పూర్వం మీ తండ్రి నాకు రెండు వరాలు ప్రసాదించాడు. వాటిని ఇప్పుడు తీర్చమని అడిగాను. అవేంటో తెలుసా? ఒకటి. భరతుడి పట్టాభిషేకం. రెండు. నీకు పద్నాలుగేళ్ళ వనవాసం. నీ తండ్రి మాట నిలబెట్టాలనుకొంటే నువ్వు పద్నాలుగేళ్ళు వనవాసం చెయ్యాలి.'

విన్నాడు శ్రీరాముడు. అతడిలో ఏ మార్పూ లేదు. ఆ మాట వినకముందు ఎలా ఉన్నాడో విన్నాక కూడా అలాగే ఉన్నాడు. అన్నాడు–

***'తల్లీ! నువ్వు చెప్పినట్లే వనవాసానికి వెళ్తాను. నాకు ధనం ముఖ్యం కాదు. లోకమర్యాదను పాటించడమే నా అభిమతం. నేను ధర్మాన్ని ఆచరించే ఋషి లాంటివాణ్ణి. పూజ్యుడైన నా తండ్రికి ఇష్టమైనదాన్ని ప్రాణత్యాగం చేసైనా సరే నేను చేస్తాను. తండ్రిగారికి సేవ చేసుకోవడం, ఆయనగారి మాటను నిలబెట్టడం కంటే గొప్ప ధర్మం ఇంకేమీ లేదు. ఆయన మాట ఇచ్చారు. నేను నిలబెడతాను. అంతే! అయితే ఆ మాట నాన్నగారు చెప్తే నేను కాదంటానా? మహారాజు నాతో ఎందుకు మాట్లాడడంలేదో తెలుసుకోవాలనుకొంటున్నాను. భరతునికోసం రాజ్యమే కాదు; నా ప్రాణాలనూ ఆనందంగా ధారపోసేవాణ్ణే?! అటువంటిది నా తండ్రే స్వయంగా నన్ను ఆజ్ఞాపిస్తే చెయ్యకుండా ఎలా ఉంటాననుకున్నారు?***

సరే నమ్మా! నాన్నగారిని ఉపశమింపజెయ్యి. భరతుణ్ణి రప్పించు. ఇదుగో నేను అడవికి బయలుదేరుతున్నాను. ***నాకు ధర్మం మీద తప్ప ఈ లోకంలో దేనిమీదా వ్యామోహం లేదు.'***

తల్లిదండ్రుల కాళ్ళకు నమస్కరించి బయటకు వచ్చాడు శ్రీరాముడు.

* * *

శ్రీరాముని ముఖంలో శోభ తగ్గలేదు. మనసులో ఏ వికారాలూ లేవు. తల్లి కౌసల్యాదేవి దగ్గరకు వెళ్ళి జరిగిన విషయం చెప్పాడు. ఆమె హతాశురాలయ్యింది. కొడుకును పట్టుకొని బోరున ఏడ్చింది. 'ఇంక నా గతి ఏం కాను?'అని వాపోయింది.

లక్ష్మణుడు కౌసల్యాదేవిని అనునయించాడు. అంతవరకూ అణచిపెట్టుకున్న కోపాన్ని ఇంక ఆపుకోలేక చెలరేగిపోయాడు.

'అమ్మా! ఒక ఆడదాని టక్కరి మాటలకు తలవంచి శ్రీరాముడు అరణ్య వాసానికి వెళ్ళడం నాకు సుతరామూ ఇష్టంలేదు. రాజుది విపరీతబుద్ధి. పైగా **భోగాసక్తుడు. దానికి తోడు వృద్ధాప్యం ఒకటి. ఇవన్నీ కలవడంతో రాజు పూర్తిగా కామానికి లొంగిపోయాడు. కామంతో ఉన్నవాడి నోటికి అడ్డూ అదుపూ ఎక్కడిది?** శ్రీరాముడు ఏం తప్పు చేశాడని అరణ్యవాసం చెయ్యాలి? ఇదేనా ధర్మం? తెలిసీతెలియని మిడిమిడి జ్ఞానంతో చేసిన బాల్యచేష్ట ఇది. ఆ మాటను లెక్కలోనికి తీసుకోవలసిన అవసరం ఎంత మాత్రమూ లేదు.

అన్నా! నువ్వు ఆజ్ఞాపించు. చూడు! ధనుర్ధారినై ఉన్నాను. ఈ అయోధ్యను నిర్మానుష్యం చేస్తాను. ఎవడు వస్తాడో రమ్మను. ఆ భరతుడే కాదు; వాడివైపు ఎవడు వచ్చినా అంతు చూస్తాను. ధర్మం తప్పిన వాళ్ళందరినీ చివరికి తండ్రినైనా సరే! చంపి పారేస్తాను. శ్రీరాముడు ఎక్కడ ఉంటే నేనూ అక్కడే.' అన్నాడు.

ఆ మాటలు విన్న శ్రీరాముడు లక్ష్మణుణ్ణి కౌగిలించుకొని –

*'లక్ష్మణా! నీకు నా మీద ఎంత ప్రేమ, గౌరవం ఉంటే మాత్రం కన్నతండ్రిని ఇలా తూలనాడవచ్చా?* ***పూజ్యుల్ని నిందించడం అధర్మం. ఎట్టి పరిస్థితుల్లోనూ ధర్మం తప్పకూడదు. ధర్మాన్ని ఆచరించేవాడికే అర్థకామాలు కూడా ధర్మఫలమైన సుఖాన్ని కలిగిస్తాయి.*** *ఈ విషయంలో నాకు ఇసుమంతైనా సందేహంలేదు. భార్య, భర్తకు అనుకూలవతియై ధర్మాన్ని సమకూరుస్తుంది. ప్రియురాలై కామాన్నీ సమకూరుస్తుంది. ఉత్తమసంతానాన్ని అందించి సకలార్థాల్నీ సమకూరుస్తుంది. అలాగే* ***ధర్మం సకలపురుషార్థాల్నీ సంపాదించి పెడుతుంది. అందుకే ధర్మాన్ని ఆచరించడం అందరూ కర్తవ్యంగా భావించాలి.*** *అర్థకామాలపై ఆసక్తితో ధర్మాన్ని నిర్లక్ష్యం చేయకూడదు. అలా చేస్తే ప్రజలు నిందిస్తారు.*

***లక్ష్మణా! నీ బాధను నేనర్థం చేసుకోగలను. ఇదంతా విధి నాయనా! మానవుల పూర్వకర్మఫలాన్నే దైవం అనిగానీ విధి అనిగానీ అంటారు. ఆ విధిని ఎవరూ మార్చలేరు. విధివిధానం ఇలా ఉంటుందని తెలుసుకోవడం చాలా కష్టం.*** *ఇలా జరుగుతుందని ఎవరైనా ఊహించారా! భరతుడికంటే నన్నే ఎక్కువగా ప్రేమించే మాత కైక కూడా ఊహించింది కాదు. అంత బలీయమైనది విధి.*

***సుఖదుఃఖాలూ లాభనష్టాలూ చావుపుట్టుకలూ మొదలైనవి అకారణంగా వస్తే దానికి కారణం విధే. తలపెట్టిన పనులు నెరవేరకపోవడం, అనుకోని పరిస్థితులు ఏర్పడడం దైవఘటనే. దీనికి కారణం పూర్వకర్మఫలమే. లోకంలోని సుఖదుఃఖాలను ప్రసాదించేది దైవమేనని తెలుసుకో. దైవనిర్ణయాన్ని ఏదీ నిరోధించలేదు. ఎంతో శ్రద్ధతో చేసిన పనులు కూడా ఒక్కోసారి సఫలం కావు. ఒక్కోసారి ఏ ప్రయత్నమూ చేయకపోయినా ఎదురుచూడని ఫలితాలు సమకూరుతాయి. నేను తండ్రిగారి మాటను నెరవేరుస్తాను'*** అని దృఢంగా చెప్తూ లక్ష్మణుణ్ణి శాంతింపజేశాడు.

ఆ తరువాత కౌసల్యాదేవి – తండ్రీ! శ్రీరామచంద్రా! నువ్వు వెళ్ళడానికి

వీల్లేదు. నిన్ను విడిచి నేను బతకలేనురా నాన్నా! నేనూ నీతో వస్తాను, అంది. దానికి శ్రీరాముడు –

*'అమ్మా! ఈ పరిస్థితిలో నాన్నగారిని విడిచిపెట్టి రావడం నీకు ధర్మం కాదు. ప్రతి మనిషికీ ధర్మాన్ని ఆచరించడాన్ని మించిన వ్రతం ఏదీ లేదు. నోములూ దీక్షలూ ఇవన్నీ ధర్మంలోని భాగాలే. వ్యక్తిగతధర్మాల్ని పాటించేవాళ్ళు వ్రతాలూ, పూజలూ చేస్తే మరిన్ని సత్ఫలితాలు పొందవచ్చు. అంతేకానీ ప్రధానమైన ధర్మాన్ని విడిచిపెట్టి చేసే నోములు, వ్రతాలవల్ల ప్రయోజనం శూన్యం. ఎంతమాత్రమూ సత్ఫలితాలు రావు. అన్ని శ్రేయస్సులకూ ధర్మాచరణ ఒక్కటే మార్గం. నేను తండ్రిగారి మాట కాదనలేను. అది నా ధర్మం. ఇది మొండివాదన కాదు. మహాత్ములు నడచిన దారి. అంతకు ముందు తండ్రి ఆజ్ఞను పాటించి గోవునే వధించిన కండుమహర్షీ, కన్నతల్లినే తన గండ్రగొడ్డలికి బలి ఇచ్చిన పరశురాముడూ, మన పూర్వికులు సగర పుత్రులూ వీళ్ళంతా పితృవాక్యపరిపాలకులే కదా! వారి బాటలోనే నేనూ నడుస్తున్నాను.'* అని కౌసల్యాదేవికి నచ్చుజెప్పాడు.

ఆ మాటలకు కౌసల్యాదేవి తేరుకొని– *'శ్రీరామా! వెళ్ళిరావయ్యా! నీవు ధర్మాన్ని ఆచరిస్తూ వనవాసానికి వెళ్తున్నావు. ఆ వనవాసంలో ఆ ధర్మమే నీకు రక్ష. లోకకంటకులైన రాక్షసుల్ని సంహరించాలి నువ్వు. అది ఎల్లప్పుడూ ధర్మాన్ని ఆచరించేవాళ్ళకే సాధ్యం. వెళ్ళిరా నీకోసం ఇక్కడ నిరంతరమూ పూజలు చేస్తూ ఉంటాను.'* అని సాగనంపింది కౌసల్య. అక్కణ్ణుంచి నేరుగా సీతాదేవి దగ్గరకు వచ్చాడు శ్రీరాముడు.

'సీతా! నేను వనవాసం పూర్తిచేసుకొని వస్తాను. నువ్వు జాగ్రత్త.' అంటూ ఏవేవో తగిన జాగ్రత్తలు చెప్పబోయాడు.

శ్రీరాముని మాటలు విన్న సీతాదేవికి కోపం కట్టలు తెంచుకొంది. 'నువ్వు ఎక్కడ ఉంటే నేనూ అక్కడే!' అంది.

అడవుల్లో ఎదురయ్యే ఇబ్బందుల్ని ఏకరువు పెట్టాడు శ్రీరాముడు. సీతాదేవి చలించలేదు సరికదా! *'ఇహంలోనైనా పరంలోనైనా భార్య భర్తవెంటే ఉండాలి. అదే భార్యకు సద్గతి. నేను నిన్ను విడిచి ఒక్కక్షణం కూడా ఉండలేను. అడవులనీ రాక్షసులనీ సాకులు చెప్పి నన్ను భయపెట్టవద్దు.'* అంది.

అడవిలో ఒక స్త్రీ సంచరించడం ఏ అనర్థానికి దారితీస్తుందో అనే భయం శ్రీరామునిది. అందుకే సీతాదేవి ఎంతగా వస్తానన్నా ఒప్పుకోవడం లేదు. అప్పుడు–

అప్పుడు సీత అసహనానికి లోనై 'రామా! నువ్వు పురుషరూపంలో ఉన్న ఆడదానివి. కాబట్టే నన్ను తీసుకు వెళ్లేందుకు సంకోచిస్తున్నావు. ఆరు నూరైనా నేను రాకుండా నువ్వు వెళ్ళలేవు. వెళ్ళడానికి వీల్లేదు. అయినా నువ్వుండగా నాకేం భయం. ఒకవేళ నన్ను వదిలి వెళ్తే విషం తాగి చస్తాను.' అని బెదిరించింది సీతాదేవి.

ఇక శ్రీరామునికి తప్పలేదు.

'సరే దేవీ! దుఃఖించకు. నీ మనసు తెలుసుకోలేకపోయాను. ***సత్యానికి పూర్తిగా కట్టుబడిన నా తండ్రిమాటే నన్ను అడవికి లాక్కుపోతోంది. కాబట్టి నేను వెళ్ళకతప్పదు. మనకు ప్రత్యక్షంగా ఎదుటే ఉన్న తల్లిదండ్రుల్ని గురువుల్ని కాదని ఎక్కడో ఉన్న దైవాన్ని అనుసరించడం ఎలా సాధ్యం ? తండ్రిగారి ఆజ్ఞను పాటించడం కంటే వేరే గొప్ప పుణ్యం ఉంటుందా? తండ్రిని సేవిస్తే వచ్చే మేలును పుణ్యాలు, దానధర్మాలు, యజ్ఞయాగాదులు ఇవేవీ కలిగించలేవు. పితృవాక్యపాలకులకు స్వర్గం, ఐశ్వర్యం, విద్యలు, పుత్రులు, సుఖాలూ– ఇలా అన్నీ కరతలామలకాలే.*** *నిన్ను విడిచి నేనూ వెళ్ళలేను. వనవాసమే మనకు వ్రతం. కాబట్టి ఇక్కడి సంపదలతో మనకు పనిలేదు. అన్నీ దానం చేసెయ్యి. వనవాసానికి కావలసిన ఏర్పాట్లు చూడు. అన్నాడు.'*

సీతాదేవి పరమానందభరితురాలయ్యింది.

ఇంతలో లక్ష్మణుడు వచ్చాడు. అడవికి రావద్దని మళ్ళీ అతడికి చెప్పిచూశాడు శ్రీరాముడు. అయినా లక్ష్మణుడు వినిపించుకోలేదు. 'నువ్వు ఎక్కడ ఉంటే నేనూ అక్కడే' అన్నాడు. శ్రీరాముడు సంబరపడ్డాడు.

'సరే లక్ష్మణా! వెళ్ళి వసిష్ఠులవారి ఇంట్లో ఉంచిన మన దివ్యధనుస్సులనూ, అక్షయతూణీరాలనూ, దివ్యఖడ్గాలనూ తీసుకురా! ఒకసారి వసిష్ఠపుత్రుడు సుయజ్ఞుణ్ణి కూడా పిలుచుకురా' అన్నాడు.

* * *

సుయజ్ఞుడు వచ్చాడు. అప్పుడు శ్రీరాముడు తన బంగారు దండకడియాలు, కుండలాలు, మణిహారాలు, భుజకీర్తులు, చేతికడియాలు ఇంకా అనేక రత్నాలు ఇచ్చి అతణ్ణి సత్కరించి –. 'సుయజ్ఞా! ఇవిగో! సీత కూడా నీ ధర్మపత్నికి హారం, కంఠాభరణం, ఒడ్డాణం, దండకడియాలు, కేయూరాలు, రత్నతల్పం ప్రదానం చేస్తుంది. స్వీకరించు. ఇదుగో! మా మేనమామగారు మాకు ఇచ్చిన శత్రుంజయం అనే గజరాజం. దీన్నీ, వెయ్యి బంగారు నాణాలనూ స్వీకరించు.' అన్నాడు.

శ్రీరామలక్ష్మణులు అ తరువాత వేలమంది బ్రాహ్మణులకూ అనేకదానాలు చేశారు.

ఈ విషయం తెలిసి త్రిజటుడు అనే ఒక బీద బ్రాహ్మణుడు అక్కడికి వచ్చి, తన దారిద్ర్యం తీర్చమని అడిగాడు. శ్రీరామునికి చెప్పలేనంత జాలి వేసింది. త్రిజటుడి చేతికి ఒక చిన్న కర్ర ఇచ్చి – 'ఇది నువ్వు ఆలమందలోకి ఎంతదూరం విసరగలుగుతావో ఆ స్థలంలో ఉన్నన్ని గోవులను నీకు దానంగా ఇస్తాను.' అన్నాడు శ్రీరాముడు.

త్రిజటుడు విసిరిన కర్ర సరయూనదీతీరంలో పడింది. అన్ని గోవుల్నీ అతనికి దానంగా ఇచ్చాడు శ్రీరాముడు. ఇలా దానాలతో అందరినీ సంతృప్తి పరిచి శ్రీరాముడు వనవాసానికి బయలుదేరుతున్నాడు.

* * *

ఒకవైపు శ్రీరాముడు అరణ్యవాసానికి సన్నద్ధుడౌతుంటే మరోవైపు ఎండిపోయిన చెరువులాగా ఉన్నాడు దశరథుడు. తన అంతఃపురకాంతలు మూడువందలయాభై మందితో కలిసి శ్రీరామునికి వీడ్కోలు పలుకుతున్నాడు. అంతలోనే మూర్ఛపోయాడు. మళ్ళీ కొంచెం తెప్పరిల్లాడు. ఇప్పటికైనా మొండిపట్టు వీడమని కైకేయిని వేడుకొన్నాడు. ఆమె వీడలేదు. కనీసం ధనధాన్యాలైనా శ్రీరామునితో పంపుతానన్నాడు. సిద్ధార్థుడు అనే మంత్రి కైకేయికి నచ్చచెప్పే ప్రయత్నం చేశాడు.

కైకేయి ససేమిరా అంది. ఆమె ముఖంలో రంగులు మారాయి. అది చూసి శ్రీరాముడు – 'రాజా! ఏనుగునే దానం ఇచ్చి దాని నడుముకు కట్టిన తాడుకోసం ఎవడైనా వెంపర్లాడతాడా! నేను సర్వం త్యజించాను. ఇవన్నీ నాకెందుకు? అయినా

వనవాసానికి కావలసినవి ఒక గునపమూ ఒక గంప మాత్రమే. అవి ఇవ్వు చాలు.' అన్నాడు. తానే స్వయంగా నారచీరలు తెచ్చి కట్టుకోమని శ్రీరామునికి ఇచ్చింది కైక.

'కనీసం ఈ ఒక్క రాత్రి అయినా ఉండు శ్రీరామా! రేపు వెళ్దువు గాని. నీ కోరికలు అన్నీ తీర్చి పంపుతాను. నన్నూ కౌసల్యనూ ఆనందింపజెయ్యి' అన్నాడు దశరథుడు మమకారం చంపుకోలేక. అప్పుడు శ్రీరాముడు – 'తండ్రీ! నాకు తీరని కోరికలేముంటాయి. ఉంటే రేపు తీర్చే దెవరు? అన్నింటికీ మించి నాకు ఉన్నది ఒకే ఒక్క కోరిక. అది ఇక్కడనుంచి వెళ్ళిపోవడమే.' అన్నాడు.

ఇదంతా చూస్తున్న బ్రహ్మర్షి వసిష్ఠులవారికి ఆగ్రహం కట్టలు తెంచుకుంది.

'కైకేయీ! నువ్వు ఇక్ష్వాకు వంశానికి మచ్చతెచ్చావు. వంశ మర్యాదల్ని తుంగలో తొక్కావు. నీ పద్ధతి మార్చుకో. లేకపోతే మేమూ శ్రీరాముడితో వనవాసానికి వెళ్ళిపోతాం. ఎవరూలేని అయోధ్యలో నువ్వే ఒంటరిగా ఉట్టి కట్టుకొని ఊరేగుదువు గాని. శ్రీరాముణ్ణి కాదని భరతశత్రుఘ్నులూ రాజ్యం స్వీకరించరు. వాళ్ళూ ఈ నారచీరలే ధరిస్తారు చూడు. ఇదే రేపు జరగబోయేది.' అన్నాడు.

అయోధ్య బోరున ఏడుస్తుంటే కోసల రాజ్యం కంటతడి పెడుతోంది.

సీతారామలక్ష్మణులు దశరథునికి ప్రదక్షిణం చేశారు. కౌసల్యాదేవికి నమస్కరించారు. లక్ష్మణుడు సుమిత్రకు నమస్కరించాడు. అప్పుడు సుమిత్ర లక్ష్మణుడితో ఇలా అంది.

**రామం దశరథం విద్ధి మాం విద్ధి జనకాత్మజామ్,**
**అయోధ్యా మటవీం విద్ధి గచ్ఛ తాత! యథాసుఖమ్.** (2–40–9)

**'నాయనా! రాముణ్ణే దశరథుడనుకో! సీతాదేవినే నన్ననుకో. అడవినే అయోధ్య అనుకో. వెళ్ళు; నీకు శుభమగుగాక!' అని దీవించి సాగనంపింది.**

**సుమంత్రుడు రథం తెచ్చాడు. ముందుగా సీతాదేవి అధిరోహించింది. పద్నాలుగేళ్ళకి సరిపోయేలా ఆభరణాలూ, వస్త్రాలూ అందించాడు మామగారు సీతాదేవికి.** రథం బయలుదేరింది.

దశరథుడు ఒకవైపు 'ఆగు ఆగు' అంటున్నాడు. మరోవైపు శ్రీరాముడు 'పద పద' అంటున్నాడు. ఎవరి మాట పాటించాలో తెలియక సుమంత్రుని మనస్సు రథచక్రాల మధ్య పడ్డట్టు నలిగిపోతోంది.

శ్రీరాముడు వెనక్కి తిరిగి చూశాడు. వెనుక కౌసల్యా దశరథులు. రామా! శ్రీరామా! అంటూ పరిగెత్తుతూ.

శ్రీరాముడు రథం వేగం పెంచమన్నాడు. **'ఒకవేళ అడిగితే రథం చప్పుళ్ళకు మాట వినిపించలేదని చెప్పవచ్చు వేగంగా పోనియ్యి'** అన్నాడు రాముడు. సుమంత్రుడు వేగం పెంచాడు. అయోధ్య మొత్తం కన్నీటి వెల్లువే అయ్యింది. ప్రజలు అన్నపానాలు మానేశారు. మోడుల్లా పడి ఉన్నారు. ఆవులు కూడా దూడల్ని కుడపడం లేదు.

రథం దుమ్ములేపుకుంటూ వెళ్ళిపోయింది. ఆ దుమ్ములో భవిష్యత్తు కనపడని దశరథుడు అయోమయంగా చూస్తూ నిలబడ్డాడు.

రాత్రి అయ్యింది. ఆ రాత్రి దశరథునికి కాళరాత్రి. కౌసల్యా సుమిత్రలు పక్కనే ఉన్నారు. ఆలోచనలు శ్రీరాముని చుట్టూ పరిభ్రమిస్తున్నాయి. శ్రీరాముడు వస్తాడనీ పట్టాభిషేకం జరుగుతుందనీ ఏమిటేమిటో కలలు.

## శ్రీరాముని వనవాస గమనం

రథం వెంట ప్రజలు పరుగులు తీస్తున్నారు. అది చూసి చివరిసారిగా శ్రీరాముడు వాళ్ళను ఉద్దేశించి ఇలా అన్నాడు.

'అయోధ్యాపురవాసులారా! మిత్రులారా! భరతుని పట్ల కూడా నాపై చూపించినట్లే గౌరవం, ఆదరణా చూపించండి. నాకు అదే ఆనందం. భరతుడు మంచివాడు. సద్గుణసంపన్నుడు. మహావీరుడు. మీకు మేలు చేస్తాడు. మీకు తగిన ప్రభువు.

నేను రాజాజ్ఞను తప్పక పాటించాలి. నా మాట వినండి. ఇక చాలు. మీరు వెనక్కి తిరిగి అయోధ్యకు వెళ్ళిపొండి.' ఇలా నచ్చచెప్పి వారినెవరినీ తమ వెనుక రావద్దని వారించాడు శ్రీరాముడు.

అయినా బ్రాహ్మణులు కొందరు వెంబడిస్తూనే ఉన్నారు. 'మేమంతా మా అగ్నిహోత్రాలతో నీ వెనుకే వస్తాం. మాలో వాజపేయయాగాలు చేసినవాళ్ళు ఉన్నారు. ఇవిగో వారి గొడుగులు. వీటితో అడవిలో నీకు నీడకల్పిస్తాం శ్రీరామా!' అంటూ వస్తున్నారు.

శ్రీరాముని ప్రయాణం సాగుతోంది. ఇంకా ప్రజలు వెంట వస్తూనే ఉన్నారు. ఇంతలో తమసానది వచ్చింది. అప్పటికి చీకటిపడడంతో ఆ రాత్రికి అందరూ అక్కడే విశ్రాంతి తీసుకున్నారు. వెంబడించి వచ్చిన ప్రజలూ తలా ఒక చెట్టూ చూసుకున్నారు. రాత్రి గడిచింది. ప్రజలు నిద్రలేవక ముందే అక్కణ్ణించి వెళ్ళిపోవాలని సుమంత్రుణ్ణి రథం సిద్ధం చేయమన్నాడు శ్రీరాముడు.

తెల్లవారింది. శ్రీరాముని జాడ లేదు. ప్రజలంతా ఉసూరుమన్నారు. చేసేది ఏమీ లేక అయోధ్యకు తిరిగి వెళ్ళిపోయారు. శ్రీరాముణ్ణి తీసుకురాకుండా ఇంటికి వచ్చిన తమ భర్తలను భార్యలు అసహ్యించుకున్నారు. 'రాముడే లేకపోయాక ఇళ్ళెందుకు? ఈ ఐశ్వర్యాలెందుకు? భోగభాగ్యాలెందుకు?' నగరంలో అందరిదీ ఇదే మాట. సొంత కొడుకు దూరమైనట్లు విలపిస్తున్నారు.

## గుహుడి ఆతిథ్యం

కోసలదేశపు జనపదాలను దాటింది రథం. గంగానదీ తీరాన్ని చేరుకుంది.

అక్కడ సమీపంలో ఉన్న ఒక ఇంగుదీ వృక్షాన్ని చూసి అక్కడ విశ్రమించాలని రథం ఆపమన్నాడు శ్రీరాముడు. రథం ఆగింది. ఆ ప్రాంతంలోనే శృంగిబేరపురం ఉంది. అక్కడ గుహుడు అనే బోయరాజు ఉన్నాడు.

గుహుడు పరివారసమేతుడై వచ్చాడు. శ్రీరాముడు గుహుణ్ణి ఆలింగనం చేసుకొన్నాడు. గుహుడు ఇచ్చిన ఆతిథ్యం స్వీకరించాడు. అప్పుడు గుహుడు – 'శ్రీరామా! ఆజ్ఞాపించు. ఏం కావాలో చెప్పు.' అన్నాడు.

గుహుని వినయవిధేయతలకూ భక్తికీ శ్రీరాముడు ఆనందించి –

'నాకేమీ వద్దుగానీ ఈ రథాశ్వాలకు మేత ఏర్పాటుచెయ్యి. అది ఒక్కటే నేను నీనుండి ఆశించేది. ఇవి నా తండ్రిగారికి అత్యంతప్రీతిపాత్రమైన అశ్వాలు. వీటిని అర్చిస్తే నన్ను అర్చించినట్లే.' అన్నాడు.

తరువాత రోజు సుమంత్రుణ్ణి పిలిచి శ్రీరాముడు – 'సుమంత్రా! నీలాంటి గొప్ప మిత్రుడు మా వంశానికి వేరొకడు దొరకడుగాక దొరకడు. దశరథుడు జాగ్రత్త. నీదే భారం. నిత్యం అప్రమత్తునిగా ఉంటూ రాజుగారిని సేవించు.' అని చెప్పి వెనక్కి పంపివేశాడు. సుమంత్రుడు వెళ్ళలేక వెళ్ళలేక వెళ్ళాడు.

తరువాత గుహుడు ఏర్పాటు చేసిన నావలో సీతాలక్ష్మణులతో కలిసి శ్రీరాముడు గంగానదిని దాటి అడవుల్లోకి సాగిపోయాడు.

రాత్రి అయ్యింది. అదే అడవిలో వాళ్ళు గడపబోయే మొదటిరాత్రి. తృణశయ్యపై శయనించి రాముడు లక్ష్మణునితో కొన్ని మంచి మాటలు చెప్తున్నాడు.

**'లక్ష్మణా! అలోచిస్తే ధర్మార్థాల కంటే కామానిదే పై చెయ్యి అని నాకు అనిపిస్తోంది. లేకపోతే ఒక స్త్రీమాటలు నమ్మి ఎంత మూర్ఖుడైనా చెప్పినమాట వినే నాలాంటి కొడుకును ఇలా అడవులకు పంపుతాడా? కామానికి లోబడినవాడు దశరథమహారాజులాగా కష్టాలపాలు కాక తప్పదు.** *

లక్ష్మణా! నా కారణంగా సుమిత్రాదేవి కష్టాల పాలు కావడం నాకు ఇష్టంలేదు. ఇకనైనా నువ్వు అయోధ్యకు వెళ్ళిపో! నేనూ సీతా దండకారణ్యంలోనికి వెళ్తాం.' అన్నాడు.

ఆ మాటలకు లక్ష్మణుడు బాధగా – 'అన్నా! ఏమిటా మాటలు? నువ్వు లేకపోతే నేను, సీతాదేవి నీళ్ళలోనుంచి బయటపడ్డ చేపల్లా క్షణకాలం కూడా జీవించలేం. నువ్వు లేకపోతే నాకు కన్నతల్లే కాదు, స్వర్గమైనా అవసరం లేదు.' అన్నాడు.

అలా మాటల్లోనే నిద్రలోనికి జారుకున్నారు సీతారామలక్ష్మణులు.

తెల్లవారింది. నడక మొదలుపెట్టారు. మధ్యాహ్నానికల్లా ప్రయాగ చేరుకున్నారు. దూరంగా ఆకాశంలో పొగలు కనిపించాయి. అది చూసి అక్కడ ఏదో ఆశ్రమం ఉందని అటువైపు అడుగులు వేశారు.

---

* (అర్థం ఎప్పుడూ ధర్మమార్గంలో ఆర్జించినదై ఉండాలి. అలా ఆర్జించినది కూడా లోకహితానికి ఉపయోగపడాలి. అలాగే కామం వల్ల కలిగే ప్రమాదాలను నివారించాలంటే మన ఆదర్శ వివాహ వ్యవస్థలో ఉన్న ఏకపత్నీవ్రతం, పాతివ్రత్యం ఆచరణలోనికి విధిగా రావాలి).

## భరద్వాజమహర్షి స్వాగతం

అది భరద్వాజమహర్షి ఆశ్రమం.

సీతారామలక్ష్మణులకు భరద్వాజుడు ఘనస్వాగతం పలికాడు. అతిథిసేవలు చేశాడు. అప్పుడు శ్రీరాముడు – 'స్వామీ! ఇక్కడికి దగ్గరలో కొన్ని కొన్ని జనపదాలు ఉన్నాయి. మేము ఇంకా ఇక్కడే ఉంటే ప్రజలు మమ్మల్ని చూడడానికి వస్తూనే ఉంటారు. మేము ఉండడానికి తగిన ప్రదేశమేదైనా ఉంటే సెలవియ్యండి.' అని అభ్యర్థించాడు.

ఆ మాటలకు భరద్వాజ మహర్షి – 'చిత్రకూట పర్వతం మీకు అన్నివిధాలా అనువైన ప్రదేశం. శ్రీరామా! ఇక్కడికి కొంత దూరంలో కాళిందీ నది ఉంది. అది దాటితే అంశుమతీ నది, దాని తర్వాత పెద్ద మర్రిచెట్టు. అక్కడికి ఒక క్రోసెడు దూరంలో నీలారణ్యం ఉంది. వాటి మధ్యలోంచి ఒక సన్నని దారి ఉంటుంది. అలా వెళ్ళండి చిత్రకూటం చేరుకుంటారు.' అని దారి చూపాడు భరద్వాజుడు. సీతారామ లక్ష్మణులు అలాగే ప్రయాణిస్తున్నారు.

'సీతా! చూశావా ఈ కింశుకవృక్షాలు?

లక్ష్మణా! వింటున్నావా? పక్షుల కిలకిలారావాలు? అదుగో! అదే చిత్రకూట పర్వత శిఖరం. పువ్వుల తివాచీ పరిచినట్లు ఉంది.' అంటూ శ్రీరాముడు మనోహరంగా ప్రకృతిని వర్ణించి చెప్తున్నాడు. అందరూ వేగంగా నడుస్తూ పర్వత శిఖరాన్ని చేరుకున్నారు. అక్కడే ఒక పర్ణశాలను క్షణాల్లో నిర్మించాడు లక్ష్మణుడు. ఆ పర్ణశాలకు ఎదురుగా మాల్యవతీనది ప్రవహిస్తోంది. అన్నీ కలిసి అక్కడి వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా ఉంది.

## దశరథుడి దీర్ఘనిద్ర

అక్కడ అయోధ్యానగరం పాడుపడినట్లు మూగవోయింది.

దుఃఖం అనే అగ్నిలో భస్మమైపోయినట్లుంది. అందరూ రామా! రామా! శ్రీరామా! అని ఒకటే పలవరింత.

సుమంత్రుడు తిరిగి వచ్చాడు. సీతారామలక్ష్మణులు గంగను దాటారన్న వార్త తెచ్చాడు. ఆ మాట విని అంతా గొల్లుమని ఒక్కసారిగా విలపించారు.

ఇంకా సీతారామలక్ష్మణులగురించి చెప్పమని ఆత్రంగా అడిగాడు దశరథమహారాజు.

'ఏం చెప్పమంటారు? మహారాజా! రాజవీథులూ జనపదాలూ బోరుబోరున విలపిస్తున్నాయి' అంటూ సుమంత్రుడు అంతా వివరంగా చెప్పాడు.

ఆ మాటలు విన్నాక దశరథుడి శోకం తగ్గకపోగా ఇంకా రెట్టింపయ్యింది. దీనంగా – **'నేను కైకేయి దుష్టస్వభావం తెలియక ఆమె ఒత్తిడికి లొంగిపోయాను. స్త్రీ వ్యామోహంలోపడి పరిణతులైన పెద్దలతో నైనా సంప్రతించకుండా పెద్ద తప్పే చేశాను.'** అని బాధపడ్డాడు.

కౌసల్య దుఃఖానికి తట్టుకోలేకపోయింది. ఇంతటికీ కారకుడు దశరథుడే కాబట్టి అతణ్ణి నిందించింది.

దశరథుడు కౌసల్యతో– 'కౌసల్యా! నువ్వు ఇప్పటిదాకా ఎవరినీ పల్లెత్తుమాటైనా అన్నావు కాదు. ఈరోజు నన్నెందుకిలా నిందిస్తున్నావు? **గుణహీనుడైనా సరే! భార్యకు భర్తే ప్రత్యక్షదైవం కదా!'** అన్నాడు.

వెంటనే కౌసల్యాదేవి తేరుకొని క్షమాపణ కోరుతూ ఇలా అంది.

'మహారాజా! నేను ఇలా మాట్లాడకూడదు. నేను చేసింది మహాపరాధం. నువ్వు ధర్మాత్మునివి. సత్యసంధునివి. పుత్రవియోగంవల్ల అలా మాట్లాడాను. నన్ను క్షమించు.

**శోకో నాశయతే ధైర్యం శోకో నాశయతే శ్రుతం,**
**శోకో నాశయతే సర్వం నాస్తి శోకసమో రిపుః. (2-62.15)**

***శోకంవల్ల ధైర్యం నశించిపోతుంది. నేర్చిన విద్యకాస్తా మసకబారిపోతుంది. శోకంవల్ల సర్వమూ నశిస్తుంది. కాబట్టి శోకానికి సమానమైన శత్రువు వేరే ఉండదు.'***

దశరథుడికి గతం గుర్తుకు వస్తోంది. కౌసల్యతో అంటున్నాడు.

"కౌసల్యా! మన వివాహానికి ముందు అప్పుడే శబ్దవేధివిద్యను సాధించిన నేను ఉత్సాహంతో సరయూనదీతీరంలో మాటువేశాను. నీళ్ళుతాగే జంతువుల్ని వాటి శబ్దాల్నిబట్టి వేటాడాలని కాచుకొని ఉన్నాను.

అప్పుడు అక్కడ అడవిలో ఒక అంధ వృద్ధదంపతులు ఉండేవారు. వాళ్ళకో పిల్లవాడు ఉన్నాడు. వాడు తన తల్లిదండ్రులకోసం నీళ్ళు తేవడానికి నదికి వెళ్ళాడు.

నదిలో ఏదో అలికిడి అయ్యేసరికి అది ఏనుగు అనుకొని బాణం వేశాను. ఆ బాణం తగిలిన చోటినుండి 'అయ్యో! వృద్ధులైన నా తల్లిదండ్రులకు దిక్కెవరు?' అని విలపిస్తూ అన్న మాటలు వినిపించాయి. తీరా చూస్తే అది ఏనుగు కాదు. ఒక పిల్లవాడు. నా బాణం ఆ పిల్లవాడిగుండెల్లో గాఢంగా దిగబడిపోయింది. గుండెల్లోని బాణం తియ్యమనీ, అంధులైన తన తల్లిదండ్రులకు ఈ నీరు తీసుకువెళ్ళి ఇవ్వమనీ ఆ బాలుడు నన్ను అడిగాడు. అలాగేనంటూ ఆ బాణం తియ్యగానే అతని ప్రాణం పోయింది.

నా పై ప్రాణాలు పైనే పోయాయి. పెద్ద పొరపాటే జరిగిపోయింది. నీటికుండను తీసుకొని నేనే ఆ దంపతుల దగ్గరికి వెళ్ళాను. బాధపడుతూ జరిగింది చెప్పి క్షమించమని వేడుకొన్నాను.

పుత్రుడు మరణించాడన్న వార్త వృద్ధుల్ని కలచివేసింది.

'మహారాజా! ఇంతటి పాపం తెలియక చేశావు కాబట్టే ఇంకా బతికి ఉన్నావు. నువ్వూ మాలాగే పుత్రశోకంతో అలమటిస్తావు' అని నన్ను శపించి ఆ దంపతులు చితిపేర్చుకొని స్వర్గస్థు లయ్యారు.

"కౌసల్యా! దాని ఫలితమే ఇది. ఆ శాపంవల్లనే ఇదంతా జరిగింది. నేనూ ఈ పుత్రశోకంతోనే మరణిస్తాను. నా చూపు మందగించింది. కొడిగట్టే దీపంలా ఉంది నా పరిస్థితి." అని దశరథుడు విలపిస్తున్నాడు.

అప్పటికే అర్ధరాత్రి గడిచింది. తెల్లవారింది. వందిమాగధులు యథాప్రకారం వచ్చారు. స్తోత్రపాఠాలూ మంగళవాద్యాలూ సాగుతున్నాయి. దశరథుడు నిద్ర లేవనేలేదు. శాశ్వత నిద్రలోకి జారిపోయాడు. ఆ వార్త నగరమంతా గుప్పుమంది.

కులగురువులూ మహర్షులూ అందరూ వసిష్ఠమహర్షి అధ్యక్షతన సమావేశ మయ్యారు. సభలోని వారంతా వసిష్ఠమహర్షికి ఇలా విన్నవించుకున్నారు.

**'మునీంద్రా! శ్రీరామలక్ష్మణులు వనవాసంలో ఉన్నారు. భరతశత్రుఘ్నులు కేకయరాజ్యంలో ఉన్నారు. ఇక్కడ రాజు మరణించాడు. ఇప్పుడేం చెయ్యాలి?**

**ఇక్ష్వాకువంశీయుల్లో ఎవరినో ఒకరిని రాజును చెయ్యాలి. సరైన పాలకుడు లేని రాజ్యం అల్లకల్లోలమైపోతుంది. నీతినిజాయితీలు నశిస్తాయి. ఎవరికీ చిత్తశాంతి ఉండదు. పెద్దలెవరూ సభలు చేయరు. మంచిచెడుల గురించి చర్చించరు. పుణ్యక్షేత్రాలు దొంగలకూ వ్యభిచారులకూ నిలయాలైపోతాయి. యాగం అన్న ఊసే ఎవరూ ఎత్తరు. పుణ్యకథల్ని వినాలనుకునే వాళ్ళే ఉండరు. వ్యవహారాలు తెలిసినవాళ్ళు కూడా న్యాయాన్యాయాలు చెప్పరు. రాజులేని రాజ్యం ఎండిపోయిన నదిలా, పచ్చదనంలేని వనంలా, గోపాలురు లేని గోసంఘంలాగా అయిపోతుంది. ప్రజలు చేపల్లాగా ఒకరిని ఒకరు మింగేస్తారు. శిక్ష లుండవు. రక్షణా ఉండదు. కాబట్టి ప్రజలకు పరువూ మర్యాదలు తెలియవు. అవి దేశంలో ఉండవు. జనులంతా నాస్తికత వైపు మొగ్గుచూపుతారు. కాబట్టి ఇప్పుడు మీరు ఒక రాజును నియమించాలి.'** అని అభ్యర్థించారు.

దానికి వసిష్ఠమహర్షి – 'సభాసదులారా! ఇందులో ఆలోచించడానికేమీ లేదు. దశరథమహారాజే భరతుణ్ణి రాజుని చెయ్యాలనుకున్నాడు కాబట్టి సత్వరం భరతుణ్ణి ఇక్కడికి రప్పించడమే మన కర్తవ్యం.' అంటూ దూతల్ని పిలిచి ఇక్కడ జరిగినదేదీ చెప్పకుండా భరతుణ్ణి సత్వరం తీసుకురమ్మని పంపాడు.

అక్కడ కేకయ రాజ్యంలో ఉన్న భరతునికీ ఆ రాత్రి ఒక పీడకల వచ్చింది.

కలలో – మాసిన బట్టలు కట్టుకొని దశరథుడు కొండపై నుంచి పేడకుప్పలో పడిపోతున్నట్టూ.. నువ్వులనూనె తాగుతున్నట్టూ.. తింటున్నట్టూ.. ఒంటికి పూసుకొంటున్నట్టూ.. ఇలా ఏవేవో అపశకునాలు.

వాటిగురించే స్నేహితునికి చెప్తున్నాడు భరతుడు. ఇంతలో వసిష్ఠుడి వర్తమానం. హుటాహుటిన బయలుదేరాడు భరతుడు. శత్రుఘ్నుడూ వెంట నడిచాడు. అయోధ్య బోసిగా ఉంది. చూసి నిర్ఘాంతపోయాడు.

ఏదీ మునుపటి ఆ కోలాహలం? వీథుల్లో అలికిడే లేదేమిటి ? పైగా ఇవేమిటి? అపశకునాలు. ఎవర్ని చూసినా మాసిపోయి మసిగుడ్డల్లా ఉన్నారు. కళ్ళల్లో నీళ్ళు కళ్ళలోనే కుక్కుకుంటున్నారు. దీనాతిదీనంగా ఉన్నారు. అనుకుంటూ గుబులుగుబులుగా మెల్లగా అంతఃపురంలోనికి అడుగులు వేశాడు భరతుడు.

కైకేయి భరతుణ్ణి చూసి సంబరపడింది. నింపాదిగా అసలు సంగతి చెప్పింది. విషయం తెలుసుకున్న భరతుడికి నోటమాటరాలేదు. అంత దుర్మార్గపు టాలోచన చేసిన తల్లిని ఏమనాలో తోచలేదతడికి. దుఃఖంతో మూర్ఛపోయాడు. కాసేపటికి తేటపడి, విలపిస్తూ ఇలా అన్నాడు –

'నాన్నా, అన్నా లేని ఈ రాజ్యం నాకెందుకు? దుఃఖం మీద దుఃఖం. అమ్మా! ఈ వంశానికి నువ్వే కాళరాత్రివి. నాకు చెడ్డపేరు తెచ్చావు. ఉండు. ఇప్పుడే అడవికి వెళ్ళి, అన్నయ్యను తీసుకొని వస్తా. రాజ్యం అప్పగిస్తా. అదే నీకు తగిన శాస్తి.' అన్నాడు. ఆ తరువాత భరతుడు శత్రుఘ్నుడితో కలిసి కౌసల్యామాత మందిరానికి వెళ్ళాడు.

అక్కడ దీనాతిదీనంగా ఉన్న కౌసల్యామాత పాదాలపై పడి బోరుమని విలపించాడు. అప్పుడు కౌసల్య భరతుణ్ణి చూసి నిష్ఠూరంగా మాట్లాడింది. దానికి భరతుడు విలవిలలాడిపోతూ ఇందులో తన ప్రమేయం ఏమీ లేదన్నాడు. తను నిర్దోషినని తెలిపేందుకు ఇలా అనేక శపథాలు చేశాడు.

అమ్మా! శ్రీరాముణ్ణి వనవాసానికి పంపడంలో నా పాత్రగనక ఉంటే–

*గోవుల్ని కాలితో తన్నే దుష్టుడూ, గురువుల్ని తిట్టే మూర్ఖుడూ, మిత్రద్రోహీ, కృతఘ్నుడూ, వ్యామోహంతో పాపాలు చేసేవాడూ, అందరిద్వేషానికీ గురైనవాడూ ఎలాంటి పాపఫలాన్ని అనుభవిస్తారో నేనూ అదే అనుభవిస్తాను. తల్లీ! ఇంట్లో ఉన్న భార్యాపుత్రులకూ, పరిచారకులకూ పెట్టకుండా తానొక్కడే షడ్రసోపేతంగా భోజనం చేసేవాడు ఏ నరకానికి పోతాడో నేనూ ఆ నరకానికే పోతాను. ధర్మహీనుడై సంతానం లేకుండా జీవించేవానికి ఏ పాపం చుట్టుకుంటుందో నాకూ ఆ పాపమే చుట్టుకుంటుంది.*

*స్త్రీబాలవృద్ధుల్ని చంపితే వచ్చే పాపం, నిషిద్ధవస్తువుల్ని అమ్మినవాడికి వచ్చే పాపం, యుద్ధంలో పిరికిపందలా పారిపోయేవానికి కలిగే పాపం నాకు కలుగుతుంది. కామ, క్రోధాలకు బానిస అయినవానికి పట్టే దుర్గతే నాకూ పడుతుంది. అక్రమంగా సంపాదించేవాడు ఏ నరకానికి పోతాడో నేనూ ఆ నరకానికే పోతాను.*

*రాముని వనవాసం గురించి నాకు ముందే తెలిసి ఉంటే, నా పూర్వపుణ్యమంతా బూడిదై పోవుగాక! నాకు నరకమే గతి అవుగాక! తల్లిదండ్రులు జీవించి*

***ఉన్నప్పుడు వాళ్ళని ఆదరించి, సేవించనివానికీ, అలాగే వాళ్ళు మరణించాక శ్రాద్ధకర్మలు చేయనివానికీ కలిగే అధోలోకాలే నాకూ కలుగుగాక!***

***పూర్వజన్మలలో మహాపాపాలు చేసి ఈ జన్మలో భయంకర రోగాలతో, దారిద్ర్యంతో నానా అగచాట్లు పడేవారికి కలిగే పాపమే నాకూ కలుగుగాక!***

***అన్యాయంగా సంపాదించి కూడబెట్టే పాపాత్ముడూ, తాళికట్టిన భార్యకు చేసిన ప్రమాణాలు తప్పి పరస్త్రీసుఖం కోసం పాకులాడేవాడూ, విషం పెట్టి చంపాలని చూసేవాడూ, లేగదూడకు పాలు లేకుండా చేసి ఆవుపొదుగును పూర్తిగా పిండేసేవాడూ, న్యాయవివాదాలలో పక్షపాతం చూపించేవాడూ, అక్రమంగా తీర్పులు చెప్పేవాడూ పొందే పాపాలనే నేనూ పొందుదును గాక!*** అని ఘోరశపథాలను చేశాడు. ఆ శపథాలను విన్న కౌసల్య భరతుని నిజాయితీని అర్థం చేసుకొని అతణ్ణి ఓదార్చింది.

మరునాడు వసిష్ఠుని ఆదేశం ప్రకారం భరతశత్రుఘ్నులు తండ్రిగారికి కర్మకాండలు నిర్వహించారు. పదమూడో రోజున అస్థిసంచయనం (పుణ్యనదీజలాల్లో కలిపే నిమిత్తం ఎముకల్ని పోగుచేయడం) చేశారు.

భరతశత్రుఘ్నులు చెప్పలేనంతగా కుమిలిపోతున్నారు. **ఆకలిదప్పులూ, శోకమోహాలూ, జరామరణాలూ ఎవరికీ తప్పవని వసిష్ఠమహర్షి చెప్తూ వాళ్ళని ఓదార్చాడు.**

భరతశత్రుఘ్నులకు ఎదురుగా మంథర కనిపించింది. మంథరను చూసీ చూడడంతోనే చంపేస్తానంటూ శత్రుఘ్నుడు ఒక్క ఉదుటున వెళ్ళి జుట్టుపట్టుకొని మరీ ఈడ్చుకొచ్చాడు. అప్పుడు కైకేయి – 'శత్రుఘ్నా! మంథరను వదిలెయ్యి.' అంది. **'ఎంత దుర్మార్గురాలైనా స్త్రీని చంపడం సమంజసం కాదు శత్రుఘ్నా!'** అన్నాడు భరతుడు కూడా. మంథరను వదిలేశాడు శత్రుఘ్నుడు.

దశరథుడు కాలంచేసి అప్పటికి పద్నాలుగురోజులు. మంత్రులూ పురోహితులూ దండనాథులూ రాజ్యం స్వీకరించమని భరతుణ్ణి కోరుతున్నారు. కానీ భరతుడు మాత్రం శ్రీరామునికే పట్టాభిషేకం జరగాలన్నాడు. అన్నగారిని అయోధ్యకు రప్పిస్తానని బయలుదేరాడు.

మంత్రులూ, పురోహితులూ, దండనాథులూ, సామంతరాజులూ, చతురంగ బలాలూ, కౌసల్య, సుమిత్ర, కైకేయి ఇలా భరతుని వెంట ఒక జనసముద్రమే కదిలింది.

శ్రీరాముణ్ణి చూడబోతున్నందుకు అందరికీ ఉత్సాహంగా ఉంది. భరతుడు గంగాతీరానికి చేరుకున్నాడు. అక్కడ ఉన్న శృంగిబేరపురం దగ్గర విడిది చేసింది అతని సైన్యం. అక్కడే ఉన్నాడు గుహుడు. అతనికి వర్తమానం అందింది.

మహాసముద్రంలాగా ఉంది భరతుని సైన్యం. సైన్యాన్ని చూసి ఇదేదో శ్రీరాముడికి కీడు తలపెట్టే ప్రయత్నంలా ఉందే! అనుకొన్నాడు గుహుడు. త్వరత్వరగా తానూ సైన్యం సిద్ధం చేశాడు.

గంగానదిని దాటించమనీ అలాగే భరద్వాజ ఆశ్రమానికి దారి చూపించమనీ అడిగాడు భరతుడు గుహుణ్ణి. అప్పుడు గుహుడు – 'భరతా! శ్రీరామునికేదో కీడు తలపెడుతున్నట్టున్నావు? లేకపోతే ఈ సైన్యం ఏమిటి?' అని తన అనుమానాన్ని బయటపెట్టాడు. అప్పుడు భరతుడు –

'గుహుడా! అటువంటి దురుద్దేశ్యం నాకు ఎంతమాత్రమూ లేదు. నన్ను అపార్థం చేసుకోకు. శ్రీరాముడు నాకు తండ్రితో సమానం. శ్రీరాముణ్ణి అయోధ్యకు తీసుకువెళ్ళి అతనికి పట్టాభిషేకం చెయ్యాలన్నదే నా కోరిక. అందుకే వచ్చాను.' అన్నాడు.

ఆ మాటలకు గుహుడు సంతోషించాడు. సీతారామలక్ష్మణులు విడిది చేసిన స్థలాలూ అవీ గుహుణ్ణి అడిగిమరీ తిలకించాడు భరతుడు.

హంసతూలికాతల్పాలపై నిద్రించవలసినవాళ్లు ఇలా కటిక నేలపై నిద్రించారా? అని బాధపడుతూ –

'నేనూ ఈ రోజు నుంచీ నేలమీదే గడ్డిపరుచుకునే పడుకుంటాను. కందమూలఫలాలే భుజిస్తాను. నారచీరలే కట్టుకుంటాను. జడలు ధరిస్తాను.' అని ప్రతిజ్ఞ చేశాడు.

ఆ మాటలకు గుహుడు ఆనందంతో ఉప్పొంగిపోయి శ్రీరాముడు ఉన్నచోటికి దారి చెప్పాడు. ఐదువందల నావలను సిద్ధం చేయించాడు. అందులో నందిఘోషం అనే నావను ప్రత్యేకంగా తానే తీసుకువచ్చాడు.

స్వస్తిక చిహ్నాలూ, తెల్లని కంబళీ, చిరుగంటల సవ్వళ్ళతో మనోహరంగా ఉందా నావ. భరతశత్రుఘ్నులూ, ముగ్గురు రాణులూ, తక్కిన అంతఃపురకాంతలూ, వసిష్ఠాది పురోహితులూ ఆ నావను అధిరోహించారు.

నావలు కదిలాయి. గంగానదిని దాటాయి. భరద్వాజ మహర్షి ఆశ్రమంలో భరతుని సైన్యం విడిది చేసింది. భరతుని పరివారంలో ఉన్న వసిష్ఠమహర్షిని చూస్తూనే భరద్వాజుడు లేచి ఎదురు వెళ్ళాడు. అర్ఘ్యపాద్యాలు సమర్పించి అందరికీ అతిథి సత్కారాలు చేసి, భరతునితో సూటిగా ఇలా అన్నాడు.

'నీ రాజ్యం నువ్వు ఏలుకోక ఇటెందుకు వచ్చావయ్యా భరతా! జరిగింది చాలదనా? శ్రీరామలక్ష్మణుల్ని వధించి పూర్తిగా అడ్డు తొలగించుకొందామనా? ఏమిటి నీ ఉద్దేశ్యం? అయినా ఇంకా చెయ్యడానికి ఏం అపకారం మిగిలి ఉందని?'

భరతుడు ఆ మాటలకు తల్లడిల్లిపోయాడు. కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగాయి. నిబ్బరించుకొని, ఎలాగో మాటలు కూడదీసుకొని, మెల్లగా తన మనసు విప్పి చెప్పాడు.

భరతుడికి ఏ దుర్బుద్ధి లేదని భరద్వాజమహర్షికి తెలియకపోలేదు. అయినా భరతుడి అంతరంగం లోకానికి తెలియాలని అలా అన్నాడు. అందుకే భరతుని మాటలకు ఆనందించి, ప్రసన్నుడయ్యాడు. తన తపశ్శక్తితో వాళ్ళకి ఒక రాజభవనం సృష్టించి ఇచ్చాడు. హాయిగా విశ్రాంతి తీసుకోమన్నాడు.

క్షణాల్లో విందు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గొప్పగా ఉన్నాయి ఆ విందులూ వినోదాలూ. ఆహా! ఇక్కడే ఉండిపోతే ఎంత బావుండు అనిపించి సైనికులంతా ఆనందంతో కేరింతలు కొట్టారు.

చివరిగా **'భరతా! కైకేయిలో దోషం చూడకు. శ్రీరామునికి ఈ వనవాసం మంచిదే – ఇది లోకకల్యాణానికే' అని భరద్వాజుడు హితవు పలికి సాగనంపాడు.**

భరతుడు తన పరివారంతో కలిసి చిత్రకూటం వైపు సాగిపోతున్నాడు. ఇప్పుడు భరతుని మనసు తేలికగా ఉంది. భరద్వాజుడు చెప్పిన ఆనవాళ్ళను బట్టి చిత్రకూటాన్ని గుర్తుపట్టాడు.

## చిత్రకూటం.. పర్ణశాల

చిత్రకూటంలో పర్ణశాలలో శచీదేవేంద్రుల్లా ప్రకాశిస్తున్నారు సీతారాములు. ప్రకృతి సౌందర్యం వాళ్ళని పులకింప జేస్తోంది. శ్రీరాము దంటున్నాడు –

'సీతా! ఇక్కడే.. ఇలాగే.. ఉండిపోవాలని ఉంది. మునుపటివి ఏవీ గుర్తుకు రావడం లేదు. ఈ వనవాసం వల్ల నాకు రెండు ఫలాలు దక్కాయి. ఒకటి– తండ్రిగారి మాటను నిలబెట్టాను. రెండు– భరతునికి మంచి చేశాను. నీకూ ఆనందమేగా?

ఎంత బావుందీ ప్రాంతం! చూడు! ఈ పర్వతం భూమిని చీల్చుకొని వచ్చినట్లు లేదూ! అక్కడే ఉంది మందాకినీ నది. దాని అందం అంతా ఇంతా?! శ్రీరాముడు ఇంకా పులకించి పోతున్నాడు. 'సీతా! రాజ్యం ఎక్కడ లేదు? ఇదుగో ఈ నదే నీ చెలికత్తె. రా! హాయిగా స్నానం చెయ్యి. ఈ పర్వతమే అయోధ్య. అడవిలోని జంతువులే మన ప్రజలు. ఈ మందాకినీ నదినే సరయూ నది అనుకో.' ఇలా కబుర్లు చెప్పుకొంటూ కులాసాగా ఉన్నారు సీతారాములు.

ఇంతలో సైన్యఘోష. అడవి దద్దరిల్లిపోయింది. జంతువులు బెంబేలెత్తి ప్రాణభయంతో అరుస్తూ చెల్లాచెదరైపోయాయి.

లక్ష్మణుడు గబగబా అక్కడే ఉన్న ఒక సాలవృక్షం ఎక్కి ఉత్తరం వైపునుంచి ఏదో మహాసైన్యం రావడాన్ని గమనించాడు. ఆ సేనకు ముందుభాగంలో ఉన్న రథంపై కోవిదారధ్వజం కన్పించింది. అది చూసిన లక్ష్మణుడు –

'అదుగో! కోవిదార ధ్వజం కనబడుతోంది. దానిపై భరతుడు వస్తున్నట్టున్నాడు. అనుమానం లేదు. పట్టాభిషిక్తుడై మనల్ని చంపడానికే వస్తున్నాడు. ఇంత జరగడానికీ కారణం ఆ భరతుడే. ఇప్పుడు దొరికాడు. ఎక్కడికి పోతాడు వాడి అంతుచూద్దాం! అన్నయ్యా! కవచం వేసుకో! విల్లు అందుకో!' అంటూ లక్ష్మణుడు కోపంతో ఊగిపోతున్నాడు. శ్రీరాముడు అతణ్ణి శాంతింపజేసి –

'లక్ష్మణా! భరతుణ్ణి చంపి సంపాదించుకున్న రాజ్యం మనకి మంచిపేరు తెస్తుందనుకొంటున్నావా? అయినా ఎందుకీ భయం? భరతునిపై ఎందుకు అనుమానం? భరతుడు మన తండ్రిగారి అనుమతి తీసుకొని నాకు రాజ్యం ఇవ్వాలని వస్తున్నాడేమో! రానీ చూద్దాం!' అన్నాడు.

## పాదుకా పట్టాభిషేకం

పర్ణశాల మధ్యలో విశాలమైన వేదిక.

దానిమీద జడలు ధరించి – అగ్నిశిఖలాగా, దర్భలపై కూర్చున్న బ్రహ్మదేవుని లాగా శ్రీరాముడు.

భరతుడు మెల్లగా వస్తూ దుఃఖం ఆపుకోలేక అన్నా! అంటూ కాళ్ళపై పడిపోయాడు. ఒకటే ఏడుపు. పెదవులు కదులుతున్నాయే కానీ మాట రావడం లేదు. శత్రుఘ్నుడూ అంతే. అమాంతంగా శ్రీరాముని కాళ్ళు చుట్టేసుకున్నాడు.

శ్రీరాముడు భరతుని నుదుటిపై ముద్దుపెట్టుకొని ఒడిలో కూర్చోబెట్టుకొని కుశల ప్రశ్నలు వేశాడు.

'భరతా! నాన్నగారు ఎలా ఉన్నారు? నువ్వెందుకిలా అడవులకు వచ్చావు? నాన్న ఉండగా నువ్విలా రావలసిన అవసరం లేదే? ఏమయ్యింది నాన్నగారికి? ఆయనకు క్షేమమే కదా!

***భరతా! రాజ్యవ్యవహారాలన్నీ నేర్పుగా చక్కదిద్దుకుంటున్నావా? ముఖ్యంగా నువ్వు సైన్యానికిగానీ సేవకులకుగానీ ఇవ్వవలసిన ఆహారం, వారి పనులకు తగిన వేతనం ఆలస్యం చెయ్యకుండా సకాలంలో ఇస్తున్నావా? ఎందుకంటే వాళ్ళు వాటిపైనే ఆధారపడి జీవించే సేవకులు. సకాలంలో శ్రమఫలం అందకపోతే వాళ్ళు రాజుపై కోపిస్తారు. దేశద్రోహులుగా మారతారు.'***

ఎన్నో సలహాలూ సూచనలూ జాగ్రత్తలూ హెచ్చరికలూ శ్రీరాముని మాటల్లో. భరతుడు వింటున్నాడు.

శ్రీరాముణ్ణి చెప్పనిచ్చి, అంతా విని, భరతుడు – 'అన్నా! నీ సేవకు దూర మయ్యాక నాకు ధర్మమెక్కడిది? ఇంక రాజ్యంతో పనేంటి? నువ్వలా అడవులకు రాగానే నాన్నగారు కాలంచేశారు.' అని దీనంగా తండ్రి మరణవార్త చెప్పాడు.

ఆ మాట వినీ వినకుండానే శ్రీరాముడు మూర్ఛపోయాడు. తర్వాత శ్రీరాముడు తేరుకొన్నాక భరతుడు – 'రా అన్నయ్యా! నువ్వూ నాన్నగారికి తర్పణాలు వదులు. నువ్వంటే నాన్నకెంతో ఇష్టం కదూ!' అన్నాడు.

శ్రీరాముడు అలాగేనంటూ మందాకినీనదిలో తర్పణాలు వదిలాడు.

ఈలోగా తల్లులు కూడా అక్కడికి వచ్చారు.

మరునాడు ఉదయం అనుష్ఠానాలు పూర్తయ్యాక భరతుడు అందరి సమక్షంలో ఇలా అన్నాడు.

'శ్రీరామా! నా తల్లి మాట మన్నించావు. ఈ రాజ్యాన్ని నాకు ఇచ్చావు. అయితే దీనిని పాలించే శక్తి నాకు లేదు. నువ్వే సమర్థుడివి. గుర్రం నడక గాడిదకు ఎలా రాదో, గరుత్మంతుని వేగం ఇతర పక్షులకి ఎలా రాదో నాకు రాజ్యపాలనా అంతే! నువ్వు వెంటనే రాజ్యాభిషేకం చేసుకో.' అన్నాడు.

అప్పుడు శ్రీరాముడు ఏమాత్రమూ ప్రలోభపడకుండా స్థిరచిత్తుడై భరతునికి ధర్మమార్గం ఉపదేశించాడు.

*ఏ పురుషుడికీ స్వతంత్రించి, తనకు తోచిన విధంగా పనులు చేసే సామర్థ్యం లేదు. ప్రతి ఒక్కరినీ దైవం అటూ ఇటూ లాగుతూనే ఉంటుంది. ఎంత కూడబెట్టినా ధనం చిట్టచివరికి నశించవలసిందే. అలాగే ఎంత గొప్పవానికైనా ఏదో ఒక రోజు పతనం తప్పదు. మానవసంబంధాలు చివరికి తెగిపోక తప్పదు. పుట్టినవాడు మరణించక తప్పదు. పండిన పండ్లకు చెట్టునుండి పడిపోవడం ఎలాగో పుట్టినవాడికి మరణమూ అలాగే.*

*ఎంత గట్టి స్తంభాలతో పటిష్ఠంగా కట్టినా కొంతకాలానికి ఇల్లు జీర్ణమై పోతుంది. కూలిపోక తప్పదు. అలాగే మానవులూ ముసలితనానికీ, మరణానికీ లొంగిపోయి మరణిస్తారు. గడచిన రాత్రి తిరిగిరాదు. నీళ్ళతో నిండిన యమునానది సముద్రంలో కలిస్తే మళ్ళీ తిరిగివస్తుందా? వేసవిలో సూర్యకిరణాలు నీటిని ఎలా పీలుస్తాయో అలాగే రాత్రులూ పగళ్ళూ ఆయుష్షును హరించివేస్తాయి. నిలబడ్డా నడుస్తున్నా నీ ఆయుర్దాయమూ అలాగే తగ్గిపోతోంది. కాబట్టి భరతా! నీ గురించి నువ్వు ఆలోచించుకో! ఇంకొకరి గురించి నీకెందుకు?*

*మనిషి ఎక్కడికి వెళ్ళినా అతణ్ణి మృత్యువు వెంటాడుతూనే ఉంటుంది. కూర్చొనేవాడు కూడా మృత్యువుతోనే కలిసి కూర్చొంటున్నాడు. ఎంత దీర్ఘప్రయాణం చేసినా మృత్యువుతో కలిసే తిరుగుతున్నాడు. దేహంపై ముడతలు వచ్చాయి.*

జుట్టు తెల్లబడింది. ముసలితనంవల్ల బక్కచిక్కిపోయిన మనిషి ఏం చేసి తనను తాను సమర్థునిగా మార్చుకోగలడు?

సూర్యుడు ఉదయిస్తే - మన పనులు మనం చేసుకోవచ్చు కదా! అని మానవులు ఆనందిస్తున్నారు. అదే సూర్యుడు అస్తమిస్తే విశ్రాంతి తీసుకోవచ్చుననీ సంబరపడుతున్నారు. కానీ తమ ఆయువు తగ్గిపోతోందని మాత్రం తెలుసుకోలేక పోతున్నారు. కొత్త ఋతువు రాగానే కొత్తకొత్త పూలూ పళ్ళూ వస్తాయని సంబర పడతారు. కానీ ఋతువుతో పాటే మానవుల ఆయుర్దాయమూ క్షీణించిపోతూ ఉంటుంది.

మహాసముద్రంలో ఒక కాష్ఠంతో మరోకాష్ఠం కొంతకాలమే కలిసి ఉంటుంది. కొంతకాలానికి విడిపోతుంది. అలాగే భార్యాపుత్రులూ, బంధువులూ, ధనమూనూ.

ఈ లోకంలో ఏ ప్రాణీ తన ఇష్టం వచ్చినట్లు నడుచుకొనే అవకాశం లేదు. అందువల్ల చనిపోయినవానికిగానీ, వానికోసం ఏడ్చేవానికి గానీ మరణం విషయంలో ఏ అధికారమూ లేదు. ఎవడూ ఏమీ చేయలేడు.

మన పెద్దలు వెళ్ళిన దారి మనందరికీ ఎప్పుడో నిశ్చితమై ఉంది. ఆ మార్గం తిరుగులేనిది. మరి ఆ మార్గంలో వెళ్తున్నప్పుడు ఇంక బాధపడడం దేనికి? నీటి ప్రవాహంలాగే వయస్సూ వెనక్కి తిరగకుండా దాటిపోతూనే ఉంటుంది. కాబట్టి రాజు మనస్సు ధర్మంమీదే ఉండాలి. అప్పుడే ప్రజలు సుఖపడతారు.

దశరథమహారాజు ధర్మాత్ముడు. పుష్కలంగా దక్షిణలు ఇస్తూ శాస్త్రోక్తంగా ఎన్నో యజ్ఞాలు చేశాడు. నమ్ముకున్న వారిని పోషించడమూ, ప్రజల్ని చక్కగా పరిపాలించడమూ, ధర్మబద్ధంగా మాత్రమే ధనం స్వీకరించడమూ ఆయన స్వభావం. చాలా కాలం జీవించాడు. సకల భోగాలూ అనుభవించాడు. మంచివాళ్ల మన్ననలూ అందుకున్నాడు. అందుకే స్వర్గానికి వెళ్ళాడు. కాబట్టి నాన్నగారి గురించి బాధపడవలసిన అవసరం లేదు.

మన నాన్నగారు మానవదేహం విడిచి, బ్రహ్మలోకంలో కూడా సంచరించ గల దివ్యశరీరాన్ని పొందారు కదా! శాస్త్రజ్ఞాని, మేధావి అయిన మన తండ్రి గురించి నీలాంటివాడూ నాలాంటివాడూ ఏమాత్రం బాధ పడకూడదు. ఎటువంటి

అవస్థ వచ్చినా బుద్ధిమంతుడు ఇలా బోరుబోరున ఏడవకూడదు. శోకాన్ని విడిచిపెట్టాలి.

భరతా! కొంచెం తేరుకో! తమాయించుకో! దుఃఖించకు. వెళ్ళు. అయోధ్యను పరిపాలించు. ఇది తండ్రిగారి ఆజ్ఞ. మన తండ్రిగారు పవిత్రమైన కార్యాలు మాత్రమే చేస్తారు. అందుకే ఆయన నన్ను ఏమని ఆజ్ఞాపించారో నేను దానిని పాటిస్తాను. నేను మహారాజు గారికి ఇచ్చిన మాటను జవదాట కూడదు. నీవు కూడా తండ్రిగారి మాటను గౌరవించు. ఎందుకో తెలుసా? ఆయన మనకు బంధువు. స్వయానా కన్నతండ్రి.

కాబట్టి నేను ధర్మాత్ములైన మన తండ్రిగారి ఆజ్ఞ ప్రకారం ఈ వనంలోనే నివసిస్తూ ఇక్కడ పరిపాలిస్తాను. పరలోకంలో సుఖం కోరుకొనే వ్యక్తి ధార్మికుడు కావాలి. క్రూరత్వాన్ని విడిచిపెట్టి గురుశుశ్రూష చెయ్యాలి. మన తండ్రి దశరథుడు ఎంతటి ఉత్తమచరిత్ర కలవాడో తెలుసుకొని నువ్వు కూడా నీ ధర్మాన్ని నిర్వర్తించు.

తండ్రిమాట పాటించడమే మన ప్రస్తుత ధర్మం. ఒక పని చెయ్యమని నన్నూ, ఇంకొక పని చెయ్యమని నిన్నూ తండ్రిగారు ఆదేశించారు. ఆయన మాటే మనకు వేదం. నువ్వు ప్రజలకి రాజువు. నేను ఈ అడవిలోని మృగాలకి మహారాజును. సంతోషంగా అయోధ్యకు వెళ్ళు. నేనూ ఆనందంగా దండకారణ్యానికి వెడతాను.'

భరతుడు పట్టు వదలకుండా అంటున్నాడు. 'శ్రీరామా! ధర్మం తెలిసిన వాడు ఎవడైనా, కేవలం భార్యని సంతోషపెట్టడానికి ఇంత పాపం చేస్తాడా? అయినా దశరథుడు చేశాడు. సరే! ఏదో ముసలితనం అనుకో! పట్టించుకోకు. అజ్ఞానం వల్లనో, సాహసం వల్లనో ధర్మాన్ని ఉల్లంఘించాడు. ఆయన చేసిన తప్పు సరిదిద్ద వలసిన బాధ్యత నీకు లేదా?

తండ్రి చేసిన మంచిని నిలబెట్టడం కుమారులకు ఎంత బాధ్యతో, తప్పులను సరిదిద్దడం కూడా అంతే. నువ్వే రాజ్యాభిషేకం చేసుకో. ఈ రాజ్యాన్నీ ప్రజల్నీ రక్షించు. అయోధ్యకు బయలుదేరు.'

భరతుడి మాటలు విన్నవారంతా హర్షం ప్రకటించారు కానీ శ్రీరాముడు తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. అప్పుడు జాబాలి మహర్షి శ్రీరాముని మనస్సు మార్చాలని ఇలా అన్నాడు.

'శ్రీరామా! మనిషి ఎప్పుడూ ఒంటరివాడే. పుట్టేటప్పుడుగానీ మరణించే టప్పుడుగానీ ఎవరూ తోడు రారు. ఈ మధ్యలో మనం కల్పించుకునే బంధుత్వాలు ఉన్నాయే! అవన్నీ ఒట్టి మాయ. అనుబంధాలు పెంచుకోవడం అంతటి బుద్ధి తక్కువపని వేరొకటి లేనేలేదు. దశరథుడు నీకేమీ కాడు. నువ్వూ దశరథునికి ఏమీ కావు. అయోధ్య నీకోసం ఎదురుచూస్తోంది. రాజ్యాభిషేకం చేసుకొని నీ క్షత్రియ ధర్మం నువ్వు నిర్వర్తించు. ఉంటుందో లేదో తెలియని పుణ్యలోకం కోసం కర్తవ్యాన్నిమాత్రం విస్మరించకు సుమా!'

ఆ మాటలు విన్న శ్రీరాముడు జాబాలితో అక్కడ ఉన్నవాళ్ళందరూ వినేలా ఇలా అన్నాడు – *'జాబాలి మహర్షీ! ఈ లోకం సుఖంగా ఎందుకుందంటారు? అందుకు కారణం కొన్ని కట్టుబాట్లు కావూ?! అందుకే వేదమర్యాదలనూ ధర్మాన్నీ త్యజించకూడదు. అలా చేసేవాడు దుర్మార్గుడు. నేను అధర్మాన్ని అనుసరిస్తే అందరూ నాలాగే అధర్మమార్గంలో ప్రవర్తిస్తారు. రాజులకైనా సరే! స్వేచ్ఛ లేదు. ప్రజలకు ఆదర్శంగా ఉండాలి. నియమాలు పాటించాలి. నిబద్ధత ఉండాలి. కుంటి సాకులు చూపించి హద్దు మీరకూడదు. రాజధర్మం సత్యస్వరూపాన్ని నిరూపించాలిగానీ నిర్మూలించకూడదు. సత్యాన్ని పలికేవాడే లోకంలో ఉత్తముడు. లోకమంతా సత్యం మీదనే కదా నిలిచి ఉండేది! రాజ్యాధికారానికీ పునాది సత్యమే. ఋషులూ దేవతలూ సత్యాన్నే పరమధర్మంగా అంగీకరించారు. సత్యభాషి లోకంలో ఉత్తమస్థానాన్ని పొందుతాడు. అసత్యవాదిని చూస్తే జనులు పామును చూసినట్లు భయపడతారు. రాజు సత్యవర్తనుడైతే ప్రజలూ సత్యమార్గంలోనే నడుస్తారు. అందువల్ల సత్యాన్ని మించిన ధర్మం లోకంలో మరొకటి లేదు. ఈ లోకంలో సత్యమే ఈశ్వరుడు. ఆ సత్యాన్నే లక్ష్మి ఎల్లప్పుడు ఆశ్రయించి ఉంటుంది. సత్యమే అన్నిటికీ ఆధారం. సత్యాన్ని మించిన ఉత్తమ ప్రమాణం మరొకటి లేదు. నాది సత్యప్రతిజ్ఞ. ప్రతిజ్ఞ చేశాను కాబట్టి మాట తప్పలేను. నా తండ్రిమాటను వమ్ము చేయలేను.*

*ఎప్పుడూ శుభకర్మలే చేయాలి. సత్యాన్ని పలకడం, ధర్మాన్ని ఆచరించడం, భూతదయ, ప్రియంగా మాట్లాడడం, అతిథిపూజ ఇవన్నీ సత్పురుషులు అనుసరించే పద్ధతులు. కాబట్టి వీటిని విడిచి పెట్టకూడదు.'*

మాటలమధ్యలో వసిష్ఠమహర్షి కలుగజేసుకున్నాడు.

'శ్రీరామా! నువ్వు చెప్పినట్లే మీ వంశంలోనూ కొన్ని కట్టుబాట్లు ఉన్నాయి. ఇక్ష్వాకువంశంలో రాజు తరువాత అతని పెద్దకొడుకే రాజు కావాలి. పెద్ద కొడుకు ఉండగా చిన్నవానికి ఎప్పుడూ రాజ్యాభిషేకం జరగలేదు. నువ్వూ నీ వంశమర్యాద పాటించు. రాజ్యాభిషేకం చేసుకో. పుట్టిన ప్రతి వ్యక్తికీ తల్లి, తండ్రి, ఆచార్యుడు, అని ముగ్గురు గురువులు ఉంటారు. **తల్లిదండ్రులు జన్మనిస్తారు. ఆచార్యుడు జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు.**

నేను నీకే కాదు, నీ తండ్రికి కూడా గురువునే. అందుకని ఏమీ ఆలోచించ కుండా నేను చెప్పినట్లు చెయ్యి. అది తప్పుకాదు. అయోధ్యలో ఉంటూ నీ తల్లికి సేవ చెయ్యి. ఈ ప్రజలంతా నీవాళ్ళు. వాళ్ళను కన్నబిడ్డల్లా పరిపాలించు.' వసిష్ఠుని మాటలు విన్న శ్రీరాముడు వినయంగా –

***మహర్షీ! తల్లిదండ్రులు పుత్రుణ్ణి కనాలని కలలు కంటారు. ఎన్నో వ్రతాలు చేస్తారు. నోములూ నోస్తారు. అశక్తుడుగా పుట్టిన పుత్రుణ్ణి అసహ్యించుకోకుండా విసుగు లేకుండా సాకుతారు. ఎంతో గారాబంగా నీళ్ళుపోసి, గోరుముద్దలు తినిపించి, జోలపాడి, నిద్రపుచ్చి తమ కంటిమీద కునుకులేకుండా కంటికి రెప్పలా తమ పుత్రుణ్ణి కడుపులో పెట్టుకొని చూసుకుంటారు. తమ శక్తికొద్దీ అన్నీ సమకూరుస్తారు. ఆప్యాయంగా మాట్లాడతారు. అంతలా ప్రేమతో సాకిన తల్లిదండ్రుల ఋణం ఎన్నటికీ తీరదు. వాళ్ళు చేసిన ఉపకారానికి ప్రత్యుపకారం చేయడం సాధ్యం కాదు. అలాగే దశరథ మహారాజు నాకు జన్మనిచ్చిన తండ్రి. నేనంటే ఆయనకు అవ్యాజమైన ప్రేమ. అల్లారుముద్దుగా నన్ను పెంచి పెద్ద చేశాడు. అటువంటి గొప్ప తండ్రికి నేను ఇచ్చిన మాటను ఇప్పుడు పరిస్థితులు మారాయి కదా అని తప్పడం భావ్యమా?'*** *అన్నాడు.*

అందరి హితబోధలూ వాటికి శ్రీరాముడు ఇస్తున్న సమాధానాలూ అన్నీ విన్నాడు భరతుడు. శ్రీరాముడు నిర్ణయం మార్చుకోడని అతనికి అర్థమయ్యింది. అందుకే అక్కడికక్కడే శ్రీరాముని సమక్షంలోనే దర్భలు పరుచుకొని ప్రాయోపవేశానికి పూనుకున్నాడు. అది చూసి శ్రీరాముడు –

'భరతా! నీ దుఃఖాన్నీ, పట్టుదలనీ వదిలిపెట్టు. క్షత్రియునికి ప్రాయోపవేశం చేసే అధికారం లేదు. కైకేయిని పెళ్ళి చేసుకొనే సమయంలో మన తండ్రి నీ మాతామహునికి ఒక మాట ఇచ్చాడు. అదేమిటో తెలుసా? కన్యాశుల్కంగా ఆమె సంతానానికి రాజ్యం ఇస్తానని. అలాగే నీ తల్లి వరాల రూపంలోనూ రాజ్యమే కోరుకుంది. అందువలన ఈ రాజ్యం ముమ్మాటికీ నీదే.' అని భరతునికి నచ్చచెప్పి–

'ప్రజలారా! భరతుడు పట్టువదలడం లేదు కాబట్టి నేనొక మాట ఇస్తున్నాను. వినండి. పద్నాలుగు సంవత్సరాలు వనవాసం చేశాక భరతునితో కలిసి రాజ్యపాలన చేస్తాను.' అన్నాడు. అదృశ్యరూపంలో అక్కడే ఉన్న దేవతలు, గంధర్వులు, ఋషులు శ్రీరాముడి మాటల్ని సమర్థించారు.

అప్పుడు భరతుడు పాదుకలను తెచ్చి శ్రీరాముని ముందు పెట్టి – 'అన్నా! నీ పవిత్రమైన పాదాలు ఈ బంగారు పాదుకల మీద ఒక్కసారి ఉంచవయ్యా! ఈ పాదుకలే ఇక నుంచీ ప్రజాపరిపాలన చేస్తాయి.' అన్నాడు.

శ్రీరాముడు పాదాలు ఉంచిన ఆ పాదుకలను తలపై పెట్టుకొని భరతుడు– 'శ్రీరామా! నేనూ నీలాగే నారచీరలూ జటలూ ధరిస్తాను. కందమూల ఫలాలే తింటాను. నువ్వు వచ్చే దాకా కేవలం నీ పాదుకలకు ప్రతినిధిగా రాజ్యపాలన చేస్తాను, రాజుగా కాదు. అంతే! పద్నాలుగు సంవత్సరాల తర్వాత నువ్వు రావడానికి ఒక్క రోజు ఆలస్యం అయినా నేను అగ్నిప్రవేశం చేస్తాను.' అన్నాడు.

అప్పుడు శ్రీరాముడు భరతశత్రుఘ్నులను కౌగిలించుకొని – 'భరతా! తల్లి కైకేయిని బాగా చూసుకో. ఆమె పట్ల పరుషంగా మాట్లాడావో నా మీద ఒట్టు.' అని సోదరులకు వీడ్కోలు చెప్పాడు.

అందరూ తిరిగి అయోధ్యకు చేరుకున్నారు. దశరథుని మరణం, శ్రీరామ వనవాసంతో ఆ నగరం రాలి పడ్డ నక్షత్రంలా ఉంది. కళా లేదు. కాంతీ లేదు.

'శ్రీరాముడు లేని ఈ అయోధ్యానగరంలో నేను ఉండలేను. నందిగ్రామంలో ఉంటాను. అక్కణ్ణుంచే రాజ్యపాలన చేస్తాను' అన్నాడు భరతుడు వసిష్ఠమహర్షితో. వసిష్ఠుని అనుమతి తీసుకొని నందిగ్రామం వెళ్ళాడు. అక్కడ శ్రీరామపాదుకలకు అభిషేకం చేసి, సమస్త ప్రజలూ వినేలా ఇలా ప్రకటించాడు.

'ప్రజలారా! వినండి! ఇప్పటినుండీ ఈ శ్రీరామ పాదుకలే రాజ్యాన్ని పరిపాలిస్తాయి. నేను సేవకుణ్ణి మాత్రమే. అన్ని లాంఛనాలూ ఈ పాదుకలకే జరగాలి. శ్రీరాముడు తిరిగివచ్చాక వీటిని నేనే స్వయంగా ఆయన పాదాలకు తొడుగుతాను' అని ఆ పాదుకలను సింహాసనం మీద పెట్టాడు. వాటికి వెల్లగొడుగు పట్టాడు. వింజామరలు వీచాడు.

## అనసూయాదేవి అనుగ్రహం

అక్కడ చిత్రకూటంలో ఋషులందరూ తనను తప్పించుకు తిరుగుతున్నారు. ఎందుకో అర్థం కాలేదు శ్రీరామునికి. ఒక వృద్ధమునిని అడిగాడు. దాని కా ముని – 'శ్రీరామా! నరమాంసభక్షకుడైన ఖరుడు అనే రాక్షసుడు ఉన్నాడు. వాడు నిన్ను చూసి ఓర్వలేక మామీద దాడి చేస్తున్నాడు. అందుకే ఇక్కణ్ణుంచి వెళ్ళిపోతున్నాం. ఇక్కడ ఉండడం మీకూ క్షేమం కాదు. మీరూ వెళ్ళిపోండి' అన్నాడు.

సీతారామలక్ష్మణులూ చిత్రకూటం వదిలి, అత్రిమహర్షి ఆశ్రమం చేరుకొన్నారు.

* * *

అది అత్రిమహర్షి ఆశ్రమం. శ్రీరామునికి ఆతిథ్యం ఇచ్చాడు మహర్షి. ఆయన భార్య అనసూయాదేవి. మహాభాగ్యవంతురాలు. తపోధనురాలు. గొప్ప ధార్మికురాలు. అత్రిమహర్షి ఆమెతో – 'అనసూయా! సీతాదేవిని ఆదరించు' అన్నాడు. ఆమె సమక్షంలోనే సీతారామలక్ష్మణులగురించి ప్రియవాక్యాలు పలికాడు. అనసూయగురించీ వాళ్ళకి ఇలా చెప్తున్నాడు.

'శ్రీరామా! ఒకసారి లోకం అనావృష్టితో అలమటించిపోయింది. అప్పుడు అనసూయ పదివేల సంవత్సరాలు తపస్సు చేసి, ఆహారం సృష్టించి, ప్రజలను కాపాడింది. ఈ ప్రాంతంలో గంగ ప్రవహించేలా చేసింది. ఈమెకు కోపం, అసూయ ఇసుమంతైనా లేవు. అందుకే అందరూ ఈమెను అనసూయ అంటారు'

సీతాదేవి అనసూయాదేవికి ప్రదక్షిణం చేసి ఆమె దగ్గర నిలబడింది. అప్పుడు అనసూయ – *'సీతా! నీ ధర్మాచరణ చూస్తుంటే నాకు ముచ్చటేస్తోంది. నువ్వు భాగ్యవంతురాలివి. అయినా అన్నీ వదిలి నీ భర్తతో అరణ్యానికి వచ్చావు. నీలా*

**భర్తను అనుసరించే స్త్రీలకు ఉత్తమగతులు కలుగుతాయి. భర్త ఎంత దుర్మార్గుడైనా, దరిద్రుడైనా అతడే ఉత్తమదైవం.***

*సీతా! ఎంత ఆలోచించినా భర్తను మించిన దైవం లేదు. బంధువూ లేదు. భర్త అనంతమైన తపస్సు. ఆ విషయం నీలాంటి ఉత్తమస్త్రీలకు మాత్రమే తెలుసు. నువ్వు ఇలాగే భర్తను అనుసరిస్తూ, పతివ్రతల ఆచారాల్ని పాటిస్తూ నీ భర్తకు సహధర్మచారిణిగా ఉండు. దానివల్ల నీకు కీర్తి, ధర్మం లభిస్తాయి.'* అని సీతాదేవిని అభినందిస్తూ దగ్గరకు తీసుకుంది.

దానికి సీతాదేవి – 'పూజ్యురాలివైన నువ్వు ఇలా చెప్పడంలో ఆశ్చర్యం లేదు. భర్త ఎంత నీచుడైనా పూజింపదగినవాడే. అటువంటప్పుడు ఇంతమంచి గుణాలున్న భర్త విషయంలో ఇంక చెప్పేది ఏముంది? నీ మాటలు వింటుంటే నా తల్లీ, అత్తగార్లూ చేసిన ఉపదేశాలే గుర్తుకువస్తున్నాయి.

స్త్రీకి పతిసేవ తప్ప వేరే తపస్సు లేదు. అలా చేసినందువల్లనే సావిత్రి స్వర్గంలో ప్రకాశిస్తోంది. రోహిణి కూడా ఒక్కక్షణమైనా చంద్రుణ్ణి విడిచి ఆకాశంలో కనిపించదు. ఇలా ఎందరో స్త్రీలు భర్తలను సేవించి దేవలోకంలో పూజలందు కొంటున్నారు' అంది*.

ఆ మాటలకు ఆనందించిన అనసూయ ప్రేమతో సీతాదేవి తలమీద ముద్దుపెట్టి – 'సీతా! చెప్పు. నా తపశ్శక్తితో నీకు ఏది కావాలన్నా ఇస్తాను. కోరుకో' అంది.

---

*** అన్ని ఆశ్రమాల్లోనూ గృహస్థ ఆశ్రమం చాలా గొప్పది. పురుషునికి భార్య వల్లనే గృహస్థధర్మం ఆచరించినందుకు ఫలం లభిస్తుంది. అనుకూలవతియైన భార్య ఉంటే ఆ భర్త చేపట్టిన పనులన్నీ సత్ఫలితాలను ఇస్తాయి. ఇంద్రియాలు అదుపులో ఉంటాయి. మంచి పుత్రులు కలుగుతారు. చతుర్విధపురుషార్థాలు సాధించడానికి భర్తకు భార్యే సాధనం. ఇంట్లో నీతి నిలబడడానికీ ఇల్లాలే ఆధారం. ఇంటిల్లిపాదీ మంచి నడవడిక కలిగి ఉండడానికి గృహిణియే గురువు. ఇంట్లో సదాచారాలు ఉండాలంటే ఇల్లాలే ఆచార్య. వంశం నిలబడాలంటే కూడా భార్యే మూలం. కుటుంబాన్ని మంచిదారిలో నడిపించడానికి ఇల్లాలే ఊతకర్ర. దేవపూజ, పితృపూజ, అతిథిపూజ చేయాలంటే భార్యే పతికి ఆధారం. అలాగే భర్త లేని భార్యకూ ధర్మార్థకామాలు లభించవు. కాబట్టి దంపతులు ఒకరికొకరు తోడై సఖ్యంగా కలిసిమెలసి జీవించాలి. ఇంటికి గౌరవమూ ఇల్లాలివల్లనే దక్కుతుంది. ఇల్లాలినీ పిల్లలనూ చక్కగా చూసుకొనే భర్తకు ఏ ఆపద రాదు. – భార. ఆది 4-85 ; మార్కం. 2-326.**

సీతాదేవి చిరునవ్వు చిందిస్తూ 'ఇది చాలు. నువ్వు నాకు వరం ఇచ్చినట్లే' అంది. దానికి అనసూయ ఇంకా సంతోషించింది. దివ్యమైనవీ, శ్రేష్ఠమైనవీ అయిన పుష్పమాలలూ, పట్టుబట్టలూ, ఇంకా అనేక ఆభరణాలూ, అంగరాగమూ, మైపూతా ఇచ్చింది. ఇస్తూ – 'సీతా! ఇవి ఎప్పటికీ వాడిపోకుండా నలిగిపోకుండా నీకు నిత్యశోభను కలిగిస్తాయి.' అని దీవించింది.

సీతాదేవి భక్తితో నమస్కరించింది. అప్పుడు అనసూయ– 'సీతా! నీ స్వయంవరమూ, వివాహమూ చాలా అద్భుతంగా జరిగాయని విన్నాను. కాస్త వివరంగా చెప్పవూ' అని అడిగింది.

సీతాదేవి పూసగుచ్చినట్లు అంతా చెప్పింది. ఆ తరువాత అనసూయ కోరికపై సీతాదేవి ఆమె ఇచ్చిన వస్త్రాలనూ ఆభరణాలనూ ధరించి శ్రీరాముడి దగ్గరకు వచ్చింది. ఎవరికీ లభించని ఆ ఘనసన్మానం సీతాదేవికి దక్కింది. అందుకు శ్రీరామలక్ష్మణులు సంతోషించారు. ఆ రాత్రి అత్రిమహర్షి ఆశ్రమంలోనే గడిపారు. తెల్లవారింది. ఆ పుణ్యదంపతుల ఆశీస్సులు పొంది, సీతాలక్ష్మణులతో కలిసి శ్రీరాముడు – మేఘమండలంలోనికి ప్రవేశించే సూర్యునిలా వెలిగిపోతూ దండ కారణ్యంవైపుకు దారితీశాడు.

# అరణ్యకాండ

## దండకారణ్యం

సీతాలక్ష్మణులతో కలిసి శ్రీరాముడు దండకారణ్యంలోనికి ప్రవేశించాడు. అల్లంత దూరంలో సూర్యమండలంలా ప్రకాశిస్తూ ఒక ఆశ్రమం. మహర్షులతో క్రిక్కిరిసి బ్రహ్మసభలా ఉంది.

శ్రీరామలక్ష్మణులు ఆ మహర్షులమీది గౌరవంతో తమ విల్లులను దించి ఆ ఆశ్రమంలోనికి ప్రవేశించారు.

మహర్షుల ఆశ్చర్యం అంతా ఇంతా కాదు. రెప్పవేయడం కూడా మరిచిపోయిన వారి కళ్ళు తదేకంగా సీతారామలక్ష్మణులనే చూస్తున్నాయి. అతిథి సత్కారాలు యథావిధిగా జరిగాయి. మహర్షులు సీతారామలక్ష్మణులకు పర్ణశాలను కూడా ఏర్పాటు చేశారు.

**'శ్రీరామా! ప్రజారక్షణే రాజుకి ప్రథమ కర్తవ్యం. అడవిలో ఉన్నప్పటికీ నువ్వే మాకు రాజువు. మమ్మల్ని కాపాడే బాధ్యత ముమ్మాటికీ నీదే. మేము ఆయుధాలు చేపట్టకుండా శాంతంగా జీవించడానికి అలవాటుపడ్డాం. నువ్వే మమ్మల్ని కన్నబిడ్డల్లా చూసుకోవాలి.'** అని వేడుకొంటూ మహర్షులు – శ్రీరాముణ్ణి ఈశ్వరునిగా భావించి అర్చించారు.

## విరాధవధ

మరుసటిరోజు నడక సాగించి క్రూరమృగాలు వీరవిహారం చేసే కీకారణ్యం లోకి ప్రవేశించారు సీతారామలక్ష్మణులు. ఇంతలో ఎక్కడనుండో హఠాత్తుగా నరమాంసభక్షకుడైన ఒక రాక్షసుడు వాళ్ళముందు ఊడిపడ్డాడు.

వాడి అరుపు భీకరం. గుంటల్లాంటి కళ్ళతో, బానపొట్టతో, పెద్ద మొహమూ వాడూ. చూస్తే చాలు పై ప్రాణాలు పైనే పోయేట్టుంది వాడి అవతారం. దానికితోడు

పొడు గొకటి. అది చాలదన్నట్టు ఒంటినిండా రక్తపు మరకలు. పైగా పులితోలు కట్టుకున్నాడు. వెరసి నోరు తెరిచి కూర్చున్న యముడిలా ఉన్నాడు. వాడి చేతిలో ఒక పెద్ద శూలం ఉంది. వస్తూనే గబాలున సీతాదేవిని పట్టుకొని, తన ఒడిలోనికి తీసుకొని –

'ఋషిపుంగవుల్లా ఉన్న మీకు ఈమెతో ఏం పని? ఈమె ఎవరో గానీ భలే అందంగా ఉంది. నేను భార్యగా స్వీకరిస్తాను. ఇక్కడే ఇప్పుడే మీ రక్తం తాగుతాను.' అన్నాడు.

ఆ మాటలకు సీతాదేవి భయపడిపోయింది. శ్రీరాముని బాధ వర్ణనాతీతం. వెంటనే శ్రీరాముడు –

**'తమ్ముడూ! అంతా అయిపోయింది. జనకమహారాజు పుత్రికా, నా సహధర్మచారిణీ అయిన సీతాదేవి ఇప్పుడు వీడి ఒడిలో ఉంది. పరాయి పురుషుడు, కట్టుకున్న ఇల్లాలిపై కళ్ళముందరే చెయ్యివేస్తే అంతకంటే దుఃఖం ఇంకేమన్నా ఉంటుందా? రాజ్యం పోయినా నేను ఇంతగా బాధపడలేదు. పితృవియోగం కంటే ఇప్పుడే ఎక్కువ బాధగా ఉంది. ఇక వీణ్ణి ఉపేక్షించకూడదు.' అన్నాడు (స్నేహంపేరుతో నాగరకత పేరుతో పరస్త్రీలను కౌగిలించుకోవడం, కరచాలనం చెయ్యడం అధర్మమనీ, పతనానికి తొలిమెట్టు అనీ పురుషులు గ్రహించాలి).**

శ్రీరాముని మాటలకు చలించిపోయిన లక్ష్మణుడు భుజంగంలా బుసలు కొడుతూ–

'అన్నా! ఈ సమస్తలోకానికీ నాథునివైన నువ్వే డీలాపడితే ఎలా? నువ్వు ఊఁ అను. ఒకే ఒక్కక్షణంలో వీణ్ణి నామరూపాలు లేకుండా చేసేస్తాను.'

'ఓరీ రాక్షసా! ఎవరు నువ్వు?' అన్నాడు గట్టిగా కోపం నిండిన కంఠంతో.

దానికా రాక్షసుడూ కోపంగానే – 'నా గురించి తర్వాత. మీరెవరు? ఇక్కడెందుకు తిరుగుతున్నారు?' అన్నాడు. శ్రీరాముడు తమ గురించి వివరంగా చెప్పాడు.

అప్పుడా రాక్షసుడు – 'నన్ను విరాధుడు అంటారు. నా తండ్రి జయుడు. తల్లి శతహ్రద. నేను వరప్రసాదిని. నన్ను ఏ ఆయుధమూ ఏమీ చెయ్యలేదు. అది

బ్రహ్మదేవుడు నాకు ఇచ్చిన వరం. ఈమె మీద ఆశలు వదులుకోండి. మిమ్మల్ని దయతలచి చంపకుండా వదిలేస్తున్నాను. నోరు మూసుకొని పొండి.' అన్నాడు.

ఆ మాటలకు శ్రీరాముని గుండె భగ్గుమంది. తక్షణం విల్లు ఎక్కుపెట్టి వరుసగా ఏడు బాణాలను వదిలాడు. అంతే! వాడియైన బాణాలు వాడి శరీరానికి గుచ్చుకొని రక్తమోడుతూ కిందపడ్డాయి.

విరాధునికి కోపం తారాస్థాయికి చేరుకుంది. సీతాదేవిని దించి, శూలాన్ని పట్టుకొని అరుస్తూ వాళ్ళమీదికి వస్తున్నాడు. శ్రీరామలక్ష్మణులు వాడిపై బాణవృష్టి కురిపిస్తున్నా లెక్కపెట్టకుండా వస్తూనే ఉన్నాడు.

శ్రీరాముడు ఆలస్యం చెయ్యలేదు. మరో రెండు బాణాలు సంధించాడు. అవి విరాధుని శూలాన్ని ముక్కలు చేసేశాయి. ఇంకా వాడు అలా వస్తూ వస్తూ శ్రీరామలక్ష్మణుల్ని చెరో సందిటా పట్టుకొని పరిగెత్తాడు. అది చూసి సీతాదేవి బెంబేలెత్తి బిగ్గరగా రోదిస్తోంది.

'అయ్యో! నా శ్రీరాముడు ఈ రాక్షసుని బారిన పడ్డాడే! లక్ష్మణుణ్ణి కూడా తీసుకుపోతున్నాడే. నాకింక దిక్కు ఎవరు? నేను ఒంటరిదాన్నై పోయాను. ఓ రాక్షసుడా! నీకు దండం పెడతాను. శ్రీరామలక్ష్మణుల్ని ఏమీ చెయ్యకు. వాళ్ళని విడిచిపెట్టు. అవసరమైతే నన్ను తీసుకుపో!' అంటూ విలపిస్తోంది.

ఇక లాభం లేదనుకొని శ్రీరాముడూ లక్ష్మణుడూ విరాధుడి చెరో చెయ్యి నరికిపారేశారు. ఆ దెబ్బకి కొండలా నేలపై పడి గిలగిలా కొట్టుకొంటున్నాడు విరాధుడు. అప్పుడు శ్రీరాముడు – 'వీడు ఆయుధాలవల్ల చచ్చేట్టులేడుగానీ లక్ష్మణా! గొయ్యి తియ్యి. పూడ్చేద్దాం.' అన్నాడు

అప్పటికిగానీ వీళ్ళు శ్రీరామలక్ష్మణులన్న జ్ఞానం రాలేదు విరాధునికి. వెంటనే – 'శ్రీరామా! నువ్వెవరో నాకు ఇప్పటికి తెలిసిందయ్యా! నువ్వు కౌసల్యా పుత్రుడివి. శ్రీరామునివి. అతడు నీ తమ్ముడు లక్ష్మణుడు. ఈమె నీ భార్య సీతాదేవి. నేను అసలు రాక్షసుణ్ణి కాదు. ఒక గంధర్వుణ్ణి. కుబేరుని శాపమే నాకీ గతి పట్టేలా చేసింది. మీ చేతుల్లోనే నాకు శాప విముక్తి లభిస్తుంది. శ్రీరామలక్ష్మణులారా! రండి! నన్ను సత్వరం పాతిపెట్టెయ్యండి.' అన్నాడు.

శ్రీరామలక్ష్మణులు విరాధుడు చెప్పినట్టే చేశారు. వాళ్ళు అలా చేశారో లేదో ఆ విరాధుడు తన పూర్వరూపాన్ని పొంది, గంధర్వుడై – **'స్వామీ! నీ అనుగ్రహంవల్ల భయంకరమైన శాపంనుండి విముక్తిని పొందాను. ఇప్పుడు స్వర్గానికి వెళ్ళిపోతున్నాను. ఇక్కడికి దగ్గరలోనే శరభంగమహర్షి ఆశ్రమం ఉంది. ఆయన పరమ ధర్మాత్ముడు. గొప్ప తపస్వి. మీరు ఆయనను దర్శించుకోండి. మీకు శుభం జరుగుతుంది.'** అంటూ స్వర్గానికి వెళ్ళిపోయాడు. ఇదంతా చూసి హడలెత్తిపోయిన సీతాదేవిని ఊరడించాడు శ్రీరాముడు. ఇంక అక్కడే ఉంటే ప్రమాదకరమని చెప్పి బయలుదేరారు ముగ్గురూ.

## శరభంగమహర్షి ఆశ్రమం

**దూరంగా శరభంగ మహర్షి ఆశ్రమం కన్పించింది. ఇంద్రుడు ఆకాశంనుంచి రథం దిగి, పాదాలు నేలకు తాకకుండా నిలబడి శరభంగ మహర్షితో ఏవో మాట్లాడుతున్నాడు. దేవకాంతలు దేవేంద్రుడికి వింజామరలతో విసురుతుంటే మరోపక్క గంధర్వులు వేదాలు చదువుతూ పొగుడుతున్నారు. చూశారు సీతారామలక్ష్మణులు.** అప్పుడు శ్రీరాముడు–

లక్ష్మణా! ఆ రథం సూర్యమండలంలా వెలిగిపోవడం లేదూ! అవిగో! ఆ రథానికి ఉన్న అశ్వరాజాలు. చూశావా? అవే ఇంద్రుని గుర్రాలు. వాటిగురించి వినడమే కానీ ఎప్పుడూ చూడలేదు కదా! బాగా చూడు. కొంచెం రథం లోపలికి కూడా చూడు. ఎవరున్నారో కనిపించిందా? లోపల అందరూ యౌవనవంతులే ఉన్నారు. వెలిగిపోతున్నారు. ఏం రంగు! ఏం వర్చస్సు! అంతా పాతికేళ్ళలోపువాళ్ళే. అదే దేవతల వయస్సు. నువ్వూ సీతా ఇక్కడే ఉండండి. తెలుసుకొని వస్తాను' అని వెళ్ళాడు శ్రీరాముడు.

శ్రీరాముని రాకను చూసిన దేవేంద్రుడు వెంటనే –

'మహర్షీ! అడుగో! శ్రీరాముడు ఇటువైపే వస్తున్నాడు. అతడు ప్రతిజ్ఞ నెరవేర్చుకున్న తరువాతే నేను శ్రీరాముని ఎదుటపడతాను. ఎవరికీ సాధ్యంకాని ఒక గొప్ప కార్యం శ్రీరామునివల్ల జరగాలి. జరుగుతుంది. వస్తా.' అంటూ హడావుడిగా వెళ్ళిపోయాడు. ఇంద్రుడు వెళ్ళిపోయాక శరభంగుడు అగ్నిహోత్రం

ఉపాసిస్తూ కూర్చున్నాడు. అక్కడికి వచ్చిన శ్రీరాముడు ఆయన పాదాలకు వినయంగా నమస్కరించి –

'స్వామీ! ఆ వచ్చింది దేవేంద్రుడేనా' అని అడిగాడు. దానికి శరభంగుడు–

**'అవును శ్రీరామా! నేనిక్కడ ఉండవలసిన సమయం ముగిసిపోయింది. ఇంక బ్రహ్మలోకానికి వెళ్ళాలి. నేను తపస్సుతో సంపాదించిన బ్రహ్మలోకానికి నన్ను తీసుకెళ్ళడంకోసం ఇంద్రుడే స్వయంగా వచ్చాడు. నువ్వు వస్తున్నావనీ,** నిన్ను చూశాక వస్తాననీ ఇంద్రునితో చెప్పాను. అందుకే ఇంద్రుడు వెళ్ళిపోయాడు.

మనోనిగ్రహంలేని వాళ్ళు ఆ లోకాలను పొందలేరు. నేను నా తపశ్శక్తితో బ్రహ్మదేవునికి సంబంధించిన పుణ్యలోకాలనూ, స్వర్గానికి సంబంధించిన పుణ్య లోకాలనూ జయించాను. వాటిని నీకు ఇస్తాను. స్వీకరించు.' అన్నాడు శరభంగుడు. దానికి శ్రీరాముడు–

'మహామునీ! ఆ పుణ్యలోకాలన్నీ నేనే తపస్సుద్వారా సంపాదించుకోగలను' అని సున్నితంగా తిరస్కరించి, 'ప్రస్తుతం ఉండడానికి ఏదైనా అనువైన ప్రదేశం ఉంటే చెప్పండి' అని వినయంగా అడిగాడు.

శరభంగుడు సుతీక్ష్ణమహర్షి దగ్గరికి వెళ్ళమని చెప్పి, తాను శరీరత్యాగం చేస్తున్నాను అంటూ అగ్నిలోనికి ప్రవేశించాడు. ఆశ్చర్యం! ముసలివాడైన శరభంగమహర్షి పడుచువాడై బయటికివచ్చి బ్రహ్మలోకానికి వెళ్ళిపోయాడు.

ఆ తరువాత అక్కడి మునులంతా శ్రీరాముని దగ్గర ఇలా విన్నవించుకొన్నారు.

'శ్రీరామా! మేము అన్నీ విడిచి పరమాత్మనే ధ్యానించే తపస్వులం. నువ్వా! ప్రసిద్ధునివి. నీకు నీ తండ్రిపై ఉన్నట్టే ధర్మంపై కూడా ఆసక్తి ఉందని మాకు తెలుసు. పంటలలో ఆరోవంతు పన్నుగా రాజును చేరుతుంది. అలాగే మా తపస్సులో నాలుగో వంతు కూడా రాజుకే చెందుతుంది. రాజు పట్టణాల్లోనే కాదు అడవుల్లోనూ అందరినీ రక్షించాలి. అందులో మాలాంటి సాధుజీవుల్ని మరీను. అలా రక్షించేంత వరకే రాజుకు గౌరవం, మన్నన. లేకపోతే లేదు.

పంపానది ఒడ్డునా మందాకినీ తీరంలోనూ రాక్షసబాధ అధికంగా ఉంది. మా మానాన మేం తపస్సు చేసుకొనే వీలు లేదు. చిత్రకూటంలోనైతే మరీనూ. నీదే భారం. రక్షించు.' అన్నారు. దానికి శ్రీరాముడు –

'మహర్షులారా! మీరు నన్ను ఆజ్ఞాపించాలి. అభ్యర్థించకూడదు. నేనేదో నా సొంత పని మీద తండ్రికి ఇచ్చిన మాటకోసం వచ్చాను. పనిలో పనిగా మీకు సేవ చేసే భాగ్యం దొరికింది. అది నా అదృష్టం. నా వనవాసానికి తగిన ఫలం. రాక్షసుల్ని చీల్చి చెండాడతాను. మీరు నిశ్చింతగా ఉండండి.' అని అభయమిచ్చి సుతీక్ష్ణుడి ఆశ్రమంవైపు కదిలాడు.

## సుతీక్ష్ణుడి ఆశ్రమం

సుతీక్ష్ణ మహర్షి శ్రీరాముణ్ణి ఆలింగనం చేసుకొని – 'శ్రీరామా! నీ కోసమే ఎదురు చూస్తున్నానయ్యా! ఎందుకు నీకీ కష్టాలు? నేను లేనూ?! నేను నా తపస్సుతో జయించిన లోకాలను నీకు ప్రసాదిస్తాను. అక్కడ హాయిగా విహరించు.' అన్నాడు. దానికి శ్రీరాముడు – 'మహర్షీ! నాకు అవేమీ వద్దుగానీ మాకు మంచి నివాసం సూచించండి చాలు.' అన్నాడు.

తన ఆశ్రమంలోనే ఉండమన్నాడు సుతీక్ష్ణ మహర్షి. దానికి శ్రీరాముడు అంగీకరించలేదు. అక్కడ మృగాలు ఉంటాయి. ఎంత వద్దనుకున్నా వాటిని ఎప్పుడో ఒకప్పుడు సంహరించక తప్పదు. అలా చంపడం ఆశ్రమ ధర్మాలకు విరుద్ధం. అందుకే మహర్షి అనుమతితో దండకారణ్యంలోని తక్కిన ఆశ్రమాలు చూడాలని బయలుదేరాడు శ్రీరాముడు. కొందరు మునులూ వెంట నడిచారు. నడక సాగుతోంది. దారిలో సీతాదేవి ఇలా అంది.

'శ్రీరామా! నీకు అన్ని ధర్మాలూ తెలుసు. అబద్ధం చెప్పవు. పరస్త్రీలపై ఆసక్తి ఏ కోశానా లేదు. ఎవరినీ చంపాలనుకోవు. శాంతమూర్తివి. అటువంటి వాడివి ఇప్పుడు రాక్షసుల్ని చంపుతానని ప్రతిజ్ఞ చేశావే!

విల్లూ బాణాలూ పట్టుకొని దండకారణ్యంలో తిరుగుతున్నావు. ఎండుకట్టెలు తగిలితే అగ్ని ఎలా ప్రజ్వరిల్లుతుందో ఆయుధం ధరిస్తే క్షత్రియుని తేజస్సూ పెరుగుతుంది. చేతిలో ఉన్న ఆయుధాన్ని ఉపయోగించాలనే కోరిక కలుగుతుంది.

వెనకటికి ఒక తపస్వి అయిన బ్రాహ్మణుడు ఉండేవాడు. అతడి తపస్సును భంగం చేయడానికి ఇంద్రుడు ఒక భటుడి వేషంలో అతడివద్దకు వచ్చి, తన ఖడ్గాన్ని న్యాసంగా (దాచిపెట్టమని) ఇచ్చి వెళ్ళాడు. ఆ బ్రాహ్మణుడు ఆ ఖడ్గాన్ని నిత్యం తనదగ్గరే ఉంచుకొని దానిని కాపాడుతూ అదే పనిలో పడి తపస్సుమీద ఏకాగ్రత కోల్పోయాడు. చివరికి హింసాపరుడిగా మారిపోయాడు. సాత్త్వికుడైన బ్రాహ్మణుణ్ణే ఆ ఆయుధం హింసాపరుణ్ణి చేసిందే?! మరి నువ్వేమో క్షత్రియునివి. ఆయుధం చేతిలో ఉంటే ఊరుకుంటావా ఏమిటి? అయినా ఇప్పుడు క్షత్రియునివి కావు. నువ్వు ఇక్కడ పాటించాల్సింది మునిధర్మమే కదా! ప్రస్తుతం మన పని ఆర్తుల్ని రక్షించడం వరకే. శిక్షించడం కాదు.

అకారణంగా రాక్షసుల్ని చంపడానికి నేను ఇష్టపడను. క్షాత్రమెక్కడ? ఈ తపస్సు ఎక్కడ? ఈ ప్రపంచమే ధర్మసారం. ధర్మం వల్లనే అన్నీ లభిస్తాయి. కాబట్టి బుద్ధిని కలుషితం చేసుకోకుండా తపోవనంలో పాటించవలసిన ధర్మాన్ని నువ్వు పాటించు. నీకు తెలియదని కాదుగానీ నాకు తోచింది చెప్పాను అంతే! నువ్వూ నీ తమ్ముడూ మీకెలా తోస్తే అలా చెయ్యండి.' అంది.

సీతాదేవి మాటలలోని ఆంతర్యం గ్రహించిన శ్రీరాముడు –

'సీతా! నువ్వు ధర్మజ్ఞురాలివి కాబట్టే చక్కగా చెప్పావు. కానీ సీతా! నువ్వే చెప్పావు కదా! ఆర్తుల్ని రక్షించడం కోసం క్షత్రియులు ఆయుధం పట్టాలని. నేనూ అదే కదా! చేస్తున్నది. ఎవరు కోరినా కోరకపోయినా నేను నా ధర్మం నెరవేరుస్తాను. ఋషులు నన్ను శరణుకోరారు. కాపాడటం నా ధర్మం.

సీతా! నిజం చెప్పాలంటే ఈ మహర్షులే తమ తపశ్శక్తితో రాక్షసులను సంహరించగలరు. అలా చేస్తే తపస్సు వ్యర్థం అవుతుంది. అందుకే ప్రాణాలు వదులుతున్నారు కానీ రాక్షసుల్ని శపించడం లేదు.

**అప్యహం జీవితం జహ్యాం త్వాం వా సీతే సలక్ష్మణామ్,**
**న తు ప్రతిజ్ఞాం సంశ్రుత్య బ్రాహ్మణేభ్యో విశేషతః. (3–10–19)**

చాలా సంతోషం సీతా! నా మీద ఉన్న స్నేహం వల్లనే ఇదంతా చెప్పావు. ఇష్టమైనవారికే కదా! హితబోధ చేస్తాం. **నువ్వు నా సహధర్మచారిణివి. నా**

**ప్రాణాలకన్నా ఎక్కువ. సీతా! నాకు అన్నింటికంటే ఇచ్చినమాటే విలువైనది. ఆడి తప్పను. నాకు సత్యమంటేనే ప్రీతి. సత్యం కోసం జీవితాన్నైనా, నిన్నైనా, లక్ష్మణుణ్ణయినా త్యజిస్తాను. అందులోనూ బ్రాహ్మణులకు ఇచ్చిన మాటను తప్పడమా? అసంభవం. మాట ఇచ్చినా ఇవ్వకపోయినా ఋషుల్ని కాపాడడం నా కర్తవ్యం.'** అన్నాడు.

ఆ మాటలకు సీతాదేవి ఆనందించింది. నడక సాగుతోంది. ముందు శ్రీరాముడు, శ్రీరాముడి అడుగు జాడల్లో సీతాదేవి, ఆ వెనుకే లక్ష్మణుడు. అడవులూ నదులూ సరోవరాలూ కొండలూ లోయలూ చెట్లూ తీగలూ పూలూ పళ్ళూ ఇలా చుట్టూ చూస్తూ నడుస్తున్నారు.

దూరంగా ఒక అందమైన సరస్సు. అక్కడ నుండి ఏదో సంగీతం విన వస్తోంది. 'అది మాండకర్ణి మహర్షి సృష్టించిన పంచ అప్సరస్సరస్సు. తన తపస్సును భంగం చేయడానికి వచ్చిన అప్సరసలకోసం ఈ తటాకాన్నీ దానిలోపల ఒక భవనాన్నీ నిర్మించి, తన తపశ్శక్తితో యౌవనం పొంది వాళ్ళతో క్రీడిస్తున్నాడు మాండకర్ణి. అక్కడిదే ఈ సంగీతం.' చెప్పాడు ముని బృందంలో ఉన్న ధర్మభృతుడు అనే ముని.

ఆ తరువాత సీతారామలక్ష్మణులు ఆశ్రమాలన్నీ సందర్శిస్తూ విశేషాలు తెలుసుకొంటూ వస్తున్నారు. కాలచక్రం గిర్రున తిరిగింది. పది సంవత్సరాలు ఇట్టే గడిచిపోయాయి. మళ్ళీ సుతీక్ష్ణుడి ఆశ్రమానికి వచ్చారు.

'శ్రీరామా! ఇక్కణ్ణుంచి నేరుగా నాలుగు యోజనాలు వెళ్తే పిప్పళ్ళవనం వస్తుంది. అది దాటితే పద్మ సరస్సు, దాని పక్కనే అగస్త్యభ్రాత ఆశ్రమం కనిపిస్తాయి. అక్కణ్ణుంచి దక్షిణంగా ఒక యోజనదూరం నడిస్తే అగస్త్యమహర్షి ఆశ్రమం వస్తుంది. వెళ్ళి ఆ మహానుభావుని దర్శనం చేసుకోండి. మీకు శుభం కలుగుతుంది.' అని వివరం చెప్పి మరీ పంపించాడు సుతీక్ష్ణుడు.

## జీర్ణం జీర్ణం వాతాపి జీర్ణం

అగస్త్యాశ్రమంవైపు వెళ్తూ దారిలో శ్రీరాముడు ఆ మహర్షి గొప్పతనం గురించి సీతాదేవికీ లక్ష్మణుడికీ విపులంగా చెప్తున్నాడు.

"పూర్వం వాతాపి, ఇల్వలుడు అనే ఇద్దరు రాక్షససోదరులు ఉండేవాళ్ళు. బ్రాహ్మణుల్ని సులభంగా చంపి తినడానికి ఒక కపటోపాయం ఉంది వాళ్ళదగ్గర. అదేమిటంటే – ఇల్వలుడు బ్రాహ్మణవేషంలో బ్రాహ్మణులను ఇంటికి భోజనానికి పిలుస్తాడు. అప్పుడు వాతాపి మేకగా మారతాడు. ఇల్వలుడు ఆ మేకనే చంపి, వండి, వచ్చిన వారికి వడ్డిస్తాడు. అతిథిగా వచ్చిన బ్రాహ్మణులు భోజనం పూర్తి చేసినతర్వాత, 'వాతాపీ! బయటకు రా!' అని ఇల్వలుడు పిలుస్తాడు. వాతాపి వాళ్ళ కడుపు చీల్చుకొని బయటకు వస్తాడు. అప్పుడు అలా మరణించిన బ్రాహ్మణులను ఈ ఇద్దరు రాక్షసులూ ఎంచక్కా ఆరగించేవాళ్ళు. ఇదీ వీళ్ళు చేస్తున్న దురాగతం.

ఎలాగైనా వాళ్ళ ఆటకట్టించాలి అనుకున్నాడు అగస్త్యమహర్షి. ఒకరోజు తానే అతిథిగా వెళ్ళాడు. అంతా మామూలుగానే ఆ రాక్షసుల పథకం ప్రకారం జరిగిపోయింది. అగస్త్యమహర్షి భోజనం చేశాక 'వాతాపీ! బయటకు రా!' అన్నాడు ఇల్వలుడు. "జీర్ణం జీర్ణం వాతాపి జీర్ణం" వాతాపి ఎప్పుడో జీర్ణమైపోయాడు. మేకతోపాటే యమ లోకానికి వెళ్ళాడు.' అన్నాడు అగస్త్యుడు. ఆ మాటలకు ఇల్వలుడు కొరకొరలాడి మహర్షిపైకి దూకి, మహర్షి కోపాగ్నికి బూడిదై పోయాడు.

అలా ఆ ఇద్దరు రాక్షసుల్నీ చంపిన ఘనుడు ఈ మహర్షి. ఇదుగో ఇప్పుడు మనం సమీపిస్తున్న ఆశ్రమం ఆ అగస్త్యులవారి తమ్ముడిది. అన్నాడు శ్రీరాముడు.

అది సంధ్యాసమయం. సంధ్యవార్చి అగస్త్యభ్రాత ఆశ్రమానికి వెళ్ళారు. ఆ రాత్రి అక్కడే విశ్రాంతి తీసుకొని, మరుసటి రోజు అగస్త్యభ్రాత చెప్పిన దారిలో నడకసాగిస్తున్నారు.

## అగస్త్యముని ఆశ్రమం

దారిలో పనస తోటలూ, తాటితోపులూ, బిల్వవృక్షారణ్యాలూ కనువిందు చేస్తున్నాయి. ఏనుగులు విరిచిన కొమ్మలూ, అటూ ఇటూ దూకుతున్న కోతులు, గుంపులు గుంపులుగా పక్షులు వాలిన చెట్లూ. ఓహ్! ఒకటేమిటి? ప్రకృతి మనసు దోచుకొంటోంది. లక్ష్మణుడితో శ్రీరాముడు అన్నాడు.

'తమ్ముడూ! ఇక్కడి చెట్లు చూశావా? ఎంత స్నిగ్ధంగా ఉన్నాయో! పక్షులుగానీ మృగాలు గానీ ఏ చప్పుడూ చేయడం లేదు. అదుగో! దూరంగా ఆరవేసిన నారచీరలు! అదే అగస్త్యాశ్రమం.

మహానుభావుడైన అగస్త్యుడు ఈ దక్షిణ దేశానికి వచ్చి, ఇక్కడ ఆశ్రమాన్ని ఏర్పాటు చేసుకోవడంతో రాక్షసులంతా భయపడి ఎటో పారిపోయారు. మహర్షులతో శత్రుత్వం విడిచిపెట్టేసి సాత్త్వికంగా బతుకు వెళ్ళబుచ్చుతున్నారు.

మరోసారేమైందో తెలుసా?! వింధ్యపర్వతం పైపైకి విజృంభించి సూర్యుణ్ణే అడ్డగించింది. ఆ పర్వతాన్ని అణిచి ఈ దక్షిణ దిక్కుకు వచ్చాడు అగస్త్యమహర్షి. ఇటువంటి పుణ్యాత్ముణ్ణి సేవించుకొని మనం మన వనవాస జీవితాన్ని చరితార్థం చేసుకుందాం.

అసత్యవాదులూ, క్రూరులూ, శఠులూ, కాముకులూ ఇలాంటి అవలక్షణాలు ఉన్నవాళ్ళెవరూ ఈ ఆశ్రమంలో కాలుపెట్టలేరు. దేవతలూ, సిద్ధులూ, గంధర్వులూ సైతం అగస్త్యమహర్షిని సేవించుకుంటూ ఉంటారు. ఇక్కడికి వచ్చిన వాళ్ళ కోరికలన్నీ తీరిపోతాయి. దివ్యత్వమూ, అధికారమూ, యక్షత్వమూ ఇలా ఒకటేమిటి? ఏది కోరుకుంటే అది లభిస్తుంది.” అగస్త్యమహర్షి ఆశ్రమం సమీపించగానే శ్రీరాముడు– ‘లక్ష్మణా! నువ్వు ముందు లోపలికి వెళ్ళి నేనూ సీతా వచ్చామని చెప్పు’ అన్నాడు.

లక్ష్మణుడా వార్త ఒక శిష్యుని ద్వారా అగస్త్యమహర్షికి విన్నవించాడు.

* * *

‘ఆహా! ఏమి నా భాగ్యం? ఎన్నాళ్ళనుంచో ఎదురుచూస్తున్నాను. వెళ్ళు. ఆ ముగ్గురినీ ఆహ్వానించు. సత్కరించు. ఏమిటి? ఇంకా లోపలికి రమ్మనలేదా? బయటే ఉన్నారా?’ కంగారుగా అడుగుతున్నాడు శిష్యుణ్ణి అగస్త్యమహర్షి. శిష్యుడు వాళ్ళని ఆహ్వానించాడు.

అగ్నితేజస్సుతో వెలిగిపోతూ సాక్షాత్తూ అగస్త్యుడే పర్ణశాలనుంచి బయటకు వచ్చాడు. శ్రీరాముడు మహర్షికి వినమ్రంగా నమస్కరించాడు.

అగస్త్యమహర్షి శ్రీరాముణ్ణి తన పక్కనే కూర్చోబెట్టుకొని, తినడానికి ఆహారం ఇచ్చి, ఆ తరువాత విశ్వకర్మ తయారుచేసిన వైష్ణవ ధనువును ప్రసాదించాడు. దానితోపాటే బ్రహ్మదత్తమైన ఒక బాణాన్నీ, ఇంద్రప్రసాదితమైన అక్షయతూణీరాన్నీ, ఒక ఖడ్గాన్నీ ఇస్తూ – ‘శ్రీరామా! ఈ అస్త్రశస్త్రాలన్నీ నీకే. స్వీకరించవయ్యా! రణరంగంలో రాక్షససంహారం గావించే విష్ణుమూర్తివై ప్రకాశించు. వజ్రాయుధాన్ని

ధరించిన ఇంద్రుడిలా నువ్వూ వీటిని ధరించు' అంటూ ఒక్కొక్కటీ శ్రీరామునికి అందించాడు.

'నాకు జరిగినదంతా తెలుసు. నువ్వు వనవాసం పూర్తిచేస్తావు. తిరిగి నీ రాజ్యం నువ్వు పొందుతావు. ఇక్కడే సప్తగోదావరీ తీరంలో పంచవటి అనే ప్రాంతం ఉంది. అది మీకు సౌకర్యవంతంగా ఉంటుంది. కొన్నాళ్ళు అక్కడ ఉండండి.' అని పంపించాడు.

సీతారామలక్ష్మణులు బయలుదేరి పంచవటి దగ్గరకు వస్తున్నారు. ఇంతలో పెద్ద గరుడపక్షి ఒకటి అటుగా వచ్చింది. దాని పేరు జటాయువు. వినతకు అరుణుడు (అనూరుడు), గరుడుడు అని ఇద్దరు పుత్రులు. అరుణునికి ఇద్దరు పుత్రులు. వారిలో ఒకడే ఈ జటాయువు. మరొకడు సంపాతి. జటాయువు దశరథునికి స్నేహితుడట. తనను తాను పరిచయం చేసుకొని –

'శ్రీరామా! ఈ వనవాసకాలంలో నీకు సహాయంగా ఉంటాను.' అన్నాడు. జటాయువు సౌహార్దానికి శ్రీరాముడు ఆనందించి అతణ్ణి ఆప్యాయంగా కౌగిలించుకొన్నాడు.

జటాయువు వెళ్ళిన తర్వాత పంచవటికి చేరుకున్నారు సీతారామలక్ష్మణులు. అక్కడ లక్ష్మణుడు అందమైన పర్ణశాల నిర్మించాడు. అందుకు శ్రీరాముడు ఈ ఆలింగనం తప్ప నీకేమి ఇవ్వగలనంటూ తమ్ముణ్ణి ప్రేమగా కౌగిలించుకున్నాడు.

సీతాలక్ష్మణులు సేవ చేస్తుంటే శ్రీరాముడు దేవేంద్రునిలా సుఖంగా ఉన్నాడు. రోజులు గడుస్తున్నాయి. ఋతువులు మారుతున్నాయి. శరదృతువు వెళ్ళిపోయింది. హేమంతం వచ్చింది. అదంటే శ్రీరామునికి చాలా ఇష్టం.

* * *

'ఎంత గొప్పదీ హేమంతం? లోకం మొత్తం మంచుతో బిరుసై పోయింది చూడు. ఈ కాలంలో నీళ్ళంటే చచ్చేంత భయం. అగ్నిదేవుడే అందరికీ దిక్కు. మధ్యాహ్నాలు బావుంటాయి. రాత్రిపొద్దు ఎక్కువ. అసలే గాలి చల్లగా ఉంటుంది. దానికి తోడు పడమటి గాలొకటి. విరగపండిన చేలల్లోని కంకులు ఖర్జూరపువ్వుల్లా బంగారురంగులో మెరుస్తుంటాయి' అంటూ హేమంతాన్ని వర్ణిస్తున్నాడు లక్ష్మణుడు.

'అయ్యో! భరతుడు ఈ చలిలో ఎలా ఉన్నాడో! అయోధ్యలో ఉంటూనే నారచీరలు ధరించి, నేలమీద పడుకుంటూ, కందమూల ఫలాలు తింటూ తపస్విలా జీవనం సాగిస్తున్నాడు.

ఇంత మంచి భరతుణ్ణి కొడుకుగానూ, అంత గొప్ప దశరథమహారాజును భర్తగానూ పొందిన కైకేయికి ఇంతటి దుర్మార్గం ఎక్కణ్ణుంచి వచ్చింది?' అంటూ మధ్యలో కైకేయి ప్రస్తావన తెచ్చాడు లక్ష్మణుడు. చర్చ కైకమీదికి మళ్ళడం ఇష్టంలేని శ్రీరాముడు – 'లక్ష్మణా! ఆ మహాతల్లిని మాత్రం నిందించకు.' అన్నాడు. ఇలా మాట్లాడుకుంటూ గోదావరి ఒడ్డుకు చేరుకొన్నారు.

## శూర్పణఖ ప్రవేశం

ఒకరోజు పర్ణశాలలో సీతారామలక్ష్మణులు కబుర్లు చెప్పుకొంటున్నారు. అంతలో వచ్చింది శూర్పణఖ. శ్రీరాముడి అందాన్ని చూసి అతడిపై మనసు పారేసుకుంది. చేరడేసి కళ్ళు, విశాలమైన వక్షఃస్థలం, ఆజానుబాహువులు. చూడగానే నచ్చేశాడు ఆమెకి. కామంతో – 'ఎవరు నువ్వు? ఎందుకొచ్చావు? ఇది రాక్షసులు తిరిగే ప్రదేశం. జటలు ధరించావు. మునిలాగా ఉన్నావు. కానీ విల్లూ బాణాలూ ఉన్నాయి. నిజం చెప్పు? ఎవరికోసం వచ్చావు?' అడిగింది.

శ్రీరాముడు అబద్ధం చెప్పడు కాబట్టి అప్పటిదాకా జరిగిన కథనంతా చెప్పి–

'ఇంతకీ నువ్వెవరో చెప్పావు కాదు. చూడడానికి మనోజ్ఞంగా ఉన్నావు. రాక్షసిలా లేవు. ఇక్కడికెందుకు వచ్చావో చెప్పు.' అన్నాడు.

శూర్పణఖ చెప్పడం మొదలుపెట్టింది.

'నేను శూర్పణఖ అనే రాక్షసిని. నాకు కామరూపవిద్యకూడా తెలుసు. ఈ అడవిలోనే ఒంటరిగా తిరుగుతూ ఉంటాను. లంకానగరానికి రాజు అయిన రావణుడు నాకు అన్న. రావణుడు విశ్రవసుని కొడుకులలో ఒకడు. విశ్రవసుని పుత్రులు – రావణుడు, కుంభకర్ణుడు, విభీషణుడు. వీళ్ళు నా సోదరులు. ఖర దూషణులు కూడా సోదరులే. చూసీ చూడడంతోనే నిన్ను నా భర్తగా భావించు కొన్నాను. ఈ సీతాదేవితో ఏమి సుఖపడతావు గానీ నాతో రా! ఈ దండకారణ్యంలో అందమైన పర్వతశిఖరాల మీద హాయిగా కులాసాగా విహరిద్దాం.' అంది.

శూర్పణఖ మాటలను శ్రీరాముడు పట్టించుకోలేదు. ఆమె కోరికను తిరస్కరించాడు. తరువాత లక్ష్మణుని వెంటపడింది శూర్పణఖ. కానీ లక్ష్మణుడూ ఆమెను తిరస్కరించాడు. రామలక్ష్మణులు తనను తిరస్కరించడానికి కారణం సీతేనని భావించిన శూర్పణఖ ఆమెని తినివేస్తానంటూ మీదికి వచ్చింది. అప్పుడు శ్రీరాముడు ఆమెకు అడ్డుపడి–

'లక్ష్మణా! చూశావా! క్రూరులైన చెడ్డవాళ్ళతో మాట్లాడకూడదు. పరిహాసం అసలే చేయకూడదు. కొంచెం ఉంటే దీని చేతిలో నా సీతాదేవి ప్రాణాలు కోల్పోయేదే! చూడు! ఎలా మదించి ఉందో ఈ రాక్షసి! దీన్ని వికృతంగా ఉండేటట్లు చెయ్యి.' అని శ్రీరాముడు ఆజ్ఞాపించాడు. వెంటనే లక్ష్మణుడు శూర్పణఖ ముక్కూ చెవులూ కోసిపారేశాడు. *

* * *

శూర్పణఖ భయంతో పారిపోయింది. భయంకరంగా అరుస్తూ నేరుగా జనస్థానం వెళ్ళి, సోదరుడు ఖరునిముందు నిలబడింది.

ఆమెను చూసి ఖరుడు చలించిపోయాడు. ఎవరిలా చేసిందని అడిగాడు. ఏడుస్తూ చెప్పింది శూర్పణఖ. అంత బాధలోనూ శ్రీరామలక్ష్మణుల అందాన్ని పొగుడుతూనే వారిగురించి చెప్పింది. తన గోడు అంతా వెళ్ళబోసుకొని చివరిగా– 'సోదరా! ఇప్పటిదాకా నిన్నేమీ అడగలేదు. ఆ ముగ్గురి రక్తం నాకు కావాలి.' అంది కోపంగా.

ఖరుడు వెంటనే పద్నాలుగు మంది రాక్షసుల్ని తోడుగా పంపి వాళ్ళను చంపిరమ్మన్నాడు. శూర్పణఖ వెళ్ళింది. శ్రీరాముడు ఆ రాక్షసులను సంహరించాడు.

శూర్పణఖ ఏడ్చి గగ్గోలు పెట్టింది. ఏడుస్తూనే మళ్ళీ ఖరదూషణుల దగ్గరికి తిరిగి వచ్చి ఇలా అంది.

'సోదరా! చూడు. నువ్వు పంపిన రాక్షసులు రాముని చేతిలో దారుణంగా చచ్చారు. అది నా కళ్ళారా చూసి నేను డీలా పడిపోయాను. నువ్వు ఆ రాముణ్ణి

* (ప్రతి పురుషుడూ ఏకపత్నీవ్రతుడుగా, ప్రతీ స్త్రీ పతివ్రతగా ఉండాలంటే కాముకులను కట్టడి చేయాలి. కామానికి వశపడ్డవారిలో యుక్తాయుక్త వివేకం నశిస్తుంది. అందుకే శూర్పణఖ ముక్కూ చెవులు కోయటం జరిగింది)

చంపుతావా లేదా? నీ వల్ల కాకపోతే తక్షణం ఇక్కణ్ణుంచి చేతకానివానిలా వెళ్ళిపో.' అంటూ బోరున ఏడ్చేసింది. అప్పుడు ఖరుడు కలుగజేసుకొని –

'శూర్పణఖా! బాధపడకు. భయపడకు. ఆ రామలక్ష్మణుల్ని యమలోకానికి పంపిస్తాను కదా!' అంటూ వెంటనే దూషణుణ్ణీ ఇంకా పద్నాలుగు వేలమంది రాక్షసుల్నీ తీసుకొని వెళ్ళాడు.

ఖరుణ్ణి చూసిన శ్రీరాముడు సీతాదేవినీ లక్ష్మణుణ్ణీ గుహలోనికి పంపి – దక్షయజ్ఞాన్ని ధ్వంసం చేసే రుద్రునిలా రాక్షస సైన్యంపై చెలరేగిపోయాడు.

ఆ ఘోర యుద్ధంలో రామబాణాల ధాటికి రాక్షసులు రాలిపోయారు. శ్రీరాముని చేతిలోని ధనుస్సు ఎక్కుపెట్టిన బాణాలతో ఎప్పుడూ మండలాకారంలోనే ఉంటోంది. ఏ బాణం ఎట్నుంచి ఏ రాక్షసుణ్ణి చీలుస్తోందో తెలియడం లేదు. ఒకటే హాహాకారాలు. రాక్షసకళేబరాలు. విరిగిన రథాలూ, చచ్చిపడిన ఏనుగులూ గుర్రాలతో రణభూమి నిండిపోయింది.

పట్టరాని కోపంతో దూషణుడు – ఒక పర్వతాన్ని పెకలించి శ్రీరాముని మీదకు దూకాడు. శ్రీరాముడు ఒకేసారి రెండు బాణాలు వేసి వాడి చేతులు నరికేశాడు. చేతుల్లోంచి పర్వతం జారి పోయింది. వాడు కుప్పకూలిపోయాడు. వెంటనే మరో మూడు బాణాలతో త్రిశిరుని మూడు తలలూ తెగనరికి, ఐంద్రాస్త్రాన్ని ప్రయోగించి ఖరుణ్ణీ వధించాడు. ఆకాశం నుంచి పుష్పవృష్టి కురిసింది.

అప్పుడు దేవతలూ, ఋషులూ శ్రీరాముణ్ణి ఇలా ప్రశంసించారు.

'శ్రీరామా! ఇంద్రుడు శరభంగాశ్రమానికి వచ్చింది ఇందుకే. ఋషులంతా ఉపాయంగా నిన్ను ఇక్కడికి రప్పించారు. నువ్వు ఈ రాక్షసుల్ని సంహరించావు. ఇక ఈ దండకారణ్యంలో మునులు యథేచ్ఛగా సంచరించవచ్చు.' అన్నారు.

మునుల జయజయ ధ్వానాలు వినబడుతూ ఉంటే సీతాదేవీ, లక్ష్మణుడూ గుహనుంచి బయటకు వచ్చారు. వారి ముఖాల్లోనూ ఆనందం వెల్లివిరిసింది.

## రావణుని దురాలోచన

ఖరాసురుని సైన్యంలో అకంపనుడు అనే ఒక రాక్షసుడు ఉన్నాడు. వాడు ఎలాగో తప్పించుకొని లంకకు వెళ్ళాడు. జరిగినదంతా రావణునికి పూస గుచ్చినట్లు

చెప్పాడు. అంతేకాదు; సీతాదేవిని అపహరిస్తే రామునికి తగిన శాస్తి చేసినట్లు అవుతుందని రావణునికి హితబోధ గావించాడు.

రావణునిపై ఆ మాటలు బాగా పనిచేశాయి. వెంటనే గుట్టుచప్పుడు కాకుండా మొత్తం చక్కబెట్టుకు వస్తాను అంటూ ఒక్క సారథిని మాత్రమే తీసుకొని బయలుదేరాడు రావణుడు. నేరుగా మారీచుని దగ్గరకు వెళ్ళి తన ఆలోచన చెప్పి అతని సహాయం కోరాడు. ఆ మాటలు విన్న మారీచుడు హతాశుడై ఇలా అన్నాడు.

'ప్రభూ! నిన్ను నాశనం చెయ్యాలని నీ శత్రువులెవరో ఇలా పన్నాగం పన్నుతున్నారు. శ్రీరాముడంటే ఎవరనుకున్నావు? అతడు ఒక మహాసింహం.' అంటూ శ్రీరాముని గొప్పతనాన్ని విపులంగా చెప్పి, బుద్ధిగా లంకకు వెళ్ళిపొమ్మని హితవు పలికాడు మారీచుడు. రావణుడు ఏమీ మాట్లాడకుండా లంకాపట్టణానికి తిరిగి వెళ్ళిపోయాడు.

తరువాత అవమానభారంతో శూర్పణఖ లంకానగరానికి బయలుదేరింది.

లంకానగరంలో బంగారు సింహాసనంపై రావణుడు అగ్నిలా ప్రజ్వరిల్లుతూ దేవేంద్రునిలా వెలిగిపోతున్నాడు. ఆ సమయంలో హాహాకారాలతో హఠాత్తుగా ఊడిపడింది శూర్పణఖ.

ఐరావతం కోరల తాకిడికి కాయలు కాసింది రావణుడి వక్షఃస్థలం. ఇరవై చేతులతో, పది శిరస్సులతో, మెరుస్తున్న కుండలాలతో మహాక్రూరంగా ఉన్నాడు రావణుడు. అటువంటి అన్నగారిని నిండు సభలో అందరిముందూ ఇలా నిలదీసింది శూర్పణఖ.

***'రావణా! ధనాశాపరుడూ భోగలాలసుడూ అయిన రాజును ప్రజలు క్షమించరు. వల్లకాటిలోని నిప్పులా వదిలి వెళ్ళిపోతారు. ప్రజల బాగోగులు పట్టించుకోవాలి. గూఢచారులద్వారా అన్ని సమాచారాలూ తెలుసుకోవాలి. లేకపోతే ఆ రాజు ఎక్కువకాలం మనలేడు.***

నువ్వు అందరితో శత్రుత్వం కొనితెచ్చుకున్నావు. రాముడు అంతమంది రాక్షసుల్ని జనస్థానంలో ఊచకోత కోస్తే నేను చెప్తేగానీ నీకు తెలియలేదు. నువ్వేం రాజువు? నీదేం మంత్రాంగం?

నీ చుట్టూ చెడ్డమంత్రులు చేరారు. అన్ని దుర్గుణాలూ నీలో మూర్తీభవించాయి. ఫలితంగా త్వరలో నీ రాజ్యం నీ చేజారిపోతుంది.'

రావణునికి చెప్పలేనంత కోపం వచ్చింది. ఇలా అన్నాడు.

'ఎవడా శ్రీరాముడు? ఎలా ఉంటాడు? వాడి పరాక్రమం ఏపాటిది? వాడి ఆయుధం ఏమిటి?' ఇలా ప్రశ్నలు గుప్పించాడు. శూర్పణఖ శ్రీరామలక్ష్మణుల అందాన్ని వర్ణిస్తూ -

'లంకేశ్వరుడా! ఆ శ్రీరాముడు పొడవైన బాహువులూ, విశాలమైన కళ్ళూ కలవాడు. నారచీరలు ధరించినా అచ్చం మన్మథుడంటే నమ్ము. దశరథకుమారుడు. ఎప్పుడు బాణం తీశాడో ఎప్పుడు వేశాడో ఏమో! ఇంద్రుడు కురిపించిన శిలావర్షానికి నేలకూలిన మొక్కల్లా మన సైన్యం నేలకొరిగింది.

అవి బాణాలా? కావు. విషసర్పాలు. ఒకళ్ళా ఇద్దరా?! అంతమంది మహామహా రాక్షసయోధుల్ని ఒకేఒక్కడు ఒంటరిగా ఒంటిచేత్తో ఒక దెబ్బతో కూల్చి పారేశాడు. ఖరదూషణులతో సహా అందర్నీ. అందర్నీ అర్ధాధిక ముహూర్తంలో (అరనిముషం కంటే కొంచెం ఎక్కువ సమయంలో) నేలకూల్చి ఋషులకు అభయం ఇచ్చాడు. నన్ను ఒక్కదాన్నీ మాత్రం విడిచిపెట్టేశాడు. ఆడదాన్ననుకున్నాడో ఏమో! అతనికో తమ్ముడున్నాడు. లక్ష్మణుడు అతని పేరు. అతడూ మహాతేజస్వి. శ్రీరామునితో సాటి రాగల పరాక్రమం కలవాడు. చాలా తెలివైనవాడు. శ్రీరాముడికి కుడి భుజం. అంతేకాదు బహిఃప్రాణం. విదేహరాజు కూతురు సీతాదేవి శ్రీరాముడి భార్య. దేవ గంధర్వ యక్ష కిన్నర స్త్రీలెవ్వరూ ఆమెకు సాటిరారు. భూలోకంలో అటువంటి స్త్రీని నేను ఎరుగను.

ఆ సీతాదేవిని భార్యగా పొందినవానిముందు దేవేంద్రుడైనా తీసికట్టు. నీకు సరైన జోడీ ఆ సీతే. ఆమెను తెచ్చి నీకు భార్యను చేద్దామనుకున్నాను. ఆమెను చూస్తేనే నీకు మన్మథతాపం కలుగుతుంది. నీకు సీతాదేవిపై అలాంటి అభిప్రాయం కలిగితే వెంటనే కుడికాలు కదుపు. నీకు జయం అవుతుంది. ముందు రామలక్ష్మణుల్ని చంపు. వాళ్ళని చంపితే సీతాదేవి అనాథ అవుతుంది. అప్పుడు నువ్వు యథేచ్ఛగా ఆమెను అనుభవించు.' అని రావణుణ్ణి రెచ్చగొట్టింది.

## మారీచుడి హితవు

శూర్పణఖ మాటలకు పులకించిపోయాడు రావణుడు. సభ చాలించి, రథం ఎక్కి, ఆకాశమార్గం పట్టాడు. సముద్రం దాటి, మారీచుని ఆశ్రమంలో దిగాడు. సీతాదేవిని అపహరించడానికి ఏమేం చెయ్యాలో ఎలా చెయ్యాలో అంతా వివరంగా మారీచునికి చెప్పాడు.

విశ్వామిత్రముని యాగానికి ఆటంకం కలిగించిన రాక్షసుల్లో ఈ మారీచుడూ ఉన్నాడు. అప్పుడు రామబాణం తగిలి వంద యోజనాలు ఎగిరి సముద్రంలో పడ్డాడు మారీచుడు. అప్పటినుండీ ఇదుగో ఇలా తపస్సు చేసుకొంటూ గడుపుతున్నాడు. మారీచుడికి శ్రీరాముని గురించి పూర్తిగా తెలుసు. అందుకే సీతాదేవిని అపహరించడం మంచిది కాదంటూ ఇలా చెప్తున్నాడు.

“నేనూ మరికొందరు రాక్షసులం కలిసి దండకారణ్యంలో ఋషుల రక్తమాంసాలు మరిగి తిరుగుతున్నాం. ఎందరినో భక్షించాం. సీతారాముల్ని చూసి వాళ్ళని తరుముతూ వెంటపడ్డాం. అది చూసిన శ్రీరాముడు కోపంతో ఒకే సారి మూడు బాణాలు వేశాడు. దానితో నా స్నేహితులు చనిపోయారు. నేనెలాగో తప్పించుకున్నాను. అప్పటినుంచి రాముడంటే నాకు చచ్చేంత భయం. నాకు వణుకు పుట్టుకొస్తోంది. ఎక్కడ చూసినా శ్రీరాముడే. అడవంతా రామమయంగా కన్పిస్తోంది. రాక్షసేశ్వరా! రకారంతో మొదలయ్యే పదాలు కూడా నన్ను భయపెడుతున్నాయంటే నమ్ము. రాజా! నా మనవి ఆలకించు. విభీషణాదులతో చర్చించు. నీ పాలనలో లంకారాజ్యం వైభవోపేతంగా ఉంది. నీ ఆశ్రయంలో రాక్షసులూ సుఖంగా కాలం వెళ్ళబుచ్చుతున్నారు. చెప్పుడు మాటలు నీమీద బాగా పనిచేస్తున్నట్లున్నాయి. అలాంటి ఆలోచనలు మానుకో.

**సులభాః పురుషా రాజన్! సతతం ప్రియవాదినః,**
**అప్రియస్య చ పథ్యస్య వక్తా శ్రోతా చ దుర్లభః. (3-37-2)**

***ఇచ్చకాలు చెప్పే వాళ్ళు ఈ లోకంలో చాలామందే దొరుకుతారు. అప్రియమైనప్పటికీ హితం కలిగించే మాటను చెప్పేవాడుగానీ వినేవాడుగానీ ఒక పట్టాన దొరకరు. కాబట్టి నేను చెప్పేది విను.***

శ్రీరాముడు మహావీరుడు. నువ్వు అతణ్ణి ఓడించలేవు. నీది చపలబుద్ధి. శ్రీరామునికి కోపం గనక వస్తే ఈ లోకంలో రాక్షసులే లేకుండా చేస్తాడు. నీవల్లనే లంకానగరం సర్వనాశనం అవుతుంది. నీలాంటి **కాముకుడూ, దుర్వర్తనుడూ, దుర్మార్గుడూ రాజుగా ఉన్న రాజ్యమూ సర్వనాశనమే** అవుతుంది. నీ మరణం కూడా సీతాదేవి కారణంగా సంభవిస్తుంది. అసలు సీతాదేవి నీ చావుకోసమే పుట్టిందేమో! శ్రీరాముడంటే ఏమిటో చెప్తాను విను.

**రామో విగ్రహవాన్ ధర్మః సాధుః సత్యపరాక్రమః,**
**రాజా సర్వస్య లోకస్య దేవానామివ వాసవః. (3-37-13)**

**శ్రీరాముడు ధర్మాత్ముడు. మూర్తీభవించిన ధర్మం. సాధువు. సత్యపరా క్రముడు. దేవతలకు ఇంద్రుడెలాగో ఈ లోకాలన్నింటికీ శ్రీరాముడు** అలాగే. రాజు అతడే. అటువంటి శ్రీరాముని పరాక్రమం అనే రక్షణకవచంలో ఉన్న సీతాదేవిని ఎలా అపహరించాలనుకొంటున్నావు రావణా! సూర్యకాంతిని ఆపగలవా? చాపమే ఇంధనంగా, బాణాలే మంటలుగా ప్రజ్వరిల్లే శ్రీరాముడు అగ్నిసమానుడు. ఆ అగ్నిలోకి ప్రవేశించకు. ఇక సీతాదేవి తేజస్సంటావా? అది అప్రమేయం. శ్రీరామచాపాన్ని ఆశ్రయించుకొని ఉంటుంది. నువ్వు అపహరించలేవు. ఎందుకంటే సీతాదేవి ఒక మండుతున్న అగ్నిశిఖ. శ్రీరామునికి సీతాదేవి ప్రాణాలకన్నా ఎక్కువ. కాబట్టి వద్దు. శ్రీరామునితో యుద్ధం నీకు మంచిది కాదు. ఒకప్పుడు నీలాగే నేనుకూడా వెయ్యి ఏనుగుల బలంతో విర్రవీగాను. శ్రీరాముని శక్తి ఏమిటో విశ్వామిత్రముని యాగ సంరక్షణ సమయంలో చవి చూశాను. సీతాదేవికోసం అర్రులుసాచి లంకకు చేటు తెచ్చుకోకు. నిన్ను ఆశ్రయించుకొని ఉన్న రాక్షసులు సైతం నీవల్ల నాశనం అవుతారు. నా మాట విను. వినకపోతే నీకూ నాకూ ఏ సంబంధమూ లేదు. ***ఈ లోకంలో దుర్మార్గులు చేసే చెడ్డపనులకు వాళ్ళతో సంబంధం ఉన్న కారణంగా మంచివాళ్ళు కూడా బలైపోతుంటారు.***

*రావణా! నువ్వు విజేతలలో శ్రేష్ఠునివి. రాజు మంచివాడైతే మంత్రులూ మంచి వాళ్ళుగా ఉంటూ మంచిపనులు చేస్తూ మంచి పేరు తెచ్చుకుంటారు. రాజు చెడ్డవాడైతే అందరికీ కష్టాలు తప్పవు. రాజు నిరంకుశుడైతే అతడికే నష్టం.* ***ప్రజాసహకారం లేకుండా రాజు పరిపాలన సాగించలేడు.*** *అందువల్ల శ్రేయోభిలాషులు రాజు ధర్మాన్ని అతిక్రమించకుండా చూడాలి. అందుకే చెప్తున్నాను. నా*

మాట విను.” ఇలా ఎంతగానో చెప్పిచూశాడు మారీచుడు. రావణుడు వింటేనా? పైగా కోపంగా –

‘రాజుగా ఆజ్ఞాపిస్తున్నాను. నేను చెప్పినట్లు చేస్తే నువ్వు రాముని చేతిలో చావవచ్చు. అదృష్టం బావుంటే బతకనూ వచ్చు. కానీ చెయ్యకపోతే మాత్రం నా చేతుల్లో కచ్చితంగా ఇప్పుడే చస్తావు.’ అన్నాడు.

## బంగారు లేడి

మారీచుడు గత్యంతరం లేక ఒప్పుకొని అందమైన బంగారు లేడిలాగా మారాడు. ఆ లేడి చెవులు ఇంద్రనీలమణుల్లా, గిట్టలు వైడూర్యాల్లా ఉన్నాయి. పొట్ట వజ్రంలా మెరిసిపోతోంది. దాని తోక ఇంద్రుడి ధనుస్సులా ఉంది. అదే మాయ లేడి. సీతారాముల ఆశ్రమం వైపు వచ్చింది.

పూలు కోసేందుకు చెట్లవైపు వెళ్ళిన సీతాదేవి కంట్లో పడింది మాయ లేడి. కావాలనే పడింది. దానిని చూసి ముగ్ధురాలయ్యింది సీతాదేవి. శ్రీరామునికీ ఆశ్చర్యం వేసింది. సీతాదేవి దాన్ని తెచ్చిపెట్టమని శ్రీరాముణ్ణి కోరింది.

‘ఏమిటీ లేడి? ఇలాంటిది ఎక్కడైనా ఉంటుందా? ఇది నిజంగా రాక్షసమాయే! ఆ మారీచుడే అయి ఉంటాడు.’ అన్నాడు లక్ష్మణుడు. అప్పుడు శ్రీరాముడు–

‘లక్ష్మణా! వాడు నిజంగా రాక్షసుడే అయినా వాణ్ణీ సంహరించాలి కదా! అందుకే నేను వెళ్తున్నాను. సీత జాగ్రత్త.’ అని చెప్పి, ఖడ్గాన్ని నడుముకు కట్టుకొని విల్లూ బాణాలూ తీసుకొని బయలుదేరాడు.

ఆ లేడి చెంగు చెంగున దూకుతోంది. అందినట్లే ఉంటోంది. అందకుండా పోతోంది. ఆశ్రమం నుంచి చాలా దూరం వెళ్ళింది. దాని వెనుక రాముడూ వెళ్ళాడు. కొంతసేపటికి అలసిపోయి, చెట్టుకింద కూర్చున్నాడు.

మళ్ళీ కన్పించింది లేడి. శ్రీరాముడు బాణం వదిలాడు. ఆ బాణం లేడిని చీల్చిపారేసింది. ఆ దెబ్బకి రాక్షసుడు తాటిచెట్టంత ఎత్తు ఎగిరిపడ్డాడు.

**రాక్షసులకు ప్రాణాలు పోయేముందు అసలు రూపం వస్తుందట. ‘హా! సీతా! హా! లక్ష్మణా!’ అని అచ్చం శ్రీరాముని గొంతు ననుకరిస్తూ అరిచాడు. ఇదంతా రావణుడి పన్నాగంలో భాగమే.**

ఆ ఆర్తనాదం విన్న సీతాదేవి శ్రీరామునికి కీడు శంకించింది. భర్తకు ఏదో అయ్యిందని చాలా కంగారు పడింది.

'లక్ష్మణా! నీ అన్న గొంతే అది. రాక్షసులకు దొరికినట్లున్నాడు. నీ సహాయం అవసరం. వెళ్ళు వెళ్ళు. వెంటనే వెళ్ళు.' అని తొందర పెట్టింది. బొటబొటా కన్నీరు కార్చేసింది.

లక్ష్మణుడు ప్రశాంతంగా ఉన్నాడు. అంతే ప్రశాంతంగా అన్నాడు.

'అమ్మా! శ్రీరామునికేం కాదు. అతణ్ణి ఎవరూ ఏమీ చెయ్యలేరు. శ్రీరాముడు అజేయుడు. నువ్వు ఇలా మాట్లాడకూడదు. నిన్ను ఒంటరిగా విడిచిపెట్టి వెళ్ళడం నాకు సుతరామూ ఇష్టంలేదు. శ్రీరాముని పరాక్రమం అంటే ఏమిటను కుంటున్నావు? ముల్లోకాలూ దండెత్తి వచ్చినా జయించగల సత్తా అతనికి ఉంది. నువ్వేమీ కంగారు పడకు. అది శ్రీరాముని కంఠం కాదు. రాక్షసమాయ.

మనం ఈ అడవుల్లో ఎందరో రాక్షసుల్ని చంపాం కదా! వాళ్ళు పగతో ఉన్నారు. ఇదంతా రాక్షసుల మాయే. నువ్వు కంగారుపడకు. నిశ్చింతగా ఉండు. నిన్ను వదిలి వెళ్ళవద్దన్న అన్నగారి ఆజ్ఞను నేను జవదాటలేను. నా వల్లకాదు.'

ఆ మాటలకు సీతాదేవికి కోపం ఇంకా పెరిగింది. బాధతో కఠినాతికఠినంగా మాట్లాడింది. వెంటనే వెళ్లమని ఆజ్ఞాపించింది. లక్ష్మణుడు మౌనం వహించాడు. చేతులు జోడించి అన్నాడు.

'అమ్మా! నువ్వు నాకు దైవంతో సమానం. సరే! నీ ఆజ్ఞను పాటిస్తూ వెళ్తున్నాను. ఇప్పుడు జరిగినదానికి ఈ వనదేవతలే సాక్షులు. అంతేకాదు, నేను మళ్ళీ వచ్చేదాకా కూడా ఈ వనదేవతలే నీకు శ్రీరామరక్ష.'

సీతాదేవికి ఏడుపు ముంచుకొచ్చి బోరున ఏడ్చేసింది.

'లక్ష్మణా! శ్రీరాముడు లేకపోతే నేను గోదావరిలో దూకుతాను. ఉరి పోసుకుంటాను. ఇంత విషమైనా మింగుతాను. లేదా అగ్నిలో దూకేస్తాను' అంటూ ఏడుస్తోంది సీతాదేవి.

సీతాదేవిని చూస్తుంటే లక్ష్మణుని గుండె తరుక్కుపోయింది. ఓదార్చే ప్రయత్నం చేశాడు కానీ ఫలితం లేదు. అందుకే సీతాదేవికి నమస్కరించి లక్ష్మణుడు– శ్రీరాముడు వెళ్ళిన వైపు కదిలాడు.

## వైదేహీహరణం

లక్ష్మణుడు అలా వెళ్ళాడో లేదో రావణుడు సన్యాసివేషంలో వచ్చాడు. కాషాయవస్త్రాలు, పిలక, గొడుగు, పావుకోళ్ళు, దండకమండలువులు ధరించి వచ్చాడు. సూర్యచంద్రులు లేని సంధ్యాదేవిని సమీపిస్తున్నట్లుగా శ్రీరామలక్ష్మణులు లేని సీతాదేవిని సమీపించాడు.

సీతాదేవి చంద్రుడులేని రోహిణిలా ఉంది. ఆమె శోకానికి ప్రకృతి మూగపోయిందా అన్నట్లు వేగంగా ప్రవహించే గోదావరిసైతం బిక్కచచ్చిపోయి చప్పుడు లేకుండా ప్రవహిస్తోంది. చెట్లు బిగుసుకుపోయాయి. ఆకులు అల్లల్లాడటం మానేశాయి. కొమ్మలూ కదలడం లేదు. గాలి స్తంభించింది. సీతాదేవిని సమీపించిన రావణుడు ఆమె సౌందర్యాన్ని రెప్పవేయకుండా చూస్తూనే ఉన్నాడు. అతనిలో కోరిక రెట్టింపయ్యింది. సీతాదేవి కంటికీ మంటికీ ఏకధారగా విలపిస్తోంది. వేదాలు వల్లెవేస్తూ సీతాదేవిచెంతకు వచ్చి –

'ఎవరు నువ్వు? ఎందుకీ అడవిలో ఒంటరిగా ఉన్నావు. ఏమి అందం నీది! ఇంత అందం దేవస్త్రీలకుగానీ, యక్షకిన్నరవనితలకుగానీ లేదు. ఎవరు నువ్వు? పార్వతివా? లక్ష్మీదేవివా? అప్సరసవా? రతీదేవివా?' అన్నాడు రావణుడు.

సీతాదేవి అతణ్ణి చూసి – చూడడానికి బ్రాహ్మణునిలాగే ఉన్నాడని గౌరవించింది. అతిథి సత్కారాలు చేసింది. తన గురించీ శ్రీరాముని గురించీ చెప్పి, ఇంతకీ నువ్వెవరని అడిగింది.

రావణుడు – 'నన్ను రావణుడు అంటారు. రాక్షసాధిపుణ్ణి. నాది లంకా నగరం. అది సముద్రం మధ్యలో ఎత్తయిన పర్వతమధ్యంలో ఉంటుంది. నీ అందం నన్ను ఆకర్షించింది. నువ్వు ఊఁ అన్నావంటే నిన్ను నా రాణిని చేసుకొంటాను. బంగారు కాంతులీనే నీ సౌందర్యం చూశాక నా భాగ్యం పట్ల నాకు ఇచ్ఛపోయిందంటే నమ్ము. నేను అపహరించి తెచ్చిన స్త్రీలు ఎంతోమంది నా దగ్గర ఉన్నారు.

వారందరిలోనూ నిన్నే అగ్రమహిషిని చేస్తా. సీతా! నీకు ఉత్తముడైన భర్త కావాలంటే నా దగ్గరకు రా! నన్ను ఆశ్రయించు.' అంటూ సన్యాసి రూపం వదిలి రాక్షసరూపం లోనికి వచ్చి, తాను అంతటివాణ్ణనీ ఇంతటివాణ్ణనీ తెగ పొగుడుకొంటూ ఏవేవో పేలుతున్నాడు రావణుడు.

పరస్త్రీతో అలా కారుకూతలు కూస్తున్న రావణుడి మాటలు విన్న సీతాదేవి కోపంతో – 'ఓ రావణా! నువ్విలా మాట్లాడుతున్నావంటే నీకు మూడినట్లే లెక్క. మందభాగ్యుడా! కాల సర్పం నోట్లోంచి కోరను బయటకు తియ్యాలనుకొంటున్నావు. మందర పర్వతాన్ని పైకి ఎత్తాలని ఉబలాటపడుతున్నావు. కాలకూట విషం తాగి సుఖంగా తిరిగి వెళ్దామనేనా? సూదితో కన్నులు తుడుచుకుంటున్నావు. చురకత్తిని నాలుకతో చప్పరిస్తున్నావు. బండరాయిని కట్టుకొని సముద్రంలో ఈదాలను కొంటున్నావు. సూర్యచంద్రుల్ని చేతుల్లోకి తీసుకోవాలనీ, నిప్పును మూటగా కట్టాలనీ ప్రయత్నిస్తున్నావు.' అంది.

'నీకూ శ్రీరామునికీ పోలికా? మీ ఇద్దరికీ నక్కకూ సింహానికీ, పిల్లికీ ఏనుగుకీ, కాకికీ గరుత్మంతునికీ ఉన్నంత తేడా ఉంది. అంతేకాదు; నువ్వు నక్కవి. నేను సివంగిని. నువ్వు నన్ను కనీసం తాకను కూడా తాకలేవు. నాది సూర్యతేజస్సు. ఆకలిమీద ఉన్న సింహాన్ని కదిలిస్తున్నావు. విషసర్పం కోరల్ని పట్టుకొంటున్నావు. జాగ్రత్త!'

సీతాదేవి తీవ్రంగా నిందిస్తూ గాలికి ఊగులాడే అరటి చెట్టులా కంపించి పోతోంది. ఆ మాటలకు రావణుడు ముఖం చిట్లించి శరీరం పెంచి పదితలలతో నిలబడ్డాడు. హఠాత్తుగా ఆమెను పట్టుకొని రథం ఎక్కాడు. రథం రివ్వున ఎగిరింది. ఆడపాములాగా మెలికలు తిరిగిపోతూ పెనుగులాడుతోంది సీతాదేవి. ఆమె ఆర్తనాదంతో అడవంతా మార్మోగిపోయింది.

'ఈ రాక్షసుడికి కాలం చెల్లింది. అందుకే ఇంత దారుణానికి ఒడిగట్టి ప్రాణాలమీదికి తెచ్చుకున్నాడు. అయ్యో! కైకేయికీ ఆమె బంధువులకూ ఇప్పుడు కళ్ళు చల్లబడతాయి. వాళ్ళ కోరిక తీరుతుంది కాబోలు!

ఓ వృక్షాల్లారా! మాల్యవత్పర్వతమా! ప్రస్రవణాద్రీ! ఈ దారుణాన్ని శ్రీరామునికి చెప్పండి. ఓ గోదావరీ! వనదేవతలారా! మృగాల్లారా! పక్షులారా! అందరికీ ఇదే

నా అభ్యర్థన. నా గోడు ఆలకించండి. ఈ సంగతి శ్రీరామునికి విన్నవించండి. ఎలాగైనా సరే ఈ వార్త నా శ్రీరామునికి చేరితే చాలు. అతడు మహావీరుడు. మహాబలవంతుడు. సాక్షాత్తూ వైవస్వతుడే నన్ను అపహరించినా, స్వర్గంలో దాచినా తన పరాక్రమంతో నా భర్త నన్ను తీసుకురాగలడు. శ్రీరామా! లక్ష్మణా! రక్షించండి. రక్షించండి!

***పాపాత్ముడు చేసే చెడ్డపనులకు ఫలితం వెంటనే కనిపించదు. విత్తు నాటిన వెంటనే పంట చేతికి అందదు కదా. దేనికైనా కొంత సమయం కావాలి.'*** అనుకుంటూ ఈ సంగతి శ్రీరామునికి చెప్పమని చెట్టుకీ పుట్టకీ రాయికీ రప్పకీ చెప్పుకుంది.

## జటాయుమరణం

రథం మీద వెళ్తూ చెట్టుమీద జటాయువును చూసింది సీతాదేవి. జటాయువు నిద్రపోతున్నాడు. అయ్యో! నిద్రపోతున్నాడే. ఏం చెయ్యను? ఎలా లేపను. అరుస్తూ పిలిచింది.

చివరికి జటాయువు నిద్రలేచాడు. దీనాతిదీనంగా విలపిస్తున్న సీతాదేవి ఆర్తనాదం జటాయువు చెవిలో పడి దిగ్గున లేచాడు. చుట్టూ కలియచూశాడు. ఎదురుగా సీతాదేవిని అపహరిస్తున్న రావణుడు కనిపించాడు. ఒక్క ఉదుటున ఎగిరి – **'ఓ దశగ్రీవా! నేను సనాతన ధర్మ పరాయణుణ్ణి. సత్యసంధుణ్ణి. మహా బలవంతుణ్ణి. గృధ్రరాజును. నన్ను జటాయువు అంటారు. శ్రీరాముడు సర్వలోకాలకూ ప్రభువు. దశరథుని కుమారుడు. మహేంద్రునితో, వరుణాది దిక్పాలకులతో సమానమైనవాడు. ఎల్లప్పుడూ లోకహితాన్నే కాంక్షిస్తాడు. అటువంటి శ్రీరామునికి ధర్మపత్ని ఈ సీతాదేవి. ఆవిడను నువ్వు అపహరిస్తున్నావు. నువ్వొ ఒక రాజువేనా? నువ్వే గనక ధర్మబద్ధుడవైతే పరులభార్యను తాకేవాడివా?**

రావణా! వద్దు. తప్పు చేస్తున్నావు. నీకిది ధర్మం కాదు. మంచిది ఎంతమాత్రమూ కాదు. సీతాదేవిని విడిచిపెట్టు. ఆమె కోపంగా చూస్తే చాలు నువ్వు బూడిదైపోతావు. కోరి కోరి కాలసర్పాన్ని కొంగున కట్టుకొంటున్నావు. నువ్వే నీ మెడకి యమపాశాన్ని తగిలించుకొంటున్నావు.

***మొయ్యలేని బరువు తలకెత్తుకున్నవాణ్ణి ఆ బరువు కుంగదీస్తుంది. అందువల్ల మోయగలిగినంత బరువే మొయ్యాలి. ఏది తింటే ఆరోగ్యంగా ఉంటుందో అదే తినాలి. ఏదైనా ఒక పని చేశామంటే అది ధర్మబద్ధంగా ఉండాలి. దానివల్ల కీర్తి రావాలి. ఈ రెండూ లేకుండా వట్టి శారీరకశ్రమ మాత్రమే మిగిలే పనుల్ని ఎవడూ చేయడు. నేను బతికి ఉండగా నిన్నీ పని చెయ్యనివ్వను సుమా!*** అన్నాడు.

రావణుడు బాణవర్షం కురిపిస్తున్నాడు. ఆ బాణాల మధ్య అచ్చం గూటిలో ఉన్న పక్షిలాగే ఉన్నాడు జటాయువు. జటాయువు తన కాలిగోళ్ళతో రావణుడి ధనుర్బాణాలను తన్నుకుపోయాడు. మరో ధనువు అందుకొని బాణాలు గుప్పించాడు రావణుడు. అయితే వాటన్నింటినీ విసిరి కొట్టి, చెలరేగిపోయాడు జటాయువు. కోపంతో ఈసారి రావణుని కవచాన్నీ, ధనువునీ చివరికి రథాన్నీ నాశనం చేసి పారేశాడు. అయినా రావణుడు సీతాదేవిని ఒక చేత్తో పట్టుకొని యుద్ధం చేస్తున్నాడు. మరో చేత్తో కత్తి తీసుకొని జటాయువు రెక్కలూ, పాదాలూ నరికివేశాడు. దాంతో నేలకూలిపోయాడు జటాయువు.

సీతాదేవి తప్పించుకొని ఇటూ అటూ పరుగెత్తింది. కానీ వీలుపడలేదు. మళ్ళీ రావణుడు సీతాదేవిని పట్టుకొన్నాడు. అప్పుడు చరాచరజగత్తు స్తంభించింది. అంధకారం అలముకొంది. సూర్యుడు కాంతిని కోల్పోయాడు. గాలి వీచడంలేదు. పెనుగులాడు తోంది సీతాదేవి. ఆ పెనుగులాటలో ఆమె ముత్యాల దండ కాస్తా తెగిపడిపోయింది.

ఆకాశమార్గంలో నల్లని మబ్బులా రావణుడు. మెరుపులా సీతాదేవి. ఆభరణాల చప్పుళ్లు ఉరుముల్లా ఉన్నాయి.

సీతాదేవికి పర్వతం మీద కొందరు వానరులు కన్పించారు. వీళ్ళైనా శ్రీరామునికి తన గురించి చెప్తారన్న ఆశతో తన పట్టువస్త్రాన్ని చింపి, కొన్ని నగల్ని మూటగట్టి, వాళ్ళు చూసేలా విసిరేసింది సీతాదేవి.

రావణ రథం పంపానదిని దాటి లంకానగరం వైపు రివ్వున దూసుకు పోయింది.

## అశోకవనంలో సీతాదేవి

సీతాదేవిని అంతఃపురంలో దింపి పిశాచస్త్రీలను కాపలాగా పెట్టాడు రావణుడు. ఆ తరువాత కొంతమంది రాక్షసుల్ని జనస్థానానికి పంపాడు. వాళ్ళని శ్రీరాముడి కదలికలపై ఒక కన్నువేసి ఉంచమన్నాడు.

ఎలాగైనా రాముణ్ణి చంపాలి. అప్పటిదాకా నిద్రపోకూడదు. ఇది రావణుడి సంకల్పం.

సీతాదేవితో ఇలా అంటున్నాడు. 'సీతా! నీకు పన్నెండు నెలలు గడువు ఇస్తున్నాను. ఆలోగా మనసు మార్చుకో.'

దానికి సీతాదేవి ఒక గడ్డిపరక అడ్డుపెట్టుకొని – 'రావణా! దశరథమహారాజు ఎంత గొప్పవాడో నీకు తెలుసు. అతని కొడుకు శ్రీరాముడు. అతని సోదరుడు లక్ష్మణుడు. వాళ్ళ పరాక్రమం అంతా ఇంతా కాదు. ఇద్దరూ కలిసి నీ ప్రాణాలు తోడేస్తారు. అయినా శ్రీరాముని సమక్షంలో గనక నువ్వీపనిచేసి ఉంటే ఇప్పటికే నీకు ఈ భూమ్మీద నూకలు చెల్లిపోయి ఉండేవి. నీ దగ్గర ఉన్నారన్నావే ముప్పై రెండు కోట్ల మంది (ద్వాత్రింశత్ కోటి) రాక్షసులు. వాళ్ళందరూ శ్రీరామునిచేతిలో గరుత్మంతుడి ముందు సర్పాల్లా నశించిపోతారు. శ్రీరామునిబాణాలు నిన్నూ వదలవు. చీల్చి చెండాడతాయి.

ఇప్పుడు నువ్వూ నీ బతుకూ యూపస్తంభానికి కట్టిన బలిపశువుతో సమానం.

నా శ్రీరాముడు చంద్రుణ్ణి నేలపై రాల్చగలడు. సముద్రాన్ని ఇంకింప జేయగలడు. అంతటివాడు నన్ను విడిపించుకోలేడా?

నీది ముగిసిన చరిత్ర. ముగిసిన ఆయుష్షు. గతించిన వైభవం. **పరసతిని అపహరించడం ఏదో పెద్ద ఘనకార్యంగా భావిస్తున్నావు నువ్వు. వినాశకాలం దాపురించిన వాళ్ళకే ఇలాంటి విపరీతపు బుద్ధులు పుడతాయి. పోయేకాలం వచ్చినప్పుడే మానవులు తమతమ కర్తవ్యాల విషయంలో తప్పటడుగులు వేస్తారు. నీకూ వినాశకాలం సమీపించింది. కాబట్టే ఇలా విపరీతపు బుద్ధులు పుట్టు కొస్తున్నాయి. కోరి కోరి నీ చావును నువ్వే కొని తెచ్చుకున్నావు. శ్రీరామ లక్ష్మణులు నీ అంతు చూస్తారు'** అంది ఆవేశంగా.

రావణునికి కోపం కట్టలు తెంచుకొంది.

'మైథిలీ! విను. నీకు గడువు పన్నెండు నెలలు మాత్రమే. ఈలోగా మనసు మార్చుకోక పోయావో! మా వంటవాళ్లు నిన్ను ఉదయకాల భోజనం కోసం ముక్కలు ముక్కలుగా తరిగేస్తారు. జాగ్రత్త!

ఓ రాక్షసాంగనలారా! ఈమెను అశోకవనంలో రహస్యంగా ఉంచండి. మీరంతా చుట్టూ కట్టుదిట్టంగా కాపలా కాయండి. అడవిలో తిరిగే ఆడ ఏనుగును మచ్చిక చేసుకొనేవిధంగా సీతాదేవిని మచ్చిక చేసుకోవడానికి ప్రయత్నించండి. ఈమె గర్వం అణచండి. భయపెట్టో బతిమాలో మనసు మార్చండి.' అని ఆజ్ఞాపించాడు.

## సీతాన్వేషణ

అక్కడ మారీచుణ్ణి చంపి ఆశ్రమంవైపు వస్తున్న శ్రీరామునికి ఏవో అపశకునాలు తోచాయి. ఎందుకో శ్రీరాముని మనసు కీడు శంకిస్తోంది. అంతలోనే దారిలో లక్ష్మణుడు ఎదురై జరిగింది చెప్పాడు.

ఇద్దరూ ఆశ్రమానికి వచ్చి చుట్టూ చూశారు. ఎక్కడా సీతాదేవి కనిపించలేదు.

శ్రీరాముడు కంగారుగా సీతా! సీతా! అని విలపిస్తూ వెదుకుతున్నాడు.

నీరుగారిపోతున్న శ్రీరాముణ్ణి లక్ష్మణుడు ఓదారుస్తున్నాడు.

'సౌమిత్రీ! అసలు నువ్వు సీతాదేవిని ఒంటరిగా విడిచిపెట్టి ఎందుకు వచ్చావు? నిన్ను చూడగానే ఏదో జరిగిందని నాకు అర్థమైపోయింది. నా ఎడమకన్ను, ఎడమ బుజం అదురుతున్నాయి.' అన్నాడు.

శ్రీరామునికి దుఃఖం ఆగడం లేదు. శరీరం వణికిపోతోంది. ఆశ్రమమంతా వెదికాడు. పర్ణశాలలోకి చూశాడు. సీతలేని ఆ పర్ణశాల శోభ కోల్పోయిన పద్మంలా కళావిహీనంగా ఉంది.

ఏమయ్యింది సీత? చనిపోయిందా? ఎవరైనా అపహరించారా? రాక్షసులో క్రూరమృగాలో తినేశాయా? భయపడి అడవిలో ఎక్కడైనా దాక్కుందా? పూలకోసమో పళ్ళకోసమో ఎటైనా వెళ్ళిందా? పరిపరివిధాలా పోతున్నాయి శ్రీరాముని ఆలోచనలు.

'ఓ కదంబవృక్షమా! బిల్వవృక్షమా! అర్జునవృక్షమా! సీతాదేవిని చూశారా!' అని అడుగుతూ మతిస్తిమితం లేనివాడిలా తిరుగుతూ శ్రీరాముడు విలపిస్తున్నాడు.

'లక్ష్మణా! సీత లేకుండా నేను జీవించలేను. మరణిస్తాను. పరలోకంలో తండ్రిని కలుసుకుంటాను.' శ్రీరాముడికి ఆవేదనగా ఉంది. నిరాశానిస్పృహలు ముంచెత్తడంతో ఊబిలోనికి దిగజారిపోతున్న గజేంద్రునిలా ఉన్నాడు. 'రాజ్యం, తండ్రి, తల్లి, అందరికీ దూరం అయ్యాను. చివరికి ఇప్పుడు సీతకూ దూరం అయ్యాను. ఏమయ్యింది నా సీత? ఓ సూర్యుడా! నువ్వు లోకసాక్షివి. వాయుదేవా! నీకు అంతా తెలుసు! నా సీత ఏమయ్యింది?'

* * *

సీతాదేవికోసం గాలిస్తున్నారు శ్రీరామలక్ష్మణులు. అడవిలోని జంతువులు పెద్దగా అరుస్తూ దక్షిణంవైపు పరిగెత్తాయి. అది చూసి శ్రీరామలక్ష్మణులు దక్షిణంవైపు కదిలారు.

దారిలో రాలిపడ్డపూలు. అవి సీతాదేవివే. శ్రీరాముడు గుర్తుపట్టాడు. ఇంకొంచెం ముందుకు వెళ్ళగానే పెద్దపెద్ద పాదముద్రలు కనిపించాయి. అవి ఏ రాక్షసుడివో అయ్యుంటాయి. వాటిమధ్య చిన్న చిన్న పాదముద్రలూ కనిపించాయి. అక్కడే విరిగిన రథం ముక్కలూ, తెగిన ఆభరణాలూ నేలమీద గడ్డకట్టిన రక్తం. శ్రీరాముడు కంగారుపడ్డాడు. ఏ రాక్షసుడైనా సీతాదేవిని చంపి తినేశాడేమోనన్న భయంతో నిలువునా కంపించిపోతున్నాడు.

'లక్ష్మణా! ఎందుకిలా జరిగింది. లోకం పట్ల దయచూపించడమే నేరమా! అలా చూపిస్తే జనులు లోకువ కట్టేస్తారే. నా సీత పాటించే ధర్మం కూడా ఆమెను కాపాడలేకపోయిందా! నేను ఎంతగా ఈ దేవతల్ని పూజించాను! ఇప్పుడు నాకూ నా సీతకూ ఇంత అన్యాయం జరిగాక ఈ దేవతలు చూస్తూ కూర్చున్నారంటే ఇంక ఈ దేవతలెందుకు? నాకేం చేసినట్లు?

నా సీత నాకు కావాలి. ఎలా ఉందో అలాగే కావాలి. అలా నాకు అప్పచెప్పకపోతే సర్వనాశనం చేసేస్తా. దేవతలూ, రాక్షసులూ, ఎవ్వరూ మిగలరు. పర్వతాలు కూల్చేస్తా. నదుల్నీ, సముద్రాల్నీ ఎండగడతా. గ్రహాల్ని ఆర్పేస్తా. గాలిని

స్తంభింపజేస్తా. సూర్యుడి తేజస్సును హరించేస్తా. ముల్లోకాల్లోనూ ప్రళయం సృష్టిస్తా.' పట్టరాని కోపంతో శ్రీరాముడు ధనువు చేతపట్టి ప్రళయకాల రుద్రుడే అయ్యాడు.

అన్నగారిని చూసి లక్ష్మణుడు అవాక్కై – *'అన్నయ్యా! కోపం వద్దు. ఈ కష్టం మనకు అనుకోకుండా వచ్చిపడింది. నీలాంటి ఉత్తముడే తట్టుకోలేకపోతే ఇంక సామాన్యుడెలా తట్టుకుంటాడు? ఓర్చుకో! ఎవరికి రావు ఆపదలు?. ఎంతటి వాడికైనా తప్పవు. ఇది లోకసహజం.*

***నహుషుడి కొడుకు యయాతికి ఇంద్రశాపం తగల్లేదా?! వసిష్ఠమహర్షికి మాత్రం ఒకే రోజున నూరుమంది పుత్రులు మరణించడంతో పుత్రశోకం దాపురించలేదా? అంతవరకూ ఎందుకు? జగత్తు మొత్తానికీ తల్లీ, లోకవందిత అయిన భూదేవికే భూకంపాలు తప్పడం లేదే; ఇక మనం ఎంత? సూర్యచంద్రులకైనా గ్రహణాలూ ఇంద్రాదులకైనా కష్టాలూ రావడం లేదూ.*** **కాబట్టి నువ్వు దుఃఖించడం తగదు. నీలో ఏ తప్పూ లేదు. సీతాదేవిని వెతుకుదాం. కనపడకపోతే అప్పుడు చూద్దాం.'** అన్నాడు.

ఆలస్యం చెయ్యకుండా ఇద్దరూ బయలుదేరి, చుట్టూ ఉన్న అడవిని అడుగడుగునా గాలిస్తున్నారు. దక్షిణం వైపుకు వెళ్ళారు. కొంతదూరం వెళ్ళాక అల్లంతదూరంలో పర్వత శిఖరంలా పడి ఉన్న జటాయువు కన్పించాడు. గబగబా శ్రీరామలక్ష్మణులకు జరిగినదంతా చెప్పాడు.

అతని నోటినుంచి రక్తం ధారలుగా కారుతోంది. ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి.

జటాయువు ఆ వార్త చెప్పాడో లేదో శ్రీరాముడు రెట్టించిన దుఃఖంతో విలపించాడు. చేతిలోని విల్లును వదిలేశాడు. గాఢంగా జటాయువును కౌగిలించుకున్నాడు.

వైదేహీహరణం, జటాయుమరణం ఈ రెండూ శ్రీరాముణ్ణి కలచివేస్తున్నాయి. అయితే జటాయువు రావణుని గురించి చెప్తూ ఆనందకరమైన ఒక మాట అన్నాడు. రావణుడు సీతాదేవిని అపహరించుకుపోయిన ముహూర్తాన్ని **'విందం'** అంటారట. ఆ ముహూర్తంలో పోయిన వస్తువు యజమానికి కచ్చితంగా దొరుకుతుందట.

'లక్ష్మణా! నాకు సీత లేదన్న బాధకన్నా జటాయువు మరణించాడన్న బాధే ఎక్కువగా ఉంది. ఈ పక్షీంద్రుడు మనకు దశరథునిలాంటివాడు. నాకు మేలు చేయడం కోసం తన ప్రాణాలను అర్పించిన మహానుభావుడు. కాబట్టి ఇతనికి మనమే అగ్నిసంస్కారం చెయ్యాలి.' అంటూ సొంత బంధువుకు చేసినట్లుగా శ్రీరాముడు జటాయువుకి అగ్ని సంస్కారం చేశాడు. ఉత్తమగతులు కల్పించాడు.

ఆ తర్వాత దక్షిణంవైపు కదిలారు శ్రీరామలక్ష్మణులు. జనస్థానం నుండి మూడు కోసులు నడిచారు. క్రౌంచారణ్యం వచ్చింది. అక్కడ నుంచి మరో మూడు కోసులు నడిచారు. ఒక చీకటి గుహ వచ్చింది. అది దాటి ముందుకు సాగి మతంగాశ్రమం చేరుకొన్నారు.

ఆ సమీపంలోనే పెద్దపొట్ట కలిగి వికృతాకారం కల రాక్షసి ఉంది. రౌద్ర స్వరూపంతో వచ్చి శ్రీరామలక్ష్మణుల్ని పట్టుకుంది. దాని పేరు అయోముఖి.

'నువ్వు నా ప్రియునివి. రా! విహరిద్దాం' అంది శ్రీరామునితో. లక్ష్మణునికి కోపం వచ్చి ఆమెపై కత్తి దూసి ముక్కూ చెవులూ తెగగోశాడు. అది పొలికేకలు పెడుతూ పారిపోయింది.

## కబంధుడు

శ్రీరామలక్ష్మణులు అడవిలో ఇంకాముందుకు సాగిపోయారు. అక్కడేవో కొన్ని అపశకునాలు పొడచూపాయి లక్ష్మణునికి. అంతలో ఒక పెద్దరాక్షసుడు హఠాత్తుగా ఎక్కణ్ణుంచో పిడుగులా వచ్చిపడ్డాడు. తలా మెడా లేకుండా ముఖం పొట్టలోకి జారిపోయి, ఒంటికన్నుతో భయంకరంగా పర్వతంలా ఉన్నాడు. చేతులు చాచి శ్రీరామలక్ష్మణుల్ని పట్టుకున్నాడు. వాడి పేరు కబంధుడు. వాడిని చూడగానే శ్రీరాముడు –

లక్ష్మణా! ఎందుకు మనకే ఇలా కష్టాలు ఒకదానిపై ఒకటి వస్తున్నాయి? ఇదుగో! ఇప్పుడీ రాక్షసుడు. ఆలోచిస్తుంటే ఇదంతా కాలప్రభావమే అనిపిస్తోంది. కాలానికి ఎదురీదడం ఎవరివల్లా కాదు. *ఎంతగట్టివైనా ఇసుకతో కట్టిన ఆనకట్టలు నీటివేగంముందు నిలుస్తాయా చెప్పు? అలాగే* ***ఎంతగొప్పవాళ్ళైనా పరాక్రమవంతులైనా సరే కాలం కలిసి రాకపోతే కష్టాలపాలు కాక తప్పదు. కర్మను అనుభవించకా తప్పదు.'*** అన్నాడు.

ఆ తర్వాత శ్రీరామలక్ష్మణులు ఏమాత్రం సంకోచించకుండా ఆ రాక్షసుని రెండు చేతులూ నరికేశారు. దెబ్బకి కబంధుడు కుప్పకూలిపోతూ – 'అయ్యా! మీరెవరు?' అని ప్రశ్నించాడు. లక్ష్మణుడు తమ కథ చెప్పాడు.

అది విన్న కబంధుడు – 'ఆహా! ఇంతకాలానికి మిమ్మల్ని చూశానన్నమాట. నేను దనుపుత్రుణ్ణి. ఇంద్రుడిలాగా చంద్రుడిలాగా నేనూ అందగాణ్ణే. అయితే వికృతరూపంలో అందర్నీ భయపెట్టేవాణ్ణి. అప్పుడు స్థూలశిరుడు అనే మహర్షి ఈ వికృతరూపం ఇలాగే ఉండిపోతుందని నన్ను శపించాడు. అంతేకాదు; శ్రీరాముడు వస్తాడనీ నా చేతుల్ని ఖండించి నాకు పూర్వరూపం తెస్తాడనీ చెప్పాడు. ఇదుగో ఇప్పటికి ఇలా నువ్వు వచ్చావు. నాకు శాపవిమోచనం కలిగింది. కాబట్టి శ్రీరామా! నాకు అగ్నిసంస్కారం నువ్వే చెయ్యి.' అన్నాడు.

శ్రీరామలక్ష్మణులు అలాగే చేశారు. కబంధుడి శరీరం అగ్నిలో నేతిముద్దలా కరిగిపోయి, అందులోంచి ఒక దివ్యరూపం పైకి లేచి, అంతరిక్షంలో నిలబడి – 'మిత్రమా! రఘురామా! విను! సీతాదేవి నీకు తప్పక లభిస్తుంది. నువ్వు సుగ్రీవునితో స్నేహం చెయ్యి. అతడు నీకు సహాయం చేస్తాడు. అప్పుడే నీ కోరిక నెరవేరుతుంది.' అంటూ ఎలా వెళ్ళాలో ఎక్కడ ఏమేమి ఉంటాయో ఏం తినాలో వివరంగా చెప్పి, కబంధుడు తన దారిన తాను వెళ్ళిపోయాడు.

ఆ తరువాత కబంధుడు చూపిన దారిలో శ్రీరామలక్ష్మణులు ప్రయాణించి శబరి ఆశ్రమం చేరుకున్నారు.

## శబరి భక్తి

అవ్యాజమైన భక్తితో శబరి ఇద్దరి పాదాలకూ మొక్కి ఎంతో మర్యాద చేసింది. శ్రీరాముడు – 'శబరీ! నీ తపస్సు బాగా సాగుతోందా? క్రోధాన్ని జయించావా? నియమాలు సాగుతున్నాయా?' అని అడిగాడు.

'శ్రీరామా! ఈనాటికి నా తపస్సు సఫలం అయ్యిందయ్యా! నా జన్మ తరించింది. నా గురువులూ, ఇంతకాలం నేను సేవించిన మహర్షులూ అందరూ దివ్యలోకాలకు చేరుకున్నారు. లక్ష్మణునితో కలిసి శ్రీరాముడు వస్తాడనీ అప్పటిదాకా ఇక్కడే ఉండమనీ నన్ను ఆదేశించారు. ఇంతకాలానికి నువ్వు వచ్చావు. ఇంక నాకు పుణ్యలోకప్రాప్తి కలుగుతుంది.' అంది.

శబరి వాళ్ళకి మతంగ మహర్షి ఆశ్రమం చూపించింది. ఆ ఆశ్రమం ఒక పెద్దమేఘంలా ఉంది. 'ఇదే మా గురువుల తపోవనం. అవిగో! పక్షులు. ఇవిగో! మృగాలు. చూడు. ఆ నదుల్ని మా గురువులే ఇక్కడ ఏర్పాటు చేశారు. ఇవేనయ్యా! మా గురువుల పూజావేదికలు. ఇదుగో! ఇక్కడే వణికే చేతులతో నేను దండలు గుచ్చి గురువులకు సమర్పించేదాన్ని. చూశావా! ఈ కాంతి. అది మా గురువుల తపశ్శక్తి. ఏమనుకొన్నావు? మా గురువులు ఉపవాసాలతో కృశించి కదల్లేని స్థితిలో ఉంటూ ధ్యానిస్తే వారికోసం సప్తసాగరాలూ ఒక్కటై ఇక్కడికే వచ్చాయి. అలా వచ్చి అవి ఇక్కడే ఉండిపోయాయి. కన్పిస్తున్నాయా! ఆ సప్తసాగరజలాలలో స్నానం చేసి, మా గురువులు ఆరేసిన వల్కలాలు అవిగో! ఇంకా ఎండిపోలేదు చూడు. పూజకు వాడిన పువ్వులవిగో! ఇంకా వాడిపోలేదు చూడు' అంటూ –

శబరి రామలక్ష్మణులకు ఫలాలను సమర్పించింది. అతిథి పూజ గావించింది. దగ్గరుండి మరీ అన్నీ చూపించింది. ఆ తరువాత మళ్ళీ ఇలా అంది – 'శ్రీరామా! ఇంక నాకు సెలవా? ఈ శరీరాన్ని వదిలి వెళ్ళిపోవాలయ్యా!'

శబరి మాటలకు శ్రీరామలక్ష్మణులకు ఆనందం, ఆశ్చర్యం రెండూ ఒకేసారి కలిగాయి.

'ఓ శబరీ! నువ్వు పరమభక్తురాలివి. కోరుకున్న లోకాలకు వెళ్ళు.' అని శ్రీరాముడు అనుజ్ఞ ఇచ్చాడు.

శబరి యోగాగ్నిలో ప్రవేశించి శరీరాన్ని విడిచిపెట్టి స్వర్గానికి వెళ్ళిపోయింది.

శ్రీరాముడు – ఆలోచనల్లో ఉన్నాడు. మహర్షులూ, వాళ్ళ వాళ్ళ ప్రభావాలూ. అవే పదే పదే సుళ్ళు తిరుగుతున్నాయి. ఎంత ఆశ్చర్యం! సప్తసముద్రాలూ ఇక్కడే ఉన్నాయే! చక్కగా స్నానం కూడా చేశాం. పితృకార్యాలూ పూర్తిచేశాం. ఇక అన్ని అశుభాలూ తొలగిపోయినట్లే! ఇప్పుడు మనసెంతో నిర్మలంగా ఉంది.

***'లక్ష్మణా! అశుభం తొలగి, మంచి జరగబోయేముందు మనసుకు తెలుస్తుంది. నా మనస్సిప్పుడు దైన్యాన్ని వదిలి, ఉత్సాహంతో ఉరకలు వేస్తూ ఉంది. అంటే ఏదో మంచి జరుగబోతోందన్నమాట! పద! ఋష్యమూకం వైపు వెళ్ళి సుగ్రీవుణ్ణి కలుద్దాం.'*** అన్నాడు.

శ్రీరామలక్ష్మణులు పంపానదిని దాటారు. దూరంగా.. ఋష్యమూక పర్వతం కనిపిస్తోంది.

# కిష్కింధాకాండ

## శ్రీరాముడి శోకం

పంపాసరోవరం – కలువపువ్వులతో, తామరపువ్వులతో, చేపలతో కళకళలాడుతోంది.

దానిని చూసిన శ్రీరామునికి మనసులో ఒకటే దిగులు. సీతాదేవి ఎలా ఉందో! ఎక్కడ ఉందో! అసలు ఉందో లేదో! గుండె బరువెక్కింది. జ్ఞాపకాలు ముంచెత్తుతున్నాయి. దుఃఖం కమ్ముకొచ్చింది.

'లక్ష్మణా! చూశావా! శిశిరం వెళ్ళి వసంతం వచ్చింది. ఎంత బావుందీ ప్రకృతి!

ఈ మహావృక్షాలు చూడు. పర్వతాల్లా ఉన్నాయి. సౌమిత్రీ! సీతాదేవి చెంతలేదని నన్ను ఈ ప్రకృతి మరీ బాధిస్తోంది. ఆమె లేకుండా నేనెలా బతకాలి? బతకను. నన్ను వదిలెయ్యి. నువ్వు అయోధ్యకు వెళ్ళు. సుఖంగా ఉండు.' అంటూ శ్రీరాముడు విలపిస్తున్నాడు.

లక్ష్మణుడు శ్రీరాముణ్ణి ఓదారుస్తూ ధైర్యం చెబుతున్నాడు. శ్రీరాముడు మళ్ళీ భావోద్వేగంతో మాట్లాడుతున్నాడు.

'అవిగో? పక్షుల కలకూజితాలు. వాటిని విన్నప్పుడల్లా నా సీత నన్ను పిలిచేది. నేను వింటే తనకు ఆనందం. ఇదుగో! ఇటు చూడు. నెమళ్ళనాట్యం. ఆహా! ఎంత బావుందో. అబ్బా! అందరికీ సుఖాన్నిచ్చే ఈ మందవాయువు మాత్రం నాపై నిప్పులు కురిపిస్తోంది.'

## లక్ష్మణుని ఓదార్పు

శ్రీరాముని పరిస్థితిని గమనించిన లక్ష్మణుడు – 'శ్రీరామా! ధైర్యం తెచ్చుకో! నీకు శుభం జరగాలి. నీలాంటి మంచిమనసు ఉన్నవాళ్ళ బుద్ధి చురుగ్గా ఉండాలి.

పని జరగాలంటే ముందు ప్రయత్నించాలి కదా! ప్రయత్నం లేకుండా ఏ పనీ జరుగదు.

**ఉత్సాహో బలవా నార్య! నా స్త్యుత్సాహో త్పరం బలం,**
**సోత్సాహస్యాస్తి లోకేఽస్మిన్ న కించిదపి దుర్లభమ్.**

**ఉత్సాహవంతః పురుషా నావసీదంతి కర్మసు,**
**ఉత్సాహమాత్ర మాశ్రిత్య సీతాం ప్రతిలభేమహి. (4-1-122,123)**

***ఆర్యా! ఉత్సాహమే నిజమైన బలం. దాన్ని మించిన బలం లేదు. ఉత్సాహవంతునికి ఈ ముల్లోకాల్లోనూ అసాధ్యమంటూ ఏమీ ఉండదు. ఉత్సాహవంతులు ఎలాంటి కష్టాల్లోనైనా వెనుకంజ వెయ్యరు. కాబట్టి దుఃఖం విడిచిపెట్టు. ఉత్సాహంతో సీతాన్వేషణ చేసి విజయం సాధిద్దాం. రా!***

నువ్వు మహాత్ముడివి. కానీ నీకా సంగతి తెలియడం లేదు. నీ మనసు మంచిది. కాబట్టే ఇంతగా బాధపడుతున్నావు. మనసుకు దగ్గరైనవాళ్ళు దూరమైతే ఎవరికైనా ఇంతే! ఇలాగే ఉంటుంది. అంతమాత్రానికే కుంగిపోతే ఎలా? నీ బుద్ధి ఎంతో నిర్మలమైనది. కష్టం కలిగినంత మాత్రానికే ఆలోచనలు మసకబారిపోతే ఎలా? తేరుకో. దుఃఖంలోనే ఉండిపోతే ఏం చెయ్యాలో తోచదు. సీతాదేవిని వెదకడం, రావణుణ్ణి సంహరించడం ఈ రెండే మనముందున్న కర్తవ్యాలు. అవి నెరవేరాలంటే బాధను ఓర్చుకోవాలి. మనస్సును ఉత్సాహంగా ఉంచుకోవాలి' అన్నాడు.

లక్ష్మణుని మాటలు పనిచేశాయి. శ్రీరాముడు కొంత తేరుకున్నాడు. ధైర్యం వచ్చింది. దుఃఖం వదిలింది. ఇద్దరూ కర్తవ్యం దిశగా అడుగులువేస్తూ ఋష్యమూకం వైపు నడక సాగించారు.

## సుగ్రీవునితో చెలిమి

ఋష్యమూక పర్వతంమీద సుగ్రీవుడు తన నలుగురు మంత్రులతో మంతనాలు సాగిస్తున్నాడు. శ్రీరామలక్ష్మణులు అటే వస్తున్నారు. అందరూ చూశారు. చూసీ చూడగానే వాళ్ళు అందగాళ్ళనీ, బలవంతులనీ అనిపించింది వాళ్ళకి.

సుగ్రీవుని మనసులో ఏదో భయం. తనను చంపడానికే వస్తున్నారేమో! బహుశా వాలి పంపించాడా? ఏమో? అందరూ పారిపోయారు. చెట్టూ పుట్టా కొండా కోనా పట్టుకొని తిరిగారు. దాక్కున్నారు. మరో గిరిశిఖరం చేరి చూస్తున్నారు. కానీ అక్కడా వాళ్ళకి కాళ్ళు నిలవలేదు.

'సుగ్రీవా! భయపడకు. వాలి ఈ పర్వతం మీదికి రాలేదు కదా! ఎందుకా కంగారు? మాకు ధైర్యం చెప్పవలసిన వాడివి నువ్వే కంగారు పడితే ఎలా?' అన్నాడు హనుమంతుడు.

సుగ్రీవుని కింకా ఆందోళనగానే ఉంది.

'వాలి సామాన్యుడు కాదు హనుమంతా! వాడు రాలేదు కాబట్టే ఈ ఇద్దరినీ పంపాడేమో. మన జాగ్రత్తలో మనం ఉండాలి. ఎందుకైనా మంచిది వాళ్ళ గురించి ఆరా తియ్యి.' అన్నాడు.

హనుమంతుడు సన్యాసివేషంలో శ్రీరామలక్ష్మణులముందు చేతులు జోడించి ఇలా అన్నాడు.

'అయ్యా! ఎవరు మీరు? మీ రూపాల్లో రాజఠీవి కొట్టివచ్చినట్లు కనిపిస్తున్నది. మునివేషంలో ఉన్న మీరు రాజర్షుల్లా కనిపిస్తున్నారు. ప్రకృతికి పరవశిస్తూ ఈ ప్రదేశానికే కొత్తశోభను చేకూరుస్తూ, వల్కలాలు ధరించి, సుదీర్ఘభుజాలతో ధైర్యవంతుల్లా సంచరిస్తున్నారు.

మీ నిట్టూర్పుల్ని బట్టి మీరు చాలా దూరంనుంచి వస్తున్నట్లుగా ఉంది. ఆయుధాలు ధరించి ఉన్న మిమ్మల్ని చూసి వనచరాలు భయపడిపోతున్నాయి. చూడ ముచ్చటైన రూపాలతో మీరు విరాజిల్లుతున్నారు.

మీ రాకతో ఈ పర్వతానికి కొత్తకళ వచ్చిందంటే నమ్మండి. రాజ్యపాలకుల్లా ఉన్న మీరు మానవరూపంలో సంచరిస్తున్న దేవతలా? మీ బాహువులు చూస్తుంటే ఆభరణాలను ధరించడానికి యోగ్యంగా ఉన్నాయే! మరెందుకు ఏ ఆభరణాలూ ధరించలేదు?

మీ ఇద్దరినీ చూస్తుంటే ఈ భూగోళం మొత్తాన్నీ రక్షించే సామర్థ్యం కలవాళ్ళని నాకు అన్పిస్తోంది. మీ ధనువులు రెండూ – వజ్రాయుధాల జంటలు. బాణాలతో

నిండిన మీ అమ్ములపొదులు– బుసకొట్టే పాముల పుట్టలు, తళతళలాడే మీ ఖడ్గాలు– కుబుసం విడిచిన పాములు. ఇంతగా నేను మాట్లాడుతుంటే మీరేమీ మాట్లాడటం లేదే!

సుగ్రీవుడనే వానరరాజు తన అన్న వాలికి భయపడి ఇక్కడే ఈ పర్వతంమీదే తలదాచుకున్నాడు.

నన్ను హనుమంతుడు అంటారు. నేను ఆ సుగ్రీవుడి అనుచరుణ్ణి. నేను, మరికొంతమందీ ధర్మాత్ముడైన ఆ సుగ్రీవునిపక్షాన నిలబడ్డాం. సుగ్రీవుడు మీ స్నేహం కోరుతున్నాడు.'

హనుమంతుడు ఇంతవరకూ ఇలా చక్కగా చెప్పి మౌనం వహించాడు.

అప్పుడు శ్రీరాముడు – 'లక్ష్మణా! చూశావా! మనమే సుగ్రీవుణ్ణి కలవాలి అనుకొంటున్నాం. సుగ్రీవుడే తన మంత్రిని మన దగ్గరకు పంపాడు. చూడు. ఇతడు ఎంత బాగా మాట్లాడుతున్నాడో! మాటల్ని బట్టి తెలియడం లేదూ!

**నూనం వ్యాకరణం కృత్స్నం అనేన బహుధా శ్రుతమ్,**
**బహువ్యాహరతాఽనేన న కించి దపశబ్దితమ్. (4-3-29)**

*'ఇతడు వేదాలు చదివిన పండితుడు. వ్యాకరణం కూడా గట్టిగా చదువుకొన్నాడు. అందుకే తప్పుల్లేకుండా మాట్లాడుతున్నాడు. అతడి శరీరం చూడు. ఎక్కడా ఏ లోపమూ లేదు. దృఢంగా మంచి లక్షణాలతో ప్రకాశిస్తోంది. మాట్లాడుతున్నప్పుడు చూశావా – ముఖంలోగానీ కళ్ళలోగానీ ఫాలభాగంలోగానీ కనుబొమల కదలికలలోగానీ ఎక్కడా ఏ దోషమూ లేదు. సందేహాలు తలెత్తకుండా, సోది చెప్పకుండా, సాగదియ్యకుండా, తొట్రుపాటులేకుండా మధ్యమస్వరంలో ఎంత హాయిగా, వినసొంపుగా పలికాడో. ఇతడి ప్రసంగం సంస్కారవంతంగానూ శుభప్రదంగానూ ఉంది. ఇటువంటి వాక్కు కత్తిపట్టిన శత్రువునైనా అలరింపజేస్తుంది. నా మనస్సునైతే కొల్లగొట్టేసిందయ్యా లక్ష్మణా! ఇలాంటి వాళ్ళయ్యా! నిజంగా రాజుగారికి కావల్సింది. ఏ పనైనా ఇట్టే సాధించుకొస్తారు.'* అన్నాడు శ్రీరాముడు.

అప్పుడు లక్ష్మణుడు అన్నగారి ఆజ్ఞపై తమ చరిత్రంతా హనుమంతుడికి చెప్పి –

'ఓ విద్వాంసుడా! సుగ్రీవుని కోసమే మేమూ వస్తున్నాం. సుగ్రీవుడు పంపగా నువ్వు వచ్చావు. సరే! సుగ్రీవునితో స్నేహం మాకూ ఇష్టమే' అని తమ గురించి చెప్పాడు.

ఆ మాటలకు ఆనందంతో పరవశించిపోతూ హనుమంతుడు –

'మహావీరులారా! మీ దర్శనం మా అదృష్టం. సీతాన్వేషణలో మీకు కావలసిన సహాయం సుగ్రీవుడు చేస్తాడు.' అని చెప్పి – వానరరూపం ధరించి వాళ్ళని తన భుజాలపై ఎక్కించుకొని సుగ్రీవుని దగ్గరకు తీసుకువెళ్ళాడు.

* * *

శ్రీరామసుగ్రీవులకు పరస్పరం పరిచయాలు అయ్యాయి.

హనుమంతుని పరిచయ వాక్యాలకు సుగ్రీవునికి ఉన్న భయం కాస్తా పటాపంచలై పోయి గాలి పీల్చుకుని ఇలా అన్నాడు. 'శ్రీరామా! నువ్వు చాలా గొప్పవాడివి. ధర్మాత్ముడివి. సర్వప్రాణులనూ ఒకేలా ప్రేమించేవాడివి. అంత గొప్పవాడివైన నువ్వు ఇప్పుడు నా స్నేహం కోరడం నిజంగా నా అదృష్టమే. ఇది నాకు సత్కారమే.'

శ్రీరామసుగ్రీవులు అగ్నిసాక్షిగా చేతులు కలిపారు. శ్రీరాముడు ఆప్యాయంగా సుగ్రీవుణ్ణి కౌగిలించుకొన్నాడు. అప్పుడు సుగ్రీవుడు –

***'శ్రీరామా! స్నేహితుడు ధనవంతుడైనా దరిద్రుడైనా, దుష్టుడైనా మంచివాడైనా, దుఃఖాల్లో ఉన్నా సుఖాల్లో ఉన్నా, అతణ్ణి మించిన ఉత్తమగతి వేరే లేదు. స్నేహధర్మం అదే. అది తెలిసినవాళ్ళు ధనాన్నీ, సుఖాన్నీ దేన్నీ లెక్కచేయరు. స్నేహానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తూ మిత్రులను ఆదుకుంటారు. ఓ రాఘవా!*** ఈ రోజు నువ్వు నాకు ప్రాణమిత్రుడివి అయ్యావు. హృదయం ఉప్పొంగిపోతోంది. కాబట్టి ఓ రాఘవా! మనమూ అలాగే ఉందాం.

శ్రీరామా! నా అన్న వాలి మహావీరుడు. నన్ను అవమానించి నా భార్యను అపహరించి, నన్ను ఎన్నో బాధలు పెట్టి, చివరికి ఇప్పుడు చంపేద్దామనికూడా చూస్తున్నాడు. అతనికి భయపడే ఈ కొండపైన దాక్కొన్నాను. నన్ను రక్షించు.' అన్నాడు.

'నీకేం భయంలేదు. హనుమంతుడు అంతా చెప్పాడు. ***శత్రువువల్ల ఎప్పుడూ అపకారమే కలుగుతుంది. ఉపకారం జరిగేది మిత్రునివల్లనే.*** నేను నీ మిత్రుణ్ణి కాబట్టి ఆ వాలిని సంహరించి నీ రాజ్యం నీకు అప్పగిస్తాను.' అని శ్రీరాముడు అభయం ఇచ్చాడు.

'నీ భార్య ఎక్కడ ఉన్నా తెచ్చి నీకు అప్పగించే పూచీ నాది. నువ్వు నిశ్చింతగా ఉండు.' అంటూ –

'ఆకాశంలో ఎవడో ఎత్తుకుపోతున్నపుడు శ్రీరామా! లక్ష్మణా! అంటూ ఏడుస్తున్న ఒక స్త్రీని చూశాం. అవిడే సీతాదేవి. సందేహం లేదు. అలా వెళ్ళేటప్పుడు, ఆవిడ తన నగల్ని మూటకట్టి మేం చూసేలా ఇక్కడ పడేసింది. తెస్తాను ఉండు.' అని గుహలోకి వెళ్ళి నగలమూట తెచ్చాడు సుగ్రీవుడు.

నగలు చూసిన శ్రీరాముని కళ్ళు చెమర్చాయి. చూడలేకపోతున్నాడు. లక్ష్మణునికి చూపించి గుర్తుపట్టమన్నాడు. లక్ష్మణుడు పరిశీలించి చూశాడు.

**నాహం జానామి కేయూరే నాహం జానామి కుండలే,**
**నూపురే త్వభిజానామి నిత్యం పాదాభివందనాత్. (4-6-22)**

అన్నయ్యా! నాకు సీతాదేవి పెట్టుకొనే కేయూరాలు (బాహుపురులు) తెలీదు. ఆమె చెవులకు పెట్టుకొనే కుండలాలు అంతకన్నా తెలీదు. రోజూ ఆమె పాదాలకు నమస్కరిస్తాను కాబట్టి ఆమె కాళ్ళకు పెట్టుకొనే నూపురాలు మాత్రమే తెలుసు. ఇవిగో ఆ నూపురాలు. ఇవి సీతాదేవివే!' అన్నాడు.

శ్రీరాముడు ఆ రాక్షసుడి వివరాలు అడిగాడు సుగ్రీవుణ్ణి.

'నాకు తెలీదు. అయినా తెలుసుకుంటాను. వానికి తగిన శాస్తి జరిగేలా మాత్రం చూస్తాను. వానరుణ్ణయిన నేనే భార్య కోసం దుఃఖించడం లేదు. అటువంటిది నువ్వు మానవుడివి, పైగా ధైర్యవంతుడివి. నువ్వే ఇలా డీలాపడిపోతే ఎలా రామా? ***శోకంలో ఉన్నవారికి సుఖం ఉండదు. నువ్వు మనోనిగ్రహం కలవాడివి. ధైర్యాన్నిమాత్రం విడిచిపెట్టవద్దు సుమా! ఎన్ని కష్టాలు వచ్చినా ధైర్యవంతుడు స్థిరంగా ఉంటాడు. కుంగిపోడు. దుఃఖంలో మునిగిపోతే బుద్ధి పనిచేయదు. దుఃఖం వచ్చినా, ధనం పోయినా, ప్రాణాలకు ముప్పువాటిల్లినా***

***బుద్ధిని తన వశంలో పెట్టుకున్న ధైర్యవంతుడు ఎప్పటికీ నశించడు. ఈ జ్ఞానం లేనివాడుమాత్రం బరువు ఎక్కువైన నావలా దుఃఖసముద్రంలో మునిగిపోక తప్పదు. మన స్నేహాన్ని మన్నించడానికైనా నువ్వు దుఃఖం నుంచి బయటపడి నిశ్చింతగా ఉండాలి. స్నేహం కొద్దీ చెప్తున్నాను నా మాట విను.'***

సుగ్రీవుని ఓదార్పుతో శ్రీరాముడు కళ్ళు తుడుచుకొని, – 'సుగ్రీవా! నీ మాటలు నన్ను తేటపడేలా చేశాయి. నా అదృష్టం కొద్దీ నీలాంటి స్నేహితుడు దొరికాడు. ఆత్మీయుడైన మిత్రునికి ఏది కావాలో అదే నువ్వు బోధించావు. నీ ఓదార్పుతో మళ్ళీ మామూలు మనిషిని అయ్యాను. నీలాంటి బంధువు ఈ రోజుల్లో దొరకడం కష్టం. సీతాన్వేషణలో నువ్వే మాకు సహాయం చెయ్యాలి. ఏం చేస్తావో ఎలా చేస్తావో అంతా నీదే భారం.

సుగ్రీవా! అభిమానంతో అంటున్న ఈ మాటలు యథార్థాలు. అక్షర సత్యాలు. ఇంతకు ముందు నేనెప్పుడూ అసత్య మాడలేదు. ముందు ముందు ఆడనుగాక ఆడను. ఇది నా ప్రతిజ్ఞ.' అన్నాడు శ్రీరాముడు.

దానికి **సుగ్రీవుడు – *'రఘువీరా! నీతో స్నేహం వల్ల నేను సమస్త దేవతల అనుగ్రహానికి పాత్రుణ్ణయ్యాను. సత్పురుషులైన మిత్రులు తమకంటే తక్కువ వాళ్ళనికూడా ఆదరిస్తారు. నువ్వు నాకు తోడుంటే స్వర్గాన్నైనా జయిస్తానన్న నమ్మకం కుదిరింది. ఇంక నా రాజ్యాన్ని పొందలేనా? అదెంతసేపు! నీలాంటి మహాత్ములకు ప్రీతి నిశ్చలంగా ఉంటుంది. ఆత్మజ్ఞానం కలవాళ్ళకి ధైర్యం కూడా అలాగే. నిజమైన మిత్రుడు స్నేహం కోసం సర్వస్వాన్నీ త్యాగం చేస్తాడు.'*** అంటూ శ్రీరాముని కోరికపై తనకూ వాలికీ మధ్య గొడవలు ఎందుకు వచ్చాయో మొదలుపెట్టాడు.

## వాలి కథ

'శ్రీరామా! వాలి నా సొంత అన్న. మా నాన్నకూ నాకూ వాలి అంటే ఎంతో ఇష్టం. మా నాన్న తర్వాత వాలి రాజు అయ్యాడు. నేను ఒక సేవకునిలా అతనికి సేవచేస్తూ తరిస్తున్నాను. ఒకరోజు అర్ధరాత్రిపూట మాయావి అనే రాక్షసుడు మా నగరంపైకి దండెత్తి వచ్చాడు. వాడు దుందుభికి అన్న. మయుని కొడుకు. ఏవో పాతకక్షలు. వాలిని యుద్ధానికి కవ్వించాడు. నిద్రలేచిన వాలి యుద్ధానికి సై అంటూ మేము ఎంత చెప్పినా వినకుండా బయలుదేరాడు. నేనూ వాలి వెంట

వెళ్ళాను. మమ్మల్ని ఇద్దర్నీ చూసిన మాయావి ఒక గుహలోకి దూరాడు. వాలి నన్ను గుహద్వారం దగ్గరే ఉండమని వాణ్ణి వెతుక్కుంటూ లోపలికి వెళ్ళాడు. నేను అలాగే ఉన్నాను. సంవత్సరం గడిచింది. ఏమయ్యిందో తెలియడంలేదు. ఎవరూ బయటికి రాలేదు. నా మనస్సు కీడునే శంకిస్తోంది.

కొంతకాలానికి గుహలోంచి నురుగులతో కూడిన రక్తం ప్రవహిస్తూ వస్తోంది. లోపల అసురులు చేసే గర్జనలు వినిపిస్తున్నాయి. వాలి ఆచూకీ లేదు. మాయావి చేతిలో వాలి చనిపోయాడనుకొన్నాను. నాకు దుఃఖం వచ్చింది. ఆ రాక్షసుడు బయటికి రాకూడదని పెద్దరాయిని అడ్డుగా పెట్టి కొండ ద్వారాన్ని మూసివేశాను. అన్నకు తర్పణాలు వదిలి కిష్కింధకు చేరుకున్నాను.

ఈ వార్త అందరికీ తెలిసింది. నేను ఎంత వద్దన్నా నాకు పట్టాభిషేకం చేశారు. న్యాయంగా రాజ్యం పాలిస్తున్నాను. ఉన్నట్టుండి ఒకరోజు వాలి వచ్చాడు. నన్ను సింహాసనం మీద చూశాడు. కన్నెర్ర జేశాడు. నా మంత్రుల్ని తిట్టిపోశాడు.

వాలి తిరిగివచ్చినందుకు నాకు అమితానందం కలిగింది. నమస్కరించాను.

'అన్నా! నువ్వే రాజువి. ఈ రాజ్యం నీదే. అరాచకాలు పేట్రేగిపోకుండా ఉండేందుకే నేను రాజ్యభారాన్ని వహించాను. అందరూ నన్ను పట్టుబట్టినందు వల్లనే నేను ఒప్పుకున్నాను. ఇప్పుడు నువ్వు వచ్చావు. నీ రాజ్యాన్ని నీకు సమర్పిస్తున్నాను. రా! సింహాసనం అధిష్ఠించు. ఇది నా వేడుకోలు. ఆగ్రహించక నన్ను అనుగ్రహించు.' అన్నాను.

"నా మాటల్ని వాలి వినలేదు సరికదా అపార్థం చేసుకొన్నాడు. నాపై ఆగ్రహించి అందరూ వినేలా ఇలా అన్నాడు – 'నేను గుహలో మాయావినీ వాడి బంధువుల్నీ అందరినీ చంపి, వచ్చి చూద్దును కదా! బిలద్వారం మూసి ఉంది. సుగ్రీవా! సుగ్రీవా! అని ఎంతగా పిలిచినా బదులు లేదు. దుఃఖించాను. కాలితో ఆ గిరిశిఖరాన్ని బద్దలుకొట్టి బయటకు వచ్చాను. తీరా కిష్కింధకు వచ్చి చూస్తే వీడు అన్నదమ్ముల అనుబంధాన్ని గౌరవించకుండా, పదవీకాంక్షతో సింహాసనాన్ని అధిష్ఠించాడు.' అని అందరిముందూ నన్ను నానా మాటలూ అన్నాడు. నా భార్యను సొంతం చేసుకొన్నాడు. నన్ను కట్టుబట్టలతో వెళ్ళగొట్టాడు. ప్రాణభయంతో ఇదుగో! ఈ పర్వతంపై తలదాచుకొన్నాను. శ్రీరామా! నన్ను రక్షించు. వాలిని శిక్షించు." అన్నాడు సుగ్రీవుడు బాధగా.

అప్పుడు రఘువీరుడైన శ్రీరాముడు చిరునవ్వు చిందిస్తూ –

'సుగ్రీవా! సూర్యుడిలాగా ప్రకాశించే అమోఘమైన నా బాణాలు త్వరలోనే వాలిని సంహరిస్తాయి. వాలి నా కంటపడకుండా ఉన్నంతవరకే బతికి ఉంటాడు. ఇద్దరం భార్యలను పోగొట్టుకొన్నవాళ్ళమే. నీ బాధ నాకు అర్థమయ్యింది. నేను వాలిని సంహరిస్తాను. నువ్వేం అధైర్య పడవద్దు.' అన్నాడు.

సుగ్రీవుడు పాదాభివందనం చేసి శ్రీరాముణ్ణి అర్చించాడు. శ్రీరాముడు వాలిని చంపగలడో లేదో నన్న అనుమానం అతనిది. అందుకే –

'శ్రీరామా! వాలి రోజూ సూర్యోదయానికి ముందే చతుస్సాగరాలలో స్నానం చేసి వచ్చేవాడు. అదీ వాలి వేగం. అతడికి అలసట అంటే ఏమిటో తెలీదు. పర్వతశిఖరాలతో బంతులాట ఆడగల సత్తా అతనిది. పెద్దపెద్ద చెట్లను సైతం కూకటివేళ్ళతో పెకలించి విరిచిపారేసేవాడు. అదీ వాలి బలం.

ఒకసారి ఏం జరిగిందో తెలుసా?! దుందుభి అనే రాక్షసుడు మా కిష్కింధ మీదికి వచ్చాడు. వాడు ముందు సముద్రునితో కయ్యానికి కాలుదువ్వితే సముద్రుడు భయపడి పోయి హిమవంతుని దగ్గరకు వెళ్ళమన్నాడట. ఆ హిమవంతుడేమో వాలిదగ్గరకు పంపించాడట.

దుందుభి పరమభయంకరుడు. వాడియైన కొమ్ములతో వర్షాకాలపు కారుమబ్బులా ఉన్నాడు. వాడి అడుగుల చప్పుడుకి కిష్కింధ ఉలిక్కిపడుతోంది. వాడి అరుపులూ దుందుభుల్లా మారుమోగిపోతున్నాయి.

చేతికి అందిన చెట్లను విరిచేస్తూ, గిట్టలతో భూమిని చీలుస్తూ, కొమ్ములతో కిష్కింధాపురద్వారాన్ని కుమ్మేస్తున్నాడు. వాడికి వెయ్యి ఏనుగుల బలం ఉంది. అంతటి దుందుభిని వాలి ఒక్కసారిగా పైకెత్తి, నేలపై చాచి కొట్టి మరీ చంపేశాడు.

ఆ దుందుభి శరీరాన్ని కోపంతో విసిరి అవతల పారేస్తే అది వెళ్ళి యోజన దూరంలో పడింది. అలా విసిరినప్పుడు ఆ రాక్షసుడి నోట్లోంచి కారుతున్న రక్తం చింది, కొన్ని చుక్కలు అనుకోకుండా మతంగమహర్షి ఆశ్రమంలో పడ్డాయి. దానికి ఆగ్రహించాడు మతంగమహర్షి. అందుకు కారకుడు వాలి కనక అతడి అనుచరులుగానీ తన ఆశ్రమం చుట్టుపక్కలకు వచ్చారా వాలి చస్తారని శపించాడు.

ఆ మహర్షి ఆశ్రమం ఇక్కడే ఉంది. శాపం కారణంగా వాలి ఈ చుట్టుపక్కలకు రాలేడు. వస్తే చస్తాడు. అదే నాకు ధైర్యం. భరోసా.'

వాలి విసిరిన దుందుభి శరీరం తాలూకు అస్థిపంజరం పర్వతాకారంతో ఇంకా అక్కడే పడి ఉంది. అలాగే అక్కడే ఏడు సాల వృక్షాలు కూడా ఉన్నాయి. వాటిని చూపిస్తూ అన్నాడు సుగ్రీవుడు.

'శ్రీరామా! ఈ చెట్లనే పట్టుకొని ఊపేసేవాడు వాలి. ఆకులన్నీ రాలిపోయేవి. చెప్పు నువ్వు వాలిని చంపగలవా?' తన అనుమానాన్ని బయటపెట్టాడు సుగ్రీవుడు.

లక్ష్మణుడు కలగజేసుకొన్నాడు. 'సుగ్రీవా! నువ్వు నమ్మాలంటే శ్రీరాముడు ఏం చెయ్యాలి?' అడిగాడు.

'ఆ దుందుభి కళేబరాన్ని కాలితో రెండువందల ధనువుల దూరం విసరాలి. శ్రీరామా! తప్పుగా అనుకోకు. వాలి శక్తిని నేను ప్రత్యక్షంగా చూసినవాణ్ణి. అతడు మహాబలశాలి. యుద్ధం అంటే అతనికి ఎంతో ఇష్టం. మదమతిప్పని పరాక్రమ వంతుడు. దేవతలకు సైతం సాధ్యం కాని ఎన్నో ఘనకార్యాలు సాధించిన వాడతడు. ఇన్నాళ్ళకి నీలాంటి మంచి మిత్రుణ్ణి పొందగలిగాను. అయితే నీ పరాక్రమం నేను ప్రత్యక్షంగా చూసినవాణ్ణి కాను. అందుకే నమ్మకం కోసం, ఇలా అడుగుతున్నానుగానీ నిన్ను అవమానించాలనో, నీకు కోపం తెప్పించాలనో కాదు.

వాలి దెబ్బకు హడలిపోయిన నా మానసికస్థితిని దృష్టిలో ఉంచుకొని నన్ను అర్థం చేసుకో. నిన్ను చూస్తుంటే నివురుగప్పిన నిప్పులా కనిపిస్తున్నావు. నీ తెగువా, మాటతీరూ, శక్తియుక్తులూ ఆ విషయాన్ని చెప్పకనే చెప్తున్నాయి సుమా! అయినా వాటిని నిరూపిస్తే మంచిదన్నదే నా ఆలోచన.' అని అన్నాడు.

సుగ్రీవుని మాటలకు దశరథరాముడు నవ్వుతూ – 'సరే! సుగ్రీవా! మా శక్తిసామర్థ్యాలేమిటో నీకు తెలియాలి. అంతేకదా! అయితే చూడు.' అంటూ కాలి బొటనవేలితో ఆ అస్థిపంజరాన్ని ఎగరగొట్టాడు. దుందుభి శరీరం పదియోజనాల దూరంలో ఎగిరిపడింది. అయినా సుగ్రీవుడికి నమ్మకం కలగలేదు. సుగ్రీవుడు మళ్ళీ మెల్లగా –

'వాలి విసిరినప్పుడు వాడి శరీరం పచ్చిది. అప్పుడు అది చాలా బరువు. పైగా అలసటలో ఉండి విసిరాడు వాలి. ఇప్పుడు ఆ కళేబరం ఎండిపోయింది. గడ్డిపోచలా తేలికగా ఉంటుంది కదా! పైగా నువ్వు ఇప్పుడు అలసిపోలేదు. శ్రీరామా! నీ మీద అనుమానం కాదు కానీ ఈ సాలవృక్షాలలో ఏ ఒక్క చెట్టునైనా బాణంతో కూలగొట్ట గలిగావంటే నువ్వు వాలిని చంపినట్లే.' అన్నాడు.

శ్రీరాముడు బాణం వేశాడు. ఆ బాణం ఏడు సాల వృక్షాలనూ చీల్చి, ఎదురుగా ఉన్న కొండచరియనూ పగలగొట్టి అంతే వేగంతో వచ్చి శ్రీరాముని అమ్ములపొదిలో కూర్చుంది.

ఆశ్చర్యపోయాడు సుగ్రీవుడు. నోట మాటరాలేదు. నమ్మకం కుదిరింది. 'శ్రీరామా! నీకు సాటిలేదు. ఇంద్రుణ్ణే కాదు; సర్వదిక్పాలకులనూ జయించగల శక్తిసామర్థ్యాలు కలవాడివి నువ్వు. ఇక ఆ వాలి ఏపాటి? ఒకే ఒక్క బాణంతో ఒక్క దెబ్బకే ఏడు సాలవృక్షాలనూ వాటితో పాటు పర్వత శిఖరాన్నీ కూల్చేసిన నీ పరాక్రమం అనన్యసామాన్యం. యుద్ధభూమిలో నీ ముందు నిలవగల మొనగాడు ఎవడూ లేడు. నా మనసు ఆనందంతో పరవళ్ళు తొక్కుతోంది.' అన్నాడు.

శ్రీరాముడు వాలిని యుద్ధానికి పిలువమన్నాడు.

## వాలి వధ

అందరూ కిష్కింధకు వెళ్ళారు. సుగ్రీవుడు ఆకాశం బద్దలయ్యేలా అరిచాడు. వాలి పరుగున వచ్చాడు. వస్తూనే కలియబడ్డాడు. వాలి సుగ్రీవుల యుద్ధం భీకరంగా సాగుతోంది. పెనుగులాటలతో, పిడిగుద్దులతో, ఒకళ్ళమీద ఒకళ్ళు చెలరేగి పోతున్నారు. శ్రీరామునికి వాళ్ళిద్దరూ బుధాంగారకుల్లాగా, అశ్వనీదేవతల్లాగా ఒకేలా కన్పిస్తున్నారు. ఎవడు సుగ్రీవుడో ఎవడు వాలో గుర్తుపట్టడం కష్టమయ్యింది. అందుకే బాణం వెయ్యలేదు. వెయ్యకపోయే సరికి వాలి చేతిలో సుగ్రీవుడు చావుదెబ్బలు తిని ప్రాణభయంతో ఋష్యమూకంవైపు పారిపోయి బతికిపోయాడు.

చావు తప్పి కన్ను లొట్టపోయినట్లు ఎలాగో బతికి బట్టకట్టిన సుగ్రీవుని దగ్గరకు శ్రీరామలక్ష్మణహనుమంతులు వచ్చారు. వెంటనే బాధతో సుగ్రీవుడు – 'ఏమయ్యా! శ్రీరామా! వాలిని యుద్ధానికి పిలవమన్నది వాలితో నన్ను చావగొట్టించ డానికేనా?' అన్నాడు.

అప్పుడు శ్రీరాముడు – 'సుగ్రీవా! కోపించకు. వేషంలో, ఒడ్డూ పొడుగులో, రూపంలో, నడకలో మీరిద్దరూ ఒకేలా ఉన్నారు. ఒకవేళ ఆ బాణం నీకు తగిలితే ఏంగాను చెప్పు? అలా జరిగితే నాకంటే మూఢుడు ఇంకెవరైనా ఉంటాడా? శరణాగతునికి అభయం ఇచ్చి, ఉసురు తీసిన పాపం నాకు చుట్టుకోదా! అందుకే బాణం వెయ్యలేదు. సరే! మించిపోయిందేమీ లేదుగానీ భయపడకుండా మళ్ళీ వెళ్ళు. ఈసారి నిన్ను గుర్తించడానికి ఏదైనా ఆనవాలు కావాలి.' అంటూ – 'లక్ష్మణా! ఇదుగో ఈ దండ సుగ్రీవుడి మెడలో వెయ్యి.' అన్నాడు. లక్ష్మణుడు వేశాడు.

గజపుష్పమాలతో మెడ రిక్కించి నడుస్తున్నాడు సుగ్రీవుడు. అందరితో కలిసి సప్తజనాశ్రమం మీదుగా కిష్కింధలోనికి ప్రవేశించి ఒకసారి శ్రీరామునివైపు చూశాడు. అప్పుడు శ్రీరాముడు –

'సుగ్రీవా! భయపడకు. ఎన్ని కష్టాలు ఎదురైనా ఇంతవరకూ నేను అబద్ధం ఆడలేదు. ఇకముందు ఆడను కూడా. ప్రతిజ్ఞ చెల్లించుకుంటాను. ధైర్యంగా వెళ్ళి వాలిని యుద్ధానికి పిలువు. వాలి యుద్ధప్రియుడు కాబట్టి తప్పక వస్తాడు. అందులోనూ శూరులు శత్రువు చేసిన పరాభవాన్నిగానీ తిరస్కారాన్నిగానీ సహించరు. అదీ స్త్రీసమక్షంలోనైతే అస్సలు సహించరు. ధైర్యంగా పిలువు.' అన్నాడు.

సుగ్రీవుడు బొబ్బలుపెడుతూ వాలిని యుద్ధానికి పిలిచాడు. ఆ అరుపులకి గోవులు కట్లు తెంచుకొని పరిగెత్తాయి. మృగాలైతే బెంబేలెత్తి అటూ ఇటూ దూకుతున్నాయి. ఎగిరే పక్షులు కాస్తా గ్రహోల్లా నేలరాలాయి.

అంతఃపురంలో ఉన్న వాలికి ఆ అరుపులు వినిపించాయి. సంధ్యాకాలపు సూర్యబింబంలాగా జేవురించిన ముఖంతో, భూమి కంపించేలాగా పెద్దపెద్ద అంగలు వేస్తూ పరుగులాంటి నడకతో బయలు దేరాడు వాలి. అప్పుడు వాలిని తార స్నేహపూర్వకంగా ఆలింగనం చేసుకుంది. ఇప్పుడు యుద్ధానికి వెళ్ళడం మంచిది కాదని చెప్పాలన్నది ఆమె తపన. కానీ ఆ మాట చెప్పడానికి భయపడుతోంది. అయినా సరే! ఇలా హితోక్తులు పలికింది.

'నాథా! ఇంతకుముందే నిన్ను యుద్ధానికి పిలిచి, నీ చేతిలో చావు దెబ్బలు తిని, పారిపోయిన సుగ్రీవుడు మళ్ళీ తిరిగివచ్చి ధైర్యంగా పిలుస్తున్నాడంటే ఆలోచించు. ఎవరి అండా లేకుండానే వచ్చాడంటావా?

మన అంగదుడూ ఇంకా కొంతమంది గూఢచారులూ ఓ వార్త తెచ్చారు తెలుసా?! ఆ సుగ్రీవునికి మహాపరాక్రమవంతుడైన శ్రీరాముడు అనే క్షత్రియునితో స్నేహం కుదిరిందట. బహుశా సుగ్రీవుడు ఆ శ్రీరాముని సహాయంతోనే మళ్ళీ వచ్చి ఉండవచ్చు. కాస్త కోపాన్ని నిగ్రహించుకొని ఆలోచించు. నాకెందుకో ఇప్పుడు నువ్వు వెళ్ళడం మంచిది కాదనిపిస్తోంది.

పోనీ సుగ్రీవునితో శత్రుత్వమన్నా మానుకోరాదూ. నీకు అతడేం బయటివాడు కాడు కదా! అతనికంటే దగ్గరివాడు ఇంకెవడుంటాడు? అతణ్ణి యువరాజును చేశావనుకో. శ్రీరాముడు నీకు మిత్రుడైపోతాడు. అప్పుడు ఏ బాధా ఉండదు.' చెప్పింది తార.

వాలికి ఆ మాటలు రుచించలేదు. తారను కసురుకొని – 'తారా! కుర్రకుంక, ఆ సుగ్రీవుడు నన్ను యుద్ధానికి కవ్విస్తుంటే చేతులు ముడుచుకొని కూర్చోమంటావా! అంతకంటే చావడమే నయం కదూ! ఇక శ్రీరాముడంటావా? ఇక్ష్వాకువంశంలో జన్మించాడు కాబట్టి ఎప్పటికీ ధర్మం తప్పడు. భయపడకు. సుగ్రీవుణ్ణి చంపనులే. నాలుగు తగిలించి, బాగా దేహశుద్ధి చేసి విడిచిపెడతాను.' అని – మహాసర్పంలా బుసలు కొడుతూ వచ్చాడు వాలి.

సుగ్రీవుడు అగ్నిజ్వాలలా ప్రజ్వరిల్లుతూ వచ్చాడు. సుగ్రీవుణ్ణి చూడగానే వాలికి కోపం కట్టలు తెంచుకుంది. పిడికిలి బిగించి పళ్ళు పటపటా కొరుకుతూ మీదికి ఉరికి ఒక్క గుద్దు గుద్దాడు.

సుగ్రీవుడికి కళ్ళు గిర్రున తిరిగాయి. అక్కడే ఉన్న సాలవృక్షం తీసుకొని వాలిని కొట్టాడు. ఆ దెబ్బకి వాలి సముద్రంలో అల్లల్లాడే నావలా చలించిపోయాడు.

ఇద్దరూ ఇద్దరే. ఇంద్రుడొకడూ వృత్రాసురుడొకడూ అన్నట్లుగా ఉన్నారు. దెబ్బకు దెబ్బ. గుద్దుకు గుద్దు. ఉన్నకొద్దీ వాలి బలం పెరుగుతోంది. క్రమంగా తన శక్తి సన్నగిల్లిపోతుండడంతో సుగ్రీవుడు చాకచక్యంగా తప్పించుకుంటూ తనను తాను రక్షించుకొంటున్నాడు.

పరిస్థితి గ్రహించిన శ్రీరాముడు వెంటనే బాణం ఎక్కుపెట్టాడు. రఘునాథుడి దృష్టి వాలిపై కేంద్రీకృతమయ్యింది. చెవుల దాకా లాగిన వింటినారి చప్పుడుకు

వనచరాల్లో సంచలనం కలిగింది. ఏదో ప్రళయం ముంచుకు రాబోతోందన్నట్లుగా అవి పరుగులు తీయడం మొదలుపెట్టాయి.

రామబాణం పిడుగులా వాలి గుండెల్లో దిగబడింది. మొదలు నరికిన చెట్టులా కుప్పకూలిపోయాడు వాలి. రక్తం మడుగులో గిలగిలా తన్నుకుంటున్నాడు. ఒళ్ళంతా దుమ్ము.

వాలికి దేవేంద్రుడు ఇచ్చిన కాంచనమాల మెడలో ఉంది. అందువల్ల ప్రాణం పోలేదు. శోభ తగ్గలేదు. ప్రళయకాలంలో రాలిపడ్డ సూర్యుడిలా ఉన్నాడు. శ్రీరామలక్ష్మణులు వాలి దగ్గరకు వెళ్ళారు.

వాలి వాళ్ళను పరిశీలనగా చూసి ఇలా అన్నాడు.

'శ్రీరామా! నువ్వు రాజకుమారుడివి. సత్యసంపన్నుడివి. పైగా వ్రతదీక్షలో ఉన్నావు. మరి ఎందుకిలా చేశావు? రాముడంటే దయామూర్తి అని నమ్మానే! ప్రజాహితమే అతని కోరిక అనీ భావించానే. అన్నీ తెలిసీ ఎందుకు వెనుకచాటుగా నన్ను కొట్టావు. నా భార్య ముందే చెప్పింది నీ గురించి. కానీ నువ్వు ధర్మాత్ముడివని నమ్మి ఆమె మాట లక్ష్యపెట్టలేదు. నన్ను చాటునుంచి కొట్టావే. ఇది నీకు ధర్మమేనా?

*రాజా! ఇంద్రియనిగ్రహం, సహనం, ధర్మం, ధైర్యం, సత్యం, పరాక్రమం, అపకారం చేసినవారిని దండించడం రాజధర్మాలు. నిష్కారణంగా నన్ను ఎందుకు దండించావు? నేను నీకేం అన్యాయం చేశాను? నీ జోలికి వచ్చానా? శిక్షకు కూడా కొన్ని నియమాలంటూ ఉంటాయి.* ***రాజు నీతిమంతునిగా ఉండాలి. వినయంతో ఉండాలి. మంచివాళ్లను అనుగ్రహించాలి. చెడ్డవాళ్ళని శిక్షించాలి.*** **అంతేకానీ నేను రాజుని కదా నన్ను అడిగేవాడు ఎవడుంటాడులే అని ఎవడిని బడితే వాడిని ఎలా పడితే అలా చంపడానికి వీల్లేదు.** మరి ఏ కారణం చేత నన్ను చంపావో చెప్పు?!

అసలు నీకూ నాకూ ఏమిటి సంబంధం? నా దేశం, నగరం, తిండి, బతుకూ వేరు. నువ్వు నరునివి. నేను వానరుణ్ణి. నేను నీ దేశంలోగానీ నీ నగరంలోగానీ ఏ తప్పూ చేయలేదు.

పోనీ వేటకోసం నన్ను చంపానంటావా? నా శరీరం, మాంసం, చర్మం, గోళ్ళు ఇవేమీ పనికిరావు. పోనీ నాతో యుద్ధం చేద్దామనా? అదీ లేదు కదా. నాతో వీరునిలా యుద్ధం చేస్తే ఈ పాటికే నీకు యముణ్ణి చూపించేవాణ్ణి.

నీ భార్య కోసమే ఇంతా చేశావా? నాకో మాట మాత్రం చెప్తే ఆ రావణుణ్ణి తెచ్చి నీ కాళ్ళదగ్గర పడవేసేవాణ్ణే! చెప్పు? నన్నెందుకు చంపావో చెప్పు?

నువ్వు జితేంద్రియుడివనీ, ఓర్పుకలవాడివనీ, ధర్మపరుడవనీ, ధైర్యశాలివనీ అపరాధుల్ని మాత్రమే శిక్షిస్తావనీ విన్నాను. కానీ నువ్వో పాపాత్ముడివనీ గడ్డికప్పిన గొయ్యివనీ తెలుసుకో లేకపోయాను. నువ్వు మంచివాడి ముసుగులో ఉన్న దుర్జనుడివి. నువ్వు మర్యాదలకు తిలోదకాలిచ్చి ఇష్టం వచ్చినట్లు ఎవరినిపడితే వారిని చంపుకుంటూ పోతున్నావు. వాలిని ఎందుకు చంపావని సజ్జనులు నిన్ను అడిగితే ఏం చెప్తావు?' అన్నాడు నీరుకారిన మేఘంలా, చల్లారిన అగ్నిలా ఉన్న వాలి.

వాలి పలుకుల్ని సహనంతో విన్న రఘుకులతిలకుడు శాంతంగా – 'వాలీ! విను. ప్రతి ప్రాణికీ హృదయంలో పరమాత్మ ఉంటాడు. ఆ పరమాత్మకు తెలుస్తుంది ఏది పుణ్యమో, ఏది పాపమో, ఏది ధర్మమో ఏది అధర్మమో. నువ్వు చపలుడివి. జాత్యంధుడిలాగా ప్రవర్తిస్తున్నావు. ధర్మం గురించి మాట్లాడుతున్నావు. అది చాలా సూక్ష్మమైనది. అసలు ధర్మం గురించి నీకేం తెలుసు? ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించావు. ఇప్పుడు ఫలితం అనుభవిస్తూ నన్ను నిందిస్తున్నావు. నన్నే నిలదీస్తున్నావు.

వాలీ! నిన్ను చంపటం ధర్మమే. ఎందుకో చెప్తాను. విను. ఈ భూమండలం మొత్తం మా ఇక్ష్వాకువంశీయులది. నువ్వూ నీ రాజ్యంతో సహా మా రాజ్యంలో భాగమే. నువ్వు ధర్మం తప్పావు. తమ్ముణ్ణి కొట్టి పంపివేశావు. తమ్ముడు బతికి ఉండగా అతని భార్య రుమను చెరపట్టావు. *ఏమంటోంది ధర్మశాస్త్రం? తమ్ముణ్ణి* కొడుకులా కోడలిని కూతురులా చూసుకోమంటోంది. సుగ్రీవుడు నీకు కొడుకైతే ఆమె భార్య రుమ నీకు కోడలే కదా. మరి నువ్వు ఆమెను చెరబట్టావే? అందుకే నీకీ శిక్ష. పైగా సుగ్రీవుడు నిన్ను క్షమించమని వేడుకున్నాడు. క్షమను మించిన *గుణం లేదు. అయినా నువ్వు క్షమించలేదు. పాపాత్ముడు క్షమించలేదు. ఇలాంటి పాపానికి మరణమే దండన.*

పైగా నువ్వు వానరుడివి. మానవుడివి కావు. నీకు చెప్పి చంపవలసిన అవసరం నాకు లేదు. మానవులు జంతువులను మాటువేసి చంపడం ఉండనే ఉంది. బాగా ఆలోచిస్తే ఈ ధర్మసూక్ష్మం నీకే అర్థమవుతుంది. **చేసిన పాపానికి *రాజు దండన విధిస్తే ఆ పాపం అంతటితో నశించి, స్వర్గం లభిస్తుంది.***

మా వంశంలోని చక్రవర్తి మాంధాత ఇలాంటి పాపంచేసిన శ్రమణుడికి ఇదే శిక్ష విధించాడు. కాబట్టి, నిన్ను చంపడం ధర్మబద్ధమే. ధర్మం పట్ల మేమెప్పుడూ అస్వతంత్రులమే. మా ఇష్టం వచ్చినట్లు శిక్షలు విధించడానికి వీల్లేదు. తప్పించ డానికీ వీల్లేదు.

వాలీ! ఇప్పటికైనా కోపం విడిచిపెట్టు. దుర్లభమైన ధర్మానికీ శుభప్రదమైన జీవితానికీ మహారాజులే నిర్ణేతలు, ప్రదాతలున్నూ. మహారాజులు మానవరూపంలో తిరిగే దేవతలేనని తెలుసుకో.' అన్నాడు.

వాలికి కనువిప్పు కలిగింది. పశ్చాత్తాపంతో – 'శ్రీరామా! నీకు నువ్వే సాటి. నన్ను చంపినందుకు నాకు బాధలేదుగానీ నా ఒక్కగానొక్క కొడుకు అంగదుని గురించే నా దిగులు.' 'శ్రీరామా! నా మీద ఉన్న కోపాన్ని సుగ్రీవుడు నా కొడుకు అంగదుని పైనా, నా భార్య తార పైనా చూపించకుండా చూసే బాధ్యత నీదే' అని మూర్ఛపోయాడు.

* * *

వార్త తెలిసిన తార పరుగున వచ్చింది. గుండె లవిసేలా ఏడ్చింది.

వాలి మెల్లిగా స్పృహ తెచ్చుకొని సుగ్రీవుణ్ణి పిలిచి – 'సుగ్రీవా! అంగదుణ్ణి జాగ్రత్తగా చూసుకో. వాడు ఈ వాలికి తగిన సుతుడు. నీకు యుద్ధాల్లో చేదోడు వాదోడుగా ఉంటాడు. సుషేణుడి కూతురైన ఈ తార చురుకైనది. మంచి చెడులు తెలిసిన ప్రజ్ఞావంతురాలు. కష్టాల్లో ఉన్నప్పుడు ఆమె చెప్పే మాటలు ఎంతో విలువైనవి. ఆమె మాటను గౌరవించు. తీసి పారెయ్యకు. శ్రీరాముడు నిన్ను నమ్మి నీ సహాయం కోరాడు. అతని పని శ్రద్ధగా చేసిపెట్టు. నువ్వు శ్రీరామకార్యాన్ని నెరవేర్చకపోతే అది అధర్మం. అప్పుడు శ్రీరాముని చేతిలో నువ్వూ మరణిస్తావు. ఇదుగో కాంచనమాల. దీన్ని ధరించావంటే నీకు అపజయం ఉండదు. ఇది నా

మెడలో ఉండగానే నేను మరణిస్తే దీని శక్తిపోతుంది. త్వరగా తీసుకొని నీ మెడలో వేసుకో!' అన్నాడు. ఆ తరువాత అంగదుణ్ణి దగ్గరికి రమ్మని పిలిచి –

**'నాయనా! అంగదా! నేను చనిపోయిన తర్వాత నీ పినతండ్రి సుగ్రీవుడు చెప్పినట్లు నడుచుకో!** ***దేశ కాల పరిస్థితులను అనుసరించి ప్రవర్తించు. ప్రియమైన వాటికి పొంగిపోవడం కానీ అప్రియమైనవాటికి క్రుంగిపోవడంగానీ చేయకు. సుఖదుఃఖాలను సమానంగా స్వీకరించు. ఎవరితోనూ అతిగా స్నేహంచేయవద్దు. ఎవరినీ అతిగా ద్వేషించనూ వద్దు.'*** **ఇలా కొడుక్కి సుద్దులు చెప్పి, వాలి కన్ను మూశాడు.**

## తారావిలాపం

వానర వీరులంతా గొల్లుమన్నారు. తార వాలి శరీరంపై పడి బావురుమని ఏడ్చింది. నన్నూ చంపెయ్యమని శ్రీరాముణ్ణి బతిమలాడుకుంది. తార శోకానికి అంతు లేకుండా పోయింది. బాధతో ఇలా విలపించింది.

**'నాథా! నీకు భూదేవి అంటే ఎంత ఇష్టమైతే మాత్రం నన్ను ఇలా ఒంటరిదాన్ని చేసి మరణించి, భూదేవికి నీశరీరస్పర్శను అనుగ్రహిస్తున్నావా? కిష్కింధకంటే అందమైన ఇంకో నగరాన్ని స్వర్గమార్గంలో ఎక్కడైనా ఏర్పాటుచేసుకున్నావా ఏమిటి? అందుకేనా ఇక్కడి వనాలనూ, పర్వతగుహల్నీ విడిచిపెట్టి వెళ్ళిపోతున్నావు? నువ్వు లేని నా జీవితం వ్యర్థం. దుర్భరం. స్త్రీకి ఎన్ని ఐశ్వర్యాలు ఉన్నా భర్తదూరమైతే** ***సర్వసౌభాగ్యాలూ నశించిపోయినట్లే.'*** అని విలపిస్తూ అంగదుణ్ణి చూసి, ఈ అంగదుడు ఏమైపోతాడో ఏమిటో! అంగదా! రా! నీ కన్నతండ్రిని తనివితీరా చూసుకో నాయనా! మళ్ళీ మనకు కనిపించడు.' అని పిలిచింది.

అంగదుడు వాలినీ తారనీ సమీపించాడు. వాలికి అంగదుణ్ణి చూపిస్తూ –

'నాథా! ఇదుగో నీ ప్రియపుత్రుడు, ఏం చెప్తావో చెప్పు? సుగ్రీవునికి ఇచ్చిన మాట నిలబెట్టుకొని శ్రీరాముడు పెద్ద ఘనకార్యమే చేశాడు. అతని ఋణం తీరిపోయింది.

సుగ్రీవా! నువ్వు శాంతించావా? నీ కళ్ళు చల్లబడ్డాయా! అంతా అయి పోయింది. నీకు శత్రువైన నీ అన్న వాలి మరణించాడు. ఇక రుమతో కలిసి సకల భోగాలూ నువ్వు నిశ్చింతగా అనుభవించు.

ప్రాణనాథా! ఒక్కసారి నన్ను చూడు. మాట్లాడవేమిటి? ఇంతగా విలపిస్తున్న నీ ప్రియభార్యను ఓదార్చవెందుకు?

ఇరుగో! నీ భార్యలందరూ వచ్చి ఎలా ఏడుస్తున్నారో చూడు. తెలిసో తెలియకో నేనుగానీ అంగదుడు గానీ ఏమైనా తప్పుచేసి ఉంటే క్షమించు.

నాథా! ఎంత చెప్పినా నా మాట విన్పించుకున్నావు కాదే! ఏ నేలపై శత్రువుల్ని కూలగొట్టావో ఆ నేలపైనే ఇప్పుడు నువ్వే కూలిపోయావా? నన్ను అనాథను చేసి వెళ్ళిపోయావా? ఇంతకు ముందు నేను వీరపత్నిని. ఇప్పుడు విధవను.' అని దీనాతిదీనంగా విలపిస్తున్న తార – ఆకాశంనుండి రాలిపోయిన తారలా ఉంది.

ఆ తారను ఓదార్చే ప్రయత్నం చేస్తూ హనుమంతుడు –

***'ఎంతటివారైనా సరే కర్మఫలాన్ని అనుభవించక తప్పదు. జీవితం ఒక నీటి బుడగ లాంటిదని తెలుసుకొని ప్రతి జీవీ తన గురించి తానే జాలిపడాలి. తారా! నువ్విప్పుడు ఎవరికోసం దుఃఖిస్తున్నావు? ఎవరిని గురించి జాలిపడుతున్నావు?*** **సర్వమూ అశాశ్వతమే. నీ బిడ్డ భవిష్యత్తు గురించి ఆలోచించు. నువ్వే మా అందరికీ దిక్కు. వాలికి దహన సంస్కారాలు జరిపించి, అంగదునికి పట్టాభిషేకం గురించి ఆలోచించు.'** అన్నాడు.

అందుకు బదులుగా తార – 'నా వల్ల కాదు హనుమంతా! వీటన్నింటికీ సుగ్రీవుడు ఉన్నాడు. అతడే చూసుకుంటాడు.' అంది.

ఇదంతా చూసిన సుగ్రీవుడూ చలించిపోయాడు. ఎందుకీ రాజ్యం? ఎందుకీ భోగాలు? విరక్తి కలిగి, శ్రీరామునితో ఇలా అన్నాడు.

'సాకేతరామా! నువ్వు నీ మాట నిలబెట్టుకున్నావు. కానీ నా అన్న మరణం నాకు దుఃఖాన్నే మిగిల్చింది. నాకు సంతోషం ఎంతమాత్రమూ లేదు. నా అన్న ఎంత మంచివాడు! నా మీద ఎంత కోపం వచ్చినా, నన్ను కొడితే కొట్టాడేమో కానీ చంపలేదు. అదీ సోదరప్రేమ అంటే. ఛీ! మరి నేనూ ఉన్నాను? నా కోతిబుద్ధి చూపించాను. అన్నను చంపించాను. నాకు రాజయ్యే అర్హత లేదు. అసలు ఈ భూమ్మీద జీవించి ఉండే అర్హత అంతకన్నా లేదు.

అంగదుణ్ణి చూడు. ఎంత ఆందోళనపడుతున్నాడో! తండ్రి లేడన్న బాధతో బిడ్డ ఏమయిపోతాడో ఏమో! నేను కూడా అగ్నిలో దూకేస్తాను. వానరవీరులు సీతాన్వేషణ జరుపుతారు. నీ కార్యం సిద్ధిస్తుంది. ఈ కులద్రోహిని క్షమించు శ్రీరామా!'

సుగ్రీవుని మాటలకు శ్రీరాముడి హృదయం ద్రవించిపోయింది. ఏం చెయ్యాలో తెలియలేదు. తారవైపు చూశాడు.

తార కూడా శ్రీరాముణ్ణి చూసింది. అదే మొదటిసారి! తార శ్రీరాముణ్ణి చూడటం. ధనుర్బాణాలు ధరించి సూర్యుడిలా ప్రకాశిస్తున్న శ్రీరాముణ్ణి చూసి అతడి దగ్గరకు వెళ్ళింది.

'శ్రీరామా! నువ్వు ధర్మాత్ముడివి. దివ్యతేజస్సు కలవాడివి. ఏ బాణంతో నా భర్తను సంహరించావో ఆ బాణంతోనే నన్నూ సంహరించు. వాలి లేకుండా నేను జీవించలేను. నేను లేకపోతే వాలికీ స్వర్గంలో సుఖం ఉండదు. సీతాదేవి లేకుండా నువ్వు ఆనందంగా ఉండగలవా? నువ్వు చంపింది వాలి శరీరాన్ని. నేను వాలి ఆత్మను. నన్ను చంపితే ఆత్మనుకూడా చంపినట్లవుతుంది. రా! నన్నూ చంపు.' అంటూ దుఃఖావేశంతో ఊగిపోతోంది తార.

అమె పరిస్థితిని చూసి శ్రీరాముడు – 'తారా! వీరపత్నీ! ఏమిటి? మతి లేకుండా మాట్లాడుతున్నావు? ***అంతా తలరాతను బట్టే జరుగుతుంది. దాన్నిబట్టే సుఖాలూ దుఃఖాలూ అన్నీ. ముల్లోకాలూ విధి చేతిలో కీలుబొమ్మలు.*** *వాలి మరణించాలనీ అంగదుడికి పట్టాభిషేకం జరగాలనీ రాసిపెట్టి ఉంది. విధి రాతను ఎవరూ తప్పించలేరు.* కాబట్టి, నీలాంటి వీరపత్నులు దుఃఖించకూడదు.' అని ఊరడించాడు.

తార కొంచెం తెప్పరిల్లింది. అక్కడి వాతావరణం గంభీరంగా ఉంది.

తనకీ బాధగానే ఉన్నప్పటికీ నిగ్రహించుకొని, ఆ గాంభీర్యాన్ని చీలుస్తూ అందరికీ వినబడేలా శ్రీరాముడు– 'కాలగతిని ఎవడూ మార్చలేడు. ఇక బాధపడడం మాని, జరగవలసింది చూడండి.' అన్నాడు.

అప్పుడు హనుమంతుడు – 'శ్రీరామప్రభూ! సుగ్రీవునికి నీ చేతులతో నువ్వే పట్టాభిషేకం జరిపించాలి.' అన్నాడు.

దానికి రామభద్రుడు – 'మా నాన్నగారికి ఇచ్చిన మాట ప్రకారం నేను అడవిలోనే ఉండాలి. నగరానికి రాకూడదు. వానరులలోని పెద్దలతో ఆ కార్యక్రమం జరిపించండి. సుగ్రీవా! నువ్వు పట్టాభిషేకం చేసుకొన్నాక అంగదుణ్ణి యువరాజుని చెయ్యి. ఇప్పుడు వర్షాకాలం. కాబట్టి సీతాదేవిని వెతకడానికి తగిన సమయం కాదు. నువ్వు నీ మందిరంలో విశ్రాంతి తీసుకో. మేం ప్రస్రవణపర్వతం మీదే ఉంటాం. నాలుగు నెలల తర్వాత పని మొదలుపెడదాం.' అన్నాడు. అలాగేనన్నాడు సుగ్రీవుడు.

## లక్ష్మణుని కోపం

అన్నీ అనుకున్నట్లుగానే జరిగాయి. వర్షఋతువు వెళ్ళి శరదృతువు ప్రవేశించింది. తారతోనూ, రుమతోనూ సుగ్రీవుడు సుఖాల్లో తేలుతున్నాడు. వర్షర్తువు వెళ్ళిపోయినా ఉలుకూ లేదు పలుకూ లేదు. మంత్రులకైనా దర్శన మిస్తున్నాడా! అంటే అదీ లేదు. ఈ పరిస్థితిని గమనించిన హనుమంతుడు సుగ్రీవుని దగ్గరకు వచ్చాడు.

**'ఓ మహావీరా! సుగ్రీవా! ఏ పనైనా తగిన సమయానికి చెయ్యాలి. కాలం చెల్లిన తర్వాత ఎంత ఘనకార్యం చేసి ఏం లాభం? మనం సీతాదేవిని వెతకాలి. అది మన బాధ్యత. శ్రీరాముడు వచ్చి ఏం చేస్తున్నారని అడిగేలోపే పనులు ప్రారంభించాలి.'** అని గుర్తుచేశాడు.

సుగ్రీవుడు గుహనుంచి బయటకు వచ్చాడు. హనుమంతుని సూచనకు ఆనందించాడు. 'పదిహేను రోజుల్లోగా అన్నివైపులనుండి వానరసైన్యం రావాలి. తక్షణం తెప్పించండి.' అని ఆదేశించి మళ్ళీ గుహలోనికే వెళ్ళిపోయాడు.

కాలం గడుస్తున్న కొద్దీ శ్రీరామునిలో ఉత్కంఠ. లక్ష్మణుడితో – 'లక్ష్మణా! చూడు సుగ్రీవుడు! చేస్తానన్న పని ఇంకా మొదలుపెట్టనే లేదు. రాజ్యాన్ని పోగొట్టుకొని వనవాసానికి వచ్చి, ఇక్కడ భార్యనూ పోగొట్టుకున్న నాపై సుగ్రీవుడికి దయ ఏమాత్రమూ లేదు. **నమ్ముకున్నవాళ్ళకీ, ఉపకారం చేసినవాళ్ళకీ ఆశపెట్టి దానిని నెరవేర్చనివాడు పురుషాధముడు. మాటనిలబెట్టుకొన్న వాడే పురుషోత్తముడు.**

**తాము కృతార్థులై, తోటివారిని కృతార్థుల్ని చెయ్యని కృతఘ్నులుంటారే వాళ్ళ మాంసాన్ని కుక్కలు కూడా ముట్టుకోవు.** శరదృతువు వచ్చేసింది. కిష్కింధకు

వెళ్ళు. వాలిని సాగనంపిన దారి ఇంకా మూసుకుపోలేదని సుగ్రీవునితో చెప్పు.' అన్నాడు.

లక్ష్మణునికైతే కోపం మరింత పెరిగిపోయింది. అసత్యవాది అయిన ఆ సుగ్రీవుణ్ణి అక్కడే చంపేసివస్తానన్నాడు.

'ఆవేశపడవద్దు లక్ష్మణా! ముందు వెళ్ళి మంచిగా మాట్లాడి రా!' అన్నాడు. లక్ష్మణుడు అలాగేనంటూ వెళ్ళాడు. దారిలో కనిపించిన అంగదునితో లక్ష్మణుడు– 'సుగ్రీవా! మాట నిలబెట్టుకో! శ్రీరాముడు చాలా బాధపడుతున్నాడు. ఈ లక్ష్మణుడు వచ్చి నీ వాకిట్లో నిల్చున్నాడు.' అని తన సందేశం పంపాడు.

లక్ష్మణుడు కోపంతో ఊగిపోతున్నాడు. అతణ్ణి శాంతింపజేయాలని వానరులు ప్రయత్నిస్తున్నారు. రకరకాల శబ్దాలు చేస్తున్నారు.

మద్యం మత్తులో ఉన్న సుగ్రీవునికి ఆ మాటలు తలకెక్కలేదు. మంత్రులూ, హనుమంతుడూ సుగ్రీవునికి హితబోధ చేయడంకోసం వచ్చారు. హనుమంతుడు సుగ్రీవునితో –

'సుగ్రీవా! **శ్రీరామునితో మన కర్తవ్యం గురించి మనం మళ్ళీ చెప్పించుకోక ముందే పని ప్రారంభించడం మంచిది. అప్పుడు మనం కావాలని ఆలస్యం చేసినట్లు కాదు. అలా చేశామని శ్రీరాముడు అనుకోడు. కానీ శ్రీరాముడే మనల్ని ప్రేరేపించాక మనం ఆ పని చేయడం మొదలుపెట్టామా! తప్పు మనదే అవుతుంది. ఆలస్యానికి బాధ్యులం మనమే అవుతాం. సమయం మించిపోకుండానే చేయవలసిన పనిని చేయాలి. సమయం మించిపోయాక ఎంతబాగా చేసినా ఆ పని సఫలం కాదు. గుర్తుంచుకో!**

పైగా భార్య అపహరణకు గురికావడంతో శ్రీరాముడు ఆర్తితో ఉన్నాడు. కాబట్టి ఆయన కోపగించడం సహజం. ***(పనిని అప్పగించినవాళ్ళకు మనం ఆ ప్రయత్నంలోనే ఉన్నట్లు తెలియజెయ్యాలి. అప్పుడు వాళ్ళకు నిశ్చింత. లేదంటే ఆగ్రహిస్తారు).*** అందుకే శ్రీరాముడు తన ఆవేదనను లక్ష్మణునిద్వారా మనకు తెలియజేస్తున్నాడు. ఆయన మాటలు పరుషంగా ఉండవచ్చు. నువ్వు ఓర్చుకోవాలి. ***(బాధలో ఉన్నవాళ్లు కఠినంగా మాట్లాడినా పట్టించుకోకూడదు).'*** అని హితవు పలికాడు.

హనుమంతుని మాటలతో తెలివి తెచ్చుకున్నాడు సుగ్రీవుడు. మత్తు వదిలి వానరులతో ఇలా అన్నాడు.

'లక్ష్మణునికి ఎందుకు కోపం వచ్చిందో తెలీదు. ఎవరైనా నాపై చాడీలు చెప్పారేమో! నాకు రాముడన్నా లక్ష్మణుడన్నా భయం లేదు. కానీ నా మిత్రునికి అకారణంగా కోపం వస్తే నాకు కంగారు కాదూ. ***మిత్రుణ్ణి సంపాదించడం సులభమే కానీ స్నేహం నిలబెట్టుకోవడం చాలా చాలా కష్టం.*** *ఎందుకంటే మనస్సు చంచలమైనది. స్నేహం చెడిపోవడానికి ఏ చిన్న కారణమైనా చాలు.* అందుకే నా భయం. నాకూ శ్రీరామునికీ ఉన్న స్నేహం కాస్తా చెడిపోతే శ్రీరామునికి ప్రత్యుపకారం చేసే అవకాశాన్ని నేను కోల్పోతాను. ఇప్పుడేం చేయాలో ఆలోచించండి.'

ఆలోచించి, ఆలోచించి లక్ష్మణుణ్ణి శాంతింపజేయడంకోసం తారను పంపాడు సుగ్రీవుడు.

తార మంచం మీదనుండి లేచింది. ఆమె కళ్ళు మత్తుగా ఉన్నాయి. మొలనూలు జారిపోతోంది. తూలుతూ లక్ష్మణుని దగ్గరికి వెళ్ళింది. ఆమెను చూడగానే లక్ష్మణుడు ముఖం తిప్పుకున్నాడు. కానీ అతని కళ్ళు మాత్రం ప్రసన్నంగా ఉన్నాయి. ఆచి తూచి మాట్లాడుతోంది తార.

'లక్ష్మణా! ఎందుకయ్యా! నీకంత కోపం? ఎవడు నీ మాటను ధిక్కరించిన వాడు? దావానలానికి ఎదురు వెళ్ళిన ఎండుచెట్టులా కోరి కోరి ఎవడు బూడిదవ్వా లనుకుంటాడు చెప్పు.' అంది.

ఆ మాటలకు లక్ష్మణుని కోపం చల్లారింది. కొంచెం మెత్తబడి ఇలా అన్నాడు.

'తారా! సుగ్రీవుడు మద్యం మత్తులో ఉన్నాడు. ఇచ్చిన గడువు పూర్తయ్యింది. సీతాదేవిని వెదకడం మొదలుపెట్టలేదు. మరి కోపగించుకోక మమ్మల్నేం చెయ్యమంటావో నువ్వే చెప్పు?'

లక్ష్మణా! మీ లాంటి గొప్పవాళ్లే కోపానికి లొంగిపోతే ఎలా? అయినా నీకు సాయం చేస్తున్న ఈ వానరులు మీ వాళ్ళు కారా! వాళ్లు తప్పుచేస్తే మీరుకాక ఎవరు క్షమిస్తారు? అయినా ఒకటి ఆలోచించు. నీ పరిస్థితి వేరు. నువ్వు కామాన్ని

దరిచేరనివ్వని స్థితితో ఉన్నావు. సుగ్రీవుడో! కామంతో పరవశిస్తున్నాడు. కామాతురుడికి లోకంతో ఏం పని?

మహామహా మహర్షులే కామానికి దాసులైపోతున్నారు. ఇక సుగ్రీవుడెంత? సుగ్రీవుడు నీకు సోదరసమానుడు. అతణ్ణి క్షమించు.' అని లక్ష్మణుడికి నచ్చచెప్పి, అతణ్ణి అంతఃపురానికి తీసుకువచ్చింది తార. అక్కడ విందులూ విలాసాలతో చాలా కులాసాగా కనిపించాడు సుగ్రీవుడు. అలా ఉన్న సుగ్రీవుణ్ణి చూసిన లక్ష్మణునికి మళ్ళీ అరికాలిమంట నెత్తికెక్కింది.

***'బ్రహ్మహత్య, మద్యపానం, దొంగతనం, వ్రతభంగంలాంటి పాపాలు చేసిన వాళ్ళకి కూడా ప్రాయశ్చిత్తం ఉంది. కానీ సుగ్రీవా! చేసిన మేలు మరిచే కృతఘ్నుడికి మాత్రం ప్రాయశ్చిత్తం లేదు. తెలుసుకో! నువ్వు నీ మాట నిలబెట్టుకోకపోయావో నిన్ను కూడా వాలి దగ్గరికే పంపిస్తా.'*** అన్నాడు.

మళ్ళీ తార అడ్డుపడి – 'రాజపుత్రా! సుగ్రీవుడు కృతజ్ఞత లేని వాడు కాడు. మంచివాడే. రావణుడి దగ్గర చాలామంది రాక్షసులు ఉన్నారు. వాళ్ళని చంపాలంటే సైన్యం కావాలి. ఈ విషయం నాకు వాలి స్వయంగా చెప్పాడు. అందుకే సుగ్రీవుడు సైన్యాన్ని సిద్ధం చేస్తున్నాడు. శాంతించు.' అంది. వెంటనే సుగ్రీవుడు అందుకొని– 'లక్ష్మణా! నేను మీ సేవకుణ్ణి. నా వల్ల ఏదైనా పొరపాటు జరిగితే క్షమించవలసినది.' అన్నాడు.

మొత్తానికి లక్ష్మణుడు శాంతించాడు. ఇద్దరూ పల్లకిపై శ్రీరాముని దగ్గరకు వెళ్ళారు. సుగ్రీవుడు శ్రీరాముని పాదాలకు నమస్కరించాడు. ఇంతలో వానర వీరులూ అక్కడికి వచ్చారు.

## వానరుల ప్రయాణం

శ్రీరాముడు చెప్తున్నాడు. 'సుగ్రీవా! ముందు సీతాదేవి బతికి ఉందో లేదో మనకి తెలియాలి. అలాగే రావణుడు ఎక్కడ ఉంటాడో తెలుసుకోవాలి. అప్పుడు గానీ ఏం చెయ్యాలో ఎలా చెయ్యాలో చెప్పలేం' అన్నాడు.

సుగ్రీవుడు వెంటనే అందరినీ పిలిచి – ఓ వానరవీరులారా! వినండి. వినతుడు లక్షమంది వానరులతో తూర్పువైపునకూ, అంగదుడి నాయకత్వంలో హనుమంతుడూ, జాంబవంతుడూ ఇంకా కొందరు వానరవీరులు దక్షిణంవైపునకూ,

రెండు లక్షలమందితో సుషేణుడు పశ్చిమదిక్కుకూ, శతబలుడూ మరో లక్షమంది ఉత్తరంవైపునకూ వెళ్ళి సీతాన్వేషణ సాగించాలి.

అందరికీ ఒకే ఒక్క నెల గడువు. ఆ గడువు దాటిందా మరణదండనే.'

సత్వరం ఆదేశాలు జారీ అయ్యాయి. సుగ్రీవుడు హనుమంతుణ్ణి పిలిచి– '*హనుమంతా! నీకు తిరుగన్నదే లేదు. నీ గమనాన్ని ఎవరూ అడ్డగించలేరు. దేవ దానవగంధర్వులలో నిన్ను ఎదిరించగల మొనగాడు ఒక్కడూ లేదు. తేజస్సూ, గమనమూ, వేగమూ, లాఘవమూ అన్నీ నీకు పుష్కలంగా ఉన్నాయి. అవన్నీ నీ తండ్రి ద్వారా సంక్రమించిన గుణాలు. ఈ పనికి సమర్థుడివి నువ్వే. ఉపాయమేదైనా ఆలోచించు.*' అన్నాడు.

ఆ మాటల్నిబట్టి హనుమంతుడే కార్యసాధకుడని అర్థం చేసుకున్నాడు కౌసల్యానందనుడు. తన పేరు ఉన్న ఉంగరాన్ని హనుమంతునికి ఇచ్చాడు. దీనిని సీతాదేవికి చూపిస్తే ఆమె నిన్ను నమ్ముతుందని చెప్పాడు.

హనుమంతుడు ఉంగరాన్ని శిరస్సుపై పెట్టుకుని, శ్రీరాముని పాదాలకు నమస్కరించి, కదిలాడు.

'సీతాన్వేషణలో అందరూ శక్తివంచన లేకుండా గట్టిగా ప్రయత్నం చెయ్యండి.' అని మళ్ళీ సుగ్రీవుడి హెచ్చరిక.

వానరవీరులు నాలుగు దిక్కులా వ్యాపించి అన్వేషణ సాగిస్తున్నారు. సీతాదేవి జాడను తెలుసుకొనేదీ రావణుణ్ణి సంహరించేదీ నేనేనంటే నేనేనంటూ ఉత్సాహంగా ఉరకలు వేస్తున్నారు. కొన్నాళ్లు గడిచాయి. ఒక్క దక్షిణం వైపునకు వెళ్ళిన గుంపు తప్ప మిగిలిన వాళ్ళందరూ సీతాదేవి కనబడలేదంటూ తిరిగి వచ్చేశారు.

దక్షిణంవైపు వెళ్ళిన వానరులు పల్లె – పట్నం, కొండా – కోనా, చెట్టూ – పుట్టా ఏదీ వదలకుండా భూగోళానికి జల్లెడపడుతున్నట్లుగా గాలించారు. ఎక్కడా సీతాదేవిజాడ లేదు. చివరికి కండుమహర్షి ఆశ్రమం కూడా వదల్లేదు. వెదికారు. ఆ పక్కనే మరో భయంకరారణ్యం ఉంది. దాన్నీ వదల్లేదు.

ఇంతలో పర్వతాకారుడైన ఒక భయంకర రాక్షసుడు వానరులపై విరుచుకుపడ్డాడు. వాణ్ణి చూసి అంగదుడు – రావణుడేమో అనుకొని ఒక్కగుద్దు గుద్దాడు. దెబ్బ కా రాక్షసుడు నెత్తురు కక్కుకొని చచ్చాడు.

ఆపై మళ్ళీ అన్వేషణ కొనసాగింది. వెదికి వెదికి వానరవీరులంతా బాగా అలసిపోయారు. ఆ పరిస్థితి గమనించిన అంగదుడు –

'వానరులారా! కాలం గడిచిపోతోంది. మన ప్రయత్నాలేవీ ఫలించడం లేదు. సుగ్రీవుడా చండశాసనుడు. అన్నంత పనీ చేస్తాడు.

**అనిర్వేదం చ దాక్ష్యం చ మనస శ్చాపరాజయః,**
**కార్యసిద్ధికరాణ్యాహుః తస్మాదేతత్ బ్రవీమ్యహమ్** (4-49-6)

***'అనిర్వేదం (ఉత్సాహం), సామర్థ్యం, మనస్సులో కూడా ఓటమిని అంగీకరించకపోవడం ఇవే మన కార్యాన్ని సాధించిపెడతాయి. వాటిని విడిచిపెట్టకండి. నిరుత్సాహ పడకండి'*** అని ప్రోత్సహించాడు.

అంగదుడి మాటలు పనిచేశాయి. మళ్ళీ అన్వేషణ సాగించారు వానరులు. అలా వెదుకుతూ ఒక అడవిలోకి వెళ్ళారు. అక్కడ తినడానికిగానీ తాగడానికి గానీ ఏమీ దొరకకపోవడంతో ఆకలిదప్పికలతో అలమటించిపోతున్నారు. దారిలో ఒక పెద్ద బిలం కనిపించింది. దాని పేరు ఋక్షబిలం. ఆ బిలంలోంచి పక్షులు బిలబిలా వస్తున్నాయి. వాటి రెక్కలు తడిగా ఉండడంతో లోపల కచ్చితంగా నీరు ఉండి ఉంటుందన్న ఆశతో అందరూ లోపలికి ప్రవేశించారు.

లోపల బంగారు వర్ణం కల పద్మాలతో, చేపలతో, తాబేళ్ళతో కళకళలాడుతున్న కొన్ని సరస్సులు ఉన్నాయి. ఆ సరస్సుల చుట్టూ బంగారపు కట్టడాలు మెరిసిపోతున్నాయి. ఆ పక్కనే విలువైన వస్త్రాలు, జంతువుల చర్మాలు. ఆ వెనుక తోటలు. ఆ తోటలనిండా పళ్ళు. ఓహ్... వానరులకు ఆనందమే ఆనందం.

ఈ వైభవాన్ని వీక్షిస్తూ ఆశ్చర్యపోతూ అడుగులు వేస్తూ ముందుకు సాగుతున్న వానరులకు అక్కడ – నారచీరలూ, కృష్ణాజినం ధరించి, దివ్యతేజస్సుతో ప్రకాశిస్తున్న ఒక తాపసి కన్పించింది. వానరులంతా ఆమె చుట్టూ చేరారు.

ఆమె పేరు స్వయంప్రభ. మేరుసావర్ణి కూతురు. హేమ అనే అప్సరసకు ప్రాణసఖి. మయుడు అనే దానవుడు తన మాయతో ఈ కాంచన వనం నిర్మించాడు. ఇక్కడే మయుడు వేల సంవత్సరాలు తపస్సు చేశాడు. బ్రహ్మదేవునినుంచి వరాలు పొందాడు.

కాలం గడుస్తోంది. హేమ అనే అప్సరసను చూసి మోహించాడు మయుడు. కొంతకాలానికి దేవేంద్రుడి చేతిలో మరణించాడు. అప్పుడు బ్రహ్మదేవుడు ఈ కాంచనవనాన్ని హేమకు ప్రసాదించాడు. ఈ తోటలూ భవనాలూ అన్నీ హేమవే. స్వయంప్రభ కాపలాగా ఉంటోంది.

హనుమంతుడు ఆమెకు నమస్కరించాడు. ఆమె తన గురించి చెప్పింది. వీళ్ళ గురించీ తెలుసుకొంది. కడుపునిండా పళ్ళు తినమంది. హనుమంతుడు తమ పని గురించి చెప్పి ఇక్కణ్ణుంచి బయటపడేదారి చెప్పమని అడిగాడు.

అప్పుడా స్వయంప్రభ ఇలా అంది – 'కపివీరులారా! ఈ బిలంలోనికి ప్రవేశించి ప్రాణాలతో బయటపడడం కుదరని పని. అయినా నేను మిమ్మల్ని రక్షిస్తాను.' అంటూ తన తపశ్శక్తితో వానరులందర్నీ ఆ బిలంనుంచి బయటపడేలా చేసింది. 'మీరు ఉన్నది దక్షిణసముద్రతీరంలోని వింధ్యపర్వత ప్రాంతంలో.' అని చెప్పి వెళ్ళిపోయింది.

చుట్టూ చూశారు వానరులు. చెట్లకు పువ్వులు విరబూసి ఉన్నాయి. అది చూసి వసంతం వచ్చిందనుకున్నారు.

సుగ్రీవుడు పంపింది మార్గశీర్షమాసంలో. పుష్యమాసందాకా గడువు. ఆ గడువు కాస్తా దాటిపోయింది. బిలంలోనే నెల రోజులు గడిచిపోయాయి. ఇప్పుడు మాఘఫాల్గుణమాసాలు కూడా గడిచిపోయాయి. వసంతం రాబోతోంది అనుకున్నారు వానరులు. అంగదుడి మనస్సు ఓటమిని అంగీకరించడం లేదు. అందుకే వానరుల్ని ఇంకా ప్రోత్సహించడానికి తానే స్వయంగా ప్రాయోపవేశానికి సిద్ధపడ్డాడు. అంగదుడిమాటనే తారుడులాంటి వానరయోధులు సైతం బలపరచటం గమనించిన హనుమంతుడు అంగదుని నాయకత్వ లక్షణాన్ని గుర్తించి– ఈ అంగదుడు కపిరాజ్యాన్ని హస్తగతం చేసుకున్నట్లే. అని అనుకున్నాడు.

ఆ తరువాత అంగదుడు వానరులతో ఇలా అంటున్నాడు.

'సుగ్రీవాజ్ఞను పాటించకుండా బతికి బయటపడగలవాడెవ్వడు? కాబట్టి మనకు ప్రాయోపవేశమే శరణ్యం. ఇది తప్ప వేరే దారి కన్పించడం లేదు. కార్యం సాధించకుండా తిరిగి వెళ్ళి మరణదండనను అనుభవించడం కంటే ఇక్కడే మరణించడం శ్రేయస్కరం.'

అంగదుడు చెప్తుంటే తక్కిన వానరులూ అవును నిజమే అంటున్నారు.

హనుమంతుడు వారిస్తున్నాడు. ఎవరూ వినే స్థితిలో లేరు. చాలాసేపు వాదోపవాదాలు జరిగాయి. అంగదుడు తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. దక్షిణం వైపునకు కొసలు ఉండే విధంగా దర్భలు పరుచుకొని, ఆచమనంచేసి తూర్పుదిక్కుకు తిరిగి కూర్చొన్నారు ప్రాయోపవేశానికి సిద్ధపడిన అంగదుడూ తక్కిన వానరులూ. శ్రీరామవనవాసం, దశరథుడి మరణం, భరతుడి భక్తిప్రపత్తులూ, రఘుపుంగవుడు చేసిన రాక్షససంహారం వీటి గురించే మళ్ళీమళ్ళీ చర్చించుకుంటున్నారు వాళ్ళలో వాళ్ళు.

## సంపాతి సాయం

పక్కనే ఒక పర్వతగుహ ఉంది. ఆ గుహలో ఒక పక్షిరాజు ఉన్నాడు. అతని పేరు సంపాతి. వానరుల కోలాహలానికి బయటికి వచ్చి చూశాడు. గుంపులు గుంపులుగా వానరులు కనిపించారు.. ఆహా! ఏమి నా భాగ్యం! దైవలీలలు ఎంత విచిత్రమైనవి? నా దగ్గరకే వచ్చి ఇంతమంది వానరులు ప్రాయోపవేశం చేసుకొంటున్నారే! వీళ్ళలో మరణించిన వారిని మరణించినట్లుగా ఎప్పటికప్పుడు నేను ఆహారంగా తింటాను. అనుకొంటూ బయటకు వస్తూ ఆ మాటలు పైకే అన్నాడు. సంపాతి అన్న మాటలు విన్న అంగదుడు హనుమంతునితో ఇలా అన్నాడు.

'హనుమంతా! చూడు! యముడే ఈ రూపంలో వచ్చినట్లున్నాడు. శ్రీరాముని కోసం మనమూ ప్రాణాలు అర్పిద్దాం. అయితే మనం ఏమీ సాధించకుండానే పోతున్నాం. అదే నాకు బాధగా ఉంది. మనకన్నా ఆ జటాయువు ఎంతో నయం. వీరోచితంగా పోరాడి మరీ చనిపోయాడు. పోరాడిన ఫలితమన్నా అతనికి దక్కింది.' అన్నాడు.

సంపాతికి గుండె ఆగినంత పని అయ్యింది. 'ఏమిటీ! జటాయువు మరణించాడా! ఏం జరిగిందసలు? ఓ వానరులారా! ఎవరు మీరు? నన్ను కిందికి దింపండి. నేను కదల్లేను. ముసలివాణ్ణి! ఆ జటాయువు నా సోదరుడు. దశరథుడు అతనికి మిత్రుడు.' అంటూ తమ గతం చెప్పడం ప్రారంభించాడు సంపాతి.

అది వృత్రాసురుణ్ణి సంహరించిన కాలం. ఆ కాలంలో నేనూ నా తమ్ముడు జటాయువూ పోటీపడి మరీ సూర్యమండలం వైపు ఎగిరాం. మధ్యాహ్నం కావడంతో సూర్యతాపానికి తట్టుకోలేక నా తమ్ముడు విలవిలలాడిపోయాడు. నేను రెక్కలను అడ్డుగా పెట్టి నా తమ్ముణ్ణి సూర్యతాపంనుంచి కాపాడాను. అయితే ఆ వేడికి నా రెక్కలు కాలిపోయాయి. అంతే! ఉన్నపళంగా వింధ్యపర్వతం మీద పడ్డాను. అప్పట్నుంచీ నా తమ్ముడేమయ్యాడో నాకు తెలియలేదు. ఇదుగో! ఇప్పుడు మీ మాటల ద్వారా తెలిసింది. అసలేమయ్యిందో చెప్పండి?' అన్నాడు ఆత్రంగా.

వానరులు సంపాతిని కిందికి దించారు. జరిగినదంతా చెప్పారు.

సంపాతి దుఃఖంతో కుమిలిపోతూ ఉంటే అంగదుడు అతణ్ణి ఓదారుస్తున్నాడు. అతని ఓదార్పుమాటలకు కొంచెం తేటపడి – 'అంగదా! కనీసం నేను శ్రీరామునికి మాట సాయమైనా చేసి తరిస్తాను.' అంటూ వానరులకు రావణుడి వివరాలు చెప్పడం ప్రారంభించాడు సంపాతి.

'ఒకరోజు, శ్రీరామా! లక్ష్మణా! అంటూ ఒక సుందరాంగి ఆకాశమార్గంలో విలపించడం చూశాను. రావణుడు ఆమెను బలవంతంగా ఎత్తుకుపోతూ కన్పించాడు. ఒకవైపు ఏడుస్తూనే మరోవైపు ఆభరణాలను జార విడుస్తోంది. ఆమె శ్రీరామనామాన్ని స్మరిస్తోంది. అందువల్ల ఆ తరుణి సీతాదేవేనని అనుకుంటున్నాను. ఇంక ఆ రావణుని నివాసం గురించి చెప్తాను వినండి.

ఇదుగో! ఈ సముద్రానికి అవతలివైపు, ఇక్కడికి వందయోజనాల దూరంలో సముద్రం మధ్యలో ఒక ద్వీపం ఉంది. అందులో లంకానగరం ఉంది. విశ్వకర్మ దాన్ని నిర్మించాడు. అదే రావణుని సామ్రాజ్యం. అక్కడే లంకలో రాక్షసస్త్రీల కాపలాలో ఉంది సీతాదేవి. నా దృష్టికి వంద యోజనాల దూరంలో ఉన్నది కూడా కన్పిస్తుంది. అందుకే చూసిమరీ చెప్తున్నాను. అదిగో! లంకలో సీతాదేవి పట్టుచీర కట్టుకొని కన్పిస్తోంది. రావణుడూ అక్కడే ఉన్నాడు. ఈ సముద్రం దాటే ఉపాయం చూడండి. ఈ లోగా నన్నూ సముద్రం దగ్గరకు తీసుకువెళ్ళండి.' అన్నాడు. చనిపోయిన తన తమ్ముడు జటాయువుకు ఈ సముద్రజలాలతో తర్పణాలు వదిలాడు.

జాంబవంతుడు అడిగిన మీదట సంపాతి అవీ ఇవీ ఇంకా తనకు తెలిసినవన్నీ చెప్తున్నాడు –

'నేను ఇక్కడే గిరిదుర్గంలో చాలా కాలంనుంచీ ఉంటున్నాను. సాధారణంగా **గంధర్వులకు కామం, సర్పాలకు కోపం, మృగాలకు భయం, మాకు ఆకలీ ఎక్కువ.** నాకు ఆహారం తీసుకురావడంకోసం వెళ్ళిన నా కొడుకు సుపార్శ్వుడు మహేంద్ర పర్వతం మీద కూర్చొని సముద్రంలోని జంతువుల కోసం చూస్తున్నాడట. అప్పుడు కాటుకకొండలా నల్లగాఉన్న ఒక దుష్టుడు ఉదయసూర్యుని కాంతితో ప్రకాశించే ఒక స్త్రీని ఎత్తుకుపోతున్నాడట. సుపార్శ్వుడు వాళ్ళను పట్టుకుందామని అనుకున్నాడట. కానీ ఆ నల్లనివాడు ప్రార్థించడంతో దయతలచి వదిలివేశాడట. ఆమె జనకుని కూతురు సీతాదేవి అనీ, ఆ రాక్షసుడు రావణుడనీ అక్కడ సిద్ధులు చెప్పుకొంటుంటే విన్నాడట. మొత్తం నాకు వచ్చి చెప్పాడు. నా రక్తం సలసలమని కాగిపోయింది. కానీ ఏం లాభం? నేనా!! రెక్కలు తెగిన పక్షిని. పైగా వృద్ధుణ్ణి. అందుకే ఈ మాట సాయం చేస్తున్నాను.

**కపివీరులారా! మీరంతా మహాబలవంతులు. రావణుడూ బలవంతుడే గానీ మీలాంటి సమర్థులకు అసాధ్యం అన్నదేదీ ఉండదు. అయిన ఆలస్యం చాలు. బయలుదేరండి. విజయాన్ని సాధించండి. మీకు శుభం కలుగుతుంది.**

సీతాదేవి గురించి నాకు అంతకుముందే తెలుసు. నేను రెక్కలు కాలి పడిపోయినప్పుడు నిశాకరుడు అనే ఒక మహర్షి ఆశ్రమానికి వెళ్ళి అతనికి నమస్కరించాను. కానీ ఆయన నన్ను గుర్తుపట్టలేదు. తర్వాత గుర్తుపట్టి – ఏమయ్యింది? అని అడిగాడు. నేను నా గురించి చెప్పాను. అప్పుడాముని ఇలా అన్నాడు.

సంపాతీ! నీ వల్ల ఇంకో కార్యం జరగవలసి ఉంది. సీతాదేవిని వెదుకుతూ వానరులు వస్తారు. వారికి సీతాదేవి జాడ చూపించు. అప్పుడు నీ రెక్కలూ, బలమూ తిరిగి నీకు వస్తాయి . ఇది నీ కర్తవ్యం సుమా!' అన్నాడు. అని సంపాతి వానరులకు చెప్తున్నాడో లేదో అంతలోనే అతనికి కొత్త రెక్కలు మొలుచుకొచ్చాయి.

'ఆహా! నా రెక్కలు నాకు వచ్చేశాయి. మీకు జయం కలుగుగాక.' అంటూ రెక్కలవేగాన్ని పరీక్షించుకోవడానికి రివ్వున ఆకాశంలోనికి దూసుకుపోయాడు సంపాతి.

వానరులు ఆనందాతిరేకంతో కేరింతలు కొట్టారు.

## వానరుల బలాబలాలు

కర్తవ్యం దిశగా ముందుకు కదిలి సముద్రతీరం చేరుకున్న వానరులు సముద్రాన్ని చూస్తున్నారు. ఆ మహాసముద్రం లోకానికి ప్రతిబింబంలా ఉంది. జలచరాలు భీకరంగా నోళ్ళు తెరుస్తున్నాయి. పెద్ద పెద్ద కెరటాలు పర్వతాకారంలో ఎగిసి పడుతున్నాయి. వానరుల్లో భయం, ఆందోళనలతో ఒళ్ళు గగుర్పొడిచింది.

అంగదుడు – ***'వానరవీరులారా! ఎందుకు మీలో నిరుత్సాహం? రండి! మనం ఉత్సాహంతో ఉరకలు వేసే సమయం రానే వచ్చింది. విషాదం మనసులోనికి రానీయకండి. అది చాలా చెడ్డది. కోపంతో ఉన్న పాము బాలుడినైనా చంపుతుంది. అలాగే విషాదం పురుషుణ్ణి నాశనం చేస్తుంది. విషాదంగా కూర్చుండిపోవడమంత పెద్ద దోషం మరొకటి లేదు. విషాదం అలుముకుంటే అంతే! బలమూ పౌరుషమూ అన్నీ నీరుగారిపోతాయి.*** **రండి! సుగ్రీవుని ఆజ్ఞను ఒక్కసారి గుర్తు చేసుకోండి. మీరంతా బలవంతులు. ఇప్పటిదాకా మీకు ఎదురన్నదే లేదు. అపజయం అంటే ఏమిటో మీకు తెలీదు. ముందు ఈ సముద్రాన్ని ఎవరు దాటగలరో చెప్పండి. మీ మీ బలాలు చెప్పండి.'** అన్నాడు.

'నేను పది యోజనాలు దూకగలను' అన్నాడు గజుడు. నేను ఇరవై – గవాక్షుడు. నేను ముప్పై – శంభుడు. ఋషభుడు అన్నాడు – నేను నలభై. గంధమాదనుడు తాను యాభై యోజనాలు దూకగలనన్నాడు. అయితే అందరూ వంద యోజనాలలోపే చెప్పారు.

అంగదుడన్నాడు – 'నేను వంద యోజనాలు దూకగలను. కానీ తిరిగి వచ్చే శక్తి ఉందో లేదో చెప్పలేను.' అప్పుడు జాంబవంతుడు – 'అంగదా! నువ్వు వెళ్ళగలవు కానీ వెళ్ళకూడదు. నువ్వు మా నాయకుడివి.' అంటూ హనుమంతుడి దగ్గరకు వచ్చాడు.

'మహావీరుడా! సర్వశాస్త్ర విశారదుడా! హనుమంతుడా! అలా ఒంటరిగా మౌనంగా కూర్చొన్నావేమయ్యా! నువ్వు సామాన్యుడివి కావు. శక్తి సామర్థ్యాలలో, తేజస్సులో, బలంలో శ్రీరామలక్ష్మణసుగ్రీవులతో సాటిరాగల వీరుడివి నువ్వే. వేగంలో

గరుత్మంతునితో పోటీ పడగల సత్తా నీది. బుద్ధి, బలం, ధైర్యం, శక్తి, అన్నీ కల అసామాన్యుడివి. ఈ విషయం నువ్వు తెలుసుకోకుండా మౌనంగా ఉన్నావేమయ్యా!

శాపవశాత్తూ పుంజికస్థల అనే అప్సరస అంజన అనే వానర స్త్రీగా పుట్టింది. ఆమెకూ కేసరి అనే వానరవీరునికీ వాయుదేవుని అంశతో నువ్వు పుట్టావు. కాబట్టి నీకు వాయుదేవునితో సమానమైన వేగమూ శక్తీ ఉన్నాయి. ఉదయిస్తున్న సూర్యుణ్ణి చిన్నప్పుడే పట్టుకోవాలని చూశావు నువ్వు. అప్పుడు ఇంద్రుడు నిన్ను వజ్రాయుధంతో కొట్టాడు. ఆ దెబ్బకు కొండమీద పడ్డావు. నీ ఎడమ దవడ (హనువు) విరిగిపోయింది. అప్పటినుండీ నీకు హనుమంతుడు అనే పేరు వచ్చింది తెలుసా?!

ఇంద్రుడు నిన్ను కొట్టాడని నీ తండ్రి వాయుదేవునికి కోపం వచ్చింది. ముల్లోకాల్లోనూ గాలి స్తంభింపజేశాడు. దానితో లోకాలన్నీ అల్లకల్లోలమైపోయాయి. మీ నాన్నను శాంతింపజేయటం కోసం దేవతలందరూ వచ్చి నీకు ఎన్నెన్నో వరాలు ఇచ్చారు.

ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే ఈ లోకంలో ఏ ప్రాణికీ లేని శక్తి నీకే.. నీకొక్కడికే.. ఉందన్న విషయం నీకు తెలియజెప్పడానికే.

హనుమంతా! లే! ఈ సముద్రాన్ని దాటు! నిన్ను ఏ అస్త్రమూ ఏమీ చెయ్యలేదని బ్రహ్మదేవుడుకూడా వరం ఇచ్చాడు. అంతటి వరబలం నీకుంది. లే! ఈ వానరులకు నీ పరాక్రమం చూపించు.'

చిన్నతనంలో హనుమంతుడు చేసిన అల్లరి పనులకు విసిగిపోయారు మహర్షులు. 'ఎవరైనా గుర్తుచేస్తే గానీ నీ బలం నీకు గుర్తుకు రాదు' అని శపించారు. అందుకే జాంబవంతుడు గుర్తుచేసే దాకా హనుమంతుడికి తల బలమేమిటో తెలియలేదు. ఇప్పుడు –

జాంబవంతుని మాటలు హనుమంతుడిలో ఉత్సాహాన్ని రేకెత్తించాయి. కొంచెం కొంచెంగా తన శరీరాన్ని పెంచుతున్నాడు హనుమంతుడు. అది చూసిన వానరుల హృదయాలు ఉప్పొంగిపోతున్నాయి. సంబరపడుతూ చూస్తున్నారు. వాళ్ళకి హనుమంతుణ్ణి చూస్తుంటే నమ్మకం కుదిరింది. త్రివిక్రమావతారం ఎత్తిన

నారాయణునిలా ఉన్నాడా హనుమంతుడు. 'కచ్చితంగా ఇతడు సముద్రాన్ని లంఘించి తీరతాడు. అనుమానం లేదు' అనుకున్నారు. ఆనందంతో గంతులు వేశారు.

శరీరం పెంచి విశ్వాన్ని ఆక్రమించిన హనుమంతుని ముఖం మండే అగ్నిగోళంలా ఉంది. తనను స్తుతిస్తున్న వానరవీరులందరికీ నమస్కరిస్తూ –

'వానరులారా! నేనే హనుమంతుణ్ణి! వాయుపుత్రుణ్ణి! నాకు సమానమైన వారెవ్వరూ లేరు. మేరు పర్వతాన్ని చుట్టిరావాలని తెగ ఉత్సాహంగా ఉంది. చూడండి. ఆకాశాన్ని అందుకొంటున్నాను. నేను వాయువేగంతో ఈ సముద్రాన్ని దాటగలను. లంకకు చేరడమే కాదు. సీతాదేవిని చూసి వస్తాను. సీతాదేవి కనిపించకపోతే లంకను కూకటివేళ్ళతో సహా పెకలించి తీసుకురాగలను. సంతోషంగా ఉండండి.' అని గట్టిగా అరుస్తూ చెప్తున్నాడు. ఉత్సాహంగా మేఘగర్జన చేస్తున్నాడు.

హనుమంతుని రూపం వానరుల హృదయాల్లోని దుఃఖాన్ని పటాపంచలు చేసింది. అప్పుడు జాంబవంతుడు – 'హనుమంతా! నువ్వు విజయం సాధించాలని మేమంతా ఇక్కడ పుణ్యకార్యాలు చేస్తూ ఉంటాం. గురువులూ ఋషీశ్వరుల అనుగ్రహంతో ఈ మహాసముద్రాన్ని లంఘించు. మా జీవితాలు నీ చేతుల్లో ఉన్నాయి. నీ రాక కోసం ఒంటికాలిపై నిలబడి ఎదురుచూస్తూ ఉంటాం' అంటూ తానూ గట్టిగా అరుస్తూ చెప్పాడు.

హనుమంతుడు సముద్రాన్ని లంఘించడానికి మహేంద్రగిరి శిఖరాన్ని ఊతంగా చేసుకున్నాడు. అప్పుడా పర్వతం కంపించింది.

వానరవీరుడు హనుమంతుడు ఏకాగ్రంగా నిలిపిన మనస్సుతో ముందుగానే లంకను చేరుకున్నాడు.

# సుందరకాండ

## మహేంద్రగిరిపై హనుమంతుడు

తన శక్తినీ వేగాన్నీ తెలుసుకున్న హనుమంతుడు నూరు యోజనాల సముద్రాన్ని దాటడానికి సంకల్పించాడు. సుసాధ్యంకాని సముద్రలంఘనం చెయ్యాలని సిద్ధమయ్యాడు. అదే హనుమంతుడు చేపట్టిన మొదటి దుష్కరకర్మ.

పర్వతాకారుడు హనుమంతుడు మహేంద్రపర్వతంపై తల ఎత్తి ఠీవిగా నిలబడి, పంచభూతాలకు నమస్కరించాడు. తూర్పువైపు తిరిగి తన తండ్రి వాయుదేవునికి మొక్కి, శరీరాన్ని పెంచాడు. పున్నమనాటి సముద్రంలా పెరుగుతున్నాడు.

అతడలా విజృంభించేసరికి మహేంద్రపర్వతం గజగజలాడింది. ఆ పర్వతం నిండా చాలా గుహలున్నాయి. పర్వతం లోపలి భాగం డొల్లగా ఉంటే ఎగిరే వేగం తగ్గుతుంది. అందుకే ఆ పర్వతాన్ని తొక్కి బిగువు చేసుకున్నాడు. అప్పుడు ఆ గుహల్లో ఉన్న సిద్ధ చారణ యక్ష కిన్నర దంపతులు భయంతో ఆకాశంలోకి ఎగిరిపోయారు. ఆ పర్వతం మీద ఉన్న సర్పాలు బుస్సుమంటూ పడగలు విప్పార్చి, కోపంగా రాళ్ళను కాటువేస్తే ఆ విషానికి కొన్ని రాళ్లు భగ్గుమన్నాయి. మరికొన్ని ముక్కలైపోయాయి.

హనుమంతుడి బరువుకి నొక్కుకుపోయిన మహేంద్రపర్వతం లోలోపలనుంచి నీళ్ళు ఉబుకుతూ వస్తూ ఉంటే, అది మదం స్రవిస్తున్న ఏనుగులా ఉంది.

హనుమంతుడు తప్పకుండా సముద్రాన్ని లంఘిస్తాడు అని ఋషులు ఆశీర్వదించారు.

అది విని విద్యాధరులూ సిద్ధులూ సాధ్యులూ చారణులూ ఆనందించారు.

## సముద్ర లంఘనం

హనుమంతుడు ఒక్కసారి ఒళ్ళు విదిలించి, మేఘంలా గర్జించి, తోకను కదిలించాడు. ఆ తోక అలలు అలలుగా కదిలింది. గరుత్మంతుడు ఎగరేసుకుపోతున్న పాములా ఉంది. దృఢంగా నిలబడి, సుదీర్ఘాలూ బలిష్ఠాలూ అయిన తన బాహువుల్ని నడుంపై మోపి, మోకాళ్లను వంచి, మెడ బిగించి, చెవులు రిక్కించి, ఆకాశం వైపు చూశాడు. గట్టిగా పీల్చిన ఊపిరిని గుండెల్నిండా బిగబట్టి –

'వానరులారా! ముల్లోకాలను గాలించి ఎలాగైనా సీతాదేవి జాడ తెలుసు కుంటాను. లేకపోతే రావణుణ్ణి బంధించి తెస్తాను. లేదా వాడితో సహా లంకను పెళ్ళగించి తీసుకువస్తాను' అంటూ రివ్వున ఆకాశంలోకి దూసుకుపోయాడు. ఆ వేగానికి చెట్లు – ఆత్మబంధువును కొంతదూరందాకా సాగనంపుతున్నట్లు హనుమంతునితోపాటుగా ఎగిరివచ్చి సముద్రంలో పడ్డాయి. ఆ చెట్ల నుంచి పువ్వులు సముద్రంలో రాలిపడ్డాయి. ఆ సముద్రం చుక్కలు పొడిచిన ఆకాశం అయ్యింది. అతని వేగానికి సముద్రజలం కొండంత ఎత్తుకు ఎగిరి గుండెల్ని తాకింది.

హనుమంతుడు చేతులు చాచి ఎగురుతుంటే ఆ రెండుచేతులూ ఒక్కొక్కటీ అయిదు తలల పాముల్లా ఉన్నాయి. అతడి కళ్ళు ఎర్రగా అగ్నిశిఖరాల్లా, రాగిరంగు ముఖం సంధ్యాసమయం నాటి సూర్యమండలంలా ప్రకాశిస్తుంటే అతడి తోక ఇంద్ర ధనువులా మెరిసిపోతోంది. అతని దృఢకాయాన్ని తాకిన వాయువు మేఘంలా గర్జిస్తోంది.

కింద సముద్రం అల్లకల్లోలమై రెండు పాయలుగా చీలిపోయింది. అప్పుడు సముద్రం అడుగున ఉన్న తిమింగిలాలతో సహా అన్ని జలచరాలూ కన్పిస్తున్నాయి. పాములైతే తమను తినడానికి గరుత్మంతుడే వచ్చాడని హడలిపోయాయి.

రెక్కల పర్వతంలా హనుమంతుడు ఆకాశంలో ఎగురుతుంటే అతని నీడ సముద్రంపై పదియోజనాల వెడల్పూ ముప్పై యోజనాల పొడవూ వ్యాపించింది. అది సముద్రజలాలపై వాలుగాలికి కదిలే నావలా సాగుతోంది.

అదృశ్యమవుతూ, అంతలోనే కన్పిస్తూ అచ్చం మబ్బులతో దోబూచులాడే చందమామలా సాగిపోతున్నాడు హనుమంతుడు.

## సముద్రుని కృతజ్ఞత

శ్రీరామకార్యార్థి అయిన హనుమంతునిపై దేవతలూ గంధర్వులూ ఆనందంతో పుష్పవృష్టిని కురిపించారు. సూర్యుడు తాపం తగ్గించి హనుమంతునికి సహకరిస్తున్నాడు. వాయువు చల్లగా వీస్తూ సేవిస్తున్నాడు. వేగంగా వస్తున్న హనుమంతుణ్ణి చూశాడు సముద్రుడు. తన పుట్టుకకు కారకుడైన సగరుడు ఇక్ష్వాకువంశం వాడు. ఇప్పుడీ హనుమంతుడు అదే వంశానికి చెందిన శ్రీరామచంద్రుని పనిమీద వెళ్తున్నాడు. కాబట్టి ఏదైనా సాయం చేసి, కొంతైనా ఋణం తీర్చుకోవాలన్నది సముద్రుని ఆశ.

'నూరు యోజనాల దూరాన్ని పాపం హనుమంతుడు ఒక్క అంగలో దాటాలనుకుంటున్నాడు కాబట్టి అతడికి మధ్యలో కొంత విశ్రాంతి కలిగేలా ఏదైనా ఏర్పాటు చేస్తే బావుంటుంది. అప్పుడు ఆట్టే శ్రమలేకుండా అవతలి గట్టుకు చేరుకుంటాడు.' – ఇదీ సముద్రుని ఆలోచన. సముద్రునికి బంగారు శిఖరాలతో తనలోనే తలదాచుకున్న మైనాకుడు గుర్తుకువచ్చాడు.

'మైనాకా! నువ్వు నాకో పనిచేసి పెట్టాలి. అడుగో! హనుమంతుడు వాయు వేగంతో వస్తున్నాడు. సమయం మించిపోకుండా వెళ్ళు. శ్రీరాముని మంచితనాన్నీ, సీతాదేవి లంకలో పడుతున్న అవస్థల్నీ, ఈ హనుమంతుని కష్టాన్నీ దృష్టిలో పెట్టుకొని మరీ వెళ్ళు. నీ శిఖరంపై హనుమంతుడు కాస్తంత సేదతీరేలా చూడు.' అని పంపాడు.

మైనాకుడు తన బంగారు శిఖరాలు పెంచి, మబ్బుల్ని చీల్చుకొని, ఉదయించే సూర్యునిలా సముద్రంనుంచి బయటికి వచ్చాడు. హనుమంతుడు అడ్డుగా ఉన్న మైనాకుణ్ణి ఢీకొట్టాడు. ఆ దెబ్బకు చలించిపోయిన మైనాకుడు మనుష్యరూపం ధరించి, శిఖరంపై హనుమంతుని సమీపంగా ఉండి ఇలా అన్నాడు.

## మైనాకుని అభ్యర్థన

'ఓ వానరోత్తమా! కష్టసాధ్యమైన పనికి పూనుకున్నావయ్యా! చాలా అలసిపోయినట్లు కనిపిస్తున్నావు. రా! కొంచెం నా శిఖరాలపై విశ్రమించు. ఇది సముద్రుని కోరిక. ఉపకారం చేసినవారికి ప్రత్యుపకారం చెయ్యాలి. నీకు సాయం చేస్తే

తనకు మేలు చేసిన రఘువంశరాజులకు చేసినట్లే. అందుకే సముద్రుడు నన్ను పంపాడు. మీ నాన్న వాయుదేవుడూ ఒకప్పుడు నాకు ఎంతో సాయం చేశాడు. ఇంద్రుడు పర్వతాల రెక్కలు నరుకుతుంటే వాయుదేవుడే నన్ను సముద్రానికి తెచ్చాడు. నేనిప్పుడిలా రెక్కలతో ఉన్నానంటే నీ తండ్రి దయ వల్లే. నువ్వు నా అతిథివి. నిన్ను పూజిస్తే నీ తండ్రిని పూజించినట్లే. ***అతిథిగా వచ్చినవాడు సామాన్యుడే అయినా ఆదరించాలి. నీలాంటి మాన్యుడూ అసామాన్యుడూ వస్తే వేరే చెప్పాలా?*** నువ్వు ఇంకా చాలా దూరం ప్రయాణించాలి. రా! కొంచెం సేపు నాపై సేదతీరు.'

'పర్వతోత్తమా! మైనాకా! నీ ఆతిథ్యం నేను స్వీకరించినట్లే భావించుకో. చాలా సంతోషం. ఆగలేదని కోపించకు. చేయవలసిన పని చాలా ఉంది. సమయం అట్టే లేదు. పొద్దు పోతోంది. పైగా మధ్యలో ఎక్కడా ఆగకూడదన్నది నా ప్రతిజ్ఞ. వస్తా.' అని తన చేతితో మైనాకుణ్ణి ఆప్యాయంగా ఒక్కసారి తాకి వెళ్ళిపోయాడు హనుమంతుడు. అలా దీక్షగా సాగిపోతున్న హనుమంతుణ్ణి అటు సముద్రుడూ, ఇటు మైనాకుడూ మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు.

ఇది హనుమంతుడు సాధించిన రెండవ దుష్కరకర్మ. అందుకే దేవతలూ సిద్ధులూ ఎంతగానో ఆనందించారు. వారంతా హనుమంతుని కార్యదీక్ష, పరాక్రమం చూశారు. ఈసారి బుద్ధి కౌశలాన్నీ, సమయస్ఫూర్తినీ పరీక్షించాలనుకొని సురస అనే నాగమాతను పంపారు.

## హనుమంతుని బుద్ధిబలం

సురస పర్వతాకారంతో పెద్ద పెద్ద కోరలు కల రాక్షసిగా మారి హనుమంతుని మార్గానికి అడ్డుతగిలి – 'వానరా! నువ్వు నాకు ఆహారంగా లభించావు. రా! నా నోటిలోకి ప్రవేశించు.' అంది.

'తల్లీ! రామకార్యార్థినై వెళ్తున్నాను. నువ్వూ రామరాజ్యంలోని దానివే. ఇందులో సహకరించవలసిన బాధ్యత నీకూ ఉంది. అందుకే నన్నిప్పుడు వదిలెయ్యి. కాదూకూడదంటే నేను వచ్చేటప్పుడు నీ నోట్లోకి ప్రవేశిస్తాను' అన్నాడు హనుమంతుడు.

'నన్ను దాటి ఎవరూ వెళ్ళలేరు. అది నాకు బ్రహ్మదేవుడు ప్రసాదించిన వరం. కాబట్టి తప్పదు.' అంటూ పెద్దగా నోరు తెరచింది సురస.

హనుమంతునికి కోపం వచ్చింది. ఏదీ నీ నోరు ఇంకా తెరువు. నేను పట్టేంత ఉందా? అన్నాడు.

సురస నోరు పెంచింది. హనుమంతుడూ తన శరీరాన్ని పెంచి, చిటికెలో బొటనవేలంత సూక్ష్మంగా మారి, చటుక్కున సురస నోట్లోకి దూరి, అంతే వేగంగా బయటికి వచ్చి, మళ్ళీ పెద్దశరీరంతో నిలబడి, సురసకు నమస్కరించి – 'అమ్మా! నమస్కారం! నువ్వు నాగమాతవని నాకు తెలుసు. నువ్వు చెప్పినట్లే నీ నోట్లోకి ప్రవేశించాను. మరి సెలవా!' అన్నాడు. సురస సంతోషించింది. నిజరూపం ధరించి – 'హనుమంతా! నీకు కార్యసిద్ధి తప్పక కలుగుతుంది.' అని దీవించింది.

హనుమంతుడు తనకు భుజబలమే కాదు బుద్ధిబలమూ ఉందని నిరూపించి, మూడో దుష్కరకర్మనూ సాధించి ముందుకు సాగుతున్నాడు.

దేవతలకూ ఋషులకూ ఆనందమే ఆనందం.

* * *

ఇంతలో సముద్రంలో సింహిక అనే ఒక విచిత్రమైన జంతువు తటస్థపడింది. ఆకాశంలో ఏ ప్రాణి ఎగురుతుంటే దాని నీడను చూసి సముద్రంలోనికి లాక్కొని తినేయడం దాని స్వభావం. ఆవలి తీరానికి చేరుకోబోతున్న హనుమంతుణ్ణి అతని నీడను చూసి లాగడం మొదలు పెట్టింది.

హనుమంతుడు ముందుకు వెళ్ళలేకపోతున్నాడు. చుట్టూ చూశాడు. ఏమీ కనబడడం లేదు. కిందకి చూశాడు. సింహిక. భయంకరంగా ఉంది. సుగ్రీవుడు చెప్పిన ఛాయాగ్రాహి గుర్తుకు వచ్చింది. హనుమంతుడు శరీరం పెంచాడు. సింహిక పాతాళంలాంటి తన నోరు తెరచి, హనుమంతుని వైపే వస్తోంది. వెంటనే హనుమంతుడు సూక్ష్మరూపాన్ని ధరించి, సింహికశరీరంలోనికి దూరి, ఆయువు పట్లలో కొట్టి, గుండెల్ని చీల్చుకొని బయటకు వచ్చాడు. సింహిక హాహాకారాలు చేస్తూ ప్రాణాలు వదిలి, సముద్రంలో పడిపోయింది.

ఇది హనుమంతుడు దిగ్విజయంగా పూర్తిచేసిన నాలుగో దుష్కరకర్మ.

సిద్ధులూ గంధర్వులూ ఆనందించి ఇలా అభినందించారు.

హనుమంతా! ***కార్యసాధకుడికి ధైర్యం, సూక్ష్మదృష్టి, తెలివి, నేర్పు ఉండాలి. ఈ నాలుగూ నీకు ఉన్నాయి. ఈ నాలుగూ ఉన్నవాళ్ళు తలపెట్టిన కార్యం దిగ్విజయం కావడం తథ్యం.***

## అదిగో లంక !

అల్లంత దూరంలో ఆవలితీరం కన్పించింది. ఆ తీరం పెద్ద పెద్ద వృక్షాలతో నిండి ఉంది. ఇంకా అక్కడ కొన్ని పర్వతాలూ, సముద్రుణ్ణి చేరుకోవడానికి వస్తున్న నదీమతల్లుల ముఖాలూ కన్పిస్తున్నాయి.

దూరంగా సముద్రంలో ఒక ద్వీపం. అదే లంక. శరీరాన్ని తగ్గించి, అక్కడ ఉన్న లంబపర్వతం మీద దిగాడు. ఒక్క బిగిన వంద యోజనాలు దాటాడు. అలసట కొంచెమైనా లేదు. కనీసం నిట్టూర్పు కూడా విడవలేదు. చుట్టూ చూశాడు. పూలతో పళ్ళతో కళకళలాడుతూ పచ్చని ఉద్యానవనాలు కనువిందు చేస్తున్నాయి. దిగుడుబావులూ, సరస్సులూ, నదులూ, పక్షుల కిలకిలారావాలు ఒకటేమిటి ప్రకృతి – పారవశ్యాన్ని కలిగించేలా ఉంది. లంబపర్వతశిఖరంమీద నిలబడి త్రికూట పర్వతశిఖరంపై ఉన్న లంకాపట్టణ సౌందర్యాన్నీ సౌభాగ్యాన్నీ చూస్తున్నాడు హనుమంతుడు. త్రికూటశిఖరంపై ఉన్న ఆ లంక ఆకాశంలో ఎగురుతోందా అన్నట్లుగా ఉంది. అమరావతిలా వెలిగిపోతోంది.

లంకలో బలమైన ప్రాకారాలు గల కోట, దాని గోడలపై శతఘ్నులూ ఉన్నాయి. సీతాదేవిని తెచ్చాక రావణుడు కాపలా మరింత పకడ్బందీగా చేశాడు. హనుమంతుడు ఒక్క ఉదుటున ఎగిరి ఉత్తర ద్వారం దగ్గర వాలాడు. అక్కడి భవనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. పాతాళాన్ని రక్షించే ఘోరసర్పాల్లా అక్కడ లంకకు రాక్షసులు రక్షణ కల్పిస్తున్నారు.

లంకనూ దాని రక్షణ వ్యవస్థనూ నగర శోభనూ చూసి ఆశ్చర్యపోయాడు హనుమంతుడు.

ఈ లంకను జయించడం ఎలా?! సాధ్యమేనా? దేవతలు కూడా ఈ నగరాన్ని జయించలేరే! ఇక వానరుల వల్ల అవుతుందా? ఈ సముద్రాన్ని ఎవరైనా దాటి రాగలరా? వచ్చినా ఆ రావణుణ్ణి ఎదిరించగలరా? ఇలా ఏవేవో ఆలోచనలు.

అయినా ఇప్పుడు ఈ ఆలోచనలు అవసరమా? ప్రస్తుతం నా కర్తవ్యం సీతాదేవి గురించి తెలుసుకోవడమే కదా! అవన్నీ తర్వాత. అనుకొని ముందుకు నడిచాడు.

ఎంత గట్టి కాపలా? ఈ రాక్షసులకు తెలియకుండా గాలైనా లోపలికి వెళ్ళగలుగుతుందా?! అసంభవం. వాళ్ళ కంటపడకుండా నేను లోపలికి ప్రవేశించాలి. అయితే రాక్షసుల కన్నుగప్పి ఈ శరీరంతో లంకలోనికి ప్రవేశించడం కుదరదు. చీకటిపడేదాకా వేచి ఉండవలసిందే. ఇంతవరకూ చేసినది ఒక ఎత్తు. ఇప్పుడు చెయ్యవలసినది ఒక ఎత్తు. పడ్డ కష్టం వృథా కాకుండా పని చక్కబెట్టుకొని వెళ్ళాలి. ***దూతలు సమయం సందర్భం చూసుకోవాలి. అలాకాకుండా ప్రవర్తిస్తే సూర్యుడు రాగానే నశించే చీకట్ల మాదిరి పనులు చెడిపోతాయి.*** లోపల అణువణువూ గాలించాలి. సీతాదేవి జాడ కనిపెట్టాలి. ఎవరూ లేనప్పుడు చూసి ఆమె దర్శనం చేసుకోవాలి. ఇలా నిశ్చయించుకున్న హనుమంతుడు సూర్యాస్తమయం దాకా ఆగాడు.

## లంకాప్రవేశం

సూర్యుడు అస్తమించిన తర్వాత పిల్లిపిల్లంత చిన్నగా మారి హనుమంతుడు లంకలోనికి ప్రవేశించాడు. విశాలమైన పురవీథులు. ఇరువైపులా భవనాలు. సూత్రం పట్టినట్లు ఉన్నాయి. బంగారు స్తంభాలతో, అంతస్తులు గల భవనాలతో, వజ్ర వైడూర్యాలు పొదిగిన గోడలతో, రత్న తోరణాలతో లంక అనూహ్య సౌందర్యంతో అలరారుతోంది. అది చూసిన హనుమంతునికి ఆనందవిషాదాలు రెండూ కలిగాయి. అంతలో చంద్రోదయం అయ్యింది. సరస్సులో విహరించే హంసలా చంద్రుడు వెలిగిపోతున్నాడు.

అప్పుడు లంకకు అధిదేవత (లంకిణి) రాక్షస స్త్రీ రూపంలో అడ్డు తగిలింది. భీకరంగా అరుస్తూ – 'వానరా! నువ్వెవరో చెప్పు. లేకపోతే నా చేతుల్లో నీకు మూడిందే!' అంది.

హనుమంతుడు తొణకూ బెణుకూ లేకుండా నువ్వెవరో చెప్పమని ఎదురు ప్రశ్నించాడు.

'నేనా?! ఈ లంకాధిదేవతను. నాకు తెలియకుండా ఒక్క పురుగు కూడా లోపలికి వెళ్ళలేదు. నువ్వు ఎలాగో ప్రవేశించావు. అంతే కాకుండా నా ముందు

నిలబడి ఇంతసేపు మాట్లాడుతున్నావు. ఎంత ధైర్యం నీకు? నీ ప్రాణాలు ఇప్పుడే తీస్తా' అంటూ హనుమంతుణ్ణి ఒక్క దెబ్బవేసింది.

హనుమంతుడూ తిరిగి కొట్టాలనుకొని స్త్రీకదా! పోనీలే ! అనుకొంటూ ఒక మోస్తరు గుద్దు వేశాడు. ఆ దెబ్బకు కళ్ళు బైర్లు కమ్మాయి దానికి. కళ్ళు తేలేసి నేలపై పడి, దిక్కులేక ప్రాణభయంతో హనుమంతుణ్ణి కాళ్ళావేళ్ళా పడి బ్రతిమ లాడింది.

'మహానుభావా! ఆడదాన్ని చంపకూడదు. నన్ను వదిలెయ్యి. నన్ను ఒక వానరుడు గెలుస్తాడనీ, అదే రాక్షసులకు అంత్యకాలమనీ బ్రహ్మదేవుడు నాకు ఎప్పుడో చెప్పాడు. ఇప్పుడు నువ్వు వచ్చావు. ఆ సమయం రానే వచ్చింది. ఈ లంకకు నందీశ్వరుడి శాపం ఉండనే ఉంది. దానికి తోడు రావణాసురుడు సీతాదేవిని తీసుకొచ్చాడు. ఇక రాక్షసజాతిని ఎవడూ కాపాడలేడు. వెళ్ళు మహావీరా! లంక లోపలికి వెళ్ళు. నీ ఇష్టం వచ్చినట్లు సంచరించు. సీతాదేవి ఎక్కడుందో తెలుసుకొని ఆమెను కలుసుకో.' అంది.

ఆ మాటలకు హనుమంతునికి ఉత్సాహం రెట్టింపయ్యింది. **శత్రువుల ఇంట్లోకి ప్రధానద్వారంగుండా ప్రవేశించ కూడదన్నారు కదా! అని హనుమంతుడు ఎగిరి, ప్రాకారం అందుకొని లంకలోకి దూకుతూ ముందుగా ఎడం కాలు పెట్టి మరీ లోపలికి ప్రవేశించాడు.**

* * *

లంక ఎంతో అందంగా శోభాయమానంగా ఉంది. ముత్యాలతో పుష్పాలతో రాజమార్గమూ, మణిమాణిక్యాలతో అందమైన మిద్దెలూ అలంకరింపబడి ఉన్నాయి. ప్రతి ఇంట్లోనూ వైభవం ఉట్టిపడుతోంది.

రాక్షసులలో కొందరు ఆయుధాలు ధరించి, కొందరు మద్యం సేవించి, మరికొందరు హోమాలూ జపాలూ చేస్తూ, కొందరు వేదం చదువుతూ కన్పించారు.

హనుమంతుడు అంతా వెదికాడు. వీథివీథినీ కనిపించిన ప్రతిమందిరాన్నీ వెదికాడు. సీతాదేవి ఎక్కడా కన్పించలేదు.

రాజవీథిని ఆవరించి నగరమధ్యంలో మహాసైన్యం మోహరించి ఉంది. ఆ సైన్యంలో రకరకాల ఆయుధాలు ధరించిన భీకరాకారులైన రాక్షసులు అసంఖ్యాకంగా ఉన్నారు. రక్షణకవచం లాంటి ఆ సైన్యాన్ని దాటుకొని ముందుకు పోతే అక్కడ ఉందో అద్భుతమైన మహాసౌధసముదాయం. అందులోనే ఉంది రావణుని అంతఃపురం. అది హనుమంతుని దృష్టిని ఆకర్షించింది.

బంగారు ద్వారాలతో, తోరణాలతో, ప్రత్యేక ప్రాకారాలతో, పరిఖలతో ఒప్పుతోంది ఆ అంతఃపురం. దివ్యాభరణాల చప్పుళ్ళూ, గుర్రాల సకిలింతలూ, ఏనుగుల ఘీంకారాలూ, పక్షుల కలకూజితాలూ, వేలమంది సైనికుల రక్షణ వలయాలూ కలిగి మహోజ్జ్వలంగా ప్రకాశిస్తోంది.

అప్పుడే ఉదయించిన చంద్రుడు ఆకాశంలో ప్రకాశిస్తూ వెండి పంజరంలోని హంసలా, మంథర పర్వతపు గుహలోని సింహంలా, మత్తగజంపై ఉన్న వీరుడిలా వెలిగిపోతున్నాడు. హనుమంతుడు ఆ వెన్నెలవెల్లిలో అంతర్నగరంలోనికి ప్రవేశించాడు. ఎక్కడ చూసినా రాక్షసులు. చేతుల్లో ఆయుధాలు పట్టుకొని కాపలా కాస్తున్నారు. రాక్షసులకు అది ఒక దేవాలయం. అనేక సౌధాల మీద నేర్పుగా దూకుతూ లంకా పట్టణానికే ఆభరణంలాంటి రావణసౌధం చేరుకున్నాడు హనుమంతుడు. దాని చుట్టూ రాక్షసముఖ్యుల భవనాలు ఉన్నాయి. తెలుపు, నలుపు, ఎరుపు రంగుల్లో రాక్షసులు భీకర స్వరూపాలతో కాపలా కాస్తున్నారు.

యోజనం పొడవూ, అర్ధయోజనం వెడల్పూ ఉన్న రావణ గృహంలో మంచాలూ ఆసనాలూ పాత్రలూ అన్నీ బంగారంతో చేసినవే కన్పిస్తున్నాయి. అక్కడే పుష్పకం అనే విమానం ఉంది. అదీ చూశాడు హనుమంతుడు. ఆ విమానం అద్భుతమైన శిల్పకళతో విరాజిల్లుతోంది. ప్రపంచం మొత్తం దానిపైనే ఉందా అన్నట్లు చిత్రాలు చెక్కబడి ఉన్నాయి. ఏం విమానం అది? దాన్ని పూర్వం విశ్వకర్మ బ్రహ్మదేవునికోసం తయారు చేశాడు. కుబేరుడు బ్రహ్మదేవునికోసం తపస్సు చేసినప్పుడు బ్రహ్మదేవుడు మెచ్చి, ఈ పుష్పకాన్ని కుబేరునికి ఇచ్చాడు. రావణుడు కుబేరుణ్ణి యుద్ధంలో ఓడించి దాన్ని సొంతం చేసుకున్నాడు.

ఒక్క మాటలో చెప్పాలంటే భూమికి దిగిన స్వర్గంలా ఉందా విమానం. అది మనస్సంకల్పంతోనే ప్రయాణిస్తుంది. అందులో కృత్రిమ పర్వతాలూ మృగపక్షి రూపాలూ, వాసయోగ్యాలైన గదులూ, బంగారు కిటికీలూ ఉన్నాయి. రత్న

వైడూర్యాలతో అలంకరించిన పక్షి మృగసమూహాల బొమ్మలు దానిపై చెక్కబడి ఉన్నాయి. రెండు ఏనుగులు – రెండు వైపులా నిలిచి లక్ష్మీదేవికి అభిషేకం చేస్తున్నట్లు చిత్రించిన చిత్రమూ దానిపై ఉంది. పర్వత పంక్తులు, వాటిపై వృక్షాలూ ఆ వృక్షాలకు పుష్పాలూ, ఆ పుష్పాలలోని కేసరాలు కూడా స్పష్టంగా కన్పించేలా అత్యంత నైపుణ్యంతో చెక్కిన శిల్పకళానైపుణ్యం ఆ పుష్పకంపై కనిపిస్తుంది.

హనుమంతుడు విమాన శిఖరాన్ని అధిరోహించాడు.

ఇంతలో ఒకవైపునుంచి మద్యం వాసన గుప్పున కొట్టింది. అటుగా వెళ్ళాడు హనుమంతుడు. అది రావణుడి పడకటిల్లు. అప్పటికి అర్ధరాత్రి అయ్యిందేమో ఎందరో స్త్రీలు చెదరిన వస్త్రాలతో ఆదమరచి నిద్రపోతున్నారు. అందరూ అందగత్తెలే. వాళ్ళ ముఖాల్లో బలవంతంగా ఎత్తుకొచ్చి నిర్బంధించిన ఆందోళన తాలూకూ ఛాయ లేమీ మచ్చుకైనా కన్పించడం లేదు. ఎంతో ప్రశాంతంగా ఉన్నాయి.

కొంచెం ముందుకు వెళ్ళాడు. మధ్యలో ఉన్న ఒక బంగారు మంచంపై పెద్ద మేఘంలా ఒక ఆకారం గాఢ నిద్రలో ఉంది. ఊపిరి తీస్తుంటే పాము బుసకొడు తున్నట్లుంది. భుజాలు ఏనుగు తొండాలంత ఉన్నాయి. ఛాతీ విశాలంగా ఉంది. మొత్తానికి మదించిన ఏనుగులా ఉన్న ఆ ఆకారం ఎవరిదో కాదు. రావణుడిదే.

హనుమంతుడు ఆశ్చర్యంతో ఒక్క అడుగు వెనక్కివేసి పక్కనే ఉన్న అరుగు మీదికి కుప్పించి కళ్ళు విప్పార్చి నిద్రిస్తున్న మంథర పర్వతంలా ఉన్న రావణుణ్ణి పరిశీలనగా చూశాడు.

మంచం ప్రస్రవణ పర్వతంలా ఉంటే, దానిపై రావణుడు మదించిన ఏనుగులా ఉన్నాడు. బంగారు ఆభరణాలు ధరించిన అతని బాహువులు ఇంద్రధ్వజాల్లా ఉన్నాయి. ఐరావతంతో పోరాడి పోరాడి కాయలు కాశాయి అతని బాహువులు. వజ్రాయుధపు దెబ్బలకు రాటుదేలి, విష్ణుచక్రం తాకిడికి గట్టిపడి, బలిష్ఠంగా తయారయ్యాయి అతని బుజాలు. పొడవాటి వేళ్ళతో అతని బాహువులు అయిదు తలల పాముల్లాగా భయంకరంగా ఉన్నాయి. చెవులకు కుండలాలు ప్రకాశిస్తున్నాయి. తలకు కిరీటం లేదు. వక్షఃస్థలంపై హారాలు చిక్కువడ్డాయి. బంగారు ఉత్తరీయం, తెల్లని మేలిమివస్త్రాలూ ధరించిన రావణుడు ప్రవాహంలో ఒంటరిగా ఉన్న గంధగజంలా ఉన్నాడు.

అతని పాదాలదగ్గర ఎందరో సుందరీమణులు ఆదమరిచి ఒళ్ళు తెలియకుండా నిద్రిస్తున్నారు. వాళ్ళు ధరించిన పూలమాలలు నలగలేదు. వాడిపోనూ లేదు. ఆ అందగత్తెలతో కూడిన విమానం నక్షత్రాలతో కూడిన ఆకాశంలా ప్రకాశిస్తోంది. ఎక్కడి వాళ్ళక్కడే నిద్రపోయారు.

ఒక స్త్రీ నృత్యపుముస్తాబులో ఉండి అలాగే నిద్రపోతోంది. మరో స్త్రీ వీణను కౌగిలించుకొని పడవకు చుట్టుకున్న పద్మంలాగా పడుకుంది. ఇంకో స్త్రీ బిడ్డతో నిద్రిస్తున్న తల్లిలా మృదంగాన్ని కౌగిలించుకొని నిద్రిస్తోంది. మరో కాంత పటహాన్ని కౌగిలించుకొని  పడుకుంది.

చూస్తూ ముందుకు వెళ్ళాడు. అక్కడే వేరొక మంచంపై ఒక అందాల రాశి నిద్రపోతోంది. బంగారు మేని ఛాయతో దివ్యాభరణాలు ధరించిన ఆమె రావణుడి భార్య మండోదరి. ఆమెను చూసి, ఆమె రూపయౌవనాలనూ, ధరించిన విలువైన ఆభరణాలనూ చూసి, ఆమే సీతాదేవి అయి ఉంటుందని హనుమంతుడు ఆనందంతో – తోకను ముద్దాడి, జబ్బలు చరుచుకొని, కుప్పిగంతులు వేశాడు. కానీ నిజంగా ఆమె సీతే అయితే అంత హాయిగా నిద్రపోగలదా? ఇంకొకరి అంతఃపురంలో ఎందుకు ఉంటుంది? సందేహాలు. చివరికి – ఈమె సీతాదేవి కాదు వేరెవరో! నిశ్చయానికి వచ్చాడు.

హనుమంతుడు మళ్ళీ అన్వేషణ కొనసాగించాడు. రావణుని పానశాల కనిపించింది. అక్కడ రకరకాల మద్యాలూ పుష్పసుగంధాలూ గుబాళిస్తుండడంతో భోగభూమిలా ఉంది లంక. హనుమంతుడు ఎందరినో చూశాడు కానీ ఎవర్ని చూసినా సీతాదేవి అన్పించలేదు.

విమానాన్ని విడిచిపెట్టి బయటకు వస్తుంటే హనుమంతునికి ఏదో తెలీని అపరాధభావం కలిగింది. ఇంతమంది పరస్త్రీలను చూడటం తప్పేమో అన్పించింది హనుమంతునికి. వెంటనే తనని తాను ఇలా విశ్లేషించుకున్నాడు.

**రావణుని విశ్వాసాన్ని చూరగొన్న ఎందరో స్త్రీలను చూశాను. అయినా నాకు మనస్సులో ఏ దురుద్దేశమూ లేదు. *మంచిపనికిగానీ చెడ్డపనికిగానీ ఇంద్రియాలన్నింటినీ ప్రవర్తింపచేసేది మనస్సే. ఆ మనస్సు నాలో ఎంతమాత్రం చెక్కుచెదరలేదు. నిశ్చలంగా ఉంది.* నేను వేరే చోట సీతాదేవిని వెదికితే ఆవిడ ఎలా కనిపిస్తుంది?**

**స్త్రీలు స్త్రీలమధ్యలోనే కదా! ఉంటారు. అందువల్ల ఒక స్త్రీకోసం వెదకాలంటే మరి స్త్రీసమూహంలోనే వెదకాలి. తప్పదు. కాబట్టి, తప్పు కాదు. అని సర్దిచెప్పుకున్నాడు.**

ఒకరా? ఇద్దరా? విద్యాధర స్త్రీలు, నాగకాంతలు ఎందరో అందగత్తెలు. వారిలో కొందరు తమంతట తామే రావణుణ్ణి వలచి వచ్చారు. మరికొందరిని రావణుడే అపహరించి తెచ్చాడు. కానీ సీతాదేవి జాడ కన్పించలేదు. అసలు సీతాదేవి బ్రతికే ఉందా? హనుమంతునికి సందేహం వచ్చింది. సీతాదేవి తనకు కన్పించిందని సంపాతి చెప్పాడు కదా! మరి నాకు కన్పించదేం? నేనేదో శుభవార్త తెస్తానని ఎదురుచూస్తున్న వానరులు సీతాదేవి లేదని చెప్తే గుండె పగిలి చస్తారు. శ్రీరాముడూ ప్రాణాలతో ఉండడు. శ్రీరాముడు లేకపోతే లక్ష్మణుడూ ఉండడు. అయోధ్యలోనూ ఎవరూ ప్రాణాలతో ఉండరు.

ఇంతా జరిగితే సుగ్రీవుడూ, అతణ్ణే నమ్ముకున్న వానరులూ అందరూ.. అందరూ.. మరణిస్తారు. నేను వట్టి చేతుల్తో వెనక్కి వెళ్ళి వాళ్ళందరి చావులకి కారకుణ్ణి అయ్యేకంటే ఇక్కడే నేను ఒక్కణ్ణీ చావడం మేలు. కాదు; ఇదంతా చేసింది రావణుడే కాబట్టి ఆ రావణుణ్ణి హతమార్చి ప్రతీకారం తీర్చుకుంటాను.

అసలు సీతాదేవి బతికే ఉందా? ఈ రాక్షస స్త్రీల భీకర స్వరూపాల్ని చూసి ప్రాణాలు వదిలేసిందా? లేక రావణుడు చంపేసి ఉంటాడా? రావణుడు సీతాదేవిని అపహరిస్తున్నప్పుడు గానీ అతడి చెయ్యి జారి కిందపడి మరణించి ఉంటుందా? సముద్రంలో పడిపోయిందా? ఆమె సౌందర్యం చూసి ఓర్చుకోలేక రావణుని భార్యలు తినేశారా? వియోగదుఃఖం భరించలేక మరణించి ఉంటుందా? ఇలా హనుమంతుని ఆలోచనలు పరిపరి విధాలుగా పోతున్నాయి. నిరాశా నిస్పృహలు ఆవహించడంతో ఉస్సూరుమంటూ కూలబడ్డాడు. కానీ వివేకవంతుడు కనక మళ్ళీ తేరుకొని, ఉత్సాహం తెచ్చుకున్నాడు. ***మనకు నిర్వేదం ఎంతమాత్రమూ పనికిరాదు. ఎప్పుడూ ఉల్లాసంగా ఉత్సాహంగా ఉండాలి. అదే గొప్ప సుఖం. ఎన్నడూ నిరాశానిస్పృహలకు లోనుకాకూడదు. అలా ఉండడమే సంపదలకు మూలం. ఉత్సాహం ప్రాణిని కార్యంవైపు పరుగులు తీయిస్తుంది. పని సఫలమయ్యేలా చేస్తుంది. కాబట్టి సడలని పట్టుదలతో లంకంతా గాలిస్తాను.*** **అని మళ్ళీ అన్వేషణ సాగించాడు.**

హనుమంతుడు వెదకని చోటు నాలుగంగుళాలయినా లంకలో లేదు. అంతలా వెదుకుతున్నాడు. వెదకాలి. ఇంకా వెదకాలి. ఎలాగైనా సాధించాలి. కృతనిశ్చయంతో దృఢసంకల్పంతో ముందుకు సాగాడు.

అంతవరకూ కన్పించని అశోకవనం అప్పుడే ఎదురుగా కన్పించింది. అంతకు ముందు ఎన్నిసార్లు ఈ లంకానగరాన్ని చుట్టివచ్చాడో కానీ ఇప్పటిదాకా ఈ అశోకవనం కన్పించలేదు. అంతే! **నిరుత్సాహంలో ఉన్నవాడికి బుద్ధి పనిచెయ్యదు. కళ్ళ ముందే ఉన్నా నిర్వేదం లక్ష్యాన్ని చూడనివ్వదు.** ఇలా తనలో అనుకొంటూ హనుమంతుడు ఈ వనంలో వెతుకుతాను అనుకొని బుద్ధిని కేంద్రీకరించాడు. చేపట్టిన కార్యాన్ని విజయవంతంగా పూర్తిచేయడానికి కావలసిన మానసికస్థైర్యాన్నీ స్ఫూర్తినీ పొందేందుకు ధ్యానం చేశాడు.

**నమోస్తు రామాయ సలక్ష్మణాయ దేవ్యై చ తస్యై జనకాత్మజాయై,**
**నమోస్తు రుద్రేంద్రయమానిలేభ్యో నమోస్తు చంద్రార్కమరుద్గణేభ్యః ।**
(5.13.59)

## సీతాసందర్శనం

'శ్రీరామలక్ష్మణులకు నమస్కారం. జనకుని పుత్రిక జానకీదేవికి నమస్కారం. రుద్ర, ఇంద్ర, యమ, వాయుదేవులకు నమస్కారం. సూర్యచంద్రులకీ (ఇంకా మరుత్తులు అనే) సకల దేవగణానికీ నమస్కారం.' అంటూ తనకు జయం కలిగించమని అభ్యర్థించాడు.

అతని మనస్సు శరీరంకంటే ముందుగా ఉరకలు వేస్తోంది.

అశోకవనంలో ప్రాకారం దాటి ముందుకు సాగాడు హనుమంతుడు.

అప్పటిదాకా యథేచ్ఛగా తిరుగుతున్న మృగాల్లోనూ పక్షులలోనూ కలకలం. అశోకవనంలో ఎన్నో అందమైన చెట్లు. వాటి మొదళ్ళలో బంగారు వేదికలు. ఆ పక్కనే మణిమయసోపానాలతో ప్రకాశించే దిగుడుబావులు. అవి వికసించిన పద్మాలతో జలపక్షులతో ఒప్పుతున్నాయి. పెద్ద పొదరిళ్ళూ, శిలాగృహాలూ, క్రీడా పర్వతం, దానిమీదినుంచి జాలువారే సెలయేరూ ఓహ్.. ఎంత అందంగా ఉన్నాయో! ఆ సెలయేరు ప్రియుని ఒడిలోంచి దూకే ప్రియురాలిలా ముచ్చట గొలుపుతోంది. ఇదంతా విశ్వకర్మ సృష్టించిన అద్భుతం.

* * *

తెలతెలవారుతోంది. అశోకవనంలో చెట్లపై అటూ ఇటూ తిరుగుతూ అంతా కలియ జూస్తున్నాడు హనుమంతుడు. చెట్టు చెట్టుకీ కాపలా ఉంది. అక్కడే ఒక శింశుపావృక్షం ఉంది. దాని చుట్టూ చూశాడు. అక్కడే ఒక చైత్య ప్రాసాదమూ కన్పించింది. అది వెయ్యి స్తంభాలతో కైలాసంలా మెరుస్తోంది.

ఆ శింశుపావృక్షం కింద – ఒకచోట రాక్షస స్త్రీలు చుట్టూ గుండ్రంగా కూర్చొని ఉన్నారు. వారి మధ్యలో ఒక అందమైన స్త్రీ మాసిన చీర ధరించి ఉంది. ఉపవాసాలుందేమో బక్కచిక్కి కన్పిస్తోంది. తలవంచుకొని కూర్చొని ఏడుస్తూ నిట్టూర్పులు విడుస్తూ ఉంది.

చూశాడు హనుమంతుడు. ఋష్యమూకపర్వతంపై చూసిన స్త్రీ, ఈమే ఒకేలా ఉన్నట్లు లీలగా అన్పించింది. రాజీవలోచనుడైన శ్రీరాముడు చెప్పిన ఆభరణాలూ అక్కడే చెట్టుకొమ్మలకు వేళ్లాడుతున్నాయి. ఆ రోజు ఏ చీర కట్టుకొందో ఇప్పుడూ అదే చీర. అయితే మాసి ఉంది. అంతే!

చంద్రుడు మేఘాల చాటునుంచి బయటకు రావడంతో వెలుతురు పెరిగి ఇంకా స్పష్టంగా కన్పించింది సీతాదేవి. చంద్రరేఖలా చిక్కిపోయి, రూపు దాల్చిన దైన్యంలా ఉంది. అయితే ధైర్యం మాత్రం సడలిపోలేదు. అదే పాతివ్రత్యబలం.

హనుమంతుడు ఒక నిర్ణయానికి వచ్చేశాడు. ఈవిడే సీతాదేవి. సందేహం లేదు. శ్రీరాముడు గుర్తొచ్చాడు. ఎదురుగా సీతాదేవి, మదిలో రవికులతిలకుడు. వాళ్ళిద్దరూ ఒకరికి ఒకరు తగిన వారు. ఒకరిని విడిచి మరొకరు జీవించలేరు. ఇప్పుడు విడిపోయారు కదా! అయినా ఒకరి మనసు మరొకరి వద్ద ఉంది. కలిసి ఉన్నట్టే.

ఇంత గొప్ప ఇల్లాలికి ఎటువంటి దురవస్థ దాపురించింది! సర్వాభరణాలతో కళకళలాడుతూ ఉండవలసిన సీతాదేవి ఏ ఆభరణాలూ లేక బోసిగా ఒంటరిగా కూర్చోవలసివచ్చింది కదా!

**మాన్యా గురువినీతస్య లక్ష్మణస్య గురుప్రియా,**
**యది సీతాఽపి దుఃఖార్తా కాలో హి దురతిక్రమః. (5–16–3)**

**శ్రీరాముడికి ఇల్లాలై, లక్ష్మణుడికి మాన్యురాలైన సీతాదేవికే ఇంతటి కష్టం వచ్చిందంటే కాలమహిమ ఎంతటిదో తెలుస్తూనే ఉంది. కాలాన్ని ఎవరూ దాటలేరు.**

ఇంత గొప్ప ఇల్లాలు కనుకనే శ్రీరాముడు అంతగా పరితపిస్తున్నాడు. ఈమెకోసం ఏమైనా చెయ్యవచ్చు. జానకీవల్లభుడు ఎంతమంది రాక్షసుల్ని సంహరించినా, భూగోళాన్ని తల్లక్రిందులు చేసినా, నేను సముద్రం దాటినా అవన్నీ తగినవే! **త్రిలోకాధిపత్యం అంతా కలిపి సీతాదేవిలో పదహారోవంతుకూడా కాదేమో!**

**మిథిలాధిపతి అయిన జనకుడి కూతురూ దశరథ మహారాజుగారి కోడలూ ధర్మజ్ఞుడైన శ్రీరాముని ఇల్లాలూ అయిన సీతాదేవి ఇప్పుడు ఈ లంకలో రాక్షసస్త్రీలమధ్య నానా అగచాట్లు పడుతూ ఏనాటికైనా పితృవాక్యపరిపాలకుడైన శ్రీరాముడు వస్తాడనే ఆశతోనే జీవిస్తోంది. ఆమెకు పరిసరా లేవీ పట్టడం లేదు. రాముణ్ణే ధ్యానిస్తోంది. దర్శిస్తోంది. అన్ని కష్టాలుపడుతున్న సీతాదేవిని చూసిన హనుమంతుని గుండె తరుక్కుపోయింది.**

చుట్టూ రాక్షసీగణం. వారిలో ఏకాక్షి, ఏకకర్ణ, అకర్ణ, శంకుకర్ణ, కర్ణప్రావరణ, ఊర్ధ్వనాసిక, మహాశిరస్క, మహాకంఠి, ధ్వస్తకేశి, అకేశి, కేశకంబళధారిణి, లంబకర్ణ, లంబోదర, లంబపయోధర, లంబోష్ఠి, చుబుకోష్ఠి, లంబాస్య, లంబజానుక, కుబ్జ, వామన, వికట, కరాళ, భుగ్నవక్త్ర, పింగాక్ష, వికృతానన, కలహప్రియ ఇలా వికృత రూపాలున్న రకరకాల వాళ్ళు ఉన్నారు. వీళ్ళ మధ్య సీతాదేవి మూగవోయిన తీగలా ఉంది.

ఇంతలో తెల్లవారింది. రాజమందిరంలో మంగళవాద్యాల మోతలూ వేదఘోషా విన్పిస్తున్నాయి. స్త్రీల అందెలరవళులూ, వడ్డాణాలకు ఉన్న మువ్వల చప్పుళ్ళూ వినిపించాయి. ఆ శబ్దం వచ్చిన వైపు చూశాడు హనుమంతుడు. రావణాసురుడు కొంతమంది స్త్రీలతో విలాసంగా నడుస్తూ వస్తున్నాడు. వచ్చి, శింశుపావృక్షం దగ్గర, నడిసముద్రంలో నావలా, తెగిపడ్డ చెట్టు కొమ్మలా, బురద గొట్టుకుపోయిన పద్మంలా ఉన్న సీతాదేవిని తేరిపారా చూసి –

'సీతా! నీది అతిలోక సౌందర్యం. నీ అందంతో సమానమైన అందం ముల్లోకాల్లో ఎక్కడా లేదు. నిన్ను సృష్టించాక బహుశా బ్రహ్మదేవుడు ఇంక సౌందర్యాన్ని సృష్టించడం మానేసి ఉంటాడు. నీ కష్టాలన్నీ ఇక తీరిపోయినట్లే. ఈ ఉపవాసాలూ దీక్షలూ మానెయ్యి. భోగాలు అనుభవించు.

**యౌవనం రోజురోజుకీ తగ్గిపోతూ ఉంటుంది. అది ప్రవాహంతోపాటుగా కొట్టుకుపోయే నీరు. వెనక్కి రాదు.** నన్ను భర్తగా అంగీకరించు. నిన్ను నా పట్టమహిషిని చేసుకొంటాను. అప్పుడు సకల సంపదలూ, రాజ్యభోగాలూ అన్నీ నీవే. శ్రీరాముణ్ణి మర్చిపో. శ్రీరాముడు ఎందులోనూ నాతో సరిపోడు.' ఇలా ఏవేవో మాట్లాడుతున్నాడు.

సీతాదేవి తన భర్తనే తలుచుకుంటూ గుండెలు చిక్కబట్టుకొని ఒక గడ్డిపరకను అడ్డుపెట్టుకొని ఇలా అంది.

'రాక్షసుడా! నేను ఒక గొప్ప వంశంలో పుట్టి మరో గొప్ప వంశంలో కోడలుగా కాలుపెట్టాను. పతివ్రతను. నేను నీకు లభించను. ఈ సంగతి నువ్వు తెలుసుకో' అంటూ వెనక్కి తిరిగి మళ్ళీ తనే అంది.

'రావణా! ఇకనైనా మంచి దారిలోకి రా! ధర్మం తెలుసుకో. నీకెవరూ ఇంత బుద్ధిచెప్పే వారే లేరా?! ఈ లంకలో. ఒకవేళ ఉన్నా నువ్వు లెక్క చెయ్యవేమో! ఇదంతా మీ నాశనానికే వచ్చిందిలే. ***పరస్త్రీవ్యామోహం నాశనానికి హేతువు అని నీకు తెలీదా?*** ఏ ధనానికీ నేను లొంగేదాన్ని కాను. నన్నెవ్వరూ శ్రీరాముని నుంచి వేరు చెయ్యలేరు. నీ మంచి కోరి చెప్తున్నా. నన్ను శ్రీరామునికి అప్పగించి తప్పైపోయిందని కాళ్ళపై పడు. క్షమిస్తాడు శ్రీరాముడు. అప్పుడు నువ్వు బతికి పోతావు. లేకపోతే నీకు చావు తప్పదు.

ఇంద్రుని వజ్రాయుధం నిన్ను వదిలెయ్యవచ్చు. యముడూ చూసీ చూడనట్లు మిన్నకుండిపోవచ్చు. కానీ శ్రీరాముడు నిన్ను వదలడు. నీ అంతు చూస్తాడు.

మాట్లాడితే నీ గురించి నువ్వే తెగ గొప్పలు చెప్పుకొంటున్నావు. అసలు శ్రీరామలక్ష్మణుల ముందు నువ్వెంత? నీ పరాక్రమం ఎంత? జాగ్రత్త! త్వరలోనే రామబాణం దూసుకు వస్తుంది. నువ్వు ఎక్కడ దాక్కున్నా అది నిన్ను విడిచిపెట్టదు. అన్నది.

ఈటెల్లాంటి ఆ మాటలు రావణునికి గుచ్చుకొని కోపం తెప్పించాయి. మళ్ళీ ఇలా అన్నాడు – 'ఓ సుందరవదనా! సారథి పగ్గాలతో రథాన్ని ఆపినట్లుగా, నీపై నాకు ఉన్న కోరిక నిన్ను ఏమీ చెయ్యకుండా నాకు అడ్డుతగులుతోంది.

నీకింకా గడువు రెండు నెలలే. ఈ లోగా మనసు మార్చుకొని నన్ను భర్తగా అంగీకరించు. లేకపోతే నువ్వు నాకు ఉదయపు ఆహారమైపోతావు.' అన్నాడు.

సీతాదేవి మాటకు మాట ఘాటుగా చెప్పింది – 'ఓరీ నీచరాక్షసుడా! ఈ లంకలో నీ నీచపుటాలోచనల్ని అరికట్టేవాడే లేడా? ఇంద్రునికి శచీదేవిలా నేను శ్రీరామునికి ధర్మపత్నిని. నీలా మరెవ్వడూ ఇలాంటి ఆలోచనకు పూనుకోడు. నువ్వు చేస్తున్న ఈ పాపానికి పరిహారం తప్పదు. నా రఘురాముడు మదించిన ఏనుగు. నువ్వో కుందేలు పిల్లవు. నువ్వు? శ్రీరాముణ్ణి ఎదిరించడం? అది ఎలా ఉందో తెలుసా? చెవుల పిల్లి ఏనుగును ఢీకొట్టినట్లు ఉంటుంది. ఇక్కడ నా దగ్గర శ్రీరాముణ్ణి నానామాటలూ అంటున్నావే కానీ శ్రీరాముడి ముందుకు వెళ్ళడం లేదు. ఎందుకు? శ్రీరాముడంటే నీకు భయం. అసలు అంతదాకా ఎందుకు? **నిన్ను బూడిదగా మార్చడానికి శ్రీరాముడే అక్కర్లేదు. నేనే చాలు. కానీ ఎందుకు ఊరుకొంటున్నానో తెలుసా?! నేను శ్రీరాముని కోసం తపస్సు చేస్తున్నాను. తపస్సులో ఉన్నవారికి కోపం తగదు. కోపం తెచ్చుకుంటే తపస్సు వ్యర్థమైపోతుంది. పైగా నిన్ను బూడిద చేసేందుకు శ్రీరాముని అనుమతి నాకు లేదు. దొంగచాటుగా నన్ను తీసుకురావడమేనా నీ శూరత్వం?'**

సీతాదేవి నిర్భయంగా తిడుతోంది. హనుమంతుడు అంతా చూస్తున్నాడు.

రావణునికి పట్టరాని కోపం వస్తోంది. రాక్షస స్త్రీలతో –

'రాక్షసాంగనలారా! మీరేం చేస్తారో నాకు తెలీదు. ఏదో ఒకటి చేసి ఈమెను లొంగదీయండి.' అన్నాడు.

అప్పుడు రావణుని చిన్నభార్య ధాన్యమాలిని వచ్చింది. రావణుణ్ణి గట్టిగా కౌగిలించుకొని – 'రాజా! ఈమె మానవమాత్రురాలు. ఈమెతో నీకు ఏం ఆనందం లభిస్తుంది? పైగా ఈమె నిన్ను తిరస్కరిస్తోంది. **మనసులేని చోట సుఖమెక్కడిది?** ఎందుకీ వృథా ప్రయాస?' అంది.

దానికి రావణుడు ఏ సమాధానమూ చెప్పకుండా వికటాట్టహాసం చేసి పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ భూమి కంపించేలాగా తన అంతఃపురం వైపు దారితీశాడు. అతని వెంటే అంతఃపుర స్త్రీలందరూ పరుగులు తీశారు.

సీతాదేవి భయం భయంగా కూర్చొంది. రాక్షసస్త్రీలు చుట్టూ చేరి విజృంభించారు. శ్రీరాముణ్ణి మరిచి పొమ్మంటూ, రావణుడు అంతటివాడూ ఇంతటి వాడూ అంటూ తెగ పొగిడేశారు.

అప్పుడు హరిజట అనే రాక్షసస్త్రీ – 'సీతాదేవిని కంటిముందు పెట్టుకొని చూస్తూ తినకుండా ఉండడం కష్టం' అంది. దానికి ఏకజట అనే మరో రాక్షసస్త్రీ– 'అవును! నాకూ అలాగే ఉంది. ఈమెని దండించమని, ప్రభువు ఎలాగూ అనుమతి ఇచ్చాడు కాబట్టి పీక పిసికి ఈమెను తినేద్దాం' అంది. ఈమె గుండె, మెదడు, కాళ్ళు, తొడలు, చేతులు నావి అంటే నావి అని రాక్షసస్త్రీలు వాటాలు వేసుకుంటున్నారు.

ఆ రాక్షస స్త్రీలను చూసి భయపడుతున్నా స్థిరమైన బుద్ధితో సీతాదేవి ఇలా చెప్పింది.

**'శ్రీరాముడు దీనుడైనా, రాజ్యం కోల్పోయినా అతడే నాకు ప్రభువు. నేను నిత్యం అతణ్ణి సూర్యుణ్ణి ఆరాధించే సువర్చలలా ఆరాధిస్తూనే ఉంటాను. శచీదేవి ఇంద్రుణ్ణీ, అరుంధతి వసిష్ఠుణ్ణీ, లోపాముద్ర అగస్త్యుణ్ణీ, సుకన్య చ్యవనుణ్ణీ, సావిత్రి సత్యవంతుణ్ణీ, శ్రీమతి కపిలుణ్ణీ, రోహిణి చంద్రుణ్ణీ ఎలా విడిచిపెట్టి ఉండరో నేనూ అంతే. శ్రీరాముణ్ణి విడిచి ఉండడం అసంభవం.**

మీరు ఎన్ని చెప్పినా నా మనసు మారదు. ఎందరో రాక్షసుల్ని సంహరించిన నా శ్రీరాముడు రణరంగంలో ఈ రావణుణ్ణీ సంహరిస్తాడు. రామబాణానికి తిరుగులేదు. నేను ఇక్కడ ఉన్నట్లు నా శ్రీరామునికి తెలియదు. తెలిసిన జటాయువూ ప్రాణాలతో లేడు. నా ఆచూకీ శ్రీరామునికి తెలిస్తే ఈ పాటికి రావణుడు భూమ్మీద ఉండేవాడే కాదు. లంక సర్వనాశనం అయ్యుండేది. నా కల తప్పక నెరవేరుతుంది. శ్రీరాముడు వస్తాడు. ఈ లంక నాశనాన్ని నేను కళ్ళారా చూస్తాను.'

ఇంతలో త్రిజట అనే రాక్షస స్త్రీ లేచి రాక్షసస్త్రీలను తిట్టి ఇలా చెప్పడం మొదలు పెట్టింది.

'ఇప్పుడే తెల్లవారుజామున నాకు ఒక కల వచ్చింది. వెయ్యి హంసలు మోస్తున్న ఒక పల్లకి మీద తెల్లటి వస్త్రాలను ధరించి, మెడలో తెల్లటి పుష్పమాలికలు వేసుకుని శ్రీరాముడు లక్ష్మణునితో కలిసి వచ్చాడు. అప్పుడు వాళ్ళు నాలుగు

దంతాలున్న ఏనుగు మీద ఉన్నారు. ఆ ఏనుగు తెల్లగా ఉన్న ఒక పర్వతం దగ్గరికి వెళ్ళింది. ఆ పర్వతం మీద సీతాదేవి పచ్చటి పట్టు పుట్టం కట్టుకుని ఉంది. శ్రీరాముడు సీతాదేవికి తన చెయ్యి ఇచ్చి ఏనుగు మీదకి ఎక్కించుకున్నాడు. అప్పుడు వాళ్ళు వృషభాలు పూన్చిన రథంలోకి మారారు. ఆ రథం వెళ్ళిపోతున్నప్పుడు సీతాదేవి సూర్యచంద్రులిద్దరినీ తన చేతితో నిమిరింది. తరువాత వాళ్ళందరూ పుష్పక విమానంలో ఉత్తర దిక్కుకి వెళ్ళిపోయారు.

పాల సముద్రం మధ్యలో ఒక కొండ ఉంది, ఆ కొండ మీద హేమసింహాసనం ఉంది, ఆ సింహాసనం మీద శ్రీరాముడు కూర్చుని ఉన్నాడు, ఆయన ఎడమ తొడ మీద సీతాదేవి కూర్చుని ఉంది. అలా ఉన్న శ్రీరామునికి దేవతలు పట్టాభిషేకం చేశారు. నాకు ఆ సమయంలో శ్రీరాముడు పరబ్రహ్మ స్వరూపంగా, నాలుగు చేతులతో ఉన్న శ్రీమహావిష్ణువుగా సాక్షాత్కరించాడు.

ఇక్కడ లంకా పట్టణంలో రావణాసురుడు మాత్రం గాడిదలు పూన్చిన రథం ఎక్కి, ఎర్రటి వస్త్రాలు ధరించి, నూనె తాగుతూ ఉన్నాడు. ఆ రథం దక్షిణ దిక్కుగా వెళ్ళిపోయింది. కొంతదూరం వెళ్ళాక ఆ రథం నుండి దక్షిణ దిక్కుకి తల ఉండేలా కింద పడిపోయాడు. తరువాత పైకి లేచి మెడలో గన్నేరు పూల మాలలు వేసుకొని పిచ్చి పిచ్చిగా అరుస్తూ, నాట్యం చేస్తూ పరుగెత్తి ఒక మురికి గుంటలో పడిపోయాడు. అప్పుడు వికటాట్టహాసం చేస్తూ, ఎర్రటి వస్త్రాలు ధరించి, బోడి గుండుతో ఉన్న ఒక స్త్రీ – తాడుతో కట్టి రావణుణ్ణి బయటకి లాగింది. అప్పుడామె రావణుణ్ణి పశువుని తీసుకెళ్ళినట్టు దక్షిణ దిక్కుకి తీసుకువెళ్ళింది. ఆవిడ వెనకాల చప్పట్లు కొడుతూ, నాట్యం చేస్తూ రావణుడు వెళ్ళిపోయాడు. వాళ్ళ వెనకాల కుంభకర్ణుడు, ఇంద్రజిత్తు మొదలైనవారు ఒంటె, మొసలి మొదలైన వాహనాలపై దక్షిణ దిక్కుకి వెళ్ళిపోయారు.

ఒక్క విభీషణుడు మాత్రం నాలుగు దంతాలు ఉన్న ఏనుగు మీద కూర్చుని ఉన్నాడు. నలుగురు మంత్రులు అతణ్ణి సేవిస్తున్నారు.

ఎక్కడినుంచో ఒక మహావానరం వచ్చి, లంకా పట్టణంలోని ఇళ్ళన్నిటినీ అగ్నికి ఆహుతి చేసింది. ఎక్కడ చూసినా హాహాకారాలు. లంకంతా బూడిదయిపోయి బీభత్సంగా ఉంది.'

'ఇదీ నాకు వచ్చిన కల. ఈ సీతాదేవికి అతిత్వరలోనే గొప్ప శుభం జరగబోతోంది. ఈమె ఎవరో కాదు. సాక్షాత్తు శ్రీమహాలక్ష్మి. ఈమెను తిట్టకండి. శ్రీరాముడు ఊరుకోడు. మీకు బతుకుమీద ఆశ ఉంటే, చేసిన దోషాలు పోవాలనుకుంటే ఒక్కసారి వచ్చి ఆ తల్లికి ఒక్క నమస్కారం చెయ్యండి చాలు. ఈమె మన తప్పులన్నీ క్షమిస్తుంది.'

త్రిజట ఇలా చెప్పగానే రాక్షసాంగనలు శాంతించారు. త్రిజట చెప్తుంటే రాక్షస స్త్రీలు కొందరు వింటున్నారు, కొందరు కునికి పాట్లు పడుతున్నారు. సీతాదేవి తనలో తాను అనుకుంటోంది.

పచ్చి మాంసం తినే ఈ రాక్షసులకు ధర్మాధర్మాలెలా తెలుస్తాయి? తెలియవు. అన్నంత పనీ చేస్తారు. ఏదో ఒక రోజు రావణునికి నన్ను ఉదయ భోజనంగా సమర్పించేస్తారు. అయ్యో! విషం తాగి మరణిద్దామన్నా గుక్కెడు విషం ఇచ్చే వాళ్ళు కూడా కరవయ్యారే! అంటూ దుఃఖం ముంచుకొచ్చేసరికి బోరున ఏడుస్తూ సీతాదేవి శింశుపావృక్షం దగ్గరికి వెళ్ళింది. తన జడనే ఉరితాడు చేసుకొని ఉరేసుకోబోయింది. ఇంతలో కొన్ని శుభశకునాలు పొడసూపాయి. ఎడమ కన్నూ, ఎడమ భుజం, ఎడమ తొడ అదురుతున్నాయి. కట్టుకున్న పట్టు పుట్టం తనంతట కొంచెం కిందకి జారింది. చెట్టు మీద ఒక పక్షి కూర్చుని కూస్తోంది. పక్షి కూస్తున్న చెట్టు కింద కూర్చున్న స్త్రీ త్వరలోనే భర్తను కలుస్తుంది. సీతాదేవికి కలత తీరి, ఆనందం చివురులు తొడుగుతోంది.

## ఉన్నాడు లెస్స రాఘవుడు

ఇంతసేపూ శింశుపావృక్షంమీద కూర్చుని ఉన్న హనుమంతుడు అంతా చూశాడు. అన్నీ విన్నాడు. వెంటనే తాను ముందుకు వెళ్ళకపోతే సీతాదేవి దక్కదు. ఆమెతో మాట్లాడదామంటే చుట్టూ రాక్షసస్త్రీలు. సీతాదేవి కూడా తనను చూసి రావణుడే మాయారూపంలో వచ్చాడనుకుంటుందేమో! అప్పుడామె భయపడి అరిస్తే రాక్షసస్త్రీలు తన పైకి ఆయుధాలతో వస్తారు. వచ్చి తన చేతిలో చావుదెబ్బలు తింటారు. తిని ఊరుకుంటారా! ఊరుకోరు. రాక్షస యోధుల్ని పిలుచుకు వస్తారు. వాళ్ళతో యుద్ధం చేసి తాను అలసిపోతే మళ్ళీ నూరు యోజనాల సముద్రం లంఘించలేకపోవచ్చు. ఒకవేళ తానే రాక్షసులచేతిలో మరణిస్తే ఈ వార్త చెప్పేవాడుండడు.

ఇంతమంది వానరవీరులు పడ్డ కష్టం ఇప్పుడు ఫలించింది. సీతాదేవి దర్శనభాగ్యం నాకు లభించింది.

లంక మొత్తం తిరిగాను. రావణుని బలాలూ బలహీనతలూ అన్నీ తెలిశాయి. ఇంక సీతాదేవిని ఓదార్చడం ఒక్కటే నా కర్తవ్యం. అందువల్ల అవకాశం చూసుకొని ఈమెను ఓదార్చాలి. నేనా వానరుణ్ణి. సూక్ష్మరూపంలో ఉన్నాను. సంస్కృతం మాట్లాడితే నన్ను రావణుడనుకొనే ప్రమాదం ఉంది. పైగా వానరునికి అది చెల్లదు. కాబట్టి మానవ భాషలోనే మాట్లాడి ఓదారుస్తాను. అయితే నా మాటలు సీతాదేవి భయపడకుండా వినాలి. ఎలా? దీర్ఘంగా ఆలోచించిన హనుమంతుడు చెట్టు కొమ్మల మాటున కూర్చుని, ఆమెకు వినిపించేలా ఇలా ప్రారంభించాడు.

* * *

అనగనగా దశరథ మహారాజు. ఆ రాజుగారి జ్యేష్ఠపుత్రుడు శ్రీరాముడు. చాలా అందమైనవాడు, గొప్ప విలుకాడు. తండ్రి ఆజ్ఞవల్ల భార్యనూ, తమ్ముణ్ణీ వెంట బెట్టుకుని అరణ్యాలకు వెళ్ళాడు. అక్కడ అనేక రాక్షసులను చంపాడు. ఈ సంగతి తెలిసి రావణుడు మాయలేడి సహాయంతో అతని భార్య అయిన సీతాదేవిని అపహరించాడు.

అయోధ్యారాముడు సీతాదేవిని వెతుకుతూ సుగ్రీవుడనే వానరరాజుతో స్నేహం చేశాడు. వాలి అనే వానరరాజును చంపి, ఆ రాజ్యాన్ని సుగ్రీవునికిచ్చాడు. సుగ్రీవుడు సీతాదేవిని వెతకటానికి అన్ని దిక్కులకూ వానరులను పంపాడు. ఆ ప్రయత్నంలో భాగంగా నేను నూరు యోజనాల సముద్రాన్ని లంఘించి ఈ లంకకు వచ్చి, శ్రీరాముడు చెప్పిన శుభలక్షణాలున్న సీతాదేవిని చూశాను.

ఆ మాటలు విన్న సీతాదేవి – ఆశ్చర్యంతోనూ, భయంతోనూ తల ఎత్తి శింశుపావృక్షం కేసి చూసింది. ఆమెకు హనుమంతుడు కనిపించాడు. సీతాదేవి తన కళ్ళనూ, చెవులనూ, తానే నమ్మలేకపోయింది. ముందు కలేమో అనుకుంది. కలలో కోతి కనిపించటం అశుభం అని భయపడింది. నిద్రే లేనప్పుడు కల రావటం ఏమిటని తర్కించుకొని అలా వానరుడు కనిపించటం సత్యమే అని భావించింది.

ఈ రాక్షసలంకలో శ్రీరామకథా?! ఈ వానరుడు ఎవరు? అని ఆలోచి స్తుండగా తెల్లని వస్త్రం ధరించి మెరుపు ముద్దలా ఉన్న హనుమంతుడు కిందికి దిగాడు. అతడి కన్నులు బంగారంలా మెరుస్తున్నాయి. అతణ్ణి చూసి ఏమిటీ రూపమని సీతాదేవి భయపడింది.

సీతాదేవి ముందు నిలబడి చేతులు జోడించి వినయంగా అడిగాడు హనుమంతుడు.

'అనిందితా! పద్మ పత్రాలవంటి నేత్రాలు కలదానా! జీర్ణమైన వస్త్రాలను ధరించినదానా! ఈ చెట్టుకొమ్మను పట్టుకొని నిలబడి ఉన్నావు. ఎవరు నువ్వు? నీ రూపంలో రాజలక్షణాలు కన్పిస్తున్నాయి కాబట్టి మానవకాంతవే. జనస్థానం నుంచి రావణుడు అపహరించి తెచ్చిన సీతాదేవివి నువ్వేనా? లోకోత్తరమైన నీ రూపమూ, దిగులూ చూస్తుంటే శ్రీరాముని భార్యలాగే అనిపిస్తున్నావు.' అన్నాడు.

సీతాదేవి ఆ మాటలు వింది. శ్రీరామసంకీర్తన కలిగించిన ఆనందంతో– 'అవును. నేను సీతాదేవినే. దశరథమహారాజు కోడలిని, జనకమహారాజు కుమార్తెను. శ్రీరామునికి భార్యను.' అంటూ సీతాదేవి కూడా తన కథ అంతా చెప్పింది. హనుమంతు డామెను ఓదార్చి –

'వైదేహీ! నేను శ్రీరాముని దూతను. శ్రీరాముడు దుఃఖార్తుడై ఉన్నాడు. నీ క్షేమం తెలుసుకొని రమ్మని నన్ను పంపాడు. మహాబాహువైన లక్ష్మణుడు నీకు నమస్కారాలు తెలియజేయమన్నాడు. సుగ్రీవుడు అనే వానరుడు శ్రీరాముని మిత్రుడు. అతడు కూడా నీ క్షేమం కోరుకుంటున్నాడు. ఆ రామచంద్రుడూ లక్ష్మణస్వామీ నిరంతరం నిన్నే తలుచుకొంటున్నారు. నువ్వు ఈ రక్కసిమూకలమధ్య ఇంకా జీవించి ఉండడం గొప్ప అదృష్టమే. మహాబలులైన శ్రీరామలక్ష్మణులనూ వానరసైన్యంతో కూడిన సుగ్రీవుణ్ణీ నువ్వు త్వరలోనే చూస్తావు. నేను ఆ సుగ్రీవునికి మంత్రిని. నాపేరు హనుమంతుడు.' అన్నాడు.

**శ్రీరామలక్ష్మణుల క్షేమసమాచారాలు విన్న సీతాదేవి – *పెద్దల మాట నిజమే. మానవుడు బతికి ఉండాలేగానీ నూరుసంవత్సరాలకైనా ఆనందం తప్పక కలుగుతుందన్న సామెత వాస్తవమేనని నాకు ఈ మంచి మాటలు వినగానే***

**అనిపిస్తోంది. నూరేళ్ళూ బతకాలేగానీ మంచిరోజులు రాక ఎక్కడికిపోతాయి? కాబట్టి, ఓపిగ్గా వేచి ఉండాలి. అని సంబరపడిపోయింది.**

సీతాదేవికి తనపై నమ్మకం కుదిరిందనుకుని హనుమంతుడు ఉత్సాహంతో మరో రెండడుగులు ముందుకు వేసి ఆమెను సమీపించాడు. సీతాదేవికి అంతలోనే మళ్ళీ సందేహం. రావణుడే వానర రూపంలో వచ్చాడా! అతనితో ఆత్మీయంగా మాట్లాడానే! అని బాధపడింది. భయపడింది. ఆ సందేహంవల్ల తనకు నమస్కారం చేస్తున్న హనుమంతుని ముఖం చూడటానికి కూడా ఆమెకు ధైర్యం చాలడం లేదు. అయినా ఇలా అంది – 'నువ్వు నిజంగా శ్రీరామదూతవే అయితే శ్రీరాముని గుణగణాలు వర్ణించు. శ్రీరామలక్ష్మణులు నీకెలా తెలుసు? నరవానరులకు పొత్తు ఎలా కుదిరింది?'

హనుమంతుడు సీతాదేవి మనోభావాలకు అనుగుణంగా మధురవచనాలతో–

**'శ్రీరాముడు తేజస్సులో సూర్యుడు, లోకానికి ఆహ్లాదం కలిగించడంలో చంద్రుడు. ఐశ్వర్యంలో కుబేరుడు. పరాక్రమంలోనంటావా? సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే. వాక్కులో బృహస్పతి. రూపంలో మన్మథుడు. రక్షణలో అతనికి అతడే సాటి. లోకంలో అందరికన్నా శ్రేష్ఠుడు.'** అంటూ శ్రీరాముణ్ణి ఆపాదమస్తకమూ వర్ణించాడు.

అయినా ఆమె అనుమానం పోయిందికాదు. కొన్ని ప్రశ్నలు వేసింది. శ్రీరామలక్ష్మణుల గుర్తులు చెప్పమంది. అప్పుడైనా తన శోకం తీరుతుందని ఆమె ఆశ.

అప్పుడు హనుమంతుడు –

***ఓ సీతాదేవీ! శ్రీరాముడు అరవిందనేత్రుడు. సాటిలేని తన కాంతితో సమస్త ప్రాణులకూ ఆనందాన్ని కలిగిస్తాడు. అందమూ సుగుణాలూ అతనికి పుట్టుకతోనే వచ్చాయి. తేజస్సులో సూర్యుడు. సహనంలో భూదేవి. బుద్ధిలో బృహస్పతి. కీర్తిలో దేవేంద్రుడు. సర్వప్రాణిరక్షకుడు. ఆశ్రితపోషకుడు, ధర్మరక్షకుడు, శత్రుసంహారకుడు. లోకమర్యాదలను తాను పాటిస్తూ ఇతరులచేత పాటింపజేసేవాడు. కాంతిమంతుడు. లోకపూజ్యుడు. బ్రహ్మచర్యవ్రతాన్ని పాటించేవాడు. సత్పురుషులు చేసిన ఉపకారాల్ని***

***మరిచిపోడు. వ్యవహారజ్ఞానసంపన్నుడు. లోకకళ్యాణం కోసమే తాను కర్మలను ఆచరిస్తూ ఇతరులచేత కూడా ఆచరింపజేసే మహనీయుడు. అంటూ వీనుల విందుగా శ్రీరామగుణకీర్తనం చేశాడు. సీతాదేవికి నమ్మకం కలిగింది.***

తన గురించీ, సుగ్రీవుడి గురించీ చెప్పి, ఇప్పటిదాకా జరిగిన విషయాలన్నీ సీతాదేవికి విన్నవించి, తన వెంట తెచ్చిన ఉంగరాన్ని ఆమెకు అందించాడు హనుమంతుడు.

అది చూసిన సీతాదేవికి నిజంగా శ్రీరాముణ్ణి చూసినంత ఆనందం కలిగింది. హనుమంతుడిపై నమ్మకం కుదిరింది. ఆమె ముఖం విప్పారింది.

'ఎంతో శక్తిసామర్థ్యాలు ఉండబట్టే నువ్వు సముద్రం దాటి రాగలిగావు. రావణుడు కూడా నిన్ను ఏమీ చేయలేడు' అని పొగిడింది.

శ్రీరాముడు వచ్చి తనను రక్షిస్తాడు, రావణుణ్ణి యుద్ధంలో హతమారుస్తాడు. అని ఆమె గాఢంగా నమ్మింది. కానీ ఏ మూలో అనుమానం. శ్రీరాముడు వస్తాడా? తనను తీసుకువెళ్తాడా? అలా జరక్కపోతే ఇక్కడే ప్రాణత్యాగం చేస్తాను. అని నిశ్చయించుకుంది. అప్పుడు హనుమంతుడు –

సీతాదేవికోసం శ్రీరాముడు పడుతున్న వేదన అంతా ఇంతా కాదని వివరంగా చెప్పాడు.

సీతాదేవి తనకోసం కాకుండా శ్రీరాముడికోసం బాధపడింది. ఆమె కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరిగాయి. ఆ మాటలు విన్నాక మనస్సు కొంత తేటపడింది. హనుమంతుడితో ఇలా అంది.

వానరోత్తమా! దశరథాత్మజుడైన శ్రీరాముడు నాకోసం బాధపడుతున్నాడంటే నాకు సంతోషంగా ఉంది. కానీ మరోవైపు బాధగానూ ఉంది. ఒకమాట చెపుతాను విను. ***తాడుతో కట్టి ఈడ్చుకుపోతున్నట్లుగా దైవం మనిషిని గొప్ప ఐశ్వర్యంలోకిగానీ దారుణమైన దుఃఖంలోకిగానీ తీసుకుపోతుంది. నేనూ, శ్రీరాముడూ, లక్ష్మణుడూ కూడా ఆపదలపాలయ్యామంటే దీనినిబట్టీ ఏం తెలుస్తోంది? దైవాన్ని అతిక్రమించే శక్తి ఏ ప్రాణికీ లేదు. ఇది నిశ్చయం.*** రావణుడిచ్చిన ఏడాది గడువులో పది నెలలు పూర్తయిపోయాయి. మిగిలినవి ఇంకా రెండు నెలలే. ఈలోగా శ్రీరాముడు రావాలి.

రావణుడి సోదరుడు విభీషణుడు, నన్ను నిర్బంధించడం తప్పు అని రావణుడికి చెప్పాడట! కానీ రావణుడు వింటేనా?! విభీషణుడి పెద్ద కూతురు అనల నా దగ్గరకు వచ్చి ఈ విషయాలన్నీ చెప్పింది. అవింధ్యుడు అనే ఒక రాక్షసుడు కూడా నన్ను విడిచిపెట్టకపోతే లంక సర్వనాశనం అవుతుందని హితవు పలికాడట. అయినా ఫలితం లేదు. హనుమంతా! అప్పుడు జనస్థానంలో శ్రీరాముడు అంతమంది రాక్షసుల్ని ఒంటరిగా వధించాడు కదా! మరి ఇప్పుడు నన్ను ఎందుకు రక్షించడంలేదు? అంది కన్నీటిపర్యంతం అవుతూ. అప్పుడు హనుమంతుడు –

'తల్లీ! నేను ఈ వార్త చెప్పగానే శ్రీరాముడు వెంటనే బయలు దేరి వస్తాడు. చింతించకు. పోనీ నా వీపుపై కూర్చో. నిన్ను ఈ శోకసాగరం దాటించి, చిటికెలో శ్రీరాముడి దగ్గరకు చేరుస్తాను.' అన్నాడు.

సీతాదేవి మెల్లగా నవ్వింది. 'ఏమిటీ! పిల్లి పిల్లంత లేవు? నువ్వు నన్ను మోస్తావా? సముద్రం దాటుతావా?' అంది.

హనుమంతుడికి పౌరుషం వచ్చింది.

'సీతామాతా! నా విశ్వరూపం చూపిస్తాను. చూడు.' అంటూ మేరు, మందర పర్వతాలంత పెద్దగా తన శరీరం పెంచి చూపించాడు. మండే అగ్నిలా ఉన్నాడు. వజ్రాల్లాంటి కోరలతో, గోళ్ళతో శత్రుభీకరంగా ఉన్నాడు.

'పర్వతాలూ వనాలూ భవనాలూ ప్రాకారాలూ తోరణాలూ రావణుడితోసహా మొత్తం లంకనే మోయగల శక్తి ఉంది. ఇప్పటికైనా నన్ను గుర్తించు.' అన్నాడు.

సీతాదేవి హనుమంతుడి శక్తిని గుర్తించి – 'హనుమంతా! నువ్వు ప్రాజ్ఞుడివి. పరాక్రమశాలివి. అయినా సరే! నేను నీతో రాను. అలా వస్తే శ్రీరాముడికి అప్రతిష్ఠ. అంతేకాదు, **నేను నా భర్తను తప్ప అన్యపురుషుణ్ణి తాకను. ఆనాడు రావణుడు నన్ను బలవంతంగా పట్టుకున్నాడు. నేను అశక్తురాల్ని కాబట్టి ఏమీచెయ్యలేక ఊరుకున్నాను.** శ్రీరాముడే స్వయంగా వచ్చి, నన్ను తీసుకు వెళ్ళాలి. అలా చేయటమే ఉభయులకూ గౌరవం. వెళ్ళు. ఈ విషయం శ్రీరాముడికి చెప్పు. శ్రీరాముడు దండెత్తి వచ్చే ఉపాయం ఆలోచించు.' అంది.

ఆమె మాటలకు సంతోషించిన హనుమంతుడు శ్రీరాముడికి చూపించడానికి ఏదైనా గుర్తు ఉంటే ఇమ్మన్నాడు. సీతాదేవి తన చూడామణిని తీసి ఇచ్చింది. ఇంకా ఏమైనా గుర్తులు చెప్పమన్నాడు హనుమంతుడు.

సీతాదేవి తనకూ శ్రీరాముడికీ మాత్రమే తెలిసిన కాకి కథ ఇలా చెప్పింది.

"చిత్రకూట పర్వతంపై ఉన్న సిద్ధాశ్రమంలో ఒకసారి శ్రీరాముడు నా ఒళ్ళో తలపెట్టుకొని నిద్రపోతున్నాడు. అప్పుడు అక్కడికి కాకి ఒకటి వచ్చింది. ఆకలితో నా వక్షఃస్థలాన్ని ముక్కుతో పొడుస్తున్నది.

శ్రీరాముడు మేల్కొని, ఒక దర్భను మంత్రించి దానిమీదికి వదిలాడు. అది ప్రాణభయంతో ముల్లోకాలూ తిరిగినా ఎవరూ రక్షించలేకపోయారు. తిరిగి తిరిగి చివరికి శ్రీరాముణ్ణే శరణువేడింది. అది బ్రహ్మాస్త్రం కాబట్టి, దానికి తిరుగులేదు. ప్రయోగించాక ఏదో ఒకటి బలి ఇవ్వాల్సిందే. అందుకే ఆ కాకి కన్ను ఒక దానిని బ్రహ్మాస్త్రానికి బలిచేసి రాముడు దాన్ని రక్షించాడు. కాకికి చావు తప్పి కన్ను లొట్టపోయింది. ఆ కథ చెప్పి–

'శ్రీరామా! ఆనాడు నా కోసం ఒక కాకిమీద బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించావే? మరి ఇప్పుడు నన్నే అపహరించిన ఈ రావణుణ్ణి ఇంకా ఎందుకు చూస్తూ ఊరుకుంటున్నావు?'

అని సీతాదేవి అడిగిందని చెప్పు." అంటూ వలవలా ఏడ్చేసింది సీతాదేవి. హనుమంతుడు బయలుదేరుతున్నాడు.

సీతాదేవి గొంతు మూగబోయింది. ఎన్నో జాగ్రత్తలు చెప్పింది. చివరిగా –

'ఇక కార్యభారం నీదే! బాగా ఆలోచించి నా దుఃఖం పోయే విధంగా ప్రవర్తించు. శ్రీరాముడికి నమస్కారాలు. లక్ష్మణుని క్షేమం అడిగానని చెప్పు. సుగ్రీవుణ్ణీ తక్కిన వానరుల్నీ కుశలమడిగాననీ చెప్పు' అంటూ హనుమంతుణ్ణి వీడ్కొల్పింది.

## లంకాదహనం

హనుమంతుడు సీతాదేవి దగ్గర సెలవు తీసుకొని ఉత్తరదిక్కుకి వచ్చాడు. వెళ్ళే ముందు రావణునికి కొంచెం బుద్ధి చెప్పాలనుకున్నాడు. దానికి రావణుణ్ణి

కలవాలి. ఎలా కలవడం? అతనికి ఎంతో ఇష్టమైన ఈ అశోక వనాన్ని నాశనం చేస్తే సరి. **మూర్ఖులదగ్గర సామ దాన భేదోపాయాలు ఎంతమాత్రమూ పనిచేయవు. దండోపాయం ఒక్కటే వాళ్ళకు తగినది. మన సత్తా ఏమిటో వీళ్ళకి రుచి చూపించాలి. ఒక పనిమీద వచ్చి, ఆ పనికి భంగం కలగకుండా మరిన్ని పనులు సాధించేవాడే అసలైన సమర్థుడు.** ఎంత చిన్నపనినైనా సాధించేందుకు ఎక్కువ వ్యూహాలు తెలుసుకోవాలి. అలా తెలుసుకున్నవాడే కార్యనిపుణుడు. అనుకొన్నాడు. అనుకోవడమే తరువాయి, ఆ అశోకవనం మీద ఎగిరాడు. తొడల వేగానికి చెట్లు విరిగిపోయాయి. పెద్దపెట్టున అరిచాడు. పక్షులు గుండెలు పగిలి కింద పడి పోయాయి.

రాక్షసుల శక్తి సామర్థ్యాలు ఏపాటివో తెలుసుకోవాలనుకొని రాక్షసుల్ని కవ్వించి రెచ్చగొట్టాడు. ఆ అశోకవనాన్ని ధ్వంసం చేసి అల్లకల్లోలం చేసి అందరినీ కాసేపు హడలెత్తించాడు.

రాక్షసులంతా వెళ్ళి రావణాసురుడికి ఇలా చెప్పారు.

'రాక్షసేశ్వరా! ఎక్కడనుంచి వచ్చిందో కానీ ఒక మహావానరం వచ్చింది. సీతాదేవి కూర్చున్న శింశుపా వృక్షాన్ని తప్ప తక్కిన అశోకవనం మొత్తాన్నీ సర్వనాశనం చేసింది. మరి అది ఇంద్రుడి దూతో, కుబేరుడి దూతో, శ్రీమహావిష్ణువు దూతో, యముడి దూతో మాకు తెలీదు. అలసటో లేక కావాలనే వదిలిపెట్టిందో తెలీదు. శింశుపావృక్షాన్నిమాత్రం ఏమీ చెయ్యలేదు. అది అలసట అనుకోడానికి వీల్లేదు, ఎందుకంటే ఇంత పెద్ద అశోకవనాన్ని నాశనం చేసిన ఆ వానరానికి శింశుపావృక్షం ఒక లెక్కా? అది కావాలనే వదిలిపెట్టిందన్నది మా అనుమానం. అంతేకాదు, మరో ముఖ్యవిషయం – సీతాదేవితో ఈ వానరం మాట్లాడింది కూడా.'

ఆ మాటల్ని విన్న రావణుడికి ఎక్కడలేని కోపం వచ్చింది. 'ఆ మహావానరాన్ని పట్టి బంధించండి, లేకపోతే సంహరించండి' అని చెప్పి ఎనభైవేలమంది రాక్షసకింకరుల్ని పంపించాడు.

హనుమంతుడు ఆ రాక్షసుల్ని చూస్తూనే ఒక పెద్ద తోరణం మీద కూర్చుని రామాదులకు జేజేలు పలుకుతూ ఇలా నినదించాడు.

**జయ త్యతిబలో రామో లక్ష్మణశ్చ మహాబలః,**
**రాజా జయతి సుగ్రీవో రాఘవేణాభిపాలితః.**

**దాసోఽహం కోసలేంద్రస్య రామస్యాక్లిష్టకర్మణః,**
**హనుమాన్ శత్రుసైన్యానాం నిహంతా మారుతాత్మజః. (5-42-33, 34)**

'శ్రీరామలక్ష్మణులు విశేషమైన బలంతో వర్ధిల్లుతున్నారు.

శ్రీరాముని సంరక్షణలో ఉన్న వానరరాజు సుగ్రీవుడూ శోభిల్లుతున్నాడు.

ఆ శ్రీరామునికి దాసానుదాసుణ్ణి నేను. నా పేరు హనుమంతుడు. నేను యుద్ధంలో వేరే ఆయుధాలు వాడను. అరికాళ్ళతో తొక్కి, పిడి గుద్దులతో చంపేస్తాను. చెట్లతో, రాళ్ళతో కొడతాను. వెయ్యిమంది రావణాసురులైనా నన్ను యుద్ధంలో ఎదిరించలేరు. నన్ను ఆపగలిగేవాడుగానీ పట్టగలిగేవాడుగానీ ఈ లంకా పట్టణంలోనే లేడు.

ఎలా వచ్చానో అలాగే ఈ సముద్రాన్ని దాటి వెళ్ళిపోతాను.' అంటూ హనుమంతుడు ఆ తోరణానికి ఉన్న ఇనుప పరిఘని ఒకదాన్ని పీకి రకరకాల ఆయుధాలతో రాక్షసులపై కలియబడ్డాడు.

రెప్పపాటుకాలంలోనే ఆ ప్రాంతం రాక్షసుల మాంసపు ముద్దలతో, రక్తంతో భీతావహంగా మారింది.

మళ్ళీ తోరణం ఎక్కి కూర్చున్నాడు హనుమంతుడు. దూరంగా వెయ్యి స్తంభాల ప్రాసాదం ఒకటి కనబడడంతో ఆ ప్రాసాదం మీదకి ఎక్కి, నిలబడి ఒక సింహనాదం చేశాడు.

ఆ ధ్వనికి గుండెలు బద్దలై, ముక్కూచెవులనుంచి నెత్తురు కారుతూ ఉండగా కొన్నివేలమంది చనిపోయారు. తొడలు చరిచాడు. ఆ శబ్దానికి మరికొందరు రాక్షసులు చనిపోయారు. తరువాత ఆ ప్రాసాదానికి మధ్యలో ఉన్న బంగారు స్తంభాన్ని ఒకదాన్ని పీకి గాలిలో గిరగిర తిప్పాడు. ఆ వేగానికి అందులోనుంచి నిప్పు పుట్టి, ఆ ప్రాసాదం కాలిపోయింది.

'మా వానరులలో పదీ, వందా, వెయ్యీ, పదివేల ఏనుగుల బలం కలిగినవారూ, అంతకన్నా ఎక్కువ బలం కలిగినవారూ ఎందరో ఉన్నారు. భూమికి

అడ్డంగా, నిలువుగా ఎగరగలిగేవాళ్ళు ఈ భూమండలం అంతటా సీతాన్వేషణలో నిమగ్నులై ఉన్నారు. వాళ్ళెవరూ మిమ్మల్ని విడిచిపెట్టే ప్రసక్తే లేదు. సుగ్రీవుడే గనక ఒకసారి బయలుదేరి లంకలో అడుగుపెట్టాడా? ఇంక, ఈ లంకా లేదు, మీరూ లేరు, ఆ రావణుడూ లేడు గీవణుడూ లేడు. ధర్మాత్ముడైన శ్రీరామునితో వైరం పెట్టుకున్న కారణంగా మీరందరూ సమసిపోవాల్సిందే.' అంటూ మళ్ళీ శ్రీరామ లక్ష్మణసుగ్రీవాదులకు జేజేలు పలికాడు.

రావణుడు వరుసగా రాక్షసవీరులను పంపుతున్నాడు. వాళ్ళంతా హనుమంతుని చేతుల్లో చనిపోతున్నారు. రావణుని మంత్రి జంబుమాలి, ఇంకా ఎందరో రాక్షసులు అలాగే చనిపోయారు. రావణుడు ఏడుగురు మంత్రికుమారుల్ని పంపాడు. వాళ్ళనీ అంతే. పాదాలతో తొక్కి, పిడి గుద్దులు గుద్ది మరీ పైకి పంపేశాడు హనుమంతుడు. ఈసారి విరూపాక్షుడు, దుర్ధరుడు, ప్రఘసుడు, భాసకర్ణుడు అనే కొందరు సేనానాయకుల్ని పంపాడు రావణుడు. వాళ్ళనీ మట్టి కరిపించాడు హనుమంతుడు. రావణుని కొడుకు అక్షకుమారుణ్ణి గిరగిరా తిప్పి నేలకేసి కొట్టి మరీ చంపాడు.

రావణుడు చివరికి తన మరో కొడుకు ఇంద్రజిత్తుని పంపాడు. ఇంద్రజిత్తు అనేక బాణాలు వేశాడు. ఎంతకీ హనుమంతుడు అదుపులోకి రాకపోవడంతో చివరికి బ్రహ్మాస్త్రం సంధించాడు. నిజానికి బ్రహ్మాస్త్రం హనుమంతుణ్ణి ఏమీ చెయ్యదు. అది అతడి వరం. కానీ హనుమంతుడు దానికి లొంగిపోయినట్లు నటించాడు. రాక్షసులు కనపడ్డ గుడ్డముక్కలన్నీ తెచ్చి హనుమంతుణ్ణి కట్టి, కర్రలతో కొట్టారు. హనుమంతుడు అలాగే ఉండిపోయాడు.

'ఈ రాక్షసులు బుద్ధిహీనులు. నేను బ్రహ్మాస్త్రంతో బంధిస్తే వీళ్ళు తాళ్ళతో బంధిస్తున్నారు. బ్రహ్మాస్త్రంతో బందీ అయిన వ్యక్తిని మళ్ళీ బంధిస్తే ఆ బ్రహ్మాస్త్రం పట్టు వదిలేస్తుంది. అలాగే ఒకసారి బ్రహ్మాస్త్రం వేశాక ఆ వ్యక్తిపై మరి ఏ అస్త్రమూ మళ్ళీ పనిచెయ్యదు. ఈ వానరానికి అస్త్రం వదిలేసిందన్న విషయం తెలియదులా ఉంది. ఇంకా ఆ బ్రహ్మాస్త్రమే పట్టుకుని ఉందనుకుంటున్నాడు.' అని సంతోషపడ్డాడు ఇంద్రజిత్తు.

రాక్షసులు హనుమంతుణ్ణి రావణుని ముందు నిలబెట్టారు. రావణుని కళ్ళు ఎరుపెక్కాయి.

## హనుమంతుని హితవు

హనుమంతుడు మేరుశిఖరంపై కారుమేఘంలా సింహాసనంపై ఉన్న రావణుణ్ణి చూశాడు. అతడి తేజస్సుకు ముచ్చటపడి అలాగే చూస్తూనే ఉన్నాడు.

'ఆహా! ఏమీ రావణుని రూపం?! ఏమి ధైర్యం?! ఏమి బలం ?! ఏమి కాంతి?! **ఈ రాక్షసరాజుకు అన్ని గొప్ప లక్షణాలూ ఉన్నాయే. సీతాదేవిని అపహరించడం అనే ఒక్క అధర్మాన్ని ఆచరించి ఉండకపోతే ఇతడు దేవలోకానికే ప్రభువు అయ్యేవాడు.'** అని అనుకున్నాడు హనుమంతుడు తన మనస్సులో.

ఇటు రావణునిలో కూడా – 'ఒక వానరునికి ఉండవలసిన తేజస్సా ఇది? నేను ఎంతమందిని చూడలేదూ? జాంబవంతుణ్ణీ, వాలినీ, సుగ్రీవుణ్ణీ, సుషేణుణ్ణీ, నీలుణ్ణీ చూశాను కానీ వాళ్ళెవరికీ ఇంతటి పరాక్రమం గానీ శక్తిసామర్థ్యాలు గానీ లేవే!

వానరులు నా నాశనానికి కారకులు ఔతారని నేను కైలాసాన్ని పెకలించి నప్పుడు నన్ను నందీశ్వరుడు శపించాడు. ఆ నందీశ్వరుడే ఇలా వచ్చాడా?! పలు ఆలోచనలు.

'అసలు వీడెవడు? ఎక్కడినుంచి వచ్చాడు? ఎందుకొచ్చాడు? ఎవడివాడు? నాకు ఇష్టమైన అశోకవనాన్ని ఎందుకు నాశనం చేశాడు? సీతాదేవితో ఎందుకు మాట్లాడాడు? ఏమి మాట్లాడాడు? కనుక్కో. నిజం చెప్పాడా ప్రాణాలతో ఉంటాడు.' ప్రహస్తుణ్ణి ఆజ్ఞాపించాడు రావణుడు. అలాగే అడిగాడు ప్రహస్తుడు.

సమాధానంగా హనుమంతుడు గంభీరంగా అర్థవంతాలైన వాక్కులతో ఇలా చెప్పాడు – 'నేను ఇంద్రుని దూతను కాను. దిక్పాలకులు నన్ను పంపలేదు. విష్ణుమూర్తి గూఢచారినీ కాను. ఏ దివ్యాస్త్రాలు నన్నేమీ చెయ్యలేవు. నేను కావాలనే.. నిన్ను చూడాలనే అశోకవనం ధ్వంసం చేశాను. రాజదర్శనం కోసమే బ్రహ్మాస్త్రాన్ని గౌరవించి మీకు పట్టుబడ్డాను. నేను వానరుణ్ణి. వాయుపుత్రుణ్ణి. శ్రీరాముని దూతను. నాది యథార్థంగా వానరరూపమే. నన్ను హనుమంతుడు అంటారు, సుగ్రీవునికి మంత్రిని. అతని సందేశాన్ని తీసుకొచ్చాను. అంటూ అప్పటిదాకా జరిగిన శ్రీరామకథ

అంతా చెప్పి – వాలిని ఒక్క బాణంతో పడగొట్టి సుగ్రీవునికి పట్టాభిషేకం చేశాడు శ్రీరాముడు. నీకూ వాలికీ ఉన్న స్నేహం వల్ల సుగ్రీవుడు నీకు సోదరుడు అవుతాడు. ఆ సుగ్రీవుడు నీ కుశలమడిగాడు. నిన్ను చూడడంకోసమే వేరొక ఉపాయం లేక అశోకవనాన్ని నాశనం చేశాను. అప్పుడు నీ వాళ్ళు నా మీదకి యుద్ధానికి వచ్చారు. దేహాన్ని రక్షించుకోవాలి కాబట్టి ఏదో నాలుగు దెబ్బలు వేశాను, వాళ్ళు చనిపోయారు. శ్రీరాముడి భార్య అయిన సీతాదేవిని నువ్వు అపహరించి తీసుకొచ్చి లంకలో పెట్టావు. నేను సీతాదేవిని అశోకవనంలో చూశాను. సీతాదేవి అంటే ఎవరనుకున్నావు? అయిదు తలల పాము. నీ లంకను సర్వనాశనం చేసే కాళరాత్రి. నీ మృత్యువు. నీ మృత్యువును నువ్వే కోరి తెచ్చుకున్నావు. శ్రీరాముని తేజస్సు ముందు నువ్వు నిలబడలేవు. నువ్వే కాదు. ఈ ముల్లోకాల్లోనూ ఎవరూ నిలబడలేరు. నిన్ను చంపడానికి శ్రీరాముని దాకా ఎందుకు? సుగ్రీవుడు చాలు.

శ్రీరామసుగ్రీవులు అగ్నిసాక్షిగా స్నేహితులయ్యారు. కనుక శ్రీరాముని శత్రువు సుగ్రీవునికీ శత్రువే.

**మన పుణ్యపాపాలకు తగిన ఫలితాలు వేరువేరుగానే అనుభవించాల్సి ఉంటుంది. పుణ్యాలకి ప్రతిఫలంగా బంగారు లంక, వేల కాంతలతో సుఖాలు, రాక్షసులకి ప్రభువుగా అధికారం ఇవన్నీ నీకు లభించాయి. కానీ నువ్వు పరాయి స్త్రీని అపహరించి తీసుకొచ్చిన పాపానికి నీ శరీరాన్నే వదిలిపెట్టబోతున్నావు.**

శ్రీరాముడు ధనుర్వేదపారంగతుడు. అతనికి తెలియని అస్త్రశస్త్రాలు లేవు. సుశిక్షితుడు, మహాధర్మాత్ముడు. అటువంటి శ్రీరాముడు లంకలో నిలబడి, ధనువు ఎక్కుబెడితే నువ్వు నిలబడలేవు. నీలాంటివాళ్ళు లక్షల సంఖ్యలో వచ్చినా శ్రీరాముని ముందు నిలబడలేరు.

నువ్వు కైలాసపర్వతాన్ని ఎత్తినపుడు శివుడు తన కాలి బొటన వేలితో ఆ పర్వతాన్ని తొక్కాడు. అప్పుడు నీ ఇరవై చేతులు ఆ పర్వతం కింద ఉండిపోయాయి. గుర్తుంది కదా. అటువంటి శివుని ధనుస్సుని ఎంతో సులభంగా విరిచినవాడూ, నిన్ను ముప్పతిప్పలు పెట్టిన వాలిని ఒక్క బాణంతో వధించినవాడూ శ్రీరాముడే. సమస్త క్షత్రియుల్నీ ఓడించిన పరశురామునికి గర్వభంగం చేసిందీ, జనస్థానంలో

పద్నాలుగువేలమంది రాక్షసుల్ని సంహరించిందీ కూడా శ్రీరాముడే. అటువంటి శ్రీరాముడు వస్తే నువ్వు బతకగలవా? అయినా నిన్ను చంపడానికి శ్రీరాముడు రావాలా? నేను చాలనూ? మర్యాదగా సీతాదేవిని శ్రీరామునికి అప్పగించు. బతికిపోతావు. లేదా చచ్చిపోతావు.

సుగ్రీవుని ఆజ్ఞపై సీతాదేవిని వెదుకుతూ వచ్చాను. నీ ఇంట్లో సీతాదేవిని చూశాను. నువ్వు చాలా పెద్ద తప్పు చేశావు. ఫలితం త్వరలో అనుభవిస్తావు. నిన్నూ నీ లంకనూ సర్వనాశనం చెయ్యడానికి నేనొక్కణ్ణే చాలు. కానీ, సీతాదేవిని అపహరించిన నిన్ను నాశనం చేస్తానని శ్రీరాముడు ప్రతిజ్ఞ చేశాడు. అతడు శ్రీమహావిష్ణువుతో సమానమైన పరాక్రమశాలి. ఈ సృష్టిలో అతనికి సాటి ఎవరూ లేరు. అటువంటి శ్రీరామునికి అప్రియం చేసిన నువ్వు ప్రాణాలతో ఉండడం అసంభవం. తప్పుదిద్దుకో!' అన్నాడు.

హనుమంతుడు జంకూగొంకూ లేకుండా అలా మాట్లాడేసరికి రావణుడు కోపం పట్టలేక – 'ఈ వానరుణ్ణి సంహరించండి.' అన్నాడు.

అప్పుడు విభీషణుడు కలుగజేసుకొని – 'అన్నా! నువ్వు వేదవేత్తవు. ధర్మం తెలిసినవానివి. దూతను చంపడం రాజనీతి కాదు. ఒకవేళ శిక్షించాలనుకొంటే, తల గొరిగించడం, కాలో చెయ్యో తీసెయ్యడం, వాతలు పెట్టడంలాంటి కొన్ని శిక్షలు ఉన్నాయి. అవి వేయాలి. మరోమాట. ఇప్పుడు ఈ వానరాన్ని చంపావే అనుకో నీ బలం శత్రుపక్షానికి ఎలా తెలుస్తుంది? ఆలోచించు.' అన్నాడు.

దానికి రావణుడు – 'అయితే ఈ వానరుని తోకకు నిప్పంటించండి. కోతులకు తోక అంటే ఇష్టమంటారు కదా! దానికి నిప్పు అంటించి, అది కాలుతూ ఉంటే వీడు వేసే గెంతులు మీరంతా చూసి ఆనందించండి. వీథుల్లో తిప్పండి' అన్నాడు.

అప్పుడు రాక్షసులు హనుమంతుని తోకకు బట్టలు చుట్టి, నెయ్యి పోసి నిప్పంటించారు. హనుమంతుణ్ణి కట్టేసి, రథం ఎక్కించారు. తోక బగబగా మండుతోంది. మండే తోకతో నగరమంతా తిప్పారు రాక్షసులు హనుమంతుణ్ణి. మిద్దెల మీద నిలబడి అందరూ చూస్తుండగా వీథుల్లో తిప్పుతూ కర్రలతో కొడుతూ 'గూఢచారి, గూఢచారి' అని ప్రకటించారు.

హనుమంతుడూ తిరిగాడు. వాళ్ళనుంచి విడిపించుకోలేక కాదు. శత్రువూ– శత్రునగరమూ వీటి బలాలూ బలహీనతలూ తెలుసుకోవడం కోసం.

ఈ వార్త సీతాదేవి దాకా వెళ్ళింది. సీతాదేవి అగ్నిదేవుణ్ణి ప్రార్థించి – 'నేను నా భర్తకు సేవచేసేదాన్నే అయితే, తపస్వినినైతే, పతివ్రతనైతే అగ్నిదేవుడు హనుమంతుణ్ణి దహించకూడదు. శ్రీరామునికి నాపై దయ ఉన్నట్లయితే, నా భాగ్యమేదైనా మిగిలి ఉంటే, ధర్మప్రభువైన శ్రీరాముడు నేను శీలవతినని నమ్మి నాకోసం ఎదుచూస్తున్నది నిజమే అయితే హనుమంతుణ్ణి అగ్ని దహించకూడదు. చల్లబడిపోవాలి.' అంది.

ఒకపక్క మండుతున్నా తోకకి ఉన్న అగ్ని వెన్నముద్దలా చల్లగా హాయిగా ఉంది. చీమకుట్టినట్టయినా లేదు. ఆశ్చర్యం అన్పించింది హనుమంతుడికి.

'శ్రీరామకార్యంపై బయలుదేరాను. సముద్రంనుంచి మైనాకుడే లేచి వచ్చాడు. ఇప్పుడు మా తండ్రితో స్నేహంవల్ల అగ్ని కూడా దహించకుండా సహకరిస్తున్నాడు. ఇందులో ఆశ్చర్యమేముంది? అంతా సీతారాముల దయ.' అనుకొని అదే తోకతో లంకకు నిప్పంటించాడు. రాక్షసవీరుల భవనాలతో సహా రావణుని భవనాన్నీ అంటించి సింహగర్జన చేశాడు హనుమంతుడు.

కొద్ది సేపట్లోనే లంకా నగరం మొత్తం మంటలు వ్యాపించాయి. భవనాలన్నీ కుప్పకూలిపోతున్నాయి. ఒకటే కేకలు. పరుగులు. రాక్షసులంతా హడలిపోయారు.

హనుమంతుడు తోకను సముద్రంలో ముంచాడు. మంటలు ఆరిపోయాయి.

**త్రికూటపర్వతంపైకి దూకి – 'అరరే! ఎంతపని చేశాను. కోపాన్ని ఆపుకోలేకపోయానే! మండే అగ్నిని నీటితో చల్లార్చినట్లు, పాము కుబుసం విడిచినట్లు ఓర్పుతో కోపాన్ని నిరోధించేవాళ్ళే సత్పురుషులు. ధన్యులు కూడా. కోపంలో ఉన్నవాడు ఎంతకైనా తెగిస్తాడు. చివరికి ఎంత పెద్దవాళ్ళనైనా చంపడానిక్కూడా వెనుకాడడు. ఏది మాట్లాడాలో ఏది మాట్లాడకూడదో, ఏది చేయాలో ఏది చేయకూడదో కోపంతో ఉన్నవానికి తెలియదు. ఈ లంకలోనే సీతాదేవికూడా ఉంది కదా! ఈ మంటల్లో మరి సీతాదేవి ఏమయినట్లు?! కాలిపోయి ఉంటుందా? సీతాదేవియే ఒక అగ్ని. అగ్నిని అగ్ని కాలుస్తుందా ! ఆమెకు ఏమీ కాదు.' అనుకొన్నాడు.**

'ఆశ్చర్యం! లంక మొత్తం కాలిపోతున్నా సీతాదేవికి ఏమీ కాలేదు.' అన్నారు ఆకాశంలో సంచరిస్తున్న చారణులు. ఆ మాటలు విని హనుమంతుడు సంతోషించాడు. రివ్వున వెనక్కి వెళ్ళి సీతాదేవికి నమస్కరించి – సీతామాతా! నువ్వు క్షేమంగా ఉన్నావు. చాలా సంతోషం. లంకంతా కాల్చేశాను. రావణునికి చెప్పవలసిన మాట చెప్పేశాను. వాడు ఇప్పటికే భయంతో సగం చచ్చిపోయాడు. శ్రీరామునికోసం వాణ్ణి వదిలేశానుగానీ లేకపోతేనా వాని పది తలల్నీ గిల్లేసేవాడిని. తల్లీ! బాధపడకు. మరి సెలవా? అన్నాడు వినయంగా.

దానికి సీతాదేవి – 'మహావీరా! నువ్వొక్కడివే ఈ కార్యాన్ని సాధించగలవని నాకు తెలుసు. శ్రీరాముడే స్వయంగా వచ్చి, రావణుణ్ణి సంహరించి నన్ను తీసుకువెళ్ళాలి. అదే శ్రీరామునికి గౌరవం. నువ్వు వెళ్ళి అలా జరిగేలా ఏర్పాటుచెయ్యి.' అంది.

అలాగే నంటూ ఒక్క దూకు దూకి ఆకాశంలోకి ఎగిరాడు. అక్కడే సముద్రతీరంలోని దక్షిణపు టొడ్డున ఉన్న అరిష్టం అనే పర్వతం మీద దిగి, ఆ పర్వతం మీద నుంచి ఉత్తర దిక్కుకు తిరిగి గాలిలోకి ఎగిరాడు. అలా ఎగిరేసరికి అది భూమిలోకి నొక్కుకుపోయింది.

## వానరుల విజయోత్సాహం

వాయువేగంతో ప్రయాణిస్తూ దారిలో మైనాకుణ్ణి స్పృశించాడు. ఆవలి ఒడ్డు కన్పించడంతో సింహగర్జన చేశాడు. అది విన్న వానరులు ఆకాశం బద్ద లయ్యిందనుకొన్నారు. జాంబవంతుని దగ్గరికి వచ్చి 'ఆ అరుపు హనుమంతుని దేనా?' అని అడిగారు.

జాంబవంతుడు – 'అది హనుమంతునిదే. హనుమంతుడికి ఒక పని అప్పజెపితే అది కాకపోవడం అంటూ ఉండదు. నిశ్చయంగా వెళ్ళిన పనిని సాధించాడు. అందుకే ఈ సింహగర్జన.' అన్నాడు.

ఒక్క ఉదుటున హనుమంతుడు మహేంద్రపర్వతంపై దూకి, **'చూశాను సీతాదేవిని' అనే ఒక్క మాటతో వానరుల దైన్యాన్ని పటాపంచలు చేశాడు.** ఆ మాటకు వానరుల్లో ఆనందం ఉరకలు వేసింది. తరువాత హనుమంతుడు జరిగిన

దంతా పూసగుచ్చినట్లు చెప్పాడు. 'మనం వెళ్ళి సీతాదేవిని తీసుకువచ్చి శ్రీరామునికి అప్పజెబుదాం.' అన్నారు వానరులు. జాంబవంతుడు వారిని వారిస్తూ – 'చెప్పిన పని చేయడం వరకే మన పని. జరిగింది చెబుదాం. సీతాపతి ఏం చెప్తే అదే చేద్దాం' అన్నాడు. అందరూ అంగీకరించి బయలుదేరారు.

దారిలో మధువనం కన్పించింది. అదంటే సుగ్రీవునికి చాలా ఇష్టం. సీతాదేవి కన్పించిన ఆనందంలో మధువు తాగి సంబరం చేసుకొందామన్నారు వానరులు. అంగదుని అంగీకారంతో వానరు లందరూ మధువు తాగి ఆ వనాన్ని అతలాకుతలం చేసిపారేశారు. కొందరు పాటలు, కొందరు పొర్లు దండాలు, కొందరు నృత్యాలు, మరికొందరు వికటాట్టహాసాలు. కొందరు తూలుతూ, ఇంకొందరు హడావుడిగా తిరుగుతూ, కొందరు గంతులేస్తూ ఒకళ్ళనొకళ్ళు నెట్టుకుంటూ చెట్లమీదనుంచి దూకుతూ ఆగమాగం చేస్తున్నారు. వానరులంతా ఒకటే నవ్వులు. ఏడుపులు, అరుపులు.

అసలే కోతిమూక. పైగా మధువు తాగింది. ఇక చూడాలి వాళ్ళ అల్లరి! చివరికి వనపాలకులను చితక్కొట్టారు వానరులు. ఆ వనపాలకులకు నాయకుడు దధిముఖుడు సుగ్రీవునికి మేనమామ. అతనికీ నాలుగు వడ్డించారు వానరులు.

దధిముఖుడు గగ్గోలుపెడుతూ సుగ్రీవునిదగ్గర మొరపెట్టుకున్నాడు. సుగ్రీవుడు కోపగించలేదు. ఆనందించాడు. దానికి కారణం ఉంది. మధువనంలోకి వానరులు వెళ్ళి సంబరాలు చేసుకొంటున్నారంటే సీతాదేవి జాడ తెలిసిందన్నమాట! అందుకే సుగ్రీవునికి ఆనందం.

హనుమంతుడూ, అంగదుడూ తక్కిన వానరులూ శ్రీరామలక్ష్మణుల వద్దకు వచ్చారు. హనుమంతుడు శిరస్సు వంచి శ్రీరామచంద్రునికి నమస్కరిస్తూ – 'శ్రీరామా! తన పాతివ్రత్యనియమాన్ని కాపాడుకుంటూ సీతాదేవి క్షేమంగా ఉంది.' అన్నాడు. ఆ వార్త విని ఊపిరి పీల్చుకున్నారు శ్రీరామలక్ష్మణులు. వాళ్ళ మనస్సిప్పుడు కొంచెం తేలిక పడింది.

సీతాదేవి ఇచ్చిన చూడామణిని శ్రీరాముని చేతికి అందించి జరిగింది జరిగినట్లు చెప్పాడు హనుమంతుడు.

అది చూసి శ్రీరాముని మనస్సు దూడను చూసిన ఆవులా కరిగిపోయింది. రఘువరుడు ఎంతో ఆనందంగా – 'లక్ష్మణా! ఇంత కాలానికి ఈ మణిని చూశాను. ఇంక సీతాదేవి నెప్పుడు చూస్తానో!' అంటూ సీతాదేవి గురించి ఇంకా ఇంకా వినాలని ఉండడంతో 'చెప్పవయ్యా! హనుమంతుడా!' అన్నాడు.

'శ్రీరామా! నీకోసం సీతాదేవి కుమిలిపోతోంది. రాముడే రావాలి. రావణుణ్ణి చంపి, నన్ను తీసుకు వెళ్ళాలి అని ఎదురు చూస్తోంది. నేను సీతాదేవిని ఓదార్చి, ఆమె సందేహాలు తీర్చి, ధైర్యం చెప్పి వచ్చాను. కొంచెం తెప్పరిల్లి, నన్ను ఆశీర్వదించింది. నమస్కరించి ఇదుగో ఇలా వచ్చాను.' అన్నాడు హనుమంతుడు శ్రీరామునికి వినయంగా నమస్కరిస్తూ.

# యుద్ధకాండ

## శ్రీరాముని బహుమానం

'మహావీరుడా! గరుత్మంతుడూ, వాయుదేవుడూ తప్ప ఆ సముద్రాన్ని ఇంకెవరూ దాటలేరు.

కానీ నువ్వు దాటావు. లంకానగరంలోనికి దేవ, దానవ, యక్ష, గంధర్వులలో ఎవరూ ప్రవేశించలేరు. ప్రవేశించినా ప్రాణాలతో బయటపడలేరు. కానీ నువ్వు ప్రవేశించావు. సీతాదేవిని చూసివచ్చి, ఆమెనూ నన్నూ బతికించి నాకు మహోపకారమే చేశావు.

***అప్పగించిన పనిని అనుకున్నదానికంటే బాగా చేసేవాడు పురుషోత్తముడు. చెప్పినంతవరకే చేసి ఊరుకొనే వాడు మధ్యముడు. అసలు చేయకుండా బద్ధకించేవాడు అధముడు. నువ్వు మొదటిరకానికి చెందినవాడివి.'*** అని అందరి సమక్షంలో హనుమంతుణ్ణి ప్రశంసిస్తూ రఘువీరుడు మళ్ళీ ఇలా అన్నాడు.

'ఈ హనుమంతుడు వెళ్ళిన పనిని చక్కగా నిర్వహించిన కార్యసాధకుడు. సీతాదేవిని దర్శించడమే కాకుండా రాక్షసుల్ని మట్టికరిపించాడు. ఎక్కడా తన గౌరవాన్ని కోల్పోలేదు. సుగ్రీవుణ్ణీ సంతోషపెట్టాడు. సీతను చూచి వచ్చి, నన్నూ, లక్ష్మణుణ్ణీ, మా వంశాన్నీ కాపాడాడు. ఇలా ఇంత ప్రియవార్త చెప్పినందుకు బదులుగా నేనేమి ఇయ్యగలను? ఒక్క ఈ ఆలింగనం తప్ప.

హనుమంతా! ఇటురా! ఇదే నా సర్వస్వమూ.' అంటూ ఆలింగనం చేసుకొన్నాడు శ్రీరాముడు.

లంకలోనికి ప్రవేశించడం ఎలా? అదే ఇప్పుడు శ్రీరాముణ్ణి వేధిస్తున్న సమస్య. ఆ సమస్యతో ఇనవంశోద్భవుడైన శ్రీరాముడు దీర్ఘాలోచనలో పడ్డాడు. అది గమనించిన సుగ్రీవుడు –

***'శ్రీరామా! నీ వొక సామాన్యుడిలాగా నిరుత్సాహపడకు. నీలాంటి మహావీరుడు నిరుత్సాహపడకూడదు. నిరుత్సాహంవల్ల కావలసిన పనులు కూడా కాకుండా పోతాయి. శోకం పురుషుని ధైర్యాన్ని దిగజారుస్తుంది. అన్ని ప్రయోజనాలూ దెబ్బతింటాయి. ఎటువంటి పరిస్థితుల్లోనైనా మనుజుడు ఉత్సాహాన్ని ప్రకటించాలి. అదే అతడి కర్తవ్యం. కాబట్టి ఈ వ్యాకులపాటును విడిచిపెట్టు.'*** అంటూ శ్రీరామునికి తమ వానరుల శక్తి సామర్థ్యాలు తెలియజేశాడు. మళ్ళీ తానే – 'శ్రీరామా! మనం లంకను చేరుకోవాలంటే ముందు సముద్రాన్ని దాటాలి. అందుకు ఒక సేతువును నిర్మించుకోవాలి. ముందు దానిగురించి ఆలోచించు' అన్నాడు.

ఆ మాటలు విన్నాక శ్రీరామునికి కొంత ఉత్సాహం వచ్చింది.

'అయితే సరే! ఏదోవిధంగా సేతువు నిర్మించి, లంకను చేరుకున్నామనే అనుకుందాం. అప్పుడు లంకను ముట్టడించాలంటే అక్కడి పరిస్థితి ఏమిటో మనకు తెలియాలి కదా. హనుమంతా! లంక గురించి కాస్త వివరంగా చెప్పు' అని అడిగాడు లోకాభిరాముడు.

హనుమంతుడు వాక్యకోవిదుడు. వినే వ్యక్తి స్థాయినిబట్టి ఏ విషయాన్ని ఎలా చెప్పాలో తెలిసిన దిట్ట.

'శ్రీరామా! నదీ, వన, పర్వత, కృత్రిమదుర్గాల మధ్య శత్రుదుర్భేద్యంగా ఉంటుంది లంకానగరం. దానికి నాలుగు వైపులా నాలుగు ద్వారాలూ వాటికి లోతైన అగడ్తలూ ఉన్నాయి. ఆ ద్వారాలకు బలమైన తలుపులూ, వాటికి ఇనుపగడియలూ ఉన్నాయి. రాళ్ళయంత్రాలూ, బాణయంత్రాలూ, శతఘ్నులూ ఇలా సమస్త ఆయుధాలతో రాక్షసులు – ఎప్పుడైనా సరే యుద్ధానికి సిద్ధం అన్నట్టు ఉంటారు. రావణుడు యుద్ధప్రియుడు. అతనికి భయం అంటే ఏమిటో తెలియదు' అని చెప్పాడు హనుమంతుడు.

ఆ మాటలు విన్న నీలమేఘశ్యాముడు సుగ్రీవుడితో – 'సుగ్రీవా! **ఈ రోజు మంచి రోజు. ఉత్తర ఫల్గుణీ నక్షత్రం. ఇది విజయతార. అభిజిత్ ముహూర్తం.** శకునం కూడా బావుంది. వెంటనే బయల్దేరుదాం' అన్నాడు.

దక్షిణం వైపునకు కదిలిన వానరసేన పగలనకా రాత్రనకా ప్రయాణించి దక్షిణ సముద్రాన్ని చేరుకుంది.

ఎదురుగా సముద్రం. దాని ముందు వానర సైన్యం. ఇదీ సముద్రంలాగే ఉంది. ఆ మహాసముద్రాన్ని చూసి ఆశ్చర్యపోయారు వానరవీరులంతా. సముద్ర తీరంలో విడిది చేసిన సైన్యానికి సేనాపతి నీలుడు. మైందుడూ ద్వివిదుడూ ఆ సైన్యానికి కాపలా కాస్తున్నారు.

సముద్రానికి అవతల సీతాదేవి, ఇవతల సీతావల్లభుడు.

శ్రీరామునిలో ఉద్వేగం కట్టలు తెంచుకుంది. ఈ సముద్రాన్ని చూసి సీతాదేవి ఎంతగా భయపడి ఉంటుందో! భూమండలానికి ఒక చివర నేనూ ఒక చివర తానూ ఉన్నాము. సీతాదేవి బతికే ఉంది. అది చాలు నాకు. అంతకు మించి నాకేం కావాలి? అనుకొంటూ సీతాదేవిని ఎప్పుడెప్పుడు చూస్తానా?! అని పరితపిస్తున్నాడు కల్యాణరాముడు. ఇంతలో సూర్యుడు మెల్లగా పడమటి కొండల్లోకి జారుకున్నాడు.

## రావణుని మంతనాలు

అక్కడ లంకానగరంలో రావణుడు మంత్రులతో మంతనాలు సాగిస్తూ సిగ్గుతో తలవంచుకొని – 'అవమానం! అవమానం! ఒకే ఒక్క వానరుడు లంకను తగులబెట్టి, సీతాదేవితో మాట్లాడి, అవలీలగా వెళ్ళిపోతే ఇంత మంది రాక్షసులు ఉండీ ఏమీ చెయ్యలేకపోవడం ఎంత అవమానం? ఒక్క వానరుడే లంకను అల్లకల్లోలం చేశాడే! మరి ఇప్పుడు లక్షల సంఖ్యలో వానరవీరులతో శ్రీరామలక్ష్మణులు లంకపై దండెత్తి వస్తున్నారట. ఇప్పుడు మనమేం చెయ్యాలి? లంకను ఎలా కాపాడుకోవాలి? చెప్పండి.

***మహావీరులారా! మంత్రుల సూచనలే విజయానికి మూలమని పెద్దలు అంటారు. హితులూ సమర్థులూ అయిన మంత్రులతోనూ, సుఖదుఃఖాలలో పాలుపంచుకొనే మిత్రులతోనూ, మేలు కోరే బంధువులతోనూ బాగా చర్చించి, దైవాన్ని ఆశ్రయించి, పనులు ప్రారంభించేవాడు ఉత్తముడు.***

***అలా కాక తానొక్కడే నిర్ణయాలు తీసుకొనేవాడు మధ్యముడు. మంచిచెడులు చూడకుండా దైవాన్ని ఆశ్రయించకుండా అంతా తానేనన్న ధీమాతో కార్యం చేపట్టి, దానిని ఉపేక్షించేవాడు అధముడు.***

***అలాగే చర్చలో ఏకాభిప్రాయం కుదిరిన మంత్రాలోచన ఉత్తమమైనది. మొదట భేదాభిప్రాయాలున్నా చివరకు ఏకాభిప్రాయం కుదిరితే అది –మధ్యమం. భిన్నాభిప్రాయాలతో పనిని చెడగొట్టే మంత్రాలోచన అధమం.***

మీరంతా ప్రజ్ఞావంతులు. బాగా అలోచించి ఏకాభిప్రాయంతో ఒక నిర్ణయం చెప్పండి. దానిని నేను అనుసరిస్తాను.' అని అడిగాడు రావణుడు

దానికి మంత్రులంతా ముక్తకంఠంతో – 'మహావీరా! రావణా! నువ్వు ముల్లోకాలనూ గడగడలాడించిన వీరాధివీరుడివి. పాతాళంలోని పన్నగరాజునూ, అష్టదిక్పాలకులనూ జయించిన శూరుడివి. కైలాసాన్నే గడగడలాడించి, పరమ శివునితో స్నేహం చేసినవాడివి. మయుడంతటి గంధర్వరాజు తానే స్వయంగా నీ చెలిమిని కోరి, తన కూతురు మండోదరిని నీకిచ్చి పెళ్ళిచేశాడు. నీ కొడుకు ఇంద్రజిత్తు మహావీరుడు. దేవేంద్రుణ్ణే జయించినవాడు. అతడొక్కడే వానరసైన్యం మొత్తాన్నీ తునాతునకలు చేస్తాడు. అతణ్ణి పంపించు' అన్నారు.

నల్లగా కారుమబ్బులా ఉండే సేనాధిపతి ప్రహస్తుడు లేచి నిలబడి ఇలా అన్నాడు – 'రాజా! మనల్ని ఎవడేం చేస్తాడులే! అన్న ధీమాలో ఉన్నప్పుడు ఒక వానరుడు పొంచి వచ్చి దొంగదెబ్బ తీశాడు. ఇప్పుడు మీరు ఆజ్ఞాపించండి. ఈ భూమ్మీద ఒక్క వానరుడూ లేకుండా సమూలంగా నాశనం చేసి వస్తాను.'

వెంటనే దుర్ముఖుడూ, వజ్రదంష్ట్రుడూ, కుంభకర్ణుడి కొడుకు నికుంభుడూ ఇంకా కొందరు రాక్షసులూ ఒకరి తర్వాత ఒకరు శత్రువులందర్నీ సర్వనాశనం చెయ్యాలన్నారు. నేను చంపుతానంటే నేను చంపుతానని ఆవేశంగా బీరాలు పలుకుతున్నారు. చేతికి దొరికిన ఆయుధం చేతబట్టి యుద్ధానికి సిద్ధమంటూ గంతులు వేశారు.

## విభీషణుని హితవు

వాళ్ళ ఆవేశం చూసిన విభీషణుడు అందర్నీ శాంతింపజేసి ఇలా అన్నాడు.

'నాయనలారా! **ఎంత కష్టమైన పనినైనా సామ దాన భేదోపాయాలతోనే సాధించాలి. అనివార్యపరిస్థితుల్లోనే దండోపాయాన్ని ప్రయోగించాలి. సీతాదేవిని అపహరించడం తప్పు. ఆ తప్పు మనలోనే ఉంది. సీతాదేవిని తిరిగి శ్రీరామునికి అప్పజెప్పేస్తే ఏ సమస్యా ఉండదు.** యుద్ధంతో పనిలేదు. ఒక్క వానరుడే అంత చేశాడంటే అటువంటి వానరులు లెక్కలేనంతమంది వస్తే మనం ఏమౌతామో ఆలోచించండి. పైగా వాళ్ళు ప్రతీకారంతో రగిలిపోతున్నారు. జాగ్రత్త!'

విభీషణుని మాటలు ఎవరికీ రుచించలేదు.

అప్పటికి సభ చాలించి అంతఃపురంలోనికి వెళ్ళిపోయాడు రావణుడు.

మరుసటి రోజు ఉదయాన్నే విభీషణుడు రావణుని అంతఃపురానికి వెళ్ళి ఇలా హితబోధ చేస్తున్నాడు–

'ప్రభూ! నువ్వు సీతాదేవిని తీసుకువచ్చిన దగ్గర్నుంచీ లంకలో అన్నీ అపశకునాలే కనిపిస్తున్నాయి. హోమకుండాలలో అగ్ని వెలగడం లేదు. యజ్ఞవాటిక ల్లోకి సర్పాలు జొరబడ్డాయి. హోమద్రవ్యాలకు చీమలు పట్టాయి. ఆవులు వట్టి పోయాయి. ఏనుగులూ గుర్రాలూ దీనంగా అరుస్తున్నాయి. కాకులు గుంపులు గుంపులుగా గుడిగోపురాలపైనా ఇంటి నడికప్పులపైనా వాలుతున్నాయి. గ్రద్దలూ ఇంతే. నక్కలు పట్టణాల్లో ఊళలు పెడుతున్నాయి. ఇవన్నీ దుశ్శకునాలే. ఇవి లంకారాజ్యానికి చేటునే సూచిస్తున్నాయి. బాగా ఆలోచించి నిర్ణయం తీసుకో.' అన్నాడు.

దానికి రావణుడు కటకటపడి – 'నాకు ఎవడివల్లా భయంలేదు. నేను సీతాదేవిని తిరిగి అప్పగించను. నువ్విక వెళ్ళవచ్చు' అన్నాడు. మరుసటి రోజు మళ్ళీ సభ ఏర్పాటు చేశాడు రావణుడు.

'రాక్షసవీరులారా! మీ సహకారంతోనే నేను ముల్లోకాల్నీ జయించాను. కాబట్టి నా జయాపజయాల గురించీ లాభనష్టాల గురించీ మీకు నేను చెప్పాలి. ఇప్పటివరకూ మీతో నేను ఆలోచనలు అన్నీ పంచుకున్నాను. అయితే కుంభకర్ణుడు ఆరునెలలు నిద్రలోనే ఉండిపోయాడు. అందువల్ల అతడికి ఈ విషయం తెలియదు. ప్రస్తుతం నిద్రలేచి మెలకువతో ఉన్నాడు కాబట్టి ఇప్పుడు చెప్తున్నాను.

రామునికి ప్రాణప్రదమైన సీతను దండకారణ్యం నుంచి అపహరించి తీసుకువచ్చాను. లంకలో ఉంచాను. ఏది ఏమైనా సీతను తిరిగి ఇచ్చే ప్రసక్తే లేదు. ఇది నా నిర్ణయం. ఇప్పుడు చెప్పండి ఆ రామలక్ష్మణులను చంపడానికి ఏ వ్యూహాలు పన్నాలి?' అని అడిగాడు.

ఆ మాటలకు స్పందిస్తూ కుంభకర్ణుడు కోపంగా – ***'రావణా! ముందు చెయ్యవలసిన పనిని వెనుక, వెనుక చెయ్యవలసిన పనిని ముందూ చేసేవాడు మూర్ఖుడు. వాడికి చివరికి మిగిలేది నష్టం మాత్రమే.*** ముందూ వెనుకా ఆలోచించకుండా సీతాదేవిని అపహరించి తీసుకొచ్చావు. అప్పుడు మాతో చెప్తే బావుండేది. సరే! జరిగిందేదో జరిగింది. ఇప్పటిదాకా శ్రీరాముడు నిన్ను చంపలేదంటే అది నీ అదృష్టమే. అయినా భయపడకు. నేనున్నాను. నా శాయశక్తులా నిన్ను కాపాడతాను. నిశ్చింతగా ఉండు.'

తరువాత మహాపార్శ్వుడు అన్నాడు.

'మహారాజా! నువ్వు ఈశ్వరుడికే ఈశ్వరుడివి. నీకు అడ్డేమిటి? ముందు ఆ సీతాదేవిని బలాత్కరించు. అప్పుడు విధిలేక సీతాదేవి నీ వశం అవుతుంది. ఆపై కుంభకర్ణుడు ఉన్నాడు. ఇంద్రజిత్తూ ఉన్నాడు. ఎవడు వచ్చినా వాళ్ళే చూసుకుంటారు.'

అప్పుడు రావణుడు అసలు రహస్యం చెప్పాడు.

"మిత్రమా! విను. నేను ఒకసారి బ్రహ్మ సభకు వెళ్తూ దారిలో పుంజికస్థల అనే అప్సరసను చూశాను. ఆమెకు ఇష్టం లేకపోయినా ఆమెను బలాత్కరించాను. అప్పుడు బ్రహ్మ నేను ఏ స్త్రీనైనా బలాత్కరిస్తే నా తల నూరు ముక్కలవుతుందని నన్ను శపించాడు. అందుకని ఊరుకొన్నాను గానీ ఈ పాటి ఆలోచన నాకు లేకనా?" అన్నాడు.

వీళ్ల ఆలోచనలు చూసి విభీషణుడు మళ్ళీ చెప్పి చూశాడు.

'రావణా! సీతాదేవి ఐదుతలల కాలసర్పం. కోరి కోరి కాలసర్పాన్ని ఎందుకు కౌగిలించుకోవాలనుకొంటున్నావో నాకు అర్థం కావడం లేదు. మేలుకో! ఈ కుంభకర్ణ, ఇంద్రజిత్, ప్రహస్త, మహాపార్శ్వ, మహోదర, కుంభ, నికుంభ, అకంపనాది

రాక్షస వీరులందర్నీ శ్రీరామబాణం చంపకముందే సీతాదేవిని శ్రీరాముడికి అప్పగించు. సూర్యేంద్రాది దేవతలుగానీ చివరికి మృత్యువే గానీ నిన్ను కాపాడాలనుకున్నా నువ్వు ఎక్కడ దాక్కున్నా ఎవరు అడ్డుపడినా శ్రీరాముడు నిన్ను చంపకుండా వదలడు.'

అందరూ కలిసి విభీషణుణ్ణి నిందించారు. చివరిగా రావణుడు – **'విభీషణా! శత్రువుతో కాపురం చెయ్యవచ్చుగాక! కాల సర్పాలతో కలిసి జీవించవచ్చు గాక! కానీ మిత్రునిగా ఉంటూ శత్రువును సేవించేవానితో మాత్రం కలిసి జీవించలేం సుమా! జ్ఞాతులెప్పుడూ ఇంతే. ఎక్కడైనా అంతే. కష్టాల్లో కలిసిరారు. పైగా వెన్నుపోటు పొడుస్తారు. శరత్కాల మేఘంలో నీరు ఎలా ఉండదో దాయాదుల గుండెల్లో స్నేహమూ అంతే! నువ్వు కాబట్టి నన్ను ఇన్ని మాటలు అని బతికి పోయావు. మరొకడైతేనా! ఏమయ్యేవాడో! ఛీ మన వంశంలో చెడబుట్టావు.'** అన్నాడు. ఆ మాటలకి విసిగిపోయిన విభీషణుడు మరో నలుగురు రాక్షసులతో ఆకాశంలోనికి ఎగిరి ఇలా అన్నాడు.

***"రాజా!*** *మనస్సుకు ప్రియంగా మాట్లాడేవాళ్ళు చాలా మందే ఉండవచ్చు.* ***కానీ అప్రియమైనా హితవే చెప్పేవాళ్ళూ, చెప్తే వినేవాళ్ళూ ఉండరు. ఇల్లు తగలబడిపోతుంటే చూస్తూ ఉండలేనట్లే నేనూ నీకు చేతనైన మేలు చేద్దామని చెప్తున్నాను.*** *నీకు పోయేకాలం దాపురించింది. అందుకే నా మాటలు నీకు రుచించడం లేదు.* ***అంతిమ ఘడియలు సమీపించినవాడికి ఇటువంటి మాటలు తలకెక్కవు, 'వినాశకాలే విపరీత బుద్ధిః',*** *నీ కర్మ. నేను వెళ్తున్నాను''* అని రావణునితో తెగతెంపులు చేసుకొన్నాడు విభీషణుడు.

## విభీషణ శరణాగతి

అలా రావణుణ్ణి విడిచిపెట్టిన విభీషణుడు తన నలుగురు మిత్రులతో కలిసి శ్రీరామలక్ష్మణులను ఆశ్రయించాడు. తన కథంతా విన్నవించాడు.

సుగ్రీవాదులు విభీషణుణ్ణి చేరదీయవచ్చో లేదోనని శంకించారు.

హనుమంతుడు బాగా ఆలోచించి అతణ్ణి ఆదరించడం మంచిదే నన్నాడు. శ్రీరాముడిదీ అదే అభిప్రాయం. **'విభీషణుడు ఏ ఉద్దేశంతో వస్తున్నాడో మనకు**

**తెలీదు. కానీ మిత్రభావంతో వచ్చి నన్ను శరణువేడితే నేను కాదనలేను. శరణువేడిన వాడు దుష్టుడే అయినా రక్షించడం సత్పురుషుల లక్షణం. తన భర్తను చంపిన వేటగాడు శరణు వేడినందువల్ల ఓ పావురం అతనికే ఆహారమయ్యింది! శక్తి ఉండి శరణాగతుణ్ణి రక్షించకపోవడం మహాపాపం అని కణ్వపుత్రుడైన కండుమహర్షి చెప్పాడు కదా! శరణు కోరిన వాడిని ప్రాణాలు అర్పించైనా కాపాడాలి. అది ధర్మం.'**

**సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే**
**అభయం సర్వభూతేభ్యో దదా మ్యేతత్ వ్రతం మమ (6-18-33)**

**ఎవ్వరైనా సరే! నన్ను శరణు వేడితే నేను తప్పక రక్షిస్తాను. ఇది నా వ్రతం. నియమం. అది విభీషణుడే కావచ్చు. రావణుడే కావచ్చు.'** అన్నాడు.

శరణాగతుడైన విభీషణుడు శ్రీరాముని కాళ్ళపై పడి శరణు వేడాడు. అప్పుడు లక్ష్మణాగ్రజుడైన శ్రీరాముడు అతణ్ణి ఓదార్చి ఆదరించాడు. తరువాత రావణుని బలాబలాల గురించి చెప్పమని విభీషణుణ్ణి అడిగాడు. విభీషణుడు చెప్తున్నాడు.

'శ్రీరామా! రాక్షసులు కోట్ల సంఖ్యలో ఉన్నారు. వీళ్ళ బలంతోనే రావణుడు దిక్పాలకుల్ని జయించాడు. దేవేంద్రుణ్ణి హింసించాడు.' అంటూ రాక్షసవీరుల బలాలు విన్నవించాడు.

**రాఘవుడు ఆనందించి - 'విభీషణా ! విను. ఇదే నా ప్రతిజ్ఞ. రావణుడు ఎక్కడున్నా సరే ! అతణ్ణి సంహరించి నిన్ను లంకా సామ్రాజ్యానికి రాజును చేస్తాను. ఇది సత్యం.'**

**'శ్రీరామా! నా శక్తివంచన లేకుండా నేను నీకు సాయం చేస్తాను.' విభీషణుడూ మాట ఇచ్చాడు. అనడమే తడవుగా శ్రీరాముడు లక్ష్మణునితో సముద్రపు నీరు తెప్పించి అప్పుడే విభీషణునికి పట్టాభిషేకం చేశాడు.**

## సేతువు నిర్మాణం

సముద్రం దాటడానికి విభీషణుని సలహా మీదట సత్యవ్రతుడైన శ్రీరాముడు సముద్రుణ్ణి పూజిస్తున్నాడు. మూడు రోజులు ఉపవాసం చేస్తూ దర్భశయ్యమీదే పడుకొని ప్రార్థించాడు. అయినా సముద్రుడు కనికరించకపోయేసరికి శ్రీరామునికి కోపం వచ్చింది.

**'ఓర్పుగా పూజిస్తే నేను చేతకానివాణ్ణని అనుకొంటున్నాడీ సముద్రుడు. ఈ లోకంలో క్షమాగుణం అవమానాల పాలవుతుంది. దుష్టుణ్ణీ, పొగడ్తలకోరునీ గౌరవించినట్లుగా శాంతుణ్ణీ, సహనశీలినీ, మంచి మాట్లాడేవాణ్ణీ మూర్ఖులు గౌరవించరు. అందుకే నేనేమిటో చూపిస్తాను'** అంటూ సముద్రంపైకి బ్రహ్మాస్త్రం సంధించాడు శ్రీరాముడు.

సముద్రం అల్లకల్లోలం అయ్యింది. లోకాలు అతలాకుతల మయ్యాయి. పర్వతాలు గజగజలాడాయి. చుక్కలు రాలిపడ్డాయి. సూర్యుడూ చంద్రుడూ మాయమైపోయారు.

మేరుపర్వతంపై సూర్యునిలా సముద్రుడు ప్రత్యక్షమై – 'శ్రీరామా! నేను సముద్రుణ్ణి. నన్నెవరూ దాటకూడదు. ఇది నా ప్రకృతి. నన్ను ఆశ్రయించుకొని ఉన్న జలజంతువులకు ఏ హానీ కలగనిరీతిలో మీకు నేను సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నాను.' అన్నాడు. దానికి శ్రీరాముడు – 'ఎక్కుపెట్టిన ఈ బ్రహ్మాస్త్రాన్ని ఏం చెయ్యమంటావు మరి?' అని అడిగాడు.

దానికి సముద్రుడు – 'శ్రీరామా! ఉత్తరం వైపు ద్రుమకుల్యం అనే చోట కొంతమంది దురాత్ములైన దస్యులు నా నీళ్ళు తాగేస్తున్నారు. నీ బ్రహ్మాస్త్రాన్ని వాళ్ళ మీదకు వదిలి పుణ్యం కట్టుకో!' అన్నాడు. శ్రీరాముడు అలాగే బాణం వదిలాడు. మళ్ళీ సముద్రుడు – 'శ్రీరామా! మీ సైన్యంలో నలుడు అని ఒక వానరుడు ఉన్నాడు. అతడు విశ్వకర్మ కొడుకు. తండ్రివల్ల ఎన్నో వరాలు పొందాడు. అతడే నా మీద వంతెన కట్టగలడు' అని చెప్పి అంతర్ధానమయ్యాడు .

వానరుల్లో ఉత్సాహం పెల్లుబికింది. చకచకా రాళ్ళూ అవీ అందించారు. నలుడు సముద్రంపై సేతువు నిర్మించాడు. 'ఆహా! ఎంత గొప్పగా ఉందీ వంతెన! సముద్రునికి పాపిడిలాగా ఉంది.' అని అందరూ ప్రశంసించారు.

* * *

రావణుడు పంపిన శార్దూలుడు అనే ఒక గూఢచారి రావణునితో – 'రాక్షసరాజా! సముద్రం పక్కన మరో సముద్రంలా ఉందా వానరసైన్యం. నిన్ను చంపడానికి వాళ్ళంతా ఉత్సాహంగా ఉన్నారు.' అన్నాడు. రావణుడు ఆ మాటలు విని మండిపడి శుకుడు అనే మరో గూఢచారిని పిలిచి –

'ఎలాగైనా సుగ్రీవుణ్ణి మనవైపు తిప్పుకోవాలి. వెళ్ళు. సుగ్రీవుణ్ణి ప్రలోభపెట్టు. ఆ పనిమీద ఉండు.' అని పంపాడు. వాడు వెళ్ళి ఆకాశంలో నిల్చొని రావణుడు పంపిన సందేశం చెప్పాడు. ఆ మాటలు విన్న వానరులు పైకెగిరి వాణ్ణి అందుకొని పిడిగుద్దులతో గుద్దిపారేశారు. 'బాబోయ్! నేను దూతని. నన్ను చంపకండని' వాడు పారిపోబోతే వానరులు బంధించేశారు.

విభీషణుడూ అతని మిత్రులూ దక్షిణంవైపు వారధికి కాపలాగా ఉన్నారు. వానర సైన్యం వారధి మీద ప్రయాణించి సముద్రాన్ని దాటింది.

## శ్రీరాముని యుద్ధవ్యూహం

లంకా సౌందర్యానికి శ్రీరాముడు ముగ్ధుడైనా మళ్ళీ గంభీరంగా మారి సైనిక వ్యూహాలను రచిస్తున్నాడు.

అంగదుడు నీలునితో కలిసి సైన్యానికి గుండెకాయగా నిలుస్తాడు. ఋషభుడు దక్షిణ భాగంలోనూ, గంధమాదనుడు ఎడమవైపూ ఉంటారు. తానూ లక్ష్మణుడూ ముందు నడుస్తారు. జాంబవంతుడూ, సుషేణుడూ, వేగదర్శీ సైన్యం మధ్యలో అంటే కుక్షిభాగంలో ఉంటారు. సుగ్రీవుడు మిగిలిన వీరులతో జఘనభాగాన్ని రక్షిస్తూ ఉంటాడు. ఇదీ శ్రీరాముని యుద్ధతంత్రం.

ఆ తర్వాత, రావణుని దూత – శుకుణ్ణి వదిలెయ్యమన్నాడు శ్రీరాముడు.

వానరసైన్యం కదిలివస్తున్న సముద్రంలా ఉంది. దిక్కులు పిక్కటిల్లేలా వానరులు చేస్తున్న జయజయధ్వానాలే తరంగఘోష అన్నట్లుగా సైన్యం లంకలోనికి ప్రవేశించింది. భూమి దద్దరిల్లుతోంది.

* * *

శుకుడు రావణుని దగ్గరకు వచ్చి – 'రాజా! వానరసైన్యానికీ మన సైన్యానికీ పోలికే లేదు. అది భూమి పట్టనంత ఉంది. శ్రీరాముణ్ణి శరణు వేడడం తప్ప మనకు మరో దారి లేదు. త్వరపడు. సీతాదేవిని సమర్పించి శరణు వేడతావో తెగించి యుద్ధం చేస్తావో ఏదో ఒకటి తేల్చు' అన్నాడు.

రావణుడు ఆ మాటలు లక్ష్యపెట్టలేదు. ఇంకా వివరాలు సేకరించమనీ వానరుల యుద్ధతంత్రాలు ఏమిటో తెలుసుకురమ్మనీ ఈసారి శుకసారణులు అనే మరో ఇద్దరు దూతల్ని పంపించాడు.

వాళ్ళు వానరరూపాలు ధరించి వానరసైన్యంలో ప్రవేశించారు. విభీషణుడు వాళ్ళని కనిపెట్టి శ్రీరామునికి అప్పగించాడు. పట్టుబడ్డ శుకసారణులతో శ్రీరాముడు – 'మీకింకేం కావాలో చెప్పండి. స్వేచ్ఛగా అడగండి. భయం లేదు. కానీ మీ ప్రభువుకు చెప్పండి. ఏ బలం చూసుకొని సీతాదేవిని అపహరించి తెచ్చాడో ఆ బలంతో రమ్మనండి. పొండి' అని వదిలేశాడు.

శుకసారణులు వచ్చి – సీతాదేవిని శ్రీరామునికి అప్పగించి శరణు వేడడం ఒక్కటే సరియైనదని హెచ్చరించారు. రావణుడు వాళ్ళపై చిరచిరలాడుతూ సేకరించిన వివరాలు చెప్పమన్నాడు.

నీలుడు, అంగదుడు, హనుమంతుడు, నలుడు, కుముదుడు, కపిలుడు, రంభుడు, శరభుడు, పనసుడు, వినతుడు, క్రోధనుడు, గవయుడు వానరుల్లో ప్రముఖులు. ఋక్షసైన్యంలో మహావీరుడు జాంబవంతుడు ఉన్నాడు. ఇంకా హరుడు, ధూమ్రుడు, దంభుడు, సన్నాదుడు, క్రథనుడు, ప్రమాథి మొదలైన మహావీరులెందరో ఉన్నారు. వాళ్ళు యమునికి కూడా భయపడేవాళ్ళు కారు. వీళ్ళు ఒక్కొక్కరూ నాలుగు కోరలు కల సింహాలు. బుసకొట్టే కాలసర్పాలు. వానర వీరుల్లో ఒక్కొక్కడి అధీనంలోనూ పదికోట్ల సైన్యం ఉంది. అని తమకు తెలిసినదంతా శుకసారణులు చెప్పారు.

## రావణుని కుతంత్రం

రావణుడు ఇంకా కొంతమంది చారుల్ని పంపి మరిన్ని వివరాలు రాబట్టాలనుకొన్నాడు. అలా వెళ్ళిన చారులందరికీ బాగా దేహశుద్ధి జరిగింది. వాళ్ళంతా ముక్తకంఠంతో ఒకే మాట చెప్పారు.

'రావణా! సీతాదేవినైనా అప్పగించు. లేదా యుద్ధానికైనా తయారుగా ఉండు' అని. అప్పుడు రావణుడు విద్యుజ్జిహ్వుణ్ణి పిలిచి – 'నేను సీతాదేవితో మాట్లాడుతుంటాను. అప్పుడు నువ్వు శ్రీరాముడి తలను కృత్రిమంగా సృష్టించి, దానినీ దానితోపాటు ధనుర్బాణాలూ తీసుకురా!' అని చెప్పి అశోకవనంలో ఉన్న

సీతాదేవి దగ్గరకు వెళ్ళి – 'సీతా! నా భర్త అంతటివాడూ ఇంతటివాడూ అని తెగ ప్రగల్భాలు పలికావే! చూడు. ఇప్పుడేమయ్యిందో! నీ భర్త మరణించాడు. ఇప్పటికైనా మనసు మార్చుకో! నన్ను భర్తగా స్వీకరించు.' అంటూ ముందే అనుకున్న పథకం ప్రకారం శ్రీరాముని తలా ధనుర్బాణాలూ తెప్పించి సీతాదేవికి చూపించాడు.

పాపం! సీతాదేవి మెల్లగా తలెత్తి చూసి, నిజమేననుకుంది. గుండె ఆగి పోయినంత పనయ్యింది సీతాదేవికి. కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది. 'ఆ ధనుర్బాణాలూ, ఆ కళ్ళూ, ఆ రంగూ, ఆ ముఖం అన్నీ శ్రీరామునివే. సందేహం లేదు. జుట్టూ అలాగే ఉంది. అదుగో చూడామణి..' అంటూనే బోరున విలపించి, కుప్పకూలిపోయింది.

ఆ శిరస్సును చేతుల్లోకి తీసుకొని – 'శ్రీరామా! నన్ను అనాథను చేసి వెళ్ళిపోయావా? అసలే దుఃఖంలో ఉన్న నాకు ఇంతటి దుఃఖం వచ్చి పడిందే! అయ్యో!! నా కోసం చివరికి నువ్విలా అయిపోయావా? నేను నీ సహధర్మచారిణిని కదా! అగ్నిసాక్షిగా నన్ను విడిచి వెళ్ళనని ప్రమాణం చేశావు. పెళ్ళి నాటి ప్రమాణా లన్నింటినీ విడిచిపెట్టి ఎలా ఒంటరిగా వెళ్ళిపోయావయ్యా!' వెంటనే రావణుణ్ణి ఉద్దేశించి – 'రావణా! గొప్ప ఘనకార్యం చేశావులే. రా! నన్నూ చంపెయ్యి. నా శరీరాన్ని శ్రీరాముని శరీరంపై పారవేసి పుణ్యం కట్టుకో' అంటూ హృదయ విదారకంగా రోదిస్తోంది.

ఇంతలో ఏదో వార్త వచ్చి, రావణుడు హుటాహుటిన అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు. అతనితో పాటే శ్రీరాముడి తలా ధనుర్బాణాలూ మాయమై పోయాయి.

## సరమ ఓదార్పు

శోకంతో మూర్ఛపోయిన సీతాదేవికి సాంత్వన వాక్యాలు పలుకుతోంది సరమ అనే రాక్షసి. సీతా! దిగులుపడకు. నీవు చూచిందంతా రావణుడి మాయ. వాస్తవం ఎంతమాత్రం కాదు. అవిగో! యుద్ధభేరీలు. గజఘీంకారాలు, హయ హేషలూ మిన్నంటుతున్నాయి. జయజయధ్వానాలు చెలరేగుతున్నాయి. రాజ మార్గాలన్నీ సైనికులతో క్రిక్కిరిసి పోయాయి. ఇక సమరమే. ఆ సమరంలో శ్రీరాముడు తప్పక విజయం సాధిస్తాడు. నీ కష్టాలన్నీ తొలగిపోతాయి. సమయానికి వాన కురిస్తే కళకళలాడే పంటపొలంలా నీ ముఖంలో ఆనందం త్వరలోనే నేను

చూస్తాను.' అంది. అంతేకాదు; సీతాదేవి కోరికమీద రావణుని కుట్రల్ని తెలుసుకొని వచ్చి సీతాదేవికి ఇలా విన్నవిస్తోంది.

'సీతాదేవీ! అక్కడ రావణుడి తల్లి కైకసీ, వృద్ధమంత్రి అవిద్ధుడూ, మాతామహుడు మాల్యవంతుడూ ఉన్నారు. శ్రీరామునితో సంధి చేసుకోమని చెప్తున్నారు. ఆ మాటలకు రావణుడు కస్సున లేచాడు.

నా ఉప్పు తింటూ నా శత్రువును సమర్థిస్తారా? ఇదుగో చెప్తున్నా వినండి. సీతాదేవిని విడిచి పెట్టే ప్రసక్తే లేదు. నా ముందు ఆ మానవుడెంత? ఆ వానరులెంత? అందరినీ సర్వనాశనం చేస్తాను. చూస్తూ ఉండండి.' అన్నాడు. యుద్ధంలో రావణుడూ, సకల రాక్షసులూ చస్తేగానీ నీకు విముక్తి కలగదమ్మా!" అని సరమ ఇలా అంటూ ఉండగానే వానరసేన సింహనాదం చేయటం వినిపించింది.

తూర్పు ద్వారంలో ప్రహస్తుణ్ణీ, దక్షిణ ద్వారంలో మహాపార్శ్వమహోదరుల్నీ, పశ్చిమద్వారంలో ఇంద్రజిత్తునీ పెట్టాడు. ఉత్తరద్వారంలో శుకసారణులతో కలిసి తనే స్వయంగా కాపలా కాస్తానన్నాడు.

విరూపాక్షుణ్ణి సైన్యం మధ్యలో ఉండమన్నాడు.

రావణుడి యుద్ధ తంత్రాలన్నీ విభీషణుని అనుచరులు అనలుడు, శరభుడు, సంపాతి, ప్రఘసుడు పక్షిరూపాల్లో వెళ్ళి తెలుసుకొని వచ్చారు. దానికి అనుగుణంగా శ్రీరాముడు వీరులందరితో సమావేశమై వ్యూహరచన చేస్తూ ఇలా ఆజ్ఞాపించాడు.

'కపివీరులారా! పూర్వ ద్వారాన్ని నీలుడు వానరసైన్యంతో ఆక్రమిస్తాడు. అక్కడ ప్రహస్తుడు ఉంటాడు కాబట్టి వాడికి నీలుడే సరియైన వాడు.

మహాపార్శ్వ మహోదరులు సంరక్షిస్తున్న దక్షిణ ద్వారాన్ని అంగదుడు ఆక్రమిస్తాడు. వానరసైన్యంతో హనుమంతుడు పశ్చిమ ద్వారాన్ని కమ్ముకొనివస్తాడు.

సరే! ఆ రావణుని సంగతి నేను చూసుకొంటాను. నేనూ లక్ష్మణుడూ ఉత్తర ద్వారాన్ని ముట్టడిస్తాము. రావణుడు అక్కడే ఉన్నాడు కదా!

ఎవరూ మానవరూపాలు ధరించకండి. నేనూ, లక్ష్మణుడూ, విభీషణుడూ, అతని నలుగురు మంత్రులు మాత్రమే మానవరూపాలలో ఉంటాము. ఇదీ యుద్ధ వ్యూహం.

విభీషణా! ఈ రాత్రికి మన నివాసస్థానం ఈ సువేల పర్వతమే. ఇది చాలా అందమైన పర్వతం. పై నుంచి చూస్తే లంక చాలా స్పష్టంగా కన్పిస్తుంది. నా భార్యను అపహరించిన ఆ రావణుణ్ణి సంహరించే దాకా నాకు కంటికి కునుకు రాదు. ఒక్కడు చేసిన పాపానికి మొత్తం రాక్షస సమూహాన్నంతటినీ చంపవలసి వస్తోందే అన్నది నా బాధ. కానీ తప్పదు. ఒకని అపచారానికి కులం మొత్తం నాశన మవుతుంది.' ఇలా అంటూనే –

శ్రీరాముడు సువేల పర్వతం ఎక్కి లంకను చూశాడు. అతని వెంట లక్ష్మణుడూ తక్కిన వానరవీరులూ అధిరోహించారు.

ఎత్తయిన రాజభవనం. పై అంతస్తులో రావణుడు ఠీవిగా కూర్చున్నాడు. నల్లని మేఘంలా ఉన్నాడు. ఎర్రని వస్త్రాలు ధరించాడు. అది చూసిన సుగ్రీవుడు ఉండబట్టలేక సువేల పర్వతం మీదనుంచి త్రికూట పర్వతం మీదికి దూకి ఎగురుకుంటూ వెళ్ళి రావణుని ముందు వాలాడు.

'రావణా! నేను శ్రీరాముని మిత్రుణ్ణి. సుగ్రీవుణ్ణి. నీ అంతు చూస్తా' నంటూ అతని మీదికి దూకి, కిరీటం పడగొట్టాడు. రావణుడూ విజృంభించి, సుగ్రీవునితో తలపడ్డాడు. 'ఓరీ సుగ్రీవా! నిన్ను హీనగ్రీవుణ్ణి చేస్తాను (నీ తల తొలగిస్తాను) కాసుకో.' అంటూ పిడిగుద్దులు వేశాడు.

ఇద్దరూ ఘోరంగా పెనగులాడారు. ఒకరినొకరు కుమ్ముకున్నారు. రివ్వున ఆకాశంలోనికి ఎగిరారు. ఇద్దరి శరీరాల్నుంచీ రక్తం కారుతోంది. పుష్పించిన మోదుగుచెట్లలాగా, ఎర్రమట్టి పులుముకున్న మదగజాల్లాగా, సింహశార్దూలాల్లాగా ప్రకాశిస్తూ అలా కాసేపు ఇద్దరూ మల్లయుద్ధం చేశారు.

సుగ్రీవుడు పెట్టే బాధలు తట్టుకోలేక రావణుడు మాయలు పన్నడం మొదలు పెట్టాడు. అది గమనించిన సుగ్రీవుడు ఆకాశంలోనికి ఎగిరి రెప్పపాటుకాలంలో తప్పించుకొని శ్రీరాముని దగ్గరకు వచ్చేశాడు.

సుగ్రీవుడు చేసింది పెద్ద సాహసమే. శ్రీరాముడు తల్లడిల్లి పోయాడు గానీ క్షేమంగా తిరిగి వచ్చినందుకు ఆనందించాడు.

శ్రీరాముడు అంగదుణ్ణి పిలిచి 'అంగదా! నువ్వు రావణుని దగ్గరకు వెళ్ళి చేసిన తప్పులకు ఫలితం అనుభవించే సమయం వచ్చిందని చెప్పు. అంతేకాదు. విభీషణుడు లంకకు రాజు అవుతాడు. నీకు కాలం చెల్లింది.' అని కూడా చెప్పు. 'సీతాదేవిని అప్పగించి శరణు కోరుకోమను' అన్నాడు.

అంగదుడు వెళ్ళి శ్రీరాముని సందేశం చెప్పాడు.

రావణుడు కోపంతో మటమటలాడిపోయాడు. అంగదుణ్ణి చంపెయ్యాలని పించి నలుగురు రాక్షసుల్ని అంగదుని మీదికి ఉసిగొల్పాడు. అంగదుడు ఆ నలుగుర్నీ ఇద్దరిద్దర్ని చొప్పున చెరో సందిటా బిగించి పట్టుకొని భవనాగ్రం పైకి దూకాడు. పట్టుజారి, ఆ రాక్షసులు కింద పడి నెత్తురు కక్కుకొని మరణించారు. ఇంకా కసి తీరని అంగదుడు ఆ భవనశిఖరాన్ని ఒక్క తన్నుతన్నాడు. అంతే అది నేలకూలింది. అందర్నీ తప్పించుకొని శ్రీరాముని దగ్గరకు వచ్చేశాడు.

## రామ రావణ సంగ్రామం

యుద్ధం మొదలయ్యింది. 'అతిబలుడైన శ్రీరామునికి జయము! మహా బలుడైన లక్ష్మణునికి జయము! సుగ్రీవునికి జయము!' అని నినదిస్తూ వానరసైన్యం లంకానగరాన్ని ఆక్రమిస్తూ విధ్వంసం సృష్టిస్తోంది. ఎక్కడ చూసినా వానరులే.

రావణుడు – 'రాక్షస వీరులారా! భేరీలు మ్రోగించండి. తూర్యాలు పూరించండి. వానర సైన్యాన్ని మట్టుపెట్టండి' అని అరుస్తూ ఆజ్ఞలు జారీచేశాడు.

రాక్షసులు రెచ్చిపోయారు. వానరుల్ని పడగొడుతున్నారు. ఖడ్గాలు, శూలాలు, భిండివాలాలు, రకరకాల ఆయుధాలు రక్తసిక్తాలయ్యాయి. రక్తం ఏరులై ప్రవహిస్తోంది. ఎటుచూసినా మాంసపు ముద్దలు. సంకుల సమరం.

అంగదుడూ – ఇంద్రజిత్తూ, సంపాతి – ప్రజంఘుడు, హనుమంతుడు – జంబుమాలి, విభీషణుడు – మిత్రఘ్నుడు, గజుడు – తపనుడు, మైందుడు – వజ్రముష్టి, నీలుడు – నికుంభుడు, సుగ్రీవుడు – ప్రఘసుడు, లక్ష్మణుడు – విరూపాక్షుడు. వీళ్ళు సరిజోదులు. ఇలా ద్వంద్వయుద్ధాలూ సాగుతున్నాయి.

ఉభయపక్షాల సైనికుల శరీరాలూ గాయాలతో నెత్తురోడుతున్నాయి. ఎక్కడ చూసినా జయజయధ్వానాలే. హాహాకారాలే.

సాయంత్రానికి ఇంద్రజిత్తు ఒక్కడే మిగిలి ఉన్నాడు. తక్కిన రాక్షస వీరులందరూ మట్టిలో కలిసిపోయారు. ఆ రోజుకి వానరులదే యుద్ధంలో పై చేయి. అంగదునికీ ఇంద్రజిత్తుకీ యుద్ధం భీకరంగా సాగుతోంది. అంగదుడు ఇంద్రజిత్తు రథం విరగ్గొట్టాడు. సంపాతి ప్రజంఘుణ్ణి అశ్వకర్ణునితో సహా సంహరించాడు. జంబుమాలి హనుమంతుణ్ణి శూలంతో పొడిస్తే హనుమంతుడు అతణ్ణి రథంతో సహా పైకెత్తి గిరగిరా తిప్పి నేలకేసి కొట్టి చంపాడు.

శ్రీరాముడు ఒకేసారి అగ్నిశిఖల్లాంటి నాలుగు బాణాలు వేసి అగ్నికేతు, రశ్మికేతు, సుప్తఘ్న, యజ్ఞకోపనుల శిరస్సులను ఖండించాడు. మైందుడి పిడిగుద్దుకి వజ్రముష్టి నేల కరిచాడు. నికుంభుడి రథచక్రాన్నే విష్ణుచక్రంలాగా విసిరి నీలుడు నికుంభుణ్ణి సంహరించాడు. సుషేణుడూ విద్యున్మాలిని బలి తీసుకున్నాడు.

చీకటి పడింది. ఆ చీకట్లో – రాక్షసుడా కాదా! వానరుడా కాదా! అని తడుముకొని, తెలుసుకొని మరీ ఒకరినొకరు చంపుకుంటున్నారు. ఎక్కడ చూసినా శవాలే.

శ్రీరాముణ్ణి వెదుక్కుంటూ మహాపార్శ్వ, మహోదర, వజ్రదంష్ట్ర, మహాకాయ, శుకసారణుల నాయకత్వంలో రాక్షససైన్యం దూసుకువచ్చింది. వచ్చింది వచ్చినట్లే శ్రీరాముని బాణాల దెబ్బకు చెల్లాచెదరై పోయింది.

అంగదుని ధాటికి సారథినీ రథాన్నీ కోల్పోయిన ఇంద్రజిత్తు రణరంగం నుండి పలాయనం చిత్తగించాడు కానీ మళ్ళీ మాయారూపంతో విరుచుకుపడ్డాడు.

ఇంద్రజిత్తు తీవ్రంగా కలతచెంది మాయలుపన్నడం మొదలు పెట్టి నాగాస్త్రం తీశాడు. విషసర్పాలనే బాణాలుగా మార్చి శ్రీరామలక్ష్మణులపై ప్రయోగించాడు.

ఆ బాణాల ప్రభావంవల్ల శ్రీరామలక్ష్మణులు కదల్లేకపోతున్నారు. బాణాలు గుచ్చుకోవడంవల్ల ఇద్దరూ నిలువలేక కిందపడిపోయారు. బాణాలు వాళ్ళని కప్పేశాయి.

ఇంద్రజిత్తుని పట్టుకుందామని ప్రయత్నం చేసిన అంగదుడూ, విభీషణుడూ, జాంబవంతుడూ, హనుమంతుడూ బాణాలలో చిక్కుకొనిపోయి నేలపై పడ్డారు!

ఇంద్రజిత్తు వికటాట్టహాసం చేస్తూ వెళ్ళి ఆ వార్త రావణుడికి చెప్పాడు. రావణుని ఆనందానికి అవధుల్లేవు.

అశక్తులై పడి ఉన్న శ్రీరామలక్ష్మణులను చూసిన సుగ్రీవుని బాధ వర్ణనాతీతం. అది చూసి వానరవీరుల్లోనూ కలవరపాటు బయలుదేరింది. ఇదంతా చూస్తున్న విభీషణునికి ఏం చెయ్యాలో పాలుపోవడం లేదు. సుగ్రీవుణ్ణి అనునయిస్తూ – 'మిత్రమా! సుగ్రీవా! యుద్ధాలెప్పుడూ ఇలాగే ఉంటాయయ్యా! విజయం ఎప్పుడూ నిశ్చితం కాదు. మన అదృష్టం ఎలా ఉంటే అలా జరుగుతుంది. కాబట్టి ధైర్యం కోల్పోవడం వీరలక్షణం కాదు. శ్రీరామలక్ష్మణులు కేవలం మూర్ఛపోయారు. అంతే! త్వరలోనే కోలుకొంటారు. లే! నువ్వే ఇలా అయిపోతే ఎలా? చూడు. వానరసైన్యం కకావికలయ్యింది. ఉత్సాహం నీరిపొయ్యి. రా! లేదా నువ్వు శ్రీరామలక్ష్మణుల్ని చూసుకో! నేనే సైన్యాన్ని ఉత్సాహపరుస్తాను.' అంటూ వెళ్ళాడు.

* * *

త్రిజట సీతాదేవిని పుష్పక విమానంపై తీసుకువెళ్ళి బాణాల మధ్య మూర్ఛపోయిన శ్రీరామలక్ష్మణుల్ని చూపించడంతో సీతాదేవి హతాశురాలైపోయి ఆక్రోశించడం మొదలు పెట్టింది. అప్పుడు త్రిజట –

'సీతా! నా మాట నమ్ము. శ్రీరాముడు మరణించలేదు. ఆ విషయాన్ని ఈ విమానమే స్పష్టం చేస్తోంది. ఎలాగంటావా? ఈ విమానం పరమ పవిత్రమైనది. పుణ్యస్త్రీలకు మాత్రమే ఇందులో ప్రవేశించే అవకాశం ఉంటుంది. భర్తృవిహీనలైన స్త్రీలను ఈ విమానం భరించదు. అంటే వాళ్ళకు అస్సలు అధిరోహించే అవకాశమే ఇవ్వదు. ఇప్పుడు చెప్పు; నీ భర్త మరణిస్తే నువ్వు ఈ విమానాన్ని అధిరోహించలేవు కదా! అంతేకాదు. అటుచూడు. వానరసైన్యం యుద్ధానికి సన్నద్ధ మవుతోంది. అంటే నాయకుడు బతికి ఉన్నాడన్నమాటేగా.' అని వెనక్కి తీసుకువెళ్ళిపోయింది.

శ్రీరామునికి స్పృహ వచ్చింది. పక్కనే లక్ష్మణుడు అచేతనంగా పడిఉన్నాడు. శ్రీరాముడు బాధపడుతూ – 'ఎక్కడైనా సరే సీతాదేవిలాంటి భార్య దొరకవచ్చునేమో గానీ లక్ష్మణుని లాంటి సోదరుడు మాత్రం ఎంత వెదకినా దొరకడు గాక దొరకడు. లక్ష్మణుడే లేకపోతే ఇంక నాకు సీతాదేవి ఎందుకు? రాజ్యం ఎందుకు?' అంటూ విలపిస్తున్నాడు.

వానరులు శ్రీరామలక్ష్మణుల్ని ఎలా కాపాడాలా అని ఆలోచిస్తున్నారు. ఇంతలో గరుత్మంతుడు అక్కడికి వచ్చి, శ్రీరామలక్ష్మణులపై వేసిన సర్పబాణా లన్నింటినీ చిటికెలో హరించివేశాడు. ఒక్కసారి శ్రీరామలక్ష్మణుల్ని స్పృశించాడు.

గరుత్మంతుడి స్పర్శవల్ల మళ్ళీ పుంజుకొని మునుపటి తేజస్సుతోనూ బలంతోనూ ప్రకాశించారు శ్రీరామలక్ష్మణులు. వానరులు ఆనందంతో ఉప్పొంగి పోయారు.

ఆ వార్త రావణునికి తెలిసి, ధూమ్రాక్షుణ్ణి పంపాడు. హనుమంతుడు వాణ్ణి వధించాడు. తరువాత వజ్రదంష్ట్రుణ్ణి పంపాడు. వాణ్ణీ అంగదుడు సంహరించాడు. తర్వాత అకంపనుడు హనుమంతుని చేతిలో హతుడయ్యాడు. ఆ తర్వాత ప్రహస్తుణ్ణి పంపాడు. నీలుడు వాణ్ణి వధించాడు.

ఇక లాభం లేదని రావణుడే స్వయంగా యుద్ధరంగంలో కాలుపెట్టి మహాసముద్రంలా ఘోషిస్తున్న వానరసైన్యాన్ని చూశాడు. ఉత్తమ అశ్వాలతో విరాజిల్లుతున్న రథంపై మందీమార్బలంతో వచ్చిన రావణుణ్ణి చూసి సత్యవ్రతుడైన శ్రీరాముడు – 'విభీషణా! ఎవరితడు?' అని అడిగాడు. దానికి విభీషణుడు–

'శ్రీరామా! అటుచూడు! ఆ ఏనుగుపై కూర్చొని వస్తున్నాడే వాడే అకంపనుడు. అతడి పక్కనే వింటి నారిని లాగుతూ దంష్ట్రలు పెరిగిన ఏనుగులా ఉన్నాడే వాడే ఇంద్రజిత్తు. అతడి సమీపంలో వింధ్యపర్వతంలా ఉన్నాడు. వాడు అతికాయుడు. ఇంకా చూడు. వాడు మహోదరుడు. వీడు పిశాచుడు, త్రిశిరుడు, కుంభుడు, నికుంభుడు, నరాంతకుడు. అరుగో! వ్యాఘ్ర, ఉష్ట్ర, నాగేంద్ర ముఖాలతో ఉన్న మహావీరులు. అంటూ అందరినీ పేరు పేరునా చూపిస్తూ.. అదిగో చూడు. చంద్రసమానమైన వెల్ల గొడుగు. దానికింద సాక్షాత్తూ రుద్రునిలా ప్రకాశిస్తున్నాడే అతడే రావణుడు.' అని చెప్పాడు. తేరిపారా చూసిన శ్రీరాముడు – రావణుని తేజస్సుకు ఆశ్చర్యపోయాడు. ఆహా! ఏమి తేజస్సు! చూడ శక్యంకాని కాంతితో సూర్యునిలా ప్రకాశిస్తున్నాడు. అనుకున్నాడు.

రావణుని దెబ్బకు సుగ్రీవుడూ, గజుడూ, గవాక్షుడూ, గవయుడూ మూర్ఛపోయారు. అప్పుడు హనుమంతుడు రావణునికి అడ్డు తగిలాడు. రావణుడు గుండెల్లో గుద్దితే హనుమంతుడు తూలి, నిలదొక్కుకొని తన అరచేతితో రావణుణ్ణి

చాచి కొట్టాడు. ఆ దెబ్బకు భూకంపంతో ఊగిపోయిన పర్వతంలా రావణుడు గజగజలాడాడు. మళ్ళీ హనుమంతునిపై ఇంకో దెబ్బ వేసి ఆ తర్వాత నీలుడితో యుద్ధం చేసి లక్ష్మణునివైపు కదిలాడు రావణుడు.

## రావణలక్ష్మణుల యుద్ధం

లక్ష్మణుడు రావణుని విల్లు విరగ్గొట్టాడు. మరో విల్లు అందుకోబోయేంతలో మరో మూడు బాణాలు వేసి అతణ్ణి తీవ్రంగా గాయపరిచాడు.

రావణునికి స్పృహతప్పింది. కొద్దిసేపటికి తేటపడి బ్రహ్మదేవుడు తనకు ఇచ్చిన శక్తిని లక్ష్మణునిపై ప్రయోగించాడు. అది లక్ష్మణుని గుండెల్లో దిగబడింది. ఆ శక్తి తిరిగి రావణుణ్ణి చేరింది. లక్ష్మణుడు మూర్ఛపోయాడు. అతణ్ణి ఎత్తుకు పోదామని రావణుడు వచ్చి ఎత్తడానికి విశ్వప్రయత్నం చేశాడు కానీ వల్ల కాలేదు. ఇంతలో హనుమంతుడు రావణుడిపై దూకి పిడిగుద్దులు గుద్దేసరికి రావణుడు గింగిరాలు తిరిగాడు. నోటినుంచీ చెవులనుంచీ రక్తం బొటబొటా కారింది.

రావణుడు లక్ష్మణుణ్ణి ఎత్తలేకపోయాడు గానీ హనుమంతుడు అనాయాసంగా లేపి భుజంపై వేసుకొని శ్రీరాముని వద్దకు తీసుకువెళ్ళాడు. లక్ష్మణుడు కోలుకుంటున్నాడు.

శ్రీరాముడు రకరకాల బాణాలు వేసి రావణుణ్ణి హింసించి, రావణుని విల్లునూ, రథాన్నీ, కిరీటాన్నీ నాశనం చేసి – 'రావణా! నువ్వు బాగా అలసిపోయావు. పో! ఈ రోజు నిన్ను చంపను. మళ్ళీ కాస్త సేదతీరి కొత్త శక్తి పుంజుకొని రేపు రా!' అన్నాడు.

రావణుడు వెనక్కి వెళ్ళి అందరినీ సమావేశ పరిచాడు. సింహం చేతిలో దెబ్బతిన్న మత్తగజమూ, గరుత్మంతుని బారిన చిక్కుకున్న పన్నగేంద్రమూ ఎలా రగిలిపోతాయో అలా రగిలిపోతున్నాడు. రాక్షసవీరుల నుద్దేశించి – 'మహావీరులారా! నా తపస్సు ఓడిపోయింది. ఇంద్రసమానుణ్ణని విర్రవీగిన నేను కేవలం ఒకే ఒక్క మానవమాత్రుడి చేతిలో భంగపడ్డాను. మానవుని వల్లనే నాకు ప్రమాదం ఉందని బ్రహ్మదేవుడు అన్న మాటల్లోని అంతరార్థం ఇప్పుడిప్పుడే బోధపడుతోంది. దేవ–దానవ–యక్ష–రాక్షస–పన్నగాది గణాల ద్వారా నాకు మరణం సంభవించకూడదని అడిగానుకానీ మానవులనుంచి కోరుకోలేదు.

నా వంశంలో పుట్టిన మహావీరుడు నిన్నూ నీ వంశాన్నీ సర్వనాశనం చేస్తాడని అనరణ్యుడు అప్పుడెప్పుడో చెప్పిన మాట ఇప్పుడు నిజమౌతోంది. అందుకేనేమో! శ్రీరాముడు ఇక్ష్వాకువంశంలో దశరథునికి జన్మించాడు. అలనాడు నన్ను శపించిన వేదవతియే ఈ సీతాదేవి.

ఉమ, నందీశ్వరుడు, రంభ, పుంజికస్థల ఇచ్చిన శాపాలు ఊరికే పోతాయా? పోవు.' అంటూ – 'సత్వరం కుంభకర్ణుణ్ణి నిద్రలేపండి' అని ఆజ్ఞాపించాడు.

రాక్షసులు నానారకాలుగా కుంభకర్ణుణ్ణి నిద్రనుంచి మేల్కొల్పాలని ప్రయత్నించారు. కానీ లేవలేదు. చివరికి వెయ్యి ఏనుగుల్ని తెచ్చి తొక్కించేసరికి ఎట్టకేలకు మేల్కొన్నాడు కుంభకర్ణుడు. జరిగినదంతా తెలుసుకొని వెంటనే రావణుడిదగ్గరకు వచ్చి – **'రాజా! నేను ఆ రోజే చెప్పాను. హితుల మాటలు పెడచెవిని పెట్టి ప్రాణాలమీదికి తెచ్చుకున్నావు. చెడ్డపనులు చేసేవారికి పతనం తప్పదు.'** అన్నాడు.

దానికి రావణుడు – 'నిన్ను నిద్రలేపింది ఏది మంచో ఏది చెడో తెలుసుకోవడానిక్కాదు కుంభకర్ణా! ఏదో ఉద్ధరిస్తావని. ***కష్టాల్లో ఆదుకొన్నవాడే నిజమైన స్నేహితుడు. నిజమైన బంధువు.*** అన్నాడు.

రావణుని మాటలకు కుంభకర్ణుడు చివాలున లేచి – 'నాకు తోచిన మంచి నేను చెప్పాను. రణరంగంలో విజృంభిస్తాను. చూడు నా ప్రతాపం! భయపడకు. నీకు ఈ కుంభకర్ణుడు ఉన్నాడు.' అంటూ వేగంగా యుద్ధభూమికి కదిలి వెళ్ళాడు.

లంకానగరంలో నడుస్తున్న కుంభకర్ణుణ్ణి చూసి శ్రీరాముడు – 'విభీషణా! ఈ భీకరాకారుడు ఎవరు, ఏమిటి వీడి కథ?' అని అడిగాడు. విభీషణుడు ఇలా చెప్తున్నాడు.

'శ్రీరామా! ఇతడు మా చిన్నన్న కుంభకర్ణుడు. వీడికీ శక్తి పుట్టుకతోనే వచ్చింది. పుట్టగానే కొన్ని వేల జీవుల్ని తినేశాడు. వీణ్ణి అలాగే వదిలేస్తే ఇంక సృష్టిలో ఏ ప్రాణీ మిగలదని బ్రహ్మదేవుడు వీడికో నియమం పెట్టాడు. వీడు ఆర్నెలలు పడుకుంటాడు. ఒక రోజు నిద్రలేస్తాడు. ఆ రోజు వీడు దొరికిన ప్రతి ప్రాణినీ తినేస్తాడు. మళ్ళీ ఆరునెలలు పడుకుంటాడు. నిన్ను చంపడానికే రావణుడు వీణ్ణి నిద్రలేపాడు.' అన్నాడు.

యుద్ధభూమిలో కుంభకర్ణుడు వీరవిహారం చేస్తున్నాడు. వానరుల్ని గుప్పిళ్ళతో పట్టుకొని మరీ మింగేస్తున్నాడు. అప్పుడు హనుమంతుడు వేగంగా వెళ్ళి కుంభకర్ణుణ్ణి ఒక్కటి కొట్టాడు. వాడికి కోపం వచ్చింది. తన శూలంతో హనుమంతుణ్ణి మోదాడు. హనుమంతుడు కిందపడిపోయాడు. కాస్సేపటికి లేచాడు. అంగదుడూ కొట్టాడు. కుంభకర్ణుడు తిరిగి కొట్టాడు. అంగదుడూ పడిపోయాడు.

సుగ్రీవుడు కుంభకర్ణుణ్ణి ఎదిరించి చివరికి అతడు కొట్టిన దెబ్బలకు స్పృహతప్పాడు. కుంభకర్ణుడు సుగ్రీవుణ్ణి ఎత్తుకొని లంకవైపు వెళ్ళాడు. కోటలోనికి ప్రవేశించగానే సుగంధపరిమళాలతో కూడిన చల్లగాలి తాకిడికి సుగ్రీవుడికి మెలకువ వచ్చింది. ఒక పక్క రాక్షసులు చిత్రహింసలు పెడుతుంటే తానూ వాళ్ళను హింసించి ఎలాగో తప్పించుకొని శ్రీరాముని దగ్గరకు వచ్చేశాడు సుగ్రీవుడు. వానరుల్లో ఆనందమే ఆనందం.

కుంభకర్ణుడు తిరిగి యుద్ధభూమికి వచ్చాడు. దొరికిన వాళ్ళని దొరికినట్లు తినేస్తున్నాడు. చంపేస్తున్నాడు. వానరసైన్యాన్ని అల్లకల్లోలం చేస్తున్నాడు. వానరవీరులంతా వీరోచితంగా పోరాడుతున్నారు.

శ్రీరాముడు వాయువ్యాస్త్రం, ఇంద్రాస్త్రం వేసి కుంభకర్ణుని చేతులు ఖండించాడు. అర్ధచంద్రాకారంలో ఉన్న బాణం వేసి పాదాలూ ఖండించాడు. కుంభకర్ణుని శక్తి తగ్గింది. అయినా దూకుడు తగ్గలేదు. తొడలతో దేకుతూ నోరు తెరిచి వస్తూనే ఉన్నాడు. ఈసారి శ్రీరాముడు ఇంద్రుడు ఇచ్చిన బాణం వేశాడు. ఆ బాణం కుంభకర్ణుడి శిరస్సును ఖండించింది. తల ఎగిరి లంకానగరప్రాకారాన్ని గుద్దుకుంది. మొండెం ఎగిరి సముద్రంలో పడింది. వానరులు ఆనందంతో సింహనాదాలు చేశారు.

కుంభకర్ణుని మరణం రావణుణ్ణి ఎంతగానో కలచి వేసింది. శ్రీరాముణ్ణి చంపనైనా చంపాలి. లేదా అతడి చేతుల్లో చావనైనా చావాలి అని నిశ్చయించుకున్నాడు.

తర్వాత త్రిశిరుడు, దేవాంతకుడు, నరాంతకుడు, అతికాయుడు అనే రావణుడి పుత్రులు యుద్ధానికి బయలుదేరారు. వాళ్ళూ వీరస్వర్గం అలంకరించారు.

ఇంద్రజిత్తు మళ్ళీ రంగప్రవేశం చేశాడు. ఈసారి క్రూరాతిక్రూరంగా దాడి చేశాడు. తాను కనబడకుండా యుద్ధం చేస్తూ బాణవర్షం కురిపిస్తున్నాడు. బ్రహ్మాస్త్రం వేశాడు. ఆ బ్రహ్మాస్త్రంవల్ల శ్రీరామలక్ష్మణులతో సహా వానరవీరులందరూ స్పృహతప్పి పడిపోయారు.

వినండి! బ్రహ్మాస్త్రాన్ని గౌరవించడం కోసమే శ్రీరామలక్ష్మణులు స్పృహ తప్పారు. అంతకుమించి ఏం లేదు. భయపడకండి. అని అందరికీ విన్పించేలా చెప్తున్నాడు విభీషణుడు.

హనుమంతుడూ బ్రహ్మాస్త్రాన్ని గౌరవించి కదలకుండా ఉన్నాడు.

యుద్ధభూమిలో తిరుగుతూ జాంబవంతుడూ విభీషణుడూ కలుసుకున్నారు.

అప్పుడు జాంబవంతుడు – 'విభీషణా! హనుమంతుడు బతికే ఉన్నాడా!' అని అడిగాడు.

విభీషణునికి ఆశ్చర్యం కలిగింది. 'మిగిలిన ఎవరి గురించీ అడక్కుండా ఒక్క హనుమంతుని గురించే అడుగుతున్నావేమిటి?' అన్నాడు విభీషణుడు ఆశ్చర్యాన్ని వ్యక్తపరుస్తూ. అప్పుడు జాంబవంతుడు –

'హనుమంతుడు బతికి ఉంటే సైన్యం మొత్తం మరణించినా అది బతికి ఉన్నట్లే. హనుమంతుడు మరణిస్తే సైన్యం బతికి ఉన్నా మరణించినట్లే.' అన్నాడు. మాటల్లోనే అక్కడికి వచ్చిన హనుమంతుడు జాంబవంతునికి నమస్కరించాడు.

ఆ తరువాత జాంబవంతుని సూచన మీదట హనుమంతుడు మృతసంజీవిని, విశల్యకరణి, సువర్ణకరణి, సంధానకరణి అనే ఓషధుల్ని తీసుకురావడానికి బయలుదేరి అక్కడికి వెళ్ళాడు. ఆ ఓషధులు కైలాస ఋషభ పర్వతాల మధ్య ఉన్న ఓషధిపర్వతంపై ఉన్నాయి. హనుమంతుణ్ణి చూసి ఆ ఓషధులన్నీ కన్పించకుండా పోయాయి. హనుమంతునికి కోపం వచ్చింది. భీకరంగా గర్జించాడు. ఆ గర్జనకు పర్వతగుహలు మార్మోగిపోయాయి.

'ఓ పర్వతరాజా! శ్రీరామునిపట్ల దయలేనివాడివై ఇలా ఓషధులు కన్పించ కుండా చేస్తావా? ఉండు నీ పని చెప్తాను. నా బాహుబలం ఏపాటిదో నీకు రుచి చూపిస్తాను. నీ శిఖరాన్ని విరిచి మరీ తీసుకుపోతాను' అంటూనే అన్నంతపనీచేసి

ఆ ఓషధీ పర్వతాన్ని తన అరచేతిలో నిలుపుకున్నాడు హనుమంతుడు. తన ప్రభువైన శ్రీరామచంద్రుణ్ణి స్మరించుకొని గరుత్మంతునిలా ఆకాశంలోనికి ఎగిరిపోయాడు. ఆకాశంలో సూర్యుడికి మారుగా మరో సూర్యునిలా వెలిగిపోతూ వానరసైన్య మధ్య భాగంలో ఒక ఎత్తయిన కొండమీద వాలాడు. వానరశ్రేష్ఠులకు మ్రొక్కి విభీషణుణ్ణి కౌగిలించుకున్నాడు.

ఓషధులు రావడంతో ఆ ఓషధుల గాలి తగిలి శ్రీరామలక్ష్మణులూ, వానరులూ లేచి కూర్చున్నారు. అందరూ కోలుకోవడంతో హనుమంతుడు ఆ పర్వతాన్ని తిరిగి తీసుకువెళ్ళి దాని స్థానంలో పెట్టి వచ్చేశాడు.

రావణుడు యుద్ధంలో ఒక నియమం పెట్టాడు. వానరుల చేతుల్లో చనిపోయిన రాక్షసుల్ని ఎప్పటికప్పుడు లెక్కకోసమని సముద్రంలో తోసెయ్యమన్నాడు. లేకపోతే ఈ ఓషధీలతల ప్రభావానికి చచ్చిన రాక్షసులు కూడా మళ్ళీ బతికేవాళ్ళే.

తర్వాత వానరులు లంకపై విజృంభించి లంకకు నిప్పుపెట్టారు.

కుంభకర్ణుని పుత్రులు కుంభుడూ, నికుంభుడూ, ఖరుడి కొడుకు మకరాక్షుడూ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయారు.

ఇంద్రజిత్తు మళ్ళీ అదృశ్యరూపంలో రణరంగానికి వచ్చాడు. రాక్షసమాయతో యుద్ధభూమినిండా పొగలు కమ్ముకొనేలా చేశాడు. దానితో ఎవరికీ ఏమీ కనిపించడంలేదు. అదృశ్యంగా ఉంటూ బాణాలు కురిపిస్తున్నాడు. అప్పుడు లక్ష్మణుడు శ్రీరామునితో – 'అన్నా! ఈ భూమిమీద రాక్షసుల్ని నామరూపాలు లేకుండా చేయడానికి ఇప్పుడే బ్రహ్మాస్త్రం ప్రయోగిస్తాను.' అన్నాడు ఆవేశంగా.

దానికి శ్రీరాముడు – లక్ష్మణా! ఒక్క రాక్షసుడు హింసిస్తున్నాడని తక్కిన రాక్షసులందరినీ చంపడం న్యాయమా? **యుద్ధం విరమించినవాణ్ణీ, దాక్కున్నవాణ్ణీ, దండంపెట్టినవాణ్ణీ, దాసోహం అన్నవాణ్ణీ, పారిపోయేవాణ్ణీ, మద్యంమత్తులో ఉన్న వాణ్ణీ చంపకూడదు.** ఇప్పుడు బ్రహ్మాస్త్రం ప్రయోగిస్తే ఎవరు మరణిస్తారో చెప్పలేం. అది మహాపాపం. ఈ ఇంద్రజిత్తు ఇప్పటికే చాలా చేశాడు. తక్షణం వీణ్ణి వధించాలి. అందరితో చర్చించి వ్యూహాత్మకంగా వధిద్దాం. అన్నాడు. అందరితో కలిసి వ్యూహం ఆలోచిస్తున్నాడు.

అది గమనించిన ఇంద్రజిత్తు తానూ ఒక మాయోపాయం పన్ని, శ్రీరాముణ్ణి మానసికంగా దెబ్బతీయాలనుకొన్నాడు. ఒక మాయాసీతాదేవిని సృష్టించి, రథంలో ఉంచుకొని, ఈసారి అదృశ్యరూపంలో కాకుండా అందరికీ కనబడేలా యుద్ధానికి వచ్చాడు.

అలా వచ్చిన ఇంద్రజిత్తుతో హనుమంతుడూ మొదలైన వానరవీరులు యుద్ధం చేస్తున్నారు. అందరూ చూస్తూ ఉండగా ఇంద్రజిత్తు మాయాసీతాదేవిని కత్తితో ఘోరంగా నరికేశాడు. అది నిజమేననుకొన్నారు వానరులు. ఆ వార్త తీసుకెళ్ళి శ్రీరామునికి చెప్పారు.

సీతాదేవిని ఇంద్రజిత్తు వధించాడన్న వార్త విన్న శ్రీరాముడు విషణ్ణవదనుడై దీనాతిదీనంగా విలపిస్తూ స్పృహ తప్పి పడిపోయాడు.

అప్పుడు విభీషణుడు – 'ఇది ఇంద్రజిత్తు మాయ. మిమ్మల్ని కొంతసేపు తప్పుదారి పట్టించడంకోసమే ఇంద్రజిత్తు ఇలా చేశాడు. ఇప్పుడు వెళ్ళి 'నికుంభిల'లోనికి ప్రవేశించి యజ్ఞం చేస్తున్నాడు. ఆ యజ్ఞం పూర్తయితే వాణ్ణి ఎవరూ చంపలేరు. హోమాన్ని భగ్నం చేసిన వాడిచేతిలోనే వాడికి మరణం అని బ్రహ్మదేవుడు చెప్పాడు. వెళ్ళండి. ఆ యాగం ఆపండి.' అన్నాడు.

లక్ష్మణుడు హనుమంతుణ్ణీ జాంబవంతుణ్ణీ వెంట తీసుకొని లోపలికి ప్రవేశించి, వింటినారిని మ్రోగించి ఇంద్రజిత్తును యుద్ధానికి పిలిచాడు.

లక్ష్మణుని పక్కన ఉన్న విభీషణుణ్ణి చూసిన ఇంద్రజిత్తు –

'విభీషణా! నాకు సాక్షాత్తు పినతండ్రివయ్యుండి ఇంత ద్రోహం చేస్తావా? నీకు నిజంగా జాత్యభిమానం, బంధుప్రీతి, నీతి, నియమం, ధర్మం ఇవేమీ లేవు. నిన్ను లోకం నిందిస్తుంది. నువ్వు సొంతవాళ్ళను విడిచిపెట్టి వైరిపక్షంవాళ్ళని ఆశ్రయించావు.

**ఎంత గుణవంతుడైనా పరాయివాడు పరాయివాడే. గుణహీనుడైనా స్వజాతీయుడు సేవించదగినవాడు. స్వపక్షాన్ని విడిచిపెట్టినవాడు స్వపక్షం నాశనం అయిన తర్వాత విపక్షం చేతుల్లో తానూ నాశనం కాక తప్పదు. అనే ప్రదేశంలోనికి ఈ విషయం నీకు అర్థం కావడం లేదు.'**

ఆ మాటలకు విభీషణునికి కోపం వచ్చింది.

**'ఓరీ! ఇంద్రజిత్తూ! నోరు మూసుకో! నా గురించి నీకేం తెలుసు. నేను శీలాన్ని బట్టి రాక్షసుణ్ణి కానే కాను. అధర్మమార్గంలో వెళ్తున్న నా సోదరుణ్ణి విడిచిపెట్టేశాను. ధర్మమార్గం వైపు నడుస్తున్నాను. పరుల్ని హింసించడం, పరధనాన్నీ పరదారనీ అపహరించడం ఇవన్నీ దుర్గుణాలు. ఇవే నా సోదరుని నాశనాన్ని కొనితెచ్చాయి. ఇవన్నీ తెలియక బాల్యచాపల్యంతో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నావు. నీకు కాలం సమీపించింది. అందుకే ఇలా మాట్లాడుతున్నావు. ఇడుగో! లక్ష్మణుడు వచ్చాడు. చేతనైతే నీ పరాక్రమం చూపించు'** అన్నాడు.

హనుమంతుని భుజంపై కూర్చొని లక్ష్మణుడు చాలా సేపు యుద్ధం చేశాడు. ఇంద్రజిత్తు శక్తి క్షీణించసాగింది. చివరిగా లక్ష్మణుడు ఇంద్రాస్త్రం ప్రయోగించాడు. అది ఇంద్రజిత్తు తలను ఖండించింది. ఇంద్రజిత్తు మరణించాడు.

ఇంద్రజిత్తు మరణంతో రావణునికి ఏం చెయ్యాలో పాలుపోలేదు. పట్టరాని కోపం వచ్చింది. బ్రహ్మదేవుడు ఇచ్చిన అభేద్యమైన కవచం, తన తాత ఇచ్చిన విల్లూ బాణాలూ తియ్యమన్నాడు.

అసలు అంతటికీ కారణం అయిన సీతాదేవిని ముందు చంపేయాలి అనుకొంటూ అశోకవనం వైపు బయలుదేరాడు. మంత్రి సుపార్శ్వుడు వారించడంతో వెనక్కి తగ్గి శ్రీరామునిమీదికి మళ్ళీ సైన్యం పంపాడు రావణుడు. శ్రీరాముడు వాళ్ళందర్నీ సంహరించాడు.

లంక మొత్తం శోకసముద్రంలో మునిగిపోయింది. ఏ ఇంట్లో చూసినా ఏడుపులూ పెడబొబ్బలే.

చివరికి రావణుడే, ఎనిమిది గుర్రాల రథంపై యుద్ధానికి బయలుదేరాడు. మహోదరుడూ, మహాపార్శ్వుడూ, విరూపాక్షుడూ అతని వెంట ఉన్నారు. ఆ ముగ్గురూ ఎంతో సేపు నిలవలేక, వానరుల చేతిలో మరణించారు.

రావణుడు విభీషణుణ్ణీ లక్ష్మణుణ్ణీ చంపాలని చూస్తుంటే శ్రీరాముడు అడ్డుపడి రావణునితో తలపడుతూ తక్కిన వానర వీరులందరినీ ఉద్దేశిస్తూ –

'వానరులారా! మీరింక యుద్ధం చేయడం ఆపి, నా యుద్ధం తిలకించండి. ఈ రావణుడు ఇంక భూమ్మీద ప్రాణాలతో ఉండడానికి వీల్లేదు' అంటూ రావణునిపై

చెలరేగిపోయాడు. రామరావణ యుద్ధం మహాభీకరంగా సాగుతోంది. రావణుడు వేసిన శక్తి ఆయుధం లక్ష్మణుని గుండెల్లో దిగబడింది. అతడు నేలపై పడిపోవడంతో శ్రీరాముడు నిర్ఘాంతపోయాడు. చెప్పలేనంత దుఃఖం కమ్మేసింది.

శ్రీరామునికి పదే పదే లక్ష్మణుడే గుర్తుకు వస్తున్నాడు. కంటిముందు నెత్తురోడుతూ పడి ఉన్న లక్ష్మణుణ్ణి చూసి సత్యవ్రతుడైన శ్రీరాముడు దుఃఖం ఆపుకోలేక బోరున విలపిస్తూ సుషేణుడితో – సుషేణా! లక్ష్మణునికి ఏమౌతుందో నన్న ఆందోళనవల్ల నేను యుద్ధంపై మనసు పెట్టలేకపోతున్నాను.

**దేశే దేశే కళత్రాణి దేశే దేశే చ బాంధవాః,**
**తం తు దేశం న పశ్యామి యత్ర భ్రాతా సహోదరః. (6–101–15)**

ప్రతి దేశంలోనూ భార్యలూ, బంధువులూ దొరుకుతారు. కానీ లక్ష్మణుని లాంటి సహోదరుడైన తమ్ముడు దొరికే దేశం ఎక్కడా లేదు.' అని అన్నాడు. ఆ మాటలకు సుషేణుడు– 'శ్రీరామా! విచారించకు. లక్ష్మణునికి ఇంకా శ్వాస ఆడుతోంది. ప్రాణం పోలేదు.' అన్నాడు.

ఇంతలో హనుమంతుడు ఓషధులకోసం వెళ్ళి, అక్కడ ఓషధుల్ని గుర్తించలేక, పర్వతాన్నే పెకలించి తెచ్చాడు. సుషేణుడు ఆ ఓషధులతో వైద్యం చేసి లక్ష్మణునికి స్పృహ తెప్పించాడు. లక్ష్మణుడు లేచి కూర్చొనే సరికి శ్రీరామునిలో ఉత్సాహం రెట్టింపయ్యింది.

## రావణవధ

దేవేంద్రుడు శ్రీరాముని కోసం రథం, ధనువు, కవచం, బాణాలు పంపాడు. ఆ రథంమీదే శ్రీరాముడు రావణునిపై యుద్ధానికి బయలుదేరాడు. ఇంద్రుడి రథసారథి మాతలి. అతడే శ్రీరామునికి సారథ్యం వహించాడు.

అస్త్రాల మీద అస్త్రాలు ప్రయోగిస్తూ ఉండగా భీకరంగా పోరు కొనసాగింది. రామరావణులిద్దరూ గాయపడ్డారు. అలసిపోయారు.

రావణుడు ఒక శూలం విసిరాడు. సత్యపరాక్రముడైన శ్రీరాముడు దానిపైకి శక్తి ఆయుధాన్ని వేశాడు. శూలం నిస్తేజమై పోయింది.

శ్రీరాముని బాణాలవల్ల రావణుడికి ఊపిరి ఆడలేదు. అతని సారథి రథాన్ని యుద్ధభూమి నుండి దూరంగా తీసుకుపోయాడు. రావణుడు కొంచెం కోలుకున్నాక మళ్ళీ యుద్ధభూమికి రథాన్ని పోనిచ్చాడు. ఎంతగా యుద్ధం చేస్తున్నా రావణుడు లొంగడం లేదు. ఏం చెయ్యాలి? అని చింతిస్తున్నాడు శ్రీరాముడు. అప్పుడు శ్రీరాముని దగ్గరకు అగస్త్యుడు వచ్చి – **'శ్రీరామా! ఇదిగో ఆదిత్యహృదయం అనే స్తోత్రాన్ని నీకు ప్రసాదిస్తున్నాను. ఈ స్తోత్రం సర్వశత్రువినాశకం. మంగళప్రదం. దీన్ని సత్వరం జపించు. నీకు శుభం కలుగుతుంది.'** అన్నాడు. అలాగే శ్రీరాముడు ఆదిత్యహృదయాన్ని భక్తిశ్రద్ధలతో జపించాడు. మనస్సు ఉత్సాహంతో పరవళ్లు తొక్కింది.

ఏడు రోజుల పాటు రాత్రనకా పగలనకా రామరావణయుద్ధం లోకభీకరంగా జరిగింది.

**గగనం గగనాకారం సాగరః సాగరోపమః**
**రామరావణయోర్యుద్ధం రామరావణయో రివ. (111-23)**

'ఆకాశానికి ఆకాశమూ సముద్రానికి సముద్రమూ సాటి అయినట్లుగా రామరావణయుద్ధానికి రామరావణయుద్ధమే సాటి.' అని దేవతలూ గంధర్వులూ కొనియాడుతున్నారు.

శ్రీరాముడు సర్పంలాంటి ఒక బాణం వేసేసరికి అది రావణుడి శిరస్సును ఖండించింది. తల కిందపడింది. దాని స్థానంలో ఇంకో శిరస్సు పుట్టుకొచ్చింది. ఇలా ఎన్ని సార్లు ఖండిస్తే అన్నిసార్లూ పుట్టుకొస్తోంది.

'శ్రీరామా! ఇంక ఆలస్యం చెయ్యకు. బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించు.' అన్నాడు రథసారథి మాతలి.

శ్రీరాముడు బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగిస్తున్నాడు. ఆ అస్త్రానికి రెక్కలలో వాయువు ఉంటుంది. ములుకులో సూర్యాగ్నులు ఉంటారు. బరువులో మేరుమందర పర్వతాలు నెలకొని ఉంటాయి. దానికి బ్రహ్మే శరీరం. ఆ అస్త్రం వెళ్ళి రావణుని గుండెలు చీల్చి, మళ్ళీ తిరిగివచ్చి అమ్ములపొదిలో చేరిపోయింది.

బ్రహ్మాస్త్రంవల్ల చేతిలోని విల్లునీ శరీరంలోని ప్రాణాల్నీ ఒకేసారి వదిలేశాడు రావణుడు.

తక్కిన రాక్షసులు హాహాకారాలు చేస్తుండగా పైనుంచి జయజయ ధ్వానాలు వినిపించాయి.. ఆకాశంనుంచి పుష్పవృష్టి కురిసింది.

రావణుని మరణానికి బాధతో విభీషణుడు కంటతడి పెడుతుంటే అది చూసిన శ్రీరాముడు – 'విభీషణా! నీ అన్న రావణుడు వీరమరణం పొందాడు. విచారించకు' అంటూ ఊరడించాడు.

రావణుని మరణవార్త తెలిసి అంతఃపురకాంతలు ఏడుస్తూ యుద్ధభూమికి వస్తున్నారు. వారిలో రావణుని పట్టమహిషి మండోదరి కూడా ఉంది. రావణుణ్ణి చూసీ చూడడంతోనే మండోదరి హృదయవిదారకంగా ఏడుస్తూ రావణుని కళేబరాన్ని కౌగిలించుకొని దీనాతిదీనంగా –

'స్వామీ! ఏ కామాన్నయితే జయించి మహాతపస్సుతో మహామహులైన బ్రహ్మరుద్రాదుల్ని సైతం మెప్పించావో చివరికి అదే కామానికి బలైపోయావు. ఇంత గొప్పవాడివి ఒక స్త్రీకారణంగా మరణించావు. శ్రీరాముణ్ణి సామాన్య మానవుడనుకొని చాలా పొరపాటు చేశావు. సాక్షాత్తూ విష్ణుమూర్తే శ్రీరామునిగా జన్మించాడని గుర్తించ లేకపోయావు. ఇంతకాలమూ నా తండ్రి దానవులకు సార్వభౌముడనీ, నా భర్త రాక్షసులకు ఈశ్వరుడనీ, నా పుత్రుడు ఇంద్రుణ్ణి జయించిన వీరుడనీ చెప్పుకొని విర్రవీగేదాన్ని. ఇప్పుడు దిక్కులేని దాన్నై పోయాను కదా.' అంటూ విలపిస్తోంది.

రావణునికి విభీషణుడు అంతిమసంస్కారం చేసి వచ్చి శ్రీరామునివద్ద వినయంగా నిలబడ్డాడు. అప్పుడు శ్రీరాముడు విభీషణునికి పట్టాభిషేకం చేసి లంకాసామ్రాజ్యానికి అధిపతిని చేశాడు.

శ్రీరాముడు హనుమంతుణ్ణి పిలిచి – 'హనుమంతా! విభీషణుడి అనుమతి తీసుకొని, నువ్వు వెంటనే లంకానగరానికి వెళ్ళి, నా విజయవార్తను సీతాదేవికి విన్నవించి, ఆమె ఏమంటుందో తెలుసుకొని రా!' అని పంపించాడు.

హనుమంతుడు వెళ్ళి ఆ శుభవార్తను సీతాదేవికి విన్నవించాడు. ఆ వార్త విన్న సీతాదేవి ఆనందంతో – 'హనుమంతా! ఇంత మంచి వార్త తెచ్చిన నీకు కృతజ్ఞత ఎలా తెలుపుకోవాలో తెలియడం లేదు.' అంది. అప్పుడు హనుమంతుడు – 'నిన్ను ఇన్నాళ్ళూ పీడిస్తూ వచ్చిన ఈ రాక్షసస్త్రీలను అందరినీ మట్టుపెడతాను' అన్నాడు.

దానికి సీతాదేవి హనుమంతుణ్ణి వారిస్తూ – ***'బుద్ధిమంతుడు అపకారికి తిరిగి అపకారం తలపెట్టడు. అపకారికికూడా ఉపకారమే చేస్తాడు. అదే సదాచారం. ఆ సదాచారమే సత్పురుషులకు అలంకారం. ఎంత ఘోరపాపానికి పాల్పడినా సత్పురుషులు వారిని వధించరు. వారిపై దయ చూపిస్తారు. ఎందుకో తెలుసా!? ఈ లోకంలో అపరాధం చెయ్యని వాళ్ళు ఎవరు?'*** అని మృదువుగా చెప్పి, వెంటనే – 'నా శ్రీరాముణ్ణి చూడాలని ఉంది. వెళ్ళు! ఈ విషయం శ్రీరామునికి విన్నవించు.' అంది. హనుమంతుడు వచ్చి శ్రీరామునికి విన్నవించాడు.

అప్పుడు శ్రీరాముడు కన్నీటిపర్యంతమై సీతాదేవిని తీసుకురమ్మని విభీషణుణ్ణి పంపాడు.

భర్త పంపిన ఆదేశానుసారంగా స్నానం చేసి, అలంకరించుకొని, శ్రీరాముడు ఉన్న చోటుకి పల్లకిలో వస్తోంది సీతాదేవి. ఆమెకు దారి ఇవ్వడంకోసం అక్కడ ఉన్న వానరుల్ని తరిమికొట్టించాడు విభీషణుడు. దానికి శ్రీరాముడు ఆగ్రహించి – 'విభీషణా! ఎందుకలా వానరుల్ని బాధిస్తున్నావు? వాళ్ళంతా నా వాళ్ళు.' అని ఇంకా ఇలా అంటున్నాడు.

***'ఇళ్ళూ, వస్త్రాలూ, ప్రాకారాలూ, తెరలూ, రాజప్రాసాదాలూ ఇవేమీ స్త్రీని దాచి ఉంచి రక్షించలేవు. మంచి నడవడిక ఒక్కటే స్త్రీకి రక్ష. అదే ఆభరణం.'*** **అదీకాక కష్టకాలంలో, దేశసంక్షోభసమయంలో, యుద్ధాల్లో, స్వయంవరాల్లో, యజ్ఞవాటికల్లో, వివాహాల్లో స్త్రీలు ఇతరులకు కనబడవచ్చు. అదేమీ దోషంకాదు.** కాబట్టి సీతాదేవి పల్లకి విడిచి కాలినడకనే నా దగ్గరకు రావచ్చు. ఈ వానరులంతా ఆమెను చూడవచ్చు.' అన్నాడు.

## సీతాదేవి అగ్నిప్రవేశం

సీతాదేవి శ్రీరాముని దగ్గరకు వచ్చి, తలవంచుకొని నిలబడింది. ఆమెను చూసీ చూడగానే శ్రీరామునికి క్రోధం భగ్గున మండింది. ముఖం పక్కకి తిప్పుకొని వెంటనే ఇలా అన్నాడు.

'సీతా! యుద్ధంలో శత్రువుని ఓడించి నిన్ను గెల్చుకున్నాను. నా ప్రతిజ్ఞ నెరవేర్చాను. ఇంతటితో నా బాధ్యత తీరిపోయింది. సమర్థుడైనవాడు తనకు కలిగిన అవమానాన్ని పరాక్రమంతో తొలగించుకోవాలి. నేను చేసింది అదే!

**సీతా! యుద్ధంలో మేమంతా ఎంత శ్రమపడవలసి వచ్చిందో నీకు తెలిసే ఉంటుంది. ఈ యుద్ధం నీకోసం కాదు నేను చేసింది. ఆత్మగౌరవంకోసం చేశాను. వంశప్రతిష్ఠకోసం చేశాను. వంశానికి పడిన మచ్చను తుడవడంకోసం చేశాను. ఉత్తమవంశంలో పుట్టినవాడెవడూ ఇన్నాళ్ళు పరాయివాని ఇంట్లో ఉన్న ఆడదాన్ని మళ్ళీ స్వీకరించడు. ఇప్పుడు నా ముందుకొచ్చి నిల్చున్న నీ శీలం సంశయాస్పదం. కంటిరోగం ఉన్నవానికి దీపంలా నువ్వు నాకు అసహ్యంగా ఉన్నావు. కాబట్టి నీ ఇష్టం. నువ్వు ఎక్కడికి వెళ్తావో వెళ్ళు. నేను స్థిరమైన బుద్ధితోనే ఈ మాటలు అంటున్నాను.'** అన్నాడు.

ఈ మాటలు విన్న సీతాదేవికి చెవుల్లో శూలాలతో పొడిచినట్లనిపించింది. కళ్ళలో కన్నీటి వరద. ఎన్నాళ్ళకో ఇన్నికష్టాల తర్వాత శ్రీరాముణ్ణి కలవబోతోంది. శ్రీరాముడు ఎంతో ఆదరిస్తాడనీ, ప్రేమగా మాట్లాడతాడనీ కన్న కలలకు భిన్నంగా ఊహాతీతంగా ఇలాంటి కఠినాతికఠినమైన మాటలు, మనసును కలచివేసే మాటలు శ్రీరాముని నోటినుండి వినవలసి వస్తుందని అనుకోలేదు. అందుకే ఆ మాటలు విన్న సీతాదేవికి పైప్రాణాలు పైనే పోయినంత పనయ్యింది. నిలువెల్లా కంపించిపోయింది. మన్నూ మిన్నూ ఏకమయ్యేరీతిలో కన్నీరుమున్నీరుగా విలపించింది. విలపించి విలపించి బొంగురు పోయిన గొంతుతో మెల్లగా ఇలా అంటోంది.

**'శ్రీరామా! ఏమిటీ దారుణం? నన్నే అనుమానిస్తూ కానిమాటలు మాట్లాడు తున్నావు. చెవుల్లో శూలాలు దించుతూ నన్ను అవమానిస్తున్నావు. ఇన్నాళ్ళ మన దాంపత్యంలో ఇదేనా నువ్వు నన్ను అర్థం చేసుకున్నది? నా శీలంపై ఒట్టువేసి**

**మరీ చెపుతున్నా. నేను అటువంటిదాన్ని కాను. నన్ను నమ్ము. నువ్వే నన్ను అర్థం చేసుకోకపోతే నా బాధ ఎవరు అర్థం చేసుకుంటారు? ఎవరో ఒకరు ఏదో చేసినంతమాత్రాన మొత్తం స్త్రీజాతినే శంకించడం నీకు భావ్యమా చెప్పు?**

నువ్వు నన్ను కొందరు దురాచారవతులైన స్త్రీలతో పోల్చుకొని, నా పాతివ్రత్యాన్ని పక్కన పెట్టి మాట్లాడుతున్నావు. నేను లోకం దృష్టిలో జనకుని కూతుర్ని, కానీ అయోనిజను. నువ్వు నన్ను అపార్థం చేసుకొన్నాక నేను బతికి ఉన్నా మరణించినట్లే.' అంటూ లక్ష్మణునివైపు చూసి – 'నాయనా లక్ష్మణా! నాకోసం చితి పేర్చవయ్యా. నాకు బతుకు మీద ఆశ చచ్చిపోయింది.' అంది.

లక్ష్మణుడు శ్రీరామునివైపు ఆజ్ఞకోసం అన్నట్టు చూశాడు. శ్రీరాముడు మౌనం వహించాడు. దాన్ని అంగీకారంగా భావించిన లక్ష్మణుడు చితిని ఏర్పాటుచేశాడు. నిప్పు కూడా పెట్టాడు.

సీతాదేవి వచ్చి, శ్రీరామునికి ప్రదక్షిణం చేసి దేవతలకూ బ్రాహ్మణులకూ అందరికీ నమస్కరించి, అగ్నికి అభిముఖంగా నిలబడి – 'నేను మనసా వాచా కర్మణా శ్రీరాముణ్ణి తప్ప ఇతరుల్ని ఎరుగను. అది నిజమే అయితే ఈ అగ్ని నన్ను తప్పక రక్షిస్తుంది!' అంటూ మూడుసార్లు అగ్నికి ప్రదక్షిణం చేసి చితిలోకి దూకేసింది.

అందరూ తట్టుకోలేక హాహాకారాలు చేశారు.

ఆ సమయంలో మహేశ్వరుడూ, బ్రహ్మదేవుడూ, ఇంద్రుడూ, ఇంకా సకల దిక్పాలకులూ దివ్యరథాలపై అక్కడ ప్రత్యక్షమై – 'శ్రీరామా! నువ్వే ఈ లోకాలకు ప్రభుడవు. సీతాదేవి అగ్నిప్రవేశం చేస్తుంటే ఎందుకు చూస్తూ ఊరుకొన్నావు?' అని అడిగారు.

అప్పుడు సత్యపరాక్రముడైన శ్రీరాముడు అయోమయంగా – **'బ్రహ్మదేవా! నేను దశరథమహారాజు పుత్రుణ్ణి. సామాన్య మానవుణ్ణి కదా! మీరేమిటి ఇలా అంటున్నారు. నాకంతా అయోమయంగా ఉంది. అసలు నేనెవరో ఏమిటో కాస్త సెలవియ్యండి?'** అన్నాడు. దానికి బ్రహ్మదేవుడు –

**'శ్రీరామా! నువ్వు సాక్షాత్తూ శ్రీమహావిష్ణువివి. ఈ సీతాదేవి ఎవరో కాదు సాక్షాత్తూ లక్ష్మీదేవి. రావణుణ్ణి సంహరించడంకోసమే నువ్వు మానవరూపాన్ని ధరించావు.'** అన్నాడు.

ఈలోగా మంటల్లో దూకిన సీతాదేవి అగ్నినుండి కసుగందకుండా బయటికి వచ్చింది. సీతాదేవిని దహించలేదుసరికదా అగ్నిదేవుడు కన్నకూతురిలా ఒడిలో కూర్చోబెట్టుకొని తీసుకువచ్చి 'ఈమె పవిత్రురాలు' అని చెప్పాడు.

అప్పుడు శ్రీరాముడు మెల్లగా - 'నాకు ఆ విషయం ముందే తెలుసు. కానీ *లోకానికి సీతాదేవి పవిత్రురాలని తెలియాలి. అందుకే ఇలా ఉపేక్షించాడు'* అన్నాడు. అప్పుడు మహేశ్వరుడు -

'శ్రీరామా! కథ సుఖాంతం అయ్యింది కదా. ఇంక ఆలస్యం దేనికి. వెళ్ళు. భరతుణ్ణి ఊరడించి, నీ ముగ్గురు తల్లులకూ ఆనందాన్ని కల్గించు. రాజ్యాన్ని పరిపాలించు. అంతేకాదు శ్రీరామా! మీరు చేసిన సాహసకృత్యాలవల్ల నీ తండ్రికి ఇంద్రలోకం ప్రాప్తించిందయ్యా! అటు చూడు.' అన్నాడు.

ఆకాశంలో దివ్యవిమానంమీద వెలిగిపోతున్నాడు దశరథుడు. శ్రీరామలక్ష్మణులు ఆనందంతో ఆయన్ని దర్శించారు. దశరథుడు కిందికి వచ్చి, శ్రీరామలక్ష్మణుల్ని ఆప్యాయంగా కౌగిలించుకొని - 'శ్రీరామా! రావణుణ్ణి సంహరించి లోకానికి ఎంతో మేలుచేశావయ్యా!' అన్నాడు.

ఆ తరువాత ఇంద్రుడు శ్రీరాముణ్ణి ఒక వరం కోరుకొమ్మన్నాడు. దానికి శ్రీరాముడు–

'నాకోసం యుద్ధం చేసి ప్రాణాలు కోల్పోయిన వానరవీరులందర్నీ బ్రతికించు.' అని ఇంద్రుణ్ణి వేడుకొని వారందరినీ సజీవుల్ని చేశాడు.

## అయోధ్యకు ప్రయాణం

ఆ మరునాడు పుష్పక విమానం వచ్చి ఆగింది. విభీషణుడూ, వానరవీరులూ పట్టాభిషేకానికి వస్తామన్నారు. అందుకు శ్రీరాముడు ఆనందించి, వారందరినీ ఆహ్వానించాడు.

విమానం బయలుదేరింది. దారిలో కన్పిస్తున్న వాటిని చూపిస్తూ సీతాదేవికి వివరిస్తున్నాడు శ్రీరాముడు. కొంతసేపయ్యాక కిష్కింధ వచ్చింది. విమానం ఆపి, వానరవీరుల భార్యలనూ అయోధ్యకు ఆహ్వానించాడు శ్రీరాముడు. వాళ్ళంతా ఆనందంగా విమానం ఎక్కారు.

అక్కణ్ణుంచి విమానం ఋష్యమూక పర్వతం, పంపాసరస్సు, శబరి ఆశ్రమం, కబంధుడు మరణించిన ప్రదేశం, జనస్థానం మీదుగా చిత్రకూటం చేరుకొని, భరద్వాజ ఆశ్రమం వద్ద కిందికి దిగింది.

శ్రీరాముడు భరద్వాజుడికి నమస్కరించి, జరిగినదంతా చెప్పి, బయలు దేరాడు.

ముందుగా గుహుణ్ణి కలుసుకోమనీ అలాగే తాము వస్తున్నామన్న వార్త భరతునికి చెప్పమనీ హనుమంతుణ్ణి పంపుతూ శ్రీరాముడు – 'హనుమంతా! నువ్వు వెళ్ళి భరతుణ్ణి జాగ్రత్తగా గమనించు. చిరకాలం రాజ్యపాలనం చేసిన కారణంగా భరతునికి రాజ్యం మీద కోరిక కలిగిందేమో పసిగట్టు. ఉంటే రాజ్యం అతనికే ఇచ్చేస్తాను.' అన్నాడు.

అలాగే హనుమంతుడు వెళ్ళి, భరతునికి అంతా చెప్పి – 'భరతా! శ్రీరాముడు ప్రస్తుతం భరద్వాజమహర్షి ఆశ్రమంలో విడిదిచేసి ఉన్నాడు. రేపు పుష్యమీ నక్షత్రం ఉన్న శుభదినంలో నువ్వు శ్రీరాముణ్ణి దర్శిస్తావు.' అన్నాడు. ఆ వార్త విన్న భరతుడు ఆనందం పట్టలేక మూర్ఛపోయాడు.

అయోధ్య – పోయిన కళ తిరిగి వస్తోందా అన్నట్లుగా ముస్తాబవుతోంది. సంబరాలు మిన్నంటాయి. అయోధ్యమొత్తం కదిలి, నందిగ్రామం చేరింది. భరతుడు రామ పాదుకల్ని శిరస్సుపై ధరించి శ్రీరామదర్శనంకోసం తహతహలాడుతున్నాడు. అందరూ ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. ఆకాశంలో పుష్పక విమానం కనిపించి, కనువిందుచేసింది.

అడుగో కౌసల్యానందనుడు! అడుగో దశరథరాముడు! జనుల ఆనంద కోలాహలం అంబరాన్ని తాకింది. శ్రీరామునికి భరతుడు వినయంగా చేతులెత్తి నమస్కరించాడు. విమానం కిందికి దిగింది.

శ్రీరాముడు దిగుతూనే భరతుణ్ణి ఆప్యాయంగా కౌగిలించుకున్నాడు. భరతుడు అక్కడికి వచ్చినవారందరికీ నమస్కరించాడు. శ్రీరాముని ఆదేశం మేరకు పుష్పక విమానం కుబేరుని దగ్గరికి వెళ్ళిపోయింది.

## శ్రీరామ పట్టాభిషేకం

పట్టాభిషేక మహోత్సవానికి ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నాయి. అభిషేకానికి సర్వం సిద్ధమయ్యింది. భరతుని కోరికపై సుగ్రీవుడు వానరుల్ని పంపి తెల్లవారేసరికల్లా చతుస్సముద్రాలనుంచీ, అయిదువందల నదులనుంచీ పుణ్య జలాలు తెప్పించాడు.

నవరత్నఖచిత సువర్ణభద్రపీఠంపై సీతారాములు ఆసీనులయ్యారు. వసిష్ఠ, వామదేవ, జాబాలి మొదలైన అష్టపురోహితులు శాస్త్రోక్తంగా శ్రీరామునికి పట్టాభిషేకం చేశారు. అప్పుడు వసిష్ఠమహర్షి, ఇక్ష్వాకువంశ రాజులు ధరించే విలువైన బంగారు కిరీటాన్ని తీసుకొనివచ్చి, దానిని యథావిధిగా పూజించి శ్రీరాముని తలపై అలంకరింపజేశాడు.

శత్రుఘ్నుడు శ్రీరామునికి గొడుగు పట్టాడు. అది ఛత్రలాంఛనం. సుగ్రీవుడూ, విభీషణుడూ చెరొకవైపూ నిలిచి శ్రీరామునికి వింజామరలు వీస్తున్నారు. అది చామరలాంఛనం. దేవేంద్రుడు వాయుదేవునిద్వారా శతపద్మసువర్ణమాలికనూ (నూరుపద్మాల బంగారుదండ), మౌక్తికహారాన్నీ (ముత్యాల దండ) బహుమాన పురస్సరంగా పంపించాడు. శుభసూచకంగా జయజయధ్వానాలు అంతటా వ్యాపించాయి. గంధర్వులు పాటలు పాడారు. అప్సరసలు నాట్యం చేశారు.

శ్రీరాముడు అందరికీ సాటిలేని మేటి దానాలు చేశాడు. వానరులందరికీ విలువకట్టలేని దివ్యాభరణాలు ఎన్నింటినో బహూకరించాడు. సీతాదేవికీ ప్రేమగా ఓ ముత్యాలహారం ఇచ్చాడు. ఆ హారం చంద్రకిరణశోభతో ప్రకాశిస్తోంది.

సీతాదేవి హనుమంతునికి దివ్యమైన వస్త్రాలనూ, ఆభరణాలనూ కానుకగా ఇచ్చింది. ఆ తరువాత తన మెడలోని ఒక ఆభరణాన్ని తీసి చేత్తో పట్టుకొని శ్రీరాముని వైపు జూసింది. అప్పుడు రాముడు నీకు నచ్చిన వీరునికి ఇవ్వమని చెప్పడంతో దాన్నీ హనుమంతునికే ఇచ్చింది.

## జయహో! శ్రీరామరాజ్యం

పట్టాభిషేకం పూర్తయిన తరువాత విభీషణుడు శ్రీరామునిదగ్గర సెలవు తీసుకొని లంకకు వెళ్ళిపోయాడు.

తర్వాత రఘుకులాన్వయరత్నదీపమైన శ్రీరాముడు భరతునికి యువరాజ పట్టాభిషేకం చేశాడు.

ఎన్నోసార్లు పౌండరీక వాజపేయాలు, ఇంకా ఎన్నో యజ్ఞాలూ చేశాడు. వందసార్లు అశ్వమేధయాగం కూడా చేశాడు. పది వేల సంవత్సరాలు ధర్మబద్ధంగా పరిపాలించాడు.

**శ్రీరామరాజ్యంలో ప్రజలందరూ దీర్ఘాయుష్కులే. ధర్మపరులే. శుభలక్షణ శోభితులే. సత్యభాషణులే. రోగాల్లేవు. రొష్ఠుల్లేవు. ఈతిబాధలు మచ్చుకైనా లేవు. ఎవరూ ఎవర్నీ బాధించడం లేదు. ప్రజలంతా కలిసిమెలిసి జీవిస్తున్నారు. సకాలంలో వానలు కురుస్తున్నాయి. ఫలపుష్పసమృద్ధితో చెట్లు కళకళలాడుతున్నాయి. వాయువులూ హాయిగొల్పుతున్నాయి. ప్రజలందరూ తమ రాజు శ్రీరామచంద్రుని లాగానే సత్యవ్రతులూ, ధర్మనిరతులూ కావటమే ఇందుకు కారణం. 'యథా రాజా తథా ప్రజా'** కదా.

స్త్రీలకు వైధవ్యం లేదు. ప్రజలకు క్రూరమృగాల బాధలూ లేవు. దొంగభయం అస్సలే లేదు. అనర్థాల అలికిడీ లేదు. పెద్దలు జీవించి ఉండగా పిల్లలు మరణించడమూ లేదు. అందరూ సంతానసమృద్ధితో ఆరోగ్యభాగ్యాలతో జీవిస్తూ వర్ధిల్లుతున్నారు.

అన్ని వర్ణాలవారూ తమతమ కర్మలను నిష్ఠగా ఆచరిస్తున్నారు. ఎవరికీ ఏ లోటూ లేదు. శ్రీరామరాజ్యం నిత్యకల్యాణం పచ్చతోరణంగా విలసిల్లుతోంది.

అందరినోటా ఒకటే మాట. అది రామ రామ రామ. శ్రీరామ! అంతా రామమయమే అయిపోయింది. కష్టమంటే ఏమిటో తెలియకుండా శ్రీరామరాజ్యం ప్రజలను కంటికిరెప్పలా కాపాడుతోంది. అలా కొన్ని వేల సంవత్సరాలు గడిచిపోయాయి.

***వాల్మీకి మహర్షి రచించిన ఈ శ్రీరామాయణ కావ్యాన్ని చదివి అందులో ఉన్న ధర్మాల్ని ఆచరణలో పెట్టుకున్న వారికి కీర్తి లభిస్తుంది. ఆయుర్దాయం పెరుగుతుంది. రాజులకైతే విజయం తథ్యం. ఈ కావ్యాన్ని చదివినవారికి సమస్త పాపాలూ తొలగిపోయి పుణ్యం లభిస్తుంది. శ్రీరామపట్టాభిషేకం వరకూ***

*శ్రీరామకథను విన్నవారికి సర్వఫలాలూ సిద్ధిస్తాయి. పుత్రులు కావాలనుకొనేవారికి పుత్రులు కలుగుతారు. ధనం కావాలనుకొనేవారికి ధనం లభిస్తుంది. రాజు భూమిని జయిస్తాడు. శత్రుసంహారం గావిస్తాడు.*

*కౌసల్యాసుమిత్రాకైకేయుల్లాగా ఈ కావ్యం విన్న స్త్రీలు పుత్రపౌత్రులతో సదా ఆనందంతో వర్ధిల్లుతారు.*

*అత్యంతవిశ్వాసంతో, జితక్రోధులై ఈ కావ్యం చదివినవారికి కష్టాలు తొలగిపోతాయి.*

*ఈ కావ్యం చదివినవాళ్ళు ప్రవాసాంతంలో బంధువులతో కలిసి ఆనందంగా ఉంటారు. శ్రీరామాయణం చదివినవారికి అప్రమేయుడైన శ్రీరాముడు కోరిన వరాలను ప్రసాదిస్తాడు. దేవతలు సంప్రీతులవుతారు. ఇంట్లో ఉన్న దుష్టగ్రహాల పీడ తొలగిపోతుంది. ఆమూలాగ్రం శ్రీరామాయణం పఠించినవారికి సమస్త ఐశ్వర్యాలు, పుత్రలాభం కలుగుతుంది. ఎంతమాత్రమూ సంశయం లేదు. దీనిని చదివినవారి పట్ల దశరథాత్మజుడు సంప్రీతుడై ఉంటాడు.*

**కాబట్టి ఓ జనులారా! ఈ శ్రీరామాయణం గురించి అడిగినవారికి నిర్భయంగా దృఢవిశ్వాసంతో చెప్పండి. మీకు క్షేమం కలుగుతుంది. విష్ణుబలం వృద్ధి పొందుతుంది. శ్రీరామాయణం పఠించినా విన్నా దేవతలు అనుగ్రహిస్తారు. దీర్ఘాయువూ, ఆరోగ్యమూ, కీర్తీ, సోదరప్రేమా, సద్బుద్ధీ కలుగుతాయి. పితృదేవతలు సంతోషిస్తారు. శ్రీరామాయణాన్ని భక్తిపూర్వకంగా రచించినవారికి స్వర్గం లభిస్తుంది. చదివిన వారికి కుటుంబాభివృద్ధి, ధనధాన్యసమృద్ధి, ఐహిక, ఆముష్మిక అనుకూల దాంపత్యం, సుఖాలు, సకలకార్యసిద్ధీ కలుగుతాయి. సమృద్ధిని కోరుకొనే వాళ్ళు నియమపూర్వకంగా తప్పనిసరిగా రామాయణాన్ని వినాలి.**

**యావత్ స్థాస్యన్తి గిరయః సరితశ్చ మహీతలే,**
**తావత్ రామాయణకథా లోకేషు ప్రచరిష్యతి. (1-2-36)**

పర్వతాలూ నదులూ ఈ భూమిపై ఉన్నంతకాలం శ్రీరామకథ లోకంలో ప్రచారంలో ఉంటుంది.

# ఉత్తరకాండ

## మహర్షుల ఆగమనం

సద్గుణధాముడైన శ్రీరాముడు కోసలప్రజలను కన్నబిడ్డల్లాగా పరిపాలిస్తున్నాడు.

రాక్షసపీడ సమూలంగా విరగడయ్యింది. వైదిక కార్యక్రమాలన్నీ నిర్విఘ్నంగా కొనసాగుతున్నాయి. ఎందరో ఋషులు శ్రీరామదర్శనంకోసం దేశం నలుమూలల నుంచీ శ్రీరామరాజ్యానికి వస్తున్నారు. వారిలో అగస్త్యుడు, అత్రి, విశ్వామిత్రమహర్షి, గౌతమమహర్షి, జమదగ్నిమహర్షి, ధౌమ్యమహర్షి, భరద్వాజమహర్షి, మొదలైన వాళ్ళు ఉన్నారు.

వీళ్ళంతా అయోధ్యానగరం చేరుకున్నారు. శ్రీరామచంద్రుడు సాదరంగా అందరినీ ఆహ్వానించి అతిథిసత్కారాలు చేసి క్షేమసమాచారాలు తెలుసుకున్నాడు. అందరూ ముక్తకంఠంతో – 'శ్రీరామా! రావణుడు మొదలైన రాక్షసుల్ని సంహరించి, లోకంలో ధర్మాన్ని నిలిపావయ్యా! అందుకు మాకు ఎంత ఆనందంగా ఉందో తెలుసా!. ఆ మేఘనాదుడు అదే ఇంద్రజిత్తు ఉన్నాడే! వాడు సామాన్యుడా? కాదు. మహామాయావి. ఇంద్రుణ్ణే గడగడలాడించి, జయించి ఇంద్రజిత్తు అయ్యాడు. అటువంటి ఇంద్రజిత్తును నువ్వు చంపడం అనితరసాధ్యం.' అని శ్రీరాముణ్ణి ఋషులు మెచ్చుకున్నారు.

దానికి శ్రీరామచంద్రుడు ఆ మహర్షులతో సవినయంగా – 'మహాత్ములారా! రావణాది రాక్షసులకంటే మీరు ఇంద్రజిత్తును ఎక్కువగా పొగడడానికి కారణం ఏమిటి? అతడి ఆధిక్యం ఎటువంటిది? అసలు ఈ రాక్షసులు ఎవరు? వాళ్ళకి ఇంతటి బలపరాక్రమాలు ఎక్కడివి? అంతకాలం వాళ్ళు ఎలా జీవించగలిగారు? దయచేసి చెప్పండి.' అన్నాడు. సాక్షాత్తూ పరాత్పరుడూ, పరంధాముడూ అయిన శ్రీరాముడే తమను ఇలా అడగడంతో ఋషులు ఆశ్చర్యపోయారు.

వివరంగా చెప్పమని అగస్త్యులవారిని అందరూ కలిసి ప్రార్థించారు. అగస్త్యమహర్షి ప్రారంభించాడు.

## పులస్త్యబ్రహ్మ

“అది కృతయుగం. బ్రహ్మదేవుడు మొదట ఒక పదిమంది ప్రజాపతులను సృష్టించాడు. వారిలో పులస్త్యబ్రహ్మ ప్రముఖుడు. బ్రహ్మర్షి, వేదమూర్తి అయిన పులస్త్యబ్రహ్మ – మేరుపర్వత ప్రాంతంలో తృణబిందుమహర్షి ఆశ్రమానికి దగ్గరలో ఒక ఆశ్రమం ఏర్పాటు చేసుకున్నాడు. ఆ సుందరప్రదేశానికి ఎందరెందరో దేవ, నాగ, అప్సరోభామినులూ ఋషికన్యలూ వచ్చేవాళ్ళు. తమ ఆటపాటలతో అక్కడ గడిపి వెళ్ళేవాళ్ళు. దానివల్ల పులస్త్యమహర్షి తపస్సుకు భంగం కలుగుతోంది. దానికి కోపగించిన మహర్షి –

‘నా చూపు ప్రసరించినంత ప్రదేశంలోనికి ఎవరూ రాకూడదు. అలా మేర దాటి వచ్చి నా తపస్సుకు భంగం కలిగించిన యువతి గర్భవతి అగుగాక!’ అని శపించాడు. ఇది తెలియని తృణబిందు మహర్షి కూతురు ఒకరోజు ప్రకృతి సౌందర్యానికి పరవశిస్తూ ఆ ప్రాంతానికి వచ్చింది. సరిగ్గా అప్పుడు పులస్త్య మహర్షి మనోహరంగా వేదగానం చేస్తున్నాడు. ఆమె కుతూహలంతో ఆ మహర్షిని చూడాలని ఆయన ఆశ్రమాన్ని సమీపించింది. ఇంతలో హఠాత్తుగా ఆమెకు గర్భవతి లక్షణాలు పొడచూపాయి. ఏమిటి ఈ విపరీతం? అర్థంకాలేదామెకి. దుఃఖం పొంగుకొచ్చింది.

## విశ్రవోమహర్షి

తృణబిందు మహర్షి కూతురు తటపటాయిస్తూ భయంభయంగా ఈ విషయం ఎలా చెప్పాలా! అనుకుంటూ తన తండ్రిదగ్గరకు వెళ్ళింది. ఆయన దివ్యదృష్టితో అంతా తెలుసుకొన్నాడు. వెంటనే బయలుదేరి తన కూతురిని పెళ్ళిచేసుకొమ్మని పులస్త్యమహర్షిని కోరాడు. అందుకు పులస్త్యమహర్షి అంగీకరించాడు.

వివాహం జరిగింది. తృణబిందుడి కూతురు అత్యంత భక్తిశ్రద్ధలతో భర్తకు సేవచేస్తోంది. ఆమె సేవలకు సంతోషించిన పులస్త్యుడు – ‘ప్రియా! నేను వేదం చదువుతున్నప్పుడు నన్ను నువ్వు దర్శించావు కాబట్టి, మనకు పుట్టబోయే కుమారుడికి విశ్రవసుడు అని నామకరణం చేస్తున్నాను.’ అని అనుగ్రహించాడు.

కొంతకాలానికి విశ్రవసుడు జన్మించాడు. అతడు తండ్రికి తగ్గ తనయుడు. గొప్ప తపస్సు చేసి విశ్రవోమహర్షి అనిపించుకున్నాడు. అతడి తపస్సుకు ముచ్చటపడి భరద్వాజమహర్షి తనంతటతానుగా తన కూతురునిచ్చి వివాహం జరిపించాడు.

## వైశ్రవణుడు

భరద్వాజుడి కూతురు సంతానం కావాలనుకుంది. అది తెలుసుకొన్న విశ్రవసుడు ఆమెకు పుత్రుణ్ణి అనుగ్రహించాడు. అతడు పుట్టిన వేళావిశేషాలనుబట్టి అతడు సర్వలోకాలకూ ధనపతి అవుతాడని తెలుసుకొని ఆ దంపతులు ఎంతగానో ఆనందించారు. వైశ్రవణుడు అని పేరు పెట్టుకొని మురిపెంగా పెంచుకున్నారు.

వైశ్రవణుడు సుదీర్ఘకాలం తపస్సు చేశాడు. బ్రహ్మదేవుడు మెచ్చి, ఇంద్రాది దేవతలతో వచ్చి, వరం కోరుకోమన్నాడు. అప్పుడు వైశ్రవణుడు – 'దేవా! నేను ధనాధిపతినై లోకపాలకుణ్ణయ్యేలా అనుగ్రహించు.' అన్నాడు. అప్పుడు బ్రహ్మ దేవుడు – 'ఓహో! నేను నలుగురు లోకపాలకుల్ని సృష్టించాలనుకొన్నాను. ఇప్పటికి ఇంద్ర, యమ, వరుణులు ఉన్నారు. ముగ్గురు పూర్తయ్యారు. ఇక నువ్వే ఆ నాలుగో వాడివి. అంతేకాదు నువ్వు ధనాధిపతివికూడా అవుతావు.' అని వరమిచ్చాడు. దానితోపాటు ఒక అద్భుతమైన విమానాన్ని కూడా బ్రహ్మదేవుడు వైశ్రవణుడికి బహుమానంగా ప్రసాదించాడు. 'దీనిని అధిరోహించి సూర్యుడితో సమానమైన తేజస్సుకలవాడివై యథేచ్ఛగా విహరించు. ఇది పుష్పకవిమానంగా లోకంలో ప్రసిద్ధికెక్కుతుంది.' అని ఆశీర్వదించాడు.

ఆ తరువాత వైశ్రవణుడు తనకు తగిన నివాసాన్ని సూచించమని తన తండ్రిని వేడుకున్నాడు. అప్పుడు ఆయన లంకానగరం గురించి ఇలా చెప్పడం మొదలుపెట్టాడు.

## లంకానగరం

'దక్షిణసముద్రతీరంలో త్రికూట పర్వతశిఖరప్రాంతంలో విశ్వకర్మ సాటిలేని ఒక మహానగరాన్ని సృష్టించాడు. విశ్వకర్మ దితిపుత్రుడు. కాబట్టి ఆ నగరం దైత్యులకు నివాసస్థానమయ్యింది. ఆ నగరం వైభవం ఎంతని చెప్పను? దైత్యులు అక్కడ సకలభోగాలతో నివసించేవారు.

ఒకసారి దేవతలకూ రాక్షసులకూ ఘోరయుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో శ్రీమహావిష్ణువుకు భయపడి రాక్షసులు లంకానగరాన్ని విడిచిపెట్టి పాతాళానికి పారిపోయి తమ ప్రాణాలు రక్షించుకున్నారు. ఇప్పుడు లంకలో ఎవరూలేరు. కాబట్టి ఆ లంక నీదే. దాన్ని నీ నివాసస్థానం చేసుకో.' అని తండ్రి విశ్రవసుడు వైశ్రవణుడికి చెప్పాడు.

అలా లంకానగరం వైశ్రవణుడికి నివాసం అయ్యింది. ఇక చూడాలి! ఆ లంకానగరం శోభ. ఇంద్రుడి అమరావతిని మించిపోయింది." అన్నాడు అగస్త్యుడు.

అప్పుడు శ్రీరామచంద్రుడు ఆశ్చర్యపోయాడు. 'లంకానగరంలో ముందే రావణ కుంభకర్ణుల్ని మించిన రాక్షసులుండేవారా? వాళ్ళు రావణునికన్నా కూడా బలవంతులా?' అడిగాడు మహర్షిని. అగస్త్యమహర్షి సమాధానంగా ఇలా సెలవిస్తున్నాడు. –

"శ్రీరామా! బ్రహ్మదేవుడు మొదట నీటిని, ఆ నీటిని కాపాడడానికి వివిధ ప్రాణుల్నీ సృష్టించాడు. ఈ ప్రాణులకు ఆకలిదప్పులు పుట్టాయి. **నీరే సమస్త జీవరాశికి ప్రాణాధారం.** కాబట్టి సంరక్షించుకోండి. అని ఆ ప్రాణులకు చెప్పాడు బ్రహ్మదేవుడు.

## యక్షులూ రాక్షసులూ

అప్పుడు వాళ్ళలో కొందరు ఈ జలాల్ని మేము రక్షిస్తాం (వయం రక్షామః) అన్నారు. మరికొందరు రక్షించడంతోపాటూ మేము పూజించి సేవిస్తాం (వయం జక్షామః) అన్నారు. అలా 'రక్షామః' అన్న వాళ్ళు రాక్షసులుగా, జక్షామః' అన్న వాళ్ళు యక్షులుగా మారారు. హేతి, ప్రహేతి వాళ్ళ నాయకులు. వీళ్ళు మధుకైటభు లంత పరాక్రమం కలవాళ్ళు. ప్రహేతి తపస్సుకోసం అడవికి వెళ్ళిపోయాడు.

హేతి మాత్రం గృహస్థాశ్రమం స్వీకరించాలని తగిన వధువుకోసం చాలా అన్వేషించాడు. చివరికి యముడి సోదరి 'భయ' ను కోరి వివాహం చేసుకున్నాడు. వాళ్ళ సంసారం అన్యోన్యంగా సాగుతోంది. కొంతకాలానికి వాళ్ళకు ఒక కొడుకు పుట్టాడు. విద్యుత్కేశుడని పేరు పెట్టుకొని పెంచుకుంటున్నారు.

కాలం గిర్రున తిరిగింది. విద్యుత్కేశుడూ పెరిగి పెద్దవాడయ్యాడు. తేజస్సుతో అపారమైన బలపరాక్రమాలతో ప్రకాశిస్తున్న విద్యుత్కేశుడికి పెళ్ళి చేయాలని హేతి నిర్ణయించుకొని తగిన వధువుకోసం అన్వేషించాడు.

సూర్యుడి భార్య సంధ్యాదేవి. ఆమెకి పెళ్ళీడుకు వచ్చిన కుమార్తె ఉందని తెలిసింది హేతికి. వెళ్ళి అడిగాడు. ఆ పిల్ల పేరు 'సాలకటంకట'. తల్లిలాగానే ఆ పిల్ల కూడా తేజస్విని.

సంధ్యాదేవి ఒప్పుకుంది. తన కూతురును విద్యుత్కేశుడికిచ్చి పెళ్ళి చేసింది.

నూతనదంపతులు ఆనందంగా కాపురం చేస్తున్నారు. కొన్నాళ్ళకు సాల కటంకట గర్భం ధరించింది. ఆ గర్భం ఆమెకు ఇష్టంలేదు. కానీ తప్పదు కదా! అందుకే పుట్టిన శిశువును మందరపర్వత ప్రాంతంలో వదిలి భర్తదగ్గరకి వెళ్ళిపోయింది.

ఆ శిశువు ఆకలికి తాళలేక పెద్దగా ఏడుస్తున్నాడు.

అదే సమయంలో పార్వతీపరమేశ్వరులు నందివాహనంపై విహరిస్తూ అటువైపే వచ్చారు. ఆ శిశువురోదన విన్నారు. శివునికి చెప్పలేనంత జాలి కలిగింది. నందివాహనం దిగివచ్చి, ఆ పిల్లవాణ్ణి ఎత్తుకొని, పార్వతికి ఇచ్చి 'వీణ్ణి నీ పుత్రునిలాగా చూసుకో' అని కోరాడు.

శివుడు వాణ్ణి సత్వరం యౌవనవంతుణ్ణి చేసి, సుకేశుడు అని పేరుపెట్టి, కామగమనంగల ఒక విమానం దానితో పాటు దివ్యత్వం కూడా ఇచ్చి కరుణించాడు.

శివుడు ప్రసాదించిన వరాలతో సుకేశుడు దేవతలకూ ప్రీతిపాత్రుడౌతూ సంతోషంతో యథేచ్ఛగా సంచరిస్తూ పరమశివుణ్ణి సేవించుకుంటూ ధార్మికుడై కాలం గడుపుతున్నాడు. అతడిలో రాక్షసప్రవృత్తి ఏ కోశానా లేదు.

సుకేశుడి గురించి విన్నాడు గ్రామణి అనే ఒక గంధర్వుడు. తన కూతురు దేవవతిని ఇచ్చి పెళ్ళి చేశాడు. కొంతకాలానికి దేవవతీసుకేశులకు మాల్యవంతుడు, సుమాలి, మాలి అనే ముగ్గురు క్రూరులైన కొడుకులు పుట్టారు. ఈ ముగ్గురిలో ఏ ఒక్కరికీ తాతతండ్రుల మంచిలక్షణాలు ఒక్కటీ రాలేదు. ముగ్గురూ ముగ్గురే. లోకకంటకులుగా మారారు.

తమ తండ్రికి శివానుగ్రహం ఉందని తెలుసుకొని తాము కూడా లోకాన్ని శాసించాలని బ్రహ్మదేవుణ్ణి గూర్చి ఘోరతపస్సు చేసి వరాలను పొందారు. ఆ వరగర్వంతో వాళ్ళు పెట్టే హింసలకు తాళలేక దేవతలంతా పరమశివునికి మొరపెట్టుకున్నారు.

అప్పుడు శివుడు – 'వాళ్ళ తండ్రి నా అనుగ్రహానికి పాత్రుడు. కాబట్టి వాళ్ళను నేను చంపలేను. మీరు వెళ్ళి శ్రీమహావిష్ణువును శరణువేడండి' అన్నాడు.

## దేవ దానవ యుద్ధం

అప్పుడు దేవతలందరూ శ్రీమహావిష్ణువును దర్శించుకొని – 'లోకరక్షకా! రాక్షససంహారకా! నీవు తప్ప మాకు వేరే గతిలేదు.' అని శరణు వేడారు. వైకుంఠ వాసుడు వాళ్ళకు అభయమిచ్చాడు.

ఈ వార్త ఆ రాక్షసులు ముగ్గురికీ తెలిసింది. దేవతలపై కక్షగట్టి దేవలోకంపై దండెత్తి వచ్చారు. అశేషమైన రాక్షససేనతో దేవలోకాన్ని ముట్టడించారు. రాక్షసులు అలా ముట్టడించేసరికి ఏం చెయ్యాలో దిక్కుతోచని దేవతలు శ్రీమన్నారాయణుడి దగ్గరకు దూతలను పంపారు. శ్రీమహావిష్ణువు తానే స్వయంగా రాక్షస సంహారానికి యుద్ధభూమికి కదలి వచ్చాడు.

దేవాసురులకు ఘోర యుద్ధం జరిగింది. పర్వతం మీద కుంభవర్షం కురిసినట్లు విష్ణుమూర్తి మీద రాక్షసులు బాణవర్షం కురిపించారు. అప్పుడు శ్రీమహావిష్ణువు తన పాంచజన్యాన్ని పూరించాడు. గరుడవాహనంపై పంచా యుధాలు ధరించి విజృంభించాడు. ఎందరో రాక్షసవీరుల్ని నేలకూల్చాడు. పాంచజన్యం పూరించిన శబ్దానికే చాలామంది రాక్షసులు గుండెపగిలి చచ్చారు. కొంతమంది లంకానగరానికి పారిపోయారు.

మాలి మాత్రం మరింత దర్పంతో శ్రీమహావిష్ణువును ఎదుర్కొన్నాడు. భీకరంగా పోరాటం సాగించాడు. చివరికి శ్రీమహావిష్ణువు ప్రయోగించిన సుదర్శనచక్రానికి అసువులు బాశాడు.

అది చూసిన మాల్యవంతుడూ, సుమాలీ తమ అనుచరగణంతో సహా లంకకు పారిపోయారు. కానీ శ్రీమహావిష్ణువు వాళ్ళను వదల్లేదు. వెంటాడాడు. బ్రతుకుజీవుడా అంటూ రాక్షసులు అక్కడినుండి పారిపోయి పాతాళంలో తలదాచుకున్నారు.

## కుబేరుడి లంకావాసం

అందువల్ల ఇప్పుడు లంకానగరంలో ఎవరూ లేరు. తన తండ్రి ఆదేశంతో కుబేరుడు (వైశ్రవణుడు) అక్కడ తన నివాసాన్ని ఏర్పరచుకొన్నాడు. కొంతకాలం గడిచింది.

సుమాలి తన పుత్రికతో కలిసి పాతాళం నుంచి బయటకు వచ్చి ఆమెకు తగిన వరుడిని అన్వేషిస్తుంటే ఒకరోజు పుష్పకవిమానంలో వైభవంగా విహరిస్తున్న కుబేరుడు అతని కంట పడ్డాడు. కుబేరుణ్ణి ఇలా చూసేసరికి సుమాలికి తమకు జరిగిన అవమానం, పోయిన ఐశ్వర్యం అన్నీ గుర్తుకువచ్చాయి. దుఃఖం కమ్ము కొచ్చింది.

తాము అలా పాతాళంలోనే మగ్గిపోతే తన కూతురికి తగిన వరుణ్ణి ఎలా వెదకటం? అందుకే తన కూతురు కైకసిని పిలిచి – 'అమ్మా! *ఈడొచ్చిన ఆడపిల్లతండ్రి పడే తపన నీకు తెలియదు.* నువ్వు చక్కని చుక్కవి.

కాబట్టే నువ్వు అంగీకరిస్తావో లేదో అని నిన్నడగటానికి నా దగ్గర కెవరూ రావటం లేదు. అదలా ఉంచు.

చూస్తున్నావుగా ఈ కుబేరుడి వైభవం. ఆ ఠీవి చూడు. పులస్త్య బ్రహ్మవంశంలో పుట్టినందువల్లనే వాడు ధనాధిపతి అయ్యాడు. లోకపాలకుడూ అయ్యాడు. అందుకే వాడికి ఆ నిక్కూ ఆ టెక్కూ. కాబట్టి నువ్వు కూడా పులస్త్య బ్రహ్మకుమారుడైన విశ్రవోబ్రహ్మను ఆశ్రయించు. నీ కడుపున ఈ కుబేరుణ్ణి పరాభవించగలవాడు పుట్టాలి. వాడి కోసం నేను ఎదురుచూస్తున్నాను.' అన్నాడు.

తండ్రిమాట విన్న కైకసి వెంటనే విశ్రవసు మహర్షి దగ్గరకు వెళ్ళింది. సిగ్గుపడుతూ ఆయన సమక్షంలో నిలిచింది. ఆమె ఎవరో ఆమె కోరిక ఏమిటో ఆ మహర్షికి అర్థమైంది. నిషిద్ధసమయంలో వచ్చింది. అదీ పుత్రవాంఛతో. విశ్రవోబ్రహ్మ విభ్రాంతుడయ్యాడు. ఇది దైవసంకల్పం. ఆమెను నిరాకరించటం ధర్మం కాదు. అని భావించి ఆమెతో ఇలా అన్నాడు.

'కైకసీ! నీకు ధర్మవిరోధులూ, క్రూరులూ అయిన తనయులు కలుగుతారు మరి!' అని ఆమెను హెచ్చరించాడు. ఆ మాటలకు ఆమెకు నోట మాటరాలేదు.

'మహానుభావా! నీలాంటి గొప్ప పుత్రులను కోరి నేను వస్తే నాకు ఇదా! రాసిపెట్టి ఉన్నది.' అంటూ బాధ పడింది. దానికి విశ్రవోబ్రహ్మ మళ్ళీ –

'చింతించకు కైకసీ! నీకు ముగ్గురు కొడుకులు పుడతారు. అయితే వారిలో చివరివాడు నువ్వు కోరుకున్నట్లుగా ధార్మికుడు అవుతాడులే!' అని ఆమెను ఊరడించి తన భార్యను చేసుకున్నాడు.

## రావణుడూ, అతడి తమ్ముళ్ళూ

విశ్రవోబ్రహ్మ సెలవిచ్చినట్లే ఆమెకు రావణుడు, కుంభకర్ణుడు, విభీషణుడు అనే ముగ్గురు కుమారులు జన్మించారు. రావణుడూ, కుంభకర్ణుడూ చిన్ననాటినుంచే ముని ఆశ్రమాలను ధ్వంసం చేయటం, ఋషులను పీడించటం మొదలుపెట్టారు. విభీషణుడు మాత్రం అలా కాదు. శాంతం, ధర్మతత్పరత, వేదాధ్యయనంపై శ్రద్ధతో మసలుకొంటున్నాడు.

కాలం గడుస్తోంది. ఒకరోజు పుష్పకవిమానంపై తండ్రిని చూడటానికి వచ్చిన కుబేరుణ్ణి చూపిస్తూ కైకసి దశకంఠుడితో – 'చూడు! నీ సోదరుడు. ఏమా వైభవం? ఏమా దివ్యతేజస్సు? నువ్వు కూడా అంతటివాడివి కావాలి.' అంది. దానికి రావణుడు – 'అమ్మా! కుబేరుణ్ణి మించిన ధనవంతుణ్ణీ, బలవంతుణ్ణీ, కీర్తిమంతుణ్ణీ అవుతాను. ఇతడు ఒక్క దిక్కుకు మాత్రమే అధిపతి. చూస్తూ ఉండు. నేను అన్ని లోకాలనూ వశం చేసుకొని బహులోకపాలకుణ్ణి అవుతాను.' అన్నాడు. తల్లికి ఎంతో సంతోషం కలిగింది.

చెప్పి ఊరుకోలేదు రావణుడు. తన సోదరులతో సహా గోకర్ణ క్షేత్రానికి వెళ్ళి, అక్కడ చాలకాలం బ్రహ్మదేవుణ్ణి గూర్చి ఘోర తపస్సు చేశాడు.

ముగ్గురూ ముగ్గురే. ఆహారం లేదు. పంచాగ్నిమధ్య నిల్చొని తపస్సు చేశారు. జడివానలలో తపస్సు చేశారు. మంచి చలికాలంలో కంఠంలోతు నీళ్లలో నిలబడి మరీ తపస్సు కొనసాగించారు.

విభీషణుడు మాత్రం వేదపురుషుణ్ణి ధ్యానిస్తున్నాడు.

దశకంఠుని తపస్సు అపూర్వం. వెయ్యి సంవత్సరాలు గడిచిపోయాయి. అప్పుడు తన తలను ఖండించుకుని అగ్నిలో సమర్పిస్తూ తపస్సు కొనసాగించాడు.

తపశ్శక్తివల్ల అతడి తల మళ్ళీ వెంటనే అతడికి వచ్చేసింది. ఇలా పదిసార్లు చేశాడు. అప్పుడు బ్రహ్మదేవుడు ప్రత్యక్షమయ్యాడు. రావణుడు నమస్కరించి – 'మహాత్మా! సమస్త ప్రాణులూ నిత్యం మరణభీతితో తల్లడిల్లిపోతాయి. ఒక్క చావుకి తప్ప ఇంక దేనికీ ఇంతగా భయపడవు. ఈ లోకంలో మృత్యువుతో సమానమైన శత్రువు లేనే లేదు. కాబట్టి నాకు మరణం అన్నదే లేకుండా వరం ప్రసాదించు.' అని ప్రార్థించాడు.

దానికి బ్రహ్మదేవుడు – 'దశగ్రీవా! పూర్తిగా అమరత్వం ఇవ్వడం అసాధ్యం. కాబట్టి నువ్వు మరో కోరిక కోరుకో!' అన్నాడు. సుర– గరుడ – ఉరగ – యక్ష – రాక్షస – సిద్ధ – చారణ – కిన్నర – కింపురుషులు మొదలైన దేవతాగణాల్లో ఎవరివల్లా తనకు మరణం రాకుండా వరం కోరుకున్నాడు రావణుడు. మానవులు అతడి లెక్కలో లేరు. వాళ్ళు తనను చంపలేరన్నది అతడి ధీమా. అందుకే మానవుల ఊసు ఎత్తటం కూడా తనకు అవమానంగా భావించాడు.

ఆ తర్వాత బ్రహ్మదేవుడు కుంభకర్ణుడికి వరాలు ఇవ్వటానికి బయలుదేరాడు. అప్పుడు దేవతలు భయభ్రాంతులైపోయారు. కుంభకర్ణుడు మహాక్రూరుడు. ఇప్పటికే ఎందరినో పొట్టన పెట్టుకున్నాడు. ఇప్పుడు వీడు ఏం కోరతాడో! వాటిని బ్రహ్మదేవుడు ప్రసాదిస్తే ఇక అంతే సంగతులు! గజగజ వణికిపోతూ బ్రహ్మదేవుడి దగ్గరకు వచ్చి మొరపెట్టుకున్నారు.

అప్పుడు బ్రహ్మదేవుడు సరస్వతిని పిలిచి – దేవీ! ఆ కుంభకర్ణుడు వరాలు కోరేప్పుడు వాడి బుద్ధి పనిచేయకుండా చేయాలి. వాడు కోరుకొనే వరాలు లోకానికి అపకారం కలిగించకూడదు. అటువంటి వరాలను వాడు కోరుకునేట్టు నువ్వే చూడాలి సుమా! అన్నాడు. తత్ఫలితంగా కుంభకర్ణుడు –

'బ్రహ్మదేవా! నేను అనేకసంవత్సరాలపాటూ ఎక్కువగా నిద్రపోయేటట్లు వరాన్ని అనుగ్రహించు. అదే నా కోరిక.' అన్నాడు. బ్రహ్మదేవుడు తథాస్తు అని వెళ్ళిపోయాడు.

విభీషణుడి తపస్సుకు మెచ్చిన బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై –

నాయనా! విభీషణా! నువ్వు ధర్మాన్ని ఆచరించేవాడివి. నీ బుద్ధి ఎప్పటికీ ధర్మమార్గాన్ని వీడిపోదు. నీ తపోదీక్షకు నేను ఆనందించాను. ఏదైనా వరం కోరుకో! అన్నాడు.

దానికి విభీషణుడు – 'బ్రహ్మదేవా! నేను ఎన్ని కష్టాలు పడినా సరే! ధర్మాన్ని విడిచిపెట్టకుండా ఉండేటట్టు అనుగ్రహించు. అలాగే నేను బ్రహ్మాస్త్రం ఎలా ప్రయోగించాలో నేర్చుకోలేదు. అయినా ఆ అస్త్రమంత్రాలు నాకు స్ఫురించేటట్టు చెయ్యి. బ్రహ్మచర్యం మొదలైన ఆశ్రమాలలో నా బుద్ధి ఎల్లప్పుడూ ధర్మబద్ధంగా ఉండేటట్టు నా విధ్యుక్తధర్మాన్ని నేను నిత్యం పాటించేటట్టూ అనుగ్రహించు. **ఎట్టి పరిస్థితుల్లోనూ మంచి నడవడిక, ధర్మబుద్ధి నన్ను విడిచి పెట్టకూడదు. నా దృష్టిలో ఇవే గొప్ప వరాలు. ఎందుకంటే ధర్మాత్ములకు ఏదీ దుర్లభం కాదు. ప్రసాదించు.' అని వరం కోరుకున్నాడు.** 'తథాస్తు' అన్నాడు బ్రహ్మదేవుడు.

ఆ తర్వాత అన్నదమ్ములు తమ తండ్రి తపోవనం చేరారు.

తన మనవళ్ళు గొప్పవరాలు పొందడంతో తన కల నెరవేర్చుకోవాలను కున్నాడు వాళ్ళ మాతామహుడు సుమాలి. పోయిన తమ రాజ్యం వీళ్ళద్వారా తిరిగి సంపాదించుకోవాలి. యథేచ్ఛగా బతకాలి. అందుకే మారీచుడు, విరూపాక్షుడు, ప్రహస్తుడు, మహోదరుడు అనే తన మంత్రులను దశకంఠుడి వద్దకు పంపి, కుబేరుణ్ణి లంకనుంచి వెళ్ళగొట్టేలా దశకంఠుణ్ణి రెచ్చగొట్టేలా చేశాడు. ఎంతైనా కుబేరుడు తనకు అన్నగారే కదా అని రావణుడు ఊరుకున్నాడు.

కొంతకాలం గడిచింది. ప్రహస్తుడు మళ్ళీ వచ్చి దశకంఠుడితో – 'దశకంఠా! పరాక్రమం, రాజ్యం – ఈ రెండింటివిషయాల్లో బంధుత్వాలు చూడకూడదు' అని రెచ్చగొట్టాడు. ఈసారి అతడి మాటలు పనిచేశాయి. రావణుడు, కుబేరుణ్ణి తక్షణం లంకను విడిచిపెట్టి వెళ్ళు. అని ఆదేశించాడు. కుబేరుడు సంధి చేసుకుందామన్నాడు కానీ రావణుడు ఒప్పుకోలేదు.

అప్పుడు కుబేరుడు తన తండ్రి విశ్రవోబ్రహ్మకు ఈ సంగతి చెప్పాడు. దానికి విశ్రవోబ్రహ్మ – 'రావణుడు పరమ దుర్మార్గుడు. నేనూ చెప్పి చూశాను. వాడు విన్నాడు కాదు. ఇంక చేసేది ఏమీ లేదు. నువ్వు కైలాసపర్వతం సమీపంలో కొత్తగా ఏదైనా నివాసం ఏర్పరుచుకో. సుఖంగా ఉండు. అక్కడే ఎందుకంటే అక్కడికి దేవతలందరూ పరమశివుణ్ణి అర్చించుకోవటానికి వస్తూ ఉంటారు. అది పరమపవిత్రమైన పుణ్యప్రదేశం.' అన్నాడు. అలాగే కుబేరుడు అక్కడ అలకాపట్టణం నిర్మించుకొని దాన్ని తన స్థిరనివాసం చేసుకున్నాడు.

రావణుడు లంకారాజ్యానికి పట్టాభిషిక్తుడై లోకాలన్నీ ఆక్రమించాలని విజృంభిస్తున్నాడు. తన చెల్లెలు శూర్పణఖను కాలకుడు అనే రాక్షసుడి కొడుకైన విద్యుజ్జిహ్వుడికిచ్చి పెళ్ళి చేశాడు.

కొంతకాలం గడిచింది. రావణుడు వేటకు వెళ్ళాడు. అరణ్యంలో అతడికి మయుడు కనిపించి తన కూతురు మండోదరికి తగిన వరుడు దశకంఠుడేననుకొని ఆమెను రావణాసురిడికి ఇచ్చి పెళ్ళిచేశాడు.

ఆ తరువాత రావణుడు వైరోచనుడి మనవరాలు వజ్రజ్వాలతో కుంభకర్ణుడి పెళ్ళినీ, శైలూషుడనే గంధర్వుడి కూతురు సరమతో విభీషణుడి పెళ్ళినీ జరిపించాడు.

కొంతకాలానికి రావణమండోదరులకు ఒక కుమారుడు కలిగాడు. వాడు పుడుతూనే మేఘంలా గర్జించాడు. అందువల్ల వాడికి మేఘనాదుడు అని పేరుపెట్టారు.

రావణుడు తన తమ్ముడు కుంభకర్ణుడికి ఒక పెద్ద భవనాన్ని నిర్మించి ఇచ్చాడు. కుంభకర్ణుడు అందులో ప్రవేశించి నిద్రపోతూ బ్రహ్మవరాన్ని సార్థకం చేస్తున్నాడు.

ఇక రావణుడు లోకాలన్నిటినీ జయించటానికి పూనుకున్నాడు. నందన వనాన్ని ధ్వంసం చేశాడు. దేవతాగణాలను హింసించాడు. ఋషివనాలను చిందరవందర చేశాడు. దేవతాస్త్రీలను చెరపట్టాడు. సాధువులను నానాబాధలు పెట్టాడు.

ఈ విధంగా రావణుడు లోకాలన్నిటిని పీడిస్తూ ఉండగా కుబేరుడు, తన తమ్ముడికి హితబోధ చేయమని ఒక దూతను పంపాడు. ఆ దూతను అక్కడికక్కడే నరికి చంపాడు రావణుడు. అంతటి క్రూరుడు ఆ రావణుడు.

## రావణుని జైత్రయాత్ర

కొంతకాలానికి ప్రహస్తుడు, మహోదరుడు, మారీచుడు, శుకుడు, సారణుడు అనే మంత్రులతో రావణుడు దిగ్విజయయాత్రకు బయలుదేరాడు. కోపం, అహంకారం మూర్తీభవించగా ముందు కుబేరునిపై దండెత్తాడు. అప్పుడు కుబేరుడు ఇలా నాలుగు మంచిమాటలు చెప్పడం ప్రారంభించాడు.

'రావణా! నువ్వు ఇలా పాపాలు చేస్తూపోతూ ఉంటే నీ తపస్సంతా వ్యర్థమైపోతుంది. ఇకనైనా పుణ్యకార్యాలు చెయ్యి. సజ్జనులు మెచ్చే తపస్సు చెయ్యి. **ఈ శరీరం అశాశ్వతం. కలకాలం ఉండదు. కాబట్టి శరీరం ఉండగానే తపస్సు చేయాలి. మూఢుడు తపస్సు చేయకుండా మరణించి ఆ తర్వాత అయ్యో! తపస్సు చెయ్యలేకపోయానే అని బాధపడతాడు.'** అన్నాడు.

ఈ మాటలు రావణుని కోపానికి మరింత ఆజ్యం పోశాయి. కుబేరుడిపై ఎన్నో మాయలు ప్రయోగించి గదలతో బలంగా మోది అతణ్ణి మూర్ఛపోయేలా కొట్టాడు. కుబేరుని నిధులకు అధిదేవతలు ఉన్నారు. వాళ్ళు కుబేరుణ్ణి ఎత్తుకొనిపోయి నందనవనంలో దాచి, ఉపచారాలు చేస్తూ స్పృహ కలిగించారు.

## నందీశ్వరుని కోపం

కుబేరుడి పుష్పకవిమానం, ఆయన ధనరాశులు తీసుకొని రావణుడు తక్కిన దిక్పతులమీదికి బయలుదేరాడు. కుబేరుడి పుష్పకంలో విహరించడం మొదలు పెట్టాడు. కొంత దూరం వెళ్ళాక ఆ పుష్పకం కైలాసపర్వతప్రాంతాలలోనికి ప్రవేశించింది. అలా ప్రవేశించిందో లేదో హఠాత్తుగా ఒకచోట ఆగిపోయింది.

ఇంతలో అక్కడికొక వ్యక్తి వచ్చి – ఇది శంకరుడి క్రీడాపర్వతం. పార్వతీ పరమేశ్వరులు ఇక్కడ విహరిస్తూ ఉంటారు. ఈ ప్రాంతాన్ని ఎవరూ సమీపించ కూడదు. కాదని దాటివెళ్ళాలనుకుంటే చైతన్యరహితులౌతారు జాగ్రత్త! అన్నాడు.

బోడితల, వేళ్ళాడే చెవులు, పొట్టిగా బలిష్ఠమైనమూపుతో వింతగా ఉన్నాడా వ్యక్తి. అతడే శివుడి వాహనం నంది. ఆ మాటలకు రావణుడు రెచ్చిపోయి– 'ఎవడా శంకరుడు?' అంటూ వెటకారంగా మాట్లాడాడు. పుష్పకంనుంచి దిగి, ఆ నంది చెవులు పట్టుకొని లాగాడు. మూతిని సాగదీసిపారేశాడు. అతడిరూపం చూసి పకపక నవ్వాడు. శంకరుని క్రీడా పర్వతాన్ని తన బాహువులతో ఒక్క ఊపు ఊపేశాడు. దానికి పార్వతీదేవి భయపడిపోయింది. శివునికి కోపం వచ్చింది. తన బొటనవ్రేలుతో ఆ కొండను అదిమాడు. అంతే! ఆ కొండకింద రావణుని చేతులు చిక్కుకుపోయాయి. దాంతో 'కుయ్యో! మొర్రో!' అని ఆర్తనాదం చేశాడు రావణుడు. అప్పుడు నందీశ్వరుడు వచ్చి – **'నువ్వు నా రూపాన్ని చూసి పరిహసించావు. నానా మాటలు అన్నావు. కాబట్టి చూడు. నీ లంకను సర్వనాశనం చేసేది అలాంటి వికృతరూపం ఉన్న వానరాలే'** అని శపించాడు.

ఆ బాధకు తాళలేక మన్నూ మిన్నూ ఏకమయ్యేలా విలపించాడు రావణుడు. అతడి రోదన మహాభయంకరంగా ఉంది. కాబట్టి అప్పటినుండీ రావణుడనే పేరు వచ్చింది.

అప్పుడు ఆ రావణుడు తన మంత్రుల సూచనను అనుసరించి కరుణా సముద్రుడైన శంకరుణ్ణి స్తుతించాడు. శివుడు ప్రసన్నుడై అతణ్ణి రక్షించాడు. రక్షించడమే కాదు. రణరంగంలో అజేయమైన ఒక దివ్య ఖడ్గాన్ని కూడా ప్రసాదిస్తూ– 'దీన్ని నన్ను ఆరాధించినట్లే భక్తిప్రపత్తులతో ఆరాధించు. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా ఈ ఖడ్గం మళ్ళీ నా దగ్గరకు వచ్చేస్తుంది.' అని రావణుడికి దానిని అనుగ్రహించాడు.

అలా ఎలాగో బతికి బట్టకట్టాడేగానీ రావణుడు తన దుష్టబుద్ధినీ, అహంకారాన్నీ ఎంతమాత్రమూ వదులుకోలేదు. పైగా వరగర్వం. దీనితో రావణుడు మరీ రెచ్చిపోయాడు.

## వేదవతి ఇచ్చిన శాపం

ఒకరోజు రావణుడు హిమవత్పర్వత ప్రాంతంలో విహరిస్తున్నాడు. అక్కడ పర్ణశాలలో తపస్సు చేసుకుంటున్న ఒక మునికన్యను చూశాడు. ఆమె పేరు వేదవతి. కుశధ్వజుడి కూతురు. ఈమె తల్లి మాలావతి ఈమె జన్మించినప్పుడు ఆ పురిటింటి నుంచి వేదఘోష వినబడిందట. అందుకే వేదవతి అని పేరు వచ్చింది. రావణుడు ఈమెను చూడగానే మోహించాడు. వేదవతి తండ్రి ఆమెను విష్ణువుకు భార్యను చేయాలని సంకల్పించాడని రావణునికి తెలిసినా అతడు బలాత్కారంగా ఆమెను చెరపట్టి లంకకు తీసుకొనిపోవాలని కొప్పుపై చెయ్యి వేశాడు. దానితో ఆమె ఆగ్రహించింది. తన చేతినే కత్తిగా మార్చుకొని రావణుడు తాకిన తన జటను కత్తిరించి, యోగాగ్నిని సృష్టించింది. అందులో దూకబోతూ– **'రాబోయే యుగంలో నేను విదేహరాజకుమార్తెగా పుట్టి నిన్ను సర్వనాశనం చేస్తాను.' అని శపించి మరీ అగ్నిలో ఆహుతి అయిపోయింది.**

శ్రీరామా! ఆ వేదవతియే జనకుడి నాగలిచాలులో సీతాదేవిగా పుట్టింది. నిన్ను చేపట్టింది. రావణవధకు కారకురాలయ్యింది." అన్నాడు అగస్త్యమహర్షి. మళ్ళీ తనే చెప్తున్నాడు.

"ఈ శాపం రావణుని అహంకారాన్నిగానీ, దౌర్జన్యాన్నిగానీ తగ్గించలేదు. ఎప్పటిలాగే పుష్పకవిమానంలో అహంకారంతో తిరుగుతూ ఒకసారి 'ఉశీరబీజం' అనే ప్రాంతానికి వెళ్ళాడు రావణుడు. అక్కడ మరుత్తుడనే రాజు చేస్తున్న యజ్ఞానికి దేవతలందరూ వచ్చారు. ఆ సమయంలో రావణుడు యజ్ఞవాటికలోకి దూసుకొని వచ్చాడు. దేవతలు భయంతో పక్షులుగా, జంతువులుగా మారు రూపాలు ధరించారు. ఒక క్రూరమృగంలాగా రావణుడు యజ్ఞశాలలో ప్రవేశించి యజ్ఞదీక్షలో ఉన్న రాజును యుద్ధానికి పురిగొల్పాడు. కానీ మరుత్తుడు యజ్ఞానికి భంగం వాటిల్లకూడదని మౌనం వహించాడు. అదిచూసిన రావణుని మంత్రి 'మరుత్తుడు ఓడిపోయి మారాజుకు దాసోహమన్నాడు' అని వికటాట్టహాసం చేశాడు. అయినా మరుత్తుడు యథావిధిగా యజ్ఞం పూర్తిచేసి, దేవతలతో స్వర్గలోకానికి వెళ్ళిపోయాడు.

రావణుడికి యుద్ధప్రీతి రోజురోజుకీ ఎక్కువైపోతోంది. రావణుడికి భయపడి రాజులందరూ అతడిముందు శిరసు వంచేశారు. అలాగే అయోధ్యపై దండెత్తి, అనరణ్యమహారాజునూ యుద్ధంలో ఓడించాడు. **అప్పుడు అనరణ్యుడు – 'రాబోయేకాలంలో మా వంశంలోనే శ్రీరాముడు అనే ఒక వీరుడు పుడతాడు. అతడి చేతిలో నీకు చావు తప్పదు'** అని శపించాడు. దానికి పెద్దగా నవ్వుకుంటూ అక్కడనుంచి వెళ్ళిపోయాడు రావణుడు.

ఒకసారి రావణుడికి నారదమహర్షి కనిపించి, అతని యుద్ధోత్సాహాన్ని మెచ్చుకొని –

'రావణా! నువ్వు యముణ్ణి జయించు. అతణ్ణి జయిస్తే తప్ప నీ జైత్రయాత్ర పూర్తి అయినట్టు కాదు.' అని రావణుణ్ణి బాగా రెచ్చగొట్టాడు.

రావణుడు సై అంటూ యమలోకంపైకి దండెత్తాడు. ఏడురోజులు, రాత్రనకా పగలనకా యముడికి రావణుడికీమధ్య ఘోరయుద్ధం జరిగింది. ఇక యముడు రావణుడిపైకి మృత్యుదేవతను ప్రేరేపిస్తున్నాడు. సరిగ్గా అప్పుడే అక్కడికి బ్రహ్మదేవుడు వచ్చి – 'యమా! నేను రావణుడికి వరాలు ఇచ్చాను. ఇప్పుడు నువ్వు మృత్యదేవతను ప్రయోగిస్తే నా వరాలు వ్యర్థమైపోతాయి. అలా కాకూడదు.' అన్నాడు. అప్పుడు యముడు తనలోకంనుంచి అదృశ్యమైపోయాడు. అప్పుడు రావణుడు – 'యముడు

నా ధాటికి తట్టుకోలేక పారిపోయాడు. నేనే గెలిచాను.' అని లోకాలు దద్దరిల్లేలా గర్జిస్తూ లంక చేరుకున్నాడు.

తరువాత రావణుడు భోగవతిని చేరాడు. అది పాతాళలోక రాజధాని. అక్కడ సర్పరాజు వాసుకిని తన వశం చేసుకొన్నాడు. అక్కడనుంచి నివాతకవచులు అనే క్రూరరాక్షసుల నగరం మణిమయపట్టణం చేరుకున్నాడు. అక్కడ వాళ్ళతో ఒక సంవత్సరం యుద్ధం చేశాడు. బ్రహ్మదేవుడు వచ్చి ఇరుపక్షాలకు సంధి కుదిర్చాడు. ఆ మణిమయ పట్టణంలో రావణుడు ఒక సంవత్సరకాలం ఉండి సకలభోగాలు అనుభవించాడు.

ఆ తరువాత వరుణునిపై దండెత్తాడు. అప్పుడు వరుణుడు నగరంలో లేడు. గంధర్వగానసభకు సత్యలోకానికి వెళ్ళాడు. వరుణుడి కొడుకులు యుద్ధానికి వచ్చారు. రావణుడు పుష్పకవిమానం దిగలేదు. రావణుని మంత్రి మహోదరుడు వరుణుని కుమారులను కకావికలం చేశాడు. దానితో వాళ్ళంతా పరుగులుతీసి కొండగుహలలో దాక్కున్నారు. ఒక వికటాట్టహాసం చేసి రావణుడు అక్కడనుంచి నిష్క్రమించాడు. దారిలో ఎక్కడ ఏ అందగత్తె కనిపించినా వాళ్ళందరినీ చెరపట్టి లంకానగరానికి తీసుకొనిపోయాడు.

లంకానగరానికి పడమటి సింహద్వారందగ్గర నికుంభిలా దేవతామందిరం ఉంది. అక్కడ మహేశ్వరయజ్ఞాన్ని పూర్తి చేసిన ఇంద్రజిత్తు మాయారథం, మాయాధనువూ, బాణాలూ పొందాడు. అలాగే అదృశ్యంగా ఉంటూ యుద్ధం చేసే శక్తీనీ పొందాడు. అక్కడికి వెళ్ళి రావణుడు కొడుకును కౌగిలించుకొని అభినందించాడు.

రావణుడు చెరపట్టి తెచ్చిన దేవతాకన్యలను చూసి చాలా బాధపడ్డాడు విభీషణుడు. రావణుడు లంకలో లేని సమయంలో మధుడు అనే రాక్షసుడు రావణుని చెల్లెలు కుంభీనసను ఎత్తుకొనివెళ్ళి, వివాహం చేసుకొన్నాడు. ఆ విషయాన్ని విచారంగా చెప్పాడు విభీషణుడు. దానికి రావణుడు పట్టరానికోపంతో మధుడిపైకి వెళ్ళాడు. అప్పుడు కుంభీనస వచ్చి అన్న పాదాలమీదపడి వలవల ఏడ్చింది. ఇతణ్ణి చంపి నన్ను అనాథను చేయవద్దని రోదించింది. సరే నంటూ రావణుడు –

'నేనిప్పుడు ఇంద్రుడిపై దండయాత్రకు వెళుతున్నాను. నీ భర్తను కూడా నాతో సహాయంగా పంపు.' అన్నాడు. ఆ రాత్రి చెల్లెలి ఆతిథ్యం స్వీకరించి, మరునాడు మధురాక్షసుడితో కలిసి కైలాసగిరి సమీపాన ఉన్న అలకాపట్టణం పరిసరాలలో తన సేనలతో విడిది చేశాడు.

వెన్నెలరాత్రి. వసంతఋతువు. దూరంగా అప్సరసల నాట్యం. గంధర్వుల గానం. ఆ సమయంలో రంభ అందంగా ముస్తాబై తన ప్రియుడైన నలకూబరుడి దగ్గరకు వెళ్తోంది. అది చూశాడు రావణుడు. ఆమె ఎంత వద్దన్నా వినకుండా ఆమెను బలాత్కరించాడు.

ఆమె బోరున విలపిస్తూ జరిగినదంతా నలకూబరుడికి చెప్పింది. ఆగ్రహించిన నలకూబరుడు – **'ఇకపై రావణుడు ఏ స్త్రీ నైనా ఆమెకు ఇష్టంలేకుండా అనుభవిస్తే వాడి తలలు పగిలిపోతాయి'** అని శపించాడు. ఆ శాపానికి దేవతలు, ఋషులు ఎంతో సంతోషించారు. రావణుడు చెరపట్టి తెచ్చిన కన్యలూ గండం గట్టెక్కిందని సంతోషించారు.

## ఇంద్ర రావణ సంగ్రామం

రావణాసురుడు ఇంద్రుని పట్టణం అమరావతిపై విరుచుకుపడ్డాడు.

అష్టవసువులు ఇంద్రునివైపు పోరాడారుగానీ వాళ్ళు సుమాలిని మాత్రమే చంపగలిగారు.

రావణుణ్ణి, ఇంద్రజిత్తునూ జయించడం దేవతలవల్ల కాలేదు.

ఇంద్రుని కుమారుడైన జయంతుడు మేఘనాదునితో పోరాడుతున్నాడు. ఆపదనుంచి తప్పించడానికని జయంతుణ్ణి అతడి మాతామహుడు పులోముడు దాచి ఉంచాడు. అది తెలీని ఇంద్రుడు జయంతుడు మరణించాడనుకొని మరింత జావగారిపోయాడు. మేఘనాదుడు మరింత రెచ్చిపోయాడు.

ఇంద్రుని రథసారథి మాతలి ఇంద్రుణ్ణి రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. చివరికి ఇంద్రుడు మేఘనాదునికి చిక్కాడు. మేఘనాదుడు ఇంద్రుణ్ణి బంధించి ఐరావతంతో సహా తీసుకుపోయి లంకలో రావణుని ముందు నిలిపాడు. అప్పుడు చూడాలి రావణుడి సంతోషం.

చివరికి సాక్షాత్తూ బ్రహ్మదేవుడే వచ్చి – 'రావణా! మేఘనాదునికి ఇంద్రజిత్తు అనే పౌరుషనామం సార్థకమయ్యింది. సకలదేవతలూ నీకు లోబడినట్లే. కాబట్టి ఇంద్రుణ్ణి విడిచిపెట్టు.' అని కోరాడు.

అప్పుడు ఇంద్రజిత్తు తనకు అమరత్వం ప్రసాదించమని బ్రహ్మను వేడుకున్నాడు. అది అసాధ్యమని బ్రహ్మదేవుడు చెప్పడంతో మళ్ళీ ఇంద్రజిత్తు –

'పితామహా! నేను మంత్రతంత్రాలతో యజ్ఞం చేసి దివ్యరథాన్ని, అస్త్రశస్త్రాలను, అమ్ములపొదులను పొందుతాను. అప్పుడు నేను ఎవరిచేతుల్లోనూ చావకుండా ఉండేటట్టూ, విజయం వరించేట్టూ వరం ఇవ్వు.' అన్నాడు. దానికి బ్రహ్మదేవుడు– సరే నన్నాడు (బ్రహ్మదేవుని వరం ప్రకారం హోమం పూర్తి అయితేనే ఇంద్రజిత్తు యుద్ధంలో గెలుస్తాడు, భంగం కలిగితే గెలవలేడు).

జరిగిన పరాభవానికి సిగ్గుపడి, తరువాత వైష్ణవయాగం చేసి మళ్ళీ స్వర్గ పాలకుడయ్యాడు ఇంద్రుడు."

అంతా వివరంగా చెప్తున్నాడు అగస్త్యమహర్షి. సుగ్రీవుడూ, విభీషణుడూ ఇంకా ప్రముఖ వానరరాక్షసవీరులంతా వింటున్నారు. అప్పుడు అరవిందనేత్రుడైన శ్రీరాముడు మళ్ళీ అగస్త్యమహర్షిని రావణాసురుని భంగపాట్లను గురించి చెప్పమని అడిగాడు. మహర్షి ఇలా చెప్పడం మొదలు పెట్టాడు.

## రావణుని భంగపాటు

"ఒకసారి రావణాసురుడు కార్తవీర్యార్జునుడు పాలించే మాహిష్మతీపురానికి వెళ్ళాడు. అప్పుడు కార్తవీర్యుడు తన భార్యలతో కలిసి జలక్రీడ లాడటానికి నర్మదా నదికి వెళ్ళాడు. రావణుడు అహంకారంతో – 'నేను మీ రాజుతో యుద్ధం చేయటానికి వస్తే పిరికివానిలా పారిపోయాడా?' అని మంత్రుల దగ్గర ప్రేలి – 'సరే! ఎక్కడికి పోతాడో నేనూ చూస్తాను.' అంటూ తానూ నర్మదానదీతీరానికి విహారంకోసం వెళ్ళాడు.

ఆ సమీపంలోనే కార్తవీర్యార్జునుడు రాణులతో జలక్రీడలాడుతున్నాడని రావణునికి తెలిసింది. తన మంత్రుల్ని పంపి కార్తవీర్యార్జునుణ్ణి యుద్ధానికి పిలవ మన్నాడు. పిలవడానికి వచ్చిన రావణుడి మంత్రులతో కార్తవీర్యార్జునుని మంత్రులు–

'మా రాజు రాణులతో కలిసి జలక్రీడలలో ఉన్నాడు. యుద్ధానికి ఇది సమయంకాదు. కావాలంటే మాతో యుద్ధం చెయ్యండి.' అన్నారు. అప్పుడా రావణుడి మంత్రులు రెచ్చిపోయి కార్తవీర్యార్జునుడి మంత్రులను చంపివేశారు.

ఆ తరువాత రావణుడు నర్మదానదిలో స్నానం చేసి అక్కడే శివపూజకు ఉపక్రమించాడు. ఒక ఇసుకతిన్నెపై బంగారు శివలింగం ప్రతిష్ఠించి భక్తిప్రపత్తులతో శివుణ్ణి అర్చిస్తున్నాడు.

అక్కడే మరోవైపు జలక్రీడలాడుతున్న కార్తవీర్యుడు తన బాహువులతో నర్మద ప్రవాహాన్ని అడ్డుకొన్నాడు. అందువల్ల అక్కడ నర్మదానది ఒక్కసారిగా ఉప్పొంగి ఇక్కడి రావణుని పూజకు భంగం కలిగించింది.

రావణునికి కోపం కట్టలు తెంచుకుంది. కార్తవీర్యార్జునుణ్ణి శిక్షించాలని ఒక పెద్ద గదను పుచ్చుకొని బయలుదేరాడు. అది చూసిన కార్తవీర్యార్జునుడూ తన రాణుల్ని భయపడవద్దని చెప్పి, తానూ ఒక పెద్ద గదను తీసుకొని రావణునితో తలపడ్డాడు.

వాళ్ళిద్దరి మధ్య యుద్ధం భీకరంగా సాగింది. కార్తవీర్యార్జునుడు ముందు రావణుడి మంత్రుల పొగరు అణిచాడు. తరువాత రావణుణ్ణి బంధించి మాహిష్మతీ పురానికి తీసుకొని వెళ్ళాడు. నగరమంతా తిప్పాడు. ప్రజలు పండగ చేసుకున్నారు. తమ రాజుగారి పరాక్రమాన్ని కొనియాడారు.

ఈ వార్త విన్న పులస్త్య బ్రహ్మదేవుడు తన మనవడైన రావణుడిపై జాలితో అతణ్ణి రక్షించాలని మాహిష్మతీపురం చేరుకున్నాడు. కార్తవీర్యార్జునుడు ఆయనకు ఘనస్వాగతం పలికాడు.

పులస్త్యబ్రహ్మ కోరిక తీర్చడంకోసం కార్తవీర్యార్జునుడు రావణుణ్ణి వెంటనే బంధవిముక్తుణ్ణి చేసి విలువైన ఆభరణాలు, మంచి మంచి వస్త్రాలు, పుష్పమాలలు బహూకరించి, అతనితో స్నేహం చేశాడు.

రావణుడు సిగ్గుపడ్డాడు. ఇకనుండైనా బుద్ధిగా ఉండమని మనవనికి హితవు పలికి పులస్త్యబ్రహ్మ తపస్సుకు వెళ్ళిపోయాడు. కాబట్టి శ్రీరామా!

**ఏవం బలిభ్యో బలినః సంతి రాఘవనందన,**
**నావజ్ఞా హి పరే కార్యా య ఇచ్ఛేత్ ప్రియమాత్మనః (7-33-22)**

***'నన్ను మించిన బలవంతుడు లేడన్న అహంకారం పనికిరాదు. బలవంతుల్ని మించిన బలవంతులు ఉంటారు. కాబట్టి తన శ్రేయస్సు కోరుకొనేవాడు ఇతరులతో కలహించకూడదు. ఈ విషయం రావణుడు తెలుసుకోలేకపోయాడు.'*** అంటూ అగస్త్యుడు మళ్ళీ ఈసారి రావణునికి వాలిచేతిలో జరిగిన పరాభవం గురించి చెప్పడం మొదలుపెట్టాడు.

రావణుడు మళ్ళీ అహంకారంతో తన యుద్ధకండూతి తీర్చుకోవటానికి బయలు దేరాడు. వాలితో యుద్ధం చేయాలని హుటాహుటిన కిష్కింధకు వెళ్ళాడు. తాను వచ్చినట్లు వార్త పంపించాడు. అప్పుడు వాలి మంత్రులు తారుడూ, సుషేణుడూ (తార తండ్రి), యువరాజు సుగ్రీవుడూ ఉన్నారు. వాళ్ళు ఇలా అన్నారు–

రావణా! నీతో యుద్ధం చేయటానికి మా వాలిప్రభువే సమర్థుడు. మంచి వాణ్ణే ఎంచుకొన్నావుగానీ వాలి ప్రస్తుతం ఇక్కడ లేడు మరి! సూర్యోదయం కాక ముందే నాలుగు సముద్రాలలోనూ స్నానం చేసిరావడం వాలికి అలవాటు. అందుకే వెళ్ళాడు. వాలి వచ్చేదాకా ఉండు. లేదంటావా? వెంటనే దక్షిణ సముద్రతీరానికి వెళ్ళు! అక్కడ వాలి నీకు దొరుకుతాడు.' అని చెప్పారు.

రావణుడు వాళ్ళను ఆట పట్టించి, పుష్పకం ఎక్కి దక్షిణసముద్రతీరం చేరాడు.

వాలి మేరుపర్వత కాంతితో వెలిగిపోతూ సంధ్యోపాసనలో ఉన్నాడు. అది చూసి రావణుడు వాలిని వెనుకనుంచి ఒడిసిపట్టాలనుకున్నాడు. రావణునిరాక వాలికి తెలుసు. సింహం కుందేలునూ గరుత్మంతుడు పామునూ చూస్తే ఎలా ఉంటుందో అంత ఉల్లాసంగా ఉంది వాలికి. రానీ అనుకున్నాడు. అలా దగ్గరకు రానిచ్చి ఒక్క ఉదుటున వాలి తన ఎడంచేతితో రావణుణ్ణి ముందుకు లాగి తనచంకలో ఇరికించేశాడు. చంకలో ఉన్న రావణుణ్ణి అలాగే ఉంచి ఆ సముద్రంలో మునిచి లేపాడు. రివ్వున ఎగిరి తక్కిన మూడు సముద్రాలలోనూ ముంచి లేపి, అలాగే కిష్కింధకు తెచ్చాడు.

జారిపోతున్న బట్టల్ని కూడా సరిచేసుకోలేని పరిస్థితి రావణునిది. సిగ్గుతో చచ్చిపోయాడు.

'వాలీ! నువ్వు ఏనుగువైతే నేను జింక పిల్లను. నన్ను కనికరించు.' అంటూ ప్రాధేయపడ్డాడు రావణుడు. వాలి పెద్ద మనసుతో రావణుణ్ణి సుగ్రీవునితో సమానంగా ఆదరించాడు.

ఒక నెలరోజులపాటు కిష్కింధలోనే ఉంచుకొని సకల భోగాలతో ఆతిథ్యం కూడా ఇచ్చాడు." అని చెప్పాడు అగస్త్యమహర్షి.

అప్పుడు శ్రీరామచంద్రుడు – **'మహానుభావా! హనుమంతుడు సాహసి. మహా మేధావి. వాక్చాతుర్యం సమయస్ఫూర్తి, కార్యదక్షత, విచక్షణ అన్నీ కలవాడు. నన్ను రక్షించింది అతడే. కానీ నాదో సందేహం? హనుమంతుడు ఉండగా అన్నకు భయపడి సుగ్రీవుడు ఎందుకు పరుగులు తీయవలసివచ్చింది? హనుమంతుడు తలచుకొంటే వాలిని చంపలేడా? సుగ్రీవుణ్ణి కిష్కింధకు రాజును చెయ్యలేడా?'** అని అడిగాడు.

## హనుమంతుని శక్తియుక్తులు

అగస్త్యమహర్షి హనుమంతుని బాల్యక్రీడల గురించి చెప్పడం ప్రారంభించాడు.

"బాలహనుమంతుడు సూర్యుణ్ణి పండుగా భావించి, దాన్ని మింగేయడానికి వెళ్ళాడు. అప్పుడు ఇంద్రుడు హనుమంతుణ్ణి వజ్రాయుధంతో కొట్టాడు. దానికి హనుమంతుని తండ్రి వాయుదేవుడికి కోపం వచ్చింది. సకలప్రాణులతో అంతర్గతంగా ఉన్న తన చలనాన్ని ఉపసంహరించుకొని తన కుమారుణ్ణి తీసుకొని ఒక గుహలోనికి ప్రవేశించాడు. దాంతో ప్రాణుల శ్వాస ఆగిపోయింది. అన్ని ప్రాణులూ కొయ్యబారిపోయాయి. ముల్లోకాల్లోనూ వేదాధ్యయనాలూ, యజ్ఞ కార్యాలూ ఆగిపోయాయి. ధర్మకార్యాలు నిలిచిపోయాయి. అప్పుడు దేవతలందరూ బ్రహ్మదేవునిదగ్గర మొరపెట్టుకున్నారు. బ్రహ్మదేవుడు సకలదేవతలతో కలిసి వాయుదేవుడి దగ్గరకు వచ్చాడు. వాయుదేవుణ్ణి శాంతింపజేయడం కోసం హనుమంతునికి ఎన్నో వరాలు ఇచ్చారు. **ఎవరైనా గుర్తుచేస్తేతప్ప తనబలమూ శక్తిసామర్థ్యాలూ హనుమంతునికి తెలియవు. ఇది హనుమంతుడి అల్లరిని భరించలేక మహర్షులు ఇచ్చిన శాపం.** బహుశా అందుకే వాలిని చంపలేకపోయి ఉండవచ్చు. అంతేకాదు శ్రీరామా! వాలిసుగ్రీవుల తండ్రి ఋక్షరజసుడు. వాలిని కిష్కింధా

రాజ్యానికి పట్టాభిషిక్తుణ్ణి చేశాడు. సుగ్రీవునికి హనుమంతుడు ఆప్తమిత్రుడు కాబట్టి సుగ్రీవుడు రాజ్యబహిష్కృతుడైనప్పుడు కూడా అతనితోనే ఉన్నాడు.” అంటూ హనుమంతుని చేష్టల తాలూకూ కథలన్నింటినీ వివరంగా చెప్పాడు మహర్షి.

అందరి చరిత్రలూ విని సంతుష్టిచెందిన శ్రీరాముడు మహర్షులందరినీ సత్కరించి, తానొక మహాయజ్ఞం తలపెట్టాననీ ఆ యజ్ఞానికి అందరూ రావాలని మహర్షుల్ని ప్రార్థించి, వాళ్ళకు వీడ్కోలు పలికాడు.

## శ్రీరాముడి సత్కారాలు

శ్రీరామచంద్రుడు తనకు యుద్ధంలో సహాయపడిన వారందరికీ కూడా సత్కారాలు చేసి పంపాడు. తన పట్టాభిషేకానికి వచ్చిన ముఖ్య బంధువులందరినీ సత్కరించాడు.

జనకమహారాజుకు రత్నాభరణాలు సమర్పించాడు. వాటిని ఆ మహారాజు తన కూతురికే బహుమానంగా ఇచ్చేశాడు. భరతుణ్ణి, లక్ష్మణుణ్ణి జనకుడి వెంట తోడుపంపి సాగనంపాడు శ్రీరాముడు. తనకు ఆప్తుడైన కాశీరాజునూ అలాగే ఆత్మీయులైన వానరప్రముఖులను సన్మానించాడు.

హనుమంతునికి తగిన కానుక ఏమివ్వాలో అర్థం కాలేదు శ్రీరాముడికి. ప్రేమగా హనుమంతుణ్ణే అడిగాడు. అప్పుడు హనుమంతుడు – **‘స్వామీ! నీపట్ల నా ప్రేమ, భక్తి, ఆరాధన స్థిరంగా ఉండేట్లు అనుగ్రహించు.’** అని ప్రార్థించాడు. శ్రీరామచంద్రుడు హనుమంతుడు తనకు చేసిన ఉపకారాల్ని స్మరిస్తూ –

**మదంగే జీర్ణతాం యాతు యత్త్వయోపకృతం కపే,**
**నరః ప్రత్యుపకారాణామ్ ఆపత్స్వాయాతి పాత్రతామ్. (7–40–23)**

***‘వానరోత్తమా! నీ ఉపకారం నాలోనే లీనమై పోనీ! ప్రత్యుపకారం చేయవలసిన సందర్భం రావాలంటే ఉపకారం చేసినవారికి ఆపద రావాలి కదా! కాబట్టి నేను నీకు ప్రత్యుపకారం చేయాలనుకోను.’*** అన్నాడు.

ఆ తరువాత శ్రీరాముడు సుగ్రీవుణ్ణి కౌగిలించుకొని అతనికీ వీడ్కోలు పలికాడు. పుష్పకాన్ని కుబేరుని దగ్గరకే పంపివేశాడు. కానీ ఆ పుష్పకం తిరిగి

వచ్చి – 'కుబేరుడు నన్ను నీదగ్గరే ఉండమన్నాడు.' అని చెప్పింది. దానికి శ్రీరాముడు – 'పుష్పకమా! నువ్వు కుబేరుడివద్దే ఉండు. నేను తలుచుకొన్నప్పుడు వద్దువుగాని' అని పంపివేశాడు.

## సీతా పరిత్యాగం

కాలం గడుస్తోంది. శ్రీరామచంద్రప్రభువు ప్రజారంజకంగా రాజ్యపాలన గావిస్తున్నాడు. సీతాదేవి శ్రీరామచంద్రునికి సకల సపర్యలూ చేస్తోంది.

ఒకరోజు సర్వాంగసుందరంగా అలంకరించుకొని తన వద్దకు వచ్చిన సీతాదేవితో శ్రీరాముడు 'వైదేహీ! నీలో గర్భవతి చిహ్నాలు కనిపిస్తున్నాయి. త్వరలో మనకు సంతానం కలుగబోతోంది. సుందరీ! నీ కోరిక ఏమిటో చెప్పు తీరుస్తాను.' అని అడిగాడు. దానికి సీతాదేవి –

'రఘువీరా! గంగాతీరంలో పవిత్రమైన తపోవనాలు ఉన్నాయి. వాటిని దర్శించాలని నాకు చాలా కుతూహలంగా ఉంది. ఆ తపోవనంలో నిత్యం తపస్సులో ఉండే దివ్యతేజోమూర్తులైన ఋషీశ్వరుల సేవలో ఒక్కరోజు తరించాలని ఉంది. ఇదే నా కోరిక.' అంది. 'అలాగే! తప్పకుండా.' అని మాట ఇచ్చాడు శ్రీరాముడు.

* * *

ఒక గూఢచారి శ్రీరాముని దర్శనార్థం వచ్చాడు. అతడే భద్రుడు.

తన పాలనగురించి ప్రజలు ఏమనుకుంటున్నారో తెలుసుకురమ్మని శ్రీరామచంద్రుడు కొంతమంది గూఢచారుల్ని నియమించాడు. వారిలో భద్రుడు ఒకడు. భద్రుడు వచ్చి అంజలి ఘటించి –

'శ్రీరామా! ప్రజలంతా మీ చరితల్ని కథలు కథలుగా చెప్పుకొని ఆనందిస్తున్నారు.' అన్నాడు. ఆ మాటలు విన్న శ్రీరాముడు – 'భద్రా! నిజం చెప్పు. ఏదీ దాచవద్దు. ప్రజలు నా గురించి చెడుగా అనుకున్నా సరే నిస్సంకోచంగా ఉన్నది ఉన్నట్లు చెప్పు. మంచిని ఆచరిస్తాను. చెడును త్యజిస్తాను. నువ్వు నాకు విశ్వాసపాత్రునివి సుమా!' అన్నాడు.

అప్పుడు భద్రుడు చేతులు జోడిస్తూ వినయంగా – 'మహారాజా! దయతో ఆలకించండి. కూడళ్ళలో రాజవీథుల్లో నలుగురూ కలిసేచోట ప్రజలు తమరి

గుణదోషాలగురించే చర్చించుకుంటున్నారు. అందులో ఒక మాట. యుద్ధంలో శ్రీరాముడు రావణుణ్ణి సంహరించిన తరువాత రోషాన్ని విడిచిపెట్టేశాడు. సీతాదేవిని మళ్ళీ స్వీకరించి, భవనానికి తీసుకువచ్చాడు. ఎంతోకాలం పరులపంచలో ఉన్న తన భార్యను శ్రీరాముడు ఏవగించుకోనేలేదు. మనం కూడా ఇకనుంచి మన భార్యలపట్ల ఇలాంటి సహనాన్నే చూపించవలసి వస్తుంది. **'యథా రాజా తథా ప్రజా'.** అని నోటికి వచ్చినట్లుగా మాట్లాడుకుంటున్నారు.' అన్నాడు.

అది విన్న శ్రీరాముడు హతాశుడయ్యాడు. ఎంతగానో బాధపడ్డాడు. వెంటనే తన స్నేహితుల్ని అడిగాడు. వాళ్ళంతా ముక్తకంఠంతో భద్రుడు చెప్పింది వాస్తవమే నన్నారు. వెంటనే శ్రీరాముడు తన సోదరులను సమావేశపరిచి – **'నా దృష్టిలో లోకాపవాదాన్ని మించిన దుఃఖం లేనే లేదు. మనం ప్రజాభిప్రాయాన్ని గౌరవించి తీరాలి. కాబట్టి, లక్ష్మణా! రేపు వేకువజామునే సుమంత్రుడు రథం సిద్ధం చేస్తాడు.** సీతాదేవిని తీసుకొని నువ్వు బయలుదేరు. గంగానదికి ఆవలితీరంలో తమసానది ఒడ్డున వాల్మీకి మహర్షి ఆశ్రమం ఉంది. ఆ ఆశ్రమ ప్రాంతంలోని నిర్జనప్రదేశంలో సీతాదేవిని విడిచిపెట్టి, నువ్వు తిరిగి వచ్చెయ్యి. ఇది నా మాట. మారు చెప్పకు.' అని ఆదేశించాడు. **వ్యక్తిధర్మం కంటే లోకధర్మం, రాజుధర్మం గొప్పది. సీతను విడిచిపెట్టకపోతే ప్రజలు అపార్థాలకు లోనై, మొత్తం వివాహ వ్యవస్థ చెడిపోయే ప్రమాదం ఉంది.** అందుకే శ్రీరాముడు ఈ కఠినమైన నిర్ణయం తీసుకున్నాడు.

అప్పుడు సీతాదేవి గర్భవతి. లక్ష్మణుడు అన్నగారి ఆజ్ఞను పాటించాడు. రథంలో తీసుకొని వెళ్ళి, నావలో గంగానదిని దాటించి, అరణ్యంలో విడిచిపెట్టాడు.

వాల్మీకి మహర్షి జరిగినదంతా తెలుసుకొని, సీతాదేవికి తన ఆశ్రమంలో ఆశ్రయం కల్పించి కంటికి రెప్పలా కాపాడాడు.

లక్ష్మణుడు తిరిగి వస్తూ రథసారథి సుమంత్రునిదగ్గర బాధపడ్డాడు. అతడి దుఃఖాన్ని చూసిన సుమంత్రుడు ఓదార్పుగా ఒక పూర్వ వృత్తాంతం చెప్పడం మొదలుపెట్టాడు.

'ఒకసారి వసిష్ఠ మహర్షి చాతుర్మాస్యదీక్షలో ఉన్నప్పుడు అతనిదగ్గరకు దుర్వాస మహర్షి వచ్చాడు. ఆ సంగతి తెలుసుకొన్న దశరథమహారాజు ఆ ఇద్దరు మహర్షుల్నీ

దర్శించుకోవడంకోసం వెళ్ళాడు. భక్తి శ్రద్ధలతో మహారాజు వాళ్ళని అర్చించి, తన పుత్రుల భవిష్యత్తుగురించి చెప్పమని దుర్వాసమహర్షిని ప్రార్థించాడు.

అప్పుడు దుర్వాస మహర్షి దశరథునితో – శ్రీరామునికి సీతావియోగం ఉంది. తప్పదు. **ఇది భృగుమహర్షి శాపం. అన్నాడు.**

దేవాసుర యుద్ధంలో ఓడిపోయిన అసురులు భృగుపత్నిని శరణువేడారు. ఆమె వాళ్ళని కాపాడింది. వాళ్ళను కాపాడినందుకు శ్రీమన్నారాయణునికి **భృగుపత్నిపై కోపం వచ్చి** తన చక్రాయుధంతో ఆమెను ఖండించాడు. ఆ పని భృగుమహర్షికి ఆగ్రహం తెప్పించింది. ఆ ఆగ్రహంలో భృగువు – 'ఒక స్త్రీ అనిగానీ మునిపత్ని అనిగానీ ఆలోచించకుండా నా భార్యను చంపిన నువ్వు మానవునిగా పుట్టి, భార్యావియోగం అనుభవిస్తావు' అని శ్రీమహావిష్ణువును శపించాడు. కానీ తరువాత పరమపురుషుడు, లోకరక్షకుడూ అయిన శ్రీమహావిష్ణువునా నేను శపించింది? అని పశ్చాత్తాపం చెందాడు. అప్పుడు శ్రీమహా విష్ణువు – 'మహర్షీ! రామావతారంలో లోకకంటకుడైన రావణుణ్ణి వధించటానికి నీ శాపం ఉపయోగపడుతుందిలే!' అని భృగుమహర్షిని అనునయించాడు.

లక్ష్మణా! ఇప్పుడిలా జరగడానికి ఇదీ కారణం. అని చెప్పాడు సుమంత్రుడు.

* * *

అయోధ్య చేరిన లక్ష్మణుడు దీనాతిదీనంగా ఉన్న శ్రీరామచంద్రుణ్ణి చూసి–

***'ప్రభూ! సంపదలు శాశ్వతం కాదు. ఔన్నత్యాలు మాత్రం ఉంటాయా? అవీ నశిస్తాయి. కలవడాలూ విడిపోవడాలూ చావుపుట్టుకలూ ఇవన్నీ అనివార్యాలు. అందువల్ల వేటిపైనా ఆసక్తి పెంచుకోకూడదు. నువ్వు ఆత్మనిగ్రహం కలవాడివి. బాధను విడిచిపెట్టు.'*** అని ఓదార్చాడు.

కానీ కొన్ని రోజులుపాటు కార్యనిర్వహణ కూడా శ్రీరామునివల్ల కాలేదు. ఎప్పుడూ సీతాదేవినే తలచుకుంటూ తల్లడిల్లిపోతున్నాడు. అంతకష్టంలోనూ తన సోదరులను పిలిచి – 'సోదరులారా! రాజ్యకార్యనిర్వహణ ఉపేక్షించకూడదు. దానివల్ల అనర్థాలు కలుగుతాయి. ఎప్పటికప్పుడు రాజ్యకార్యాలు నా దృష్టికి తీసుకురండి.' అని వాళ్ళను అభ్యర్థించాడు.

## లవణాసుర సంహారం

శ్రీరామ దర్శనార్థమై యమునాతీరం నుండి కొందరు బ్రాహ్మణులు వచ్చారు. వారిలో చ్యవనుడు – 'శ్రీరామా! మధువు అనే రాక్షసుడున్నాడే! వాడి కొడుకు లవణాసురుడు. మమ్మల్ని నానాబాధలు పెడుతున్నాడు. మీరే మమ్మల్ని కాపాడాలి.' అన్నాడు.

అప్పుడు శ్రీరామచంద్రుడు ఎవరిని పంపుదామా! అని ఆలోచిస్తుంటే శత్రుఘ్నుడు అన్నగారిని ఇలా వేడుకున్నాడు– 'అన్నా! లక్ష్మణుడు అరణ్యవాసం తోనూ, భరతుడు తపస్సువల్లా అలసిపోయారు. కాబట్టి నన్ను ఆజ్ఞాపించు. ఆ లవణుణ్ణి సంహరిస్తాను.'

అప్పుడు శ్రీరాముడు ఒక దివ్యమైన అస్త్రాన్ని శత్రుఘ్నునికి ఇచ్చి ఆశీర్వదించాడు. మధుకైటభులను వధించడానికి ముందు శ్రీమన్నారాయణుడు ధరించిన అస్త్రమే అది. దాన్ని ఇస్తూ లవణునితో ఎలా యుద్ధం చేయాలో చెప్పాడు. ఇంకా జాగ్రత్తలూ మెళకువలూ చెప్పాడు.

'లవణుని తండ్రి మధుడు. ఆ రాక్షసుడి చేతిలో పరమశివుడి అనుగ్రహంవల్ల లభించిన శూలం ఉంటుంది. అది అతని చేతిలో ఉన్నంతసేపూ ఎవరూ అతణ్ణి జయించలేరు. కాబట్టి శూలం చేతిలో లేకుండా చూసి వాణ్ణి వధించాలి సుమా! యుద్ధానికి వస్తున్నట్లు కూడా తెలియకూడదు వాడికి. జాగ్రత్త!!' అన్నాడు శ్రీరామచంద్రుడు. శత్రుఘ్నుడు అలాగే అదను చూసి లవణుణ్ణి సంహరించాడు (ఈ లవణాసురుడి తల్లి రావణుని చెల్లెలు కుంభీనస కాబట్టి వీడు రావణునికి మేనల్లుడన్నమాట).

ఈ విధంగా లవణుణ్ణి వధించి, మధుపురం స్వాధీనం చేసుకొన్నాడు శత్రుఘ్నుడు. అక్కడ రాజ్యపాలన కూడా సాగించాడు. అదే తరువాత కాలంలో శూరసేనం అని ప్రసిద్ధి చెందింది.

శత్రుఘ్నుడు యుద్ధానికి వెళ్తూ ముందుగా వాల్మీకిమహర్షి ఆశ్రమం సందర్శించాడు. వాల్మీకిమహర్షి ఆతిథ్యం ఇచ్చాడు. ఈ ఆశ్రమం కూడా మీ రాజ్యంలోనిదే నన్నాడు. పూర్వం సౌదాసమహారాజు అనే ఇక్ష్వాకువంశరాజు అక్కడ యజ్ఞం చేశాడనీ, ఆ రాజును మోసగించిన పులిరూపంలో ఉన్న రాక్షసుల కథనూ శత్రుఘ్నునికి చెప్పాడు.

## కుశలవులు

శత్రుఘ్నుడు వాల్మీకి మహర్షి ఆశ్రమంలో ఉన్నప్పుడే సీతాదేవికి కవలపిల్లలు కలిగారు. వాల్మీకి మహర్షి వారికి కుశలవులు అని నామకరణం చేశాడు.

చాలాకాలం తర్వాత శత్రుఘ్నుడు అయోధ్యకు వెళ్తూ మళ్ళీ వాల్మీకి మహర్షి ఆశ్రమంలో ఒక రాత్రి గడిపాడు. అప్పుడు అక్కడ వీనులవిందుగా కుశలవులు చేస్తున్న శ్రీరామాయణగానం విన్పించింది.

శ్రీరాముని పాలన సుభిక్షంగా సాగిపోతోంది. ఒకరోజు ఒక విప్రుడు కోటవాకిలి దగ్గరకు వచ్చాడు. అతని చేతిలో ఐదేళ్ళ బాలుడి శవం ఉంది. ఆ బాలుడు ఎవరో కాదు. అతడి కొడుకే. దిక్కులు పిక్కటిల్లేలా ఏడుస్తున్నాడు విప్రుడు. శ్రీరామరాజ్యంలో ఇంతటి దుర్మరణమా? ఎందుకు జరిగింది? దీనికి కారణం ఏమిటి? శ్రీరామచంద్రుడు మునుల్ని ప్రశ్నించాడు.

'యుగధర్మం భగ్నమయ్యింది. చతుర్థవర్ణుడెవరో తపస్సు చేస్తున్నాడు. అందుకే ఇది జరిగింది.' అని వాళ్ళు చెప్పారు.

శ్రీరామచంద్రుడు పుష్పకం అధిరోహించాడు. భూమండలం మొత్తాన్నీ గాలించాడు. దక్షిణదిక్కున 'శైవలం' అనే కొండ ఉంది. దాని పక్కన ఒక తటాకం. దాని పక్కన ఎవరో తలకిందులుగా నిలబడి తపస్సు చేస్తున్న దృశ్యం శ్రీరాముని కంట పడింది. అతడు శంబూకుడు. చతుర్థవర్ణుడు. శరీరంతోనే దివ్యత్వాన్ని పొందాలనీ, దేవలోకాన్ని జయించాలనీ తపస్సు చేస్తున్నాడు. అదే విషయం శ్రీరాముడికి చెప్పాడు.

నాటి యుగధర్మానికి విరుద్ధంగా ప్రవర్తించినందుకు శ్రీరామచంద్రుడు అతణ్ణి సంహరించాడు.

యుగధర్మాన్ని నిలిపినందుకు దేవతలు శ్రీరాముణ్ణి ప్రశంసిస్తూ ఏదైనా వరం కోరుకోమన్నారు. అప్పుడు రఘుపతి ఆ విప్రబాలుణ్ణి బతికించవలసిందిగా కోరాడు. ఇప్పటికే ఆ బాలుడు జీవించాడు అన్నారు దేవతలు. అని వాళ్ళంతా అగస్త్యమహర్షి దగ్గరకు వెళ్తున్నారు.

పన్నెండు సంవత్సరాలుగా నీళ్ళలోనే ఉంటూ అగస్త్యుడు తపస్సు చేశాడు. అది నేటితో ముగిసింది. అందుకే, ఆయనను దర్శించటానికి వెళ్తున్నారు వీళ్ళంతా.

విషయం తెలిసిన శ్రీరామచంద్రుడు కూడా వాళ్ళతో వెళ్ళాడు.

అగస్త్యమహాముని శ్రీరాముణ్ణి ఎంతో ఆదరించాడు. ప్రశంసించాడు. ఒక దివ్యమైన ఆభరణం కూడా బహూకరించాడు.

ఆ ఆభరణం తీసుకోవాలా? వద్దా? అని శ్రీరాముడు తటపటాయించాడు.

అప్పుడు అగస్త్యుడు శ్వేతుడనే రాజర్షి కథను ఇలా చెప్పాడు శ్రీరామునికి.

'శ్వేతుడు పూర్వజన్మలో ఏ దానమూ చేయలేదు. అందువల్ల ఈ జన్మలో శవాలను తింటూ బతకవలసిన కర్మ పట్టింది. ఆ దుర్గతిని నేను పోగొట్టాను. అందువల్ల ఆయన నాకు ఒక దివ్యాభరణం బహూకరించాడు. అదే ఇది. ఇది క్షత్రియధనమే. కాబట్టి స్వీకరించవచ్చు.' అని చెప్పాడు అగస్త్యుడు.

ఆ తరువాత అగస్త్యమహర్షి ద్వారా దండకారణ్యం, జనస్థానం గురించిన పుట్టుపూర్వోత్తరాలు తెలుసుకొని శ్రీరాముడు అయోధ్యానగరానికి తిరిగివచ్చాడు.

## అశ్వమేధం

కొన్నాళ్ళు గడిచిపోయాయి. శ్రీరామునికి రాజసూయయాగం చేయాలనే ఆలోచన కలిగింది. లక్ష్మణ, భరతులు అశ్వమేధయాగమైతే బావుంటుందన్నారు. ఎందుకంటే వృత్రాసురుణ్ణి చంపడంవల్ల కలిగిన పాపాన్ని ఇంద్రుడు అశ్వమేధం చేసే పోగొట్టుకున్నాడు. అదే విషయాన్ని శ్రీరామునితో ప్రస్తావించారు సోదరులు. అప్పుడు శ్రీరాముడు తమ్ముళ్ళకి అశ్వమేధయాగమహిమను తెలిపే ఇల, బుధుల కథను చెప్పాడు. తరువాత శ్రీరామచంద్రుడు అశ్వమేధయాగం సంకల్పించాడు.

ఆ యజ్ఞానికి వాల్మీకిమహర్షి కుశలవులను వెంటతీసుకొని వచ్చాడు. శ్రీరామాయణాన్ని అన్ని ప్రదేశాలలో గానం చెయ్యమని కుశలవులను ఆదేశించాడు. మహర్షి ఆదేశం మేరకు కుశలవులు అయోధ్యలో శ్రీరామాయణగానం చేస్తున్నారు. అది విన్న శ్రీరామచంద్రుడు వారిని తన కొలువుకి పిలిపించుకొని తానూ వాళ్ళ గానాన్ని విని, పరవశించిపోయాడు. కుశలవుల కంఠస్వరాన్నిబట్టి వాళ్ళు

సీతాదేవికుమారులై ఉంటా రనిపించింది శ్రీరామునికి. వెంటనే ఒక దూతను వాల్మీకిమహర్షి వద్దకు పంపి, వాల్మీకినీ, సీతాదేవినీ సభకు రప్పించాడు.

## సీతాశపథం

నిండుసభలో కొలువుతీరి ఉన్నాడు రాఘవుడు. వాల్మీకిమహర్షి సీతాదేవితో కలిసి సభలోనికి ప్రవేశించి – 'శ్రీరామచంద్రా! సీతాదేవి పరమసాధ్వి. కుశలవులు నీ పుత్రులే.' అని చెప్పాడు.

అప్పుడు శ్రీరాముడు సభాసదులంతా వింటూ ఉండగా ఇలా అన్నాడు.

**'ఆనాడు అగ్నిప్రవేశం చేసి, తన పాతివ్రత్యాన్ని నిరూపించుకున్న సీత ఏ పాపమూ ఎరుగదని నాకు తెలుసు. అయినా లోకాపవాదంవల్ల నేను ఆమెను విడిచిపెట్టవలసి వచ్చింది. కాబట్టి ఈ రోజు, ఈ నిండు సభలో సీత తన పవిత్రతను ప్రకటించాలి.**

సీతాదేవి చేయబోయే శపథాన్ని చూడడానికి బ్రహ్మాది దేవతలందరూ విచ్చేశారు. సీతాదేవి చేతులు జోడించింది. తలవంచుకొని – 'నా పతిదేవుడైన శ్రీరాముణ్ణి తప్ప నేను ఇతరుణ్ణి ఎరుగను. ఇది నిజమే అయితే నా తల్లి భూదేవి నన్ను తన ఒడిలోనికి చేర్చుకొను గాక!' అంది.

సీతాదేవి అలా శపథం చేస్తున్నప్పుడే భూమిలోనుంచి ఒక మహాసింహాసనం బయటకు వచ్చింది. దాన్ని అధిరోహించిన భూదేవి చేతులు చాచి, సీతాదేవిని అక్కునచేర్చుకొని రసాతలంలోనికి వెళ్ళిపోయింది.

సీతాదేవి కనిపించకపోయే సరికి సీతా! సీతా! అంటూ శ్రీరాముడు ఆక్రోశించాడు. బ్రహ్మదేవుడు శ్రీరాముణ్ణి ఓదార్చాడు.

## అవతార పరిసమాప్తి

సీతాదేవి అంతర్ధానం తరువాత శ్రీరాముడు మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు. ఏకపత్నీవ్రతునిగానే ఉంటూ అందరికీ ఆదర్శప్రాయుడయ్యాడు. సీతాదేవికి ప్రతినిధిగా బంగారు సీతను నిల్పుకొని, పదివేల అశ్వమేధ యాగాలనూ, లక్ష వాజపేయయాగాలనూ, ఇంకా సువర్ణ, అగ్నిష్టోమ, అతిరాత్ర, గోసవాది అనేక యాగాలనూ నిర్వహించాడు.

కొంతకాలానికి శ్రీరాముని ముగ్గురు తల్లులూ స్వర్గస్థులయ్యారు. ఆ తరువాత కేకయదేశపు రాజు యుధాజిత్తు (భరతుని మేనమామ) శ్రీరామునికి ఒక సందేశాన్ని పంపించాడు. సిరిసంపదలతో తులతూగే గంధర్వదేశాన్ని ఆక్రమించుకోమన్నదే ఆ సందేశం.

శ్రీరాముని ఆదేశం మేరకు భరతుడు గాంధర్వదేశంపై దండెత్తి, ఆక్రమించి, అక్కడే తక్షశిల, పుష్కలావతము అనే రెండు నగరాలను (కేవలం ఐదు సంవత్సరాల కాలంలో) నిర్మించాడు. తక్షుడు, పుష్కలుడు అనే తన ఇద్దరు కుమారులకు ఆ రెండునగరాలను అప్పగించాడు. అలాగే లక్ష్మణకుమారులైన అంగదుడు, చంద్ర కేతువులకు కూడా కారుపథదేశంలో రెండు పురాలను నిర్మించి, వాళ్ళిద్దరినీ పాలకులుగా నియమించాడు.

* * *

రోజులు గడుస్తున్నాయి. శ్రీరామచంద్రప్రభువు ధర్మమార్గంలో రాజ్యాన్ని పరిపాలిస్తున్నాడు. ఒకరోజు, బ్రహ్మదేవుని ఆదేశంతో కాలపురుషుడు మునిరూపంలో శ్రీరాముని వద్దకు వచ్చి– 'శ్రీరామా! నేను నీతో ఏకాంతంగా మాట్లాడాలి. ఒక సందేశం వినిపించాలి. మన మాట్లాడుతున్నప్పుడు ఎవరైనా విన్నా, చూసినా, వాళ్ళను నువ్వు వధించాలి. అలాగైతేనే ఆ సందేశం వినిపిస్తాను.' అన్నాడు.

శ్రీరాముడు అందుకు సమ్మతించాడు. అతడితో సమావేశమవుతూ లక్ష్మణ స్వామిని ద్వారం వద్ద కాపలా ఉంచి, ఎవ్వరినీ లోపలికి రానివ్వవద్దని ఆజ్ఞాపించాడు. ఆజ్ఞను ఉల్లంఘించినవారికి మరణశిక్షే అన్నాడు.

* * *

'ప్రభూ! మీ అవతారలక్ష్యం నెరవేరింది. ఇక తమరు వైకుంఠానికి విచ్చేయండి. ఇది బ్రహ్మదేవుడు పంపిన సందేశం.' అని కాలపురుషుడు శ్రీరామునికి నివేదిస్తున్నాడు. దానికి శ్రీరాముడు అంగీకరించాడు.

సరిగ్గా అదే సమయానికి దుర్వాసమహర్షి అక్కడికి వచ్చి – 'నాకు వెంటనే శ్రీరామ దర్శనం కావాలి.' అన్నాడు.

కాపలా ఉన్న లక్ష్మణుడు – శ్రీరాముడు ఏకాంత సమావేశంలో ఉన్నాడనీ, కొంతసమయం వేచి ఉండమనీ ప్రార్థించాడు దుర్వాసమహర్షిని. దాని కా మహర్షి కోపంతో ఊగిపోతూ – 'వెంటనే వెళ్ళి, నా రాక గురించి శ్రీరామునికి చెప్పక పోయావో.. మీ వంశం మొత్తాన్నీ శపిస్తాను.' అన్నాడు.

వంశక్షేమంకోసం తన ఒక్కని ప్రాణం పోయినా మంచిదేనని భావించిన లక్ష్మణుడు గత్యంతరం లేక నియమాన్ని ఉల్లంఘిస్తూ – దుర్వాసుడు వచ్చాడన్న వార్తను శ్రీరామునికి విన్నవించాడు.

ఇప్పుడు ఆజ్ఞను ఉల్లంఘించిన లక్ష్మణునికి మరణశిక్ష విధించాలి. అందుకే శ్రీరాముడు వసిష్ఠుడితో చర్చించాడు. సజ్జనుల దృష్టిలో త్యాగం, వధా రెండూ సమానమే అనే మహర్షి సూచనమేరకు లక్ష్మణుణ్ణి పరిత్యజించాడు.

* * *

లక్ష్మణుడు వెంటనే సరయూనదీ తీరంలో యోగంతో తన దేహాన్ని పరిత్యజించాడు.

శ్రీరామచంద్రుడు–లక్ష్మణుణ్ణి పరిత్యజించినందుకు ఎంతగానో దుఃఖించాడు.

భరతుని అభ్యర్థనమేరకు కుశుణ్ణి దక్షిణ కోసల రాజ్యానికి, లవుణ్ణి ఉత్తర కోసల రాజ్యానికీ పట్టాభిషిక్తుల్ని చేశాడు. సోదరులతో, సుగ్రీవాది వానరులతో, పౌరులతో రాముడు సహా పరమపదానికి వెళ్ళాలని నిశ్చయించుకొన్నాడు. విభీషణుణ్ణీ, హనుమంతుణ్ణీ, జాంబవంతుణ్ణీ భూలోకంలోనే ఉండమని ఆదేశించాడు. ఆ తరువాత అవతారాన్ని చాలించి, వైకుంఠానికి మహాప్రస్థానం గావించాడు. అందరూ ఆ స్వామిని అనుసరించారు. అయోధ్యా పౌరులందరికీ 'సంతానకాలు' అనే దివ్యలోకాలు లభించాయి.

## శ్రీరామాయణ ప్రశస్తి

శ్రీరామాయణం ఏడు కాండలూ ఇరవైనాలుగువేల శ్లోకాల కావ్యం. పురాతనమైన ఇతిహాసం. వాల్మీకి మహర్షి కలం నుండి జాలువారిన పుణ్యచరితం. ఆదికావ్యం. అందరిచేతా పూజలందుకొనే పరమపవిత్రమైన గ్రంథరాజం.

శ్రీరామాయణం సాక్షాత్తూ వేదమే. పితృకార్యాలలో రామాయణాన్ని చదివితే పితృదేవతలు సంప్రీతులౌతారు. మరణించిన తరువాత ఉత్తమలోకాలను ప్రసాదిస్తుంది శ్రీరామాయణం.

**శ్రీరామాయణ పఠనం వల్ల, రామాయణంలో చెప్పిన ధర్మాలు ఆకళింపు చేసుకొని ఆచరించటం వల్లా పాపాలు తొలగిపోతాయి. సంతానం లేనివారికి సంతానం కలుగుతుంది. పేదరికం తొలగిపోతుంది. కష్టాలు దరిచేరవు. పుణ్యం చేకూరుతుంది.**

శ్రీరామాయణాన్ని చదివినా విన్నా దీర్ఘాయువూ సంపదా కలుగుతాయి. అలా చదివి, చెప్పినవారికి నూత్నవస్త్రాలు, ధనం, గోవును ఇచ్చి సత్కరించాలి.

శ్రీరామాయణాన్ని చదివినా చదివింపజేసినా, విన్నా వినిపింపజేసినా గొప్ప గొప్ప యజ్ఞాలను చేస్తే వచ్చే పుణ్యమూ, పుణ్యతీర్థాలను దర్శిస్తే వచ్చే ఫలమూ లభిస్తాయి. పుణ్యలోకాలు ప్రాప్తిస్తాయి.

శ్రీరామాయణం గాయత్రీమంత్ర పారాయణ ఫలితాన్ని ఇస్తుంది. ఈ లోకం లోనూ పైలోకాల్లోనూ అన్ని సుఖాలూ శ్రేయస్సులూ రామాయణ పఠన పాఠనాలవల్ల లభిస్తాయి. అందుకే అందరూ రామాయణాన్ని తప్పనిసరిగా చదవాలి.

**ఇహంలో సుఖం, పరంలో శ్రేయస్సు కోరుకొనేవాళ్ళు శ్రీరామాయణాన్ని శ్రద్ధాసక్తులతో చదవాలి. భక్తివిశ్వాసాలతో పఠించాలి. అలా చేస్తే సకల శుభాలూ కలుగుతాయి.**

**మంగళం కోసలేంద్రాయ మహనీయగుణాత్మనే,**
**చక్రవర్తితనూజాయ సార్వభౌమాయ మంగళమ్.**

సంకలనం, భావం :
డా॥ తటవర్తి రాజగోపాలం, M.A. Ph.D.,
విశ్రాంత-తెలుగు రీడర్, డి.ఎన్.ఆర్. కళాశాల, భీమవరం - 534 202

## అనుబంధం-1

# శ్రీరామాయణ నీతిచంద్రిక

## శ్రీరామస్తుతి

*1. కం॥ శ్రీమన్నామ! పయోద*
*శ్యామ! ధరాభృల్లలామ! జగదభిరామా!*
*రామాజనకామ! మహో*
*ద్దామ! గుణస్తోమధామ! దశరథరామా!*

*-ఆంధ్రమహాభాగవతము. 8. 1*

**తాత్పర్యం:** దశరథ మహారాజు యొక్క పుత్రుడవైన శ్రీరామచంద్ర ప్రభూ! శ్రీమంతమైన పేరుగలవాడా! నీటిని వర్షించే మేఘంలాంటి నల్లని రంగుగల శ్రీరామా! ఈ భూమిని పాలిస్తున్న మహారాజులందరిలో గొప్పవాడా! సమస్త జగాలలోనూ సుందరస్వరూపం కలవాడా! స్త్రీలకు మన్మథునివంటివాడా! ఎంతో గంభీరమైనవాడా! మంచి గుణాలన్నింటికీ నెలవైనవాడా! (నా భాగవతాన్ని విను, స్వామీ!)

## శ్రీరామస్తుతి

*2. కం॥ శ్రీకంఠచాపఖండన!*
*పాకారిప్రముఖ వినుతభండన! విలసత్*
*కాకుత్స్థవంశమండన!*
*రాకేందుయశోవిశాల! రామనృపాలా!*

*-ఆంధ్రమహాభాగవతము. 10. 1*

**తాత్పర్యం:** శివధనుస్సును విరిచిన శ్రీరామా! ఇంద్రాదులు కొనియాడే పరాక్రమవంతుడవైన శ్రీరామా! ప్రకాశించెడి కాకుత్థ్సవంశానికి అలంకారం వంటి శ్రీరామా! పూర్ణచంద్రుడిలాంటి తెల్లని యశస్సుగల శ్రీరామా! శ్రీరామచంద్రమహారాజా! (నా భాగవతాన్ని విను.)

## క్షమ గొప్పదనము

*3. గీ॥ క్షమయె దానంబు, జన్నంబు క్షమయె చూడు,*
*క్షమయె సత్యంబు, సత్కీర్తి క్షమయె కాదె,*
*క్షమయె సద్ధర్మ, మటుగానఁ గన్యలార!*
*క్షమను నెలకొని యుండెడి జగము లెల్ల.*

*–శ్రీమ॥వా॥రా॥బాల. –754*

*(శ్రీ వావిలికొలను వారిది)*

**తాత్పర్యం:** కుశనాభుడి పుత్రికల కథలోనిదీ పద్యం. కుశనాభుడు తన కుమార్తెలతో చెప్పిన మాటలు.

కన్యలారా! ఓర్పు గలిగి ఉండడ (క్షమ) మే దానమంటే. ఓర్పే యజ్ఞం. ఓర్పే సత్యం. ఓర్పే మంచికీర్తి . మంచి ధర్మమూ ఓర్పే. అందువల్ల ఈ జగత్తంతా ఓర్పు మీదనే (క్షమ మీదనే) ఆధారపడి ఉంది.

## ధర్మార్థకామాల్లో ధర్మానిదే అగ్రస్థానం

*4. చ॥ కలుగవొ ధర్మ మర్థమును గామము దేనను దాని నెవ్వఁడేన్*
*జలుపఁగ బూనరా దెటఁ బ్రశస్తపు ధర్మము గల్గు దానినే*
*చలుపగనౌ, ననేకులకు శాత్రవుడౌను ధనైకకామి, కే*
*వలమును గామసక్తుఁడు ధ్రువంబుగ నింద్యుఁడు సుమ్ము, తమ్ముడా!*

*–శ్రీమ॥వా॥రా॥ అయో1–628*

(శ్రీరామచంద్రుడు ధర్మంయొక్క గొప్పతనాన్ని లక్ష్మణుడికి చెబుతున్న మాటలు)

**తాత్పర్యం:** తమ్ముడా! ధర్మమూ, అర్థమూ, కామమూ–ఈ మూడూ సిద్ధించే పనినే చెయ్యాలి. ఇవి సిద్ధించని పనిని ఏమాత్రమూ చేయకూడదు. అయితే ప్రశస్తమైన ధర్మం కలిగి ఉన్న పనినే చెయ్యాలి. కేవలం డబ్బు బాగా లభిస్తుందని వట్టి ధనకాంక్షతోనే పని చేసేవాణ్ణి లోకం ద్వేషించి అందరూ వాణ్ణి పగవాణ్ణి చూసినట్లు చూస్తారు. అలాగే కేవలం కామం కోసం వ్యవహరించేవాడు లోకం యొక్క నిందలకు గురి అవుతాడు.

## తల్లిదండ్రుల సేవ గొప్పతనం

*5. గీ॥ వెలది! మాతాపితృపరాయణులకు స్వర్గ*
*లోక గోలోకములు బ్రహ్మలోకమైన*
*కృచ్ఛ్రములు గావు సూవె తర్పితుల వెంట*
*దల్లిదండ్రులవెంట సాధ్యము త్రిలోకి.*

*–శ్రీమద్రామాయణ కల్పవృక్షము అయో. పుట. 80*

(విశ్వనాథ సత్యనారాయణ గారి రామాయణకల్పవృక్షం లోనిదీ పద్యం. అయోధ్యాకాండలో సీతమ్మతో శ్రీరామచంద్రుడు చెప్పిన మాట లివి.)

**తాత్పర్యం:** సీతాదేవీ! తల్లిదండ్రుల్ని సేవించే బిడ్డలకు స్వర్గలోకం, గోలోకం, బ్రహ్మలోకం కూడా పొందడంలో కష్టము ఉండదు సుమా! తర్పితులైన (సంతోషపెట్టబడిన) తల్లిదండ్రుల వెంట పోవువారికి పై మూడు లోకములును (సులభముగా) సాధ్యములు.

## పితృవాక్యపాలన గొప్పతనం

*6. గీ॥ తండ్రిమాట యారాధించు తనయునకును*
*నల త్రిలోకీగతంబు భయంబు లేదు*
*దాన మాన యజ్ఞమ్ములు రక్షణలును*
*బితృసమారాధనకు బోల్కి బెట్టలేవు.*

*–కల్ప॥అయో. పుట. 80*

**తాత్పర్యం:** నాన్న చెప్పిన మాట వినే కొడుక్కి ముల్లోకాలూ దక్కవన్న భయమే ఉండదు. దానంవల్ల లభించే మాన్యతగాని, యజ్ఞాలుగాని, గోరక్షణ–శిశురక్షణ–ప్రజారక్షణాదులుగాని తండ్రిని ఆరాధించడంతో సమానం కావు.

## మేలు – కీడు

*7. తే.గీ॥ మేలు రెండులోకంబుల మేలతెచ్చుఁ;*
*గీడు సేసినఁ దప్పదు కీడయగుట;*
*దీని నాబాలగోపాలమైన జనము*
*సకలమును మది నెఱుఁగు, నీ వొకఁడు దక్క.*

*నిర్వచనోత్తర రామాయణము 4–67–తిక్కన*

(తన్నెదిరించి జయించిన రావణునితో కుబేరు డన్నమాట ఇది)

**తాత్పర్యం:** మేలైనా, కీడైనా మనం అవతలివాళ్లకి ఏది చేస్తే అదే మనకు ఈ లోకంలోను, పైలోకంలో కూడా సిద్ధిస్తుంది. ఈ ధర్మం నీకొక్కడికి తప్పించి బాలురనుంచి వృద్ధులదాకా తెలుసు.

మేలు చేసిన వారికి మేలు, కీడు చేసిన వారికి కీడును కలుగుతుందని దీనివల్ల తెలుస్తోంది. మనకు మేలు జరగాలంటే మనం పరులకు మేలుచేసి తీరాలి.

## రాజు త్రివర్గాన్ని ఎలా సేవించాలి ?

*8. కం॥ అర్థముచే ధర్మంబును,*
*నర్థము ధర్మంబుచేత, నవి కామముచే*
*వ్యర్థంబులు గాకుండ స*
*మర్థింతువె? సుఖము మరగి యవి చెఱపవుగా?*

*–శ్రీమ॥వా॥రా॥అయో. 2. 2289*

**తాత్పర్యం:** డబ్బు సంపాదనలో బడి ధర్మాన్ని విడిచి పెట్టలేదు కదా! అలాగే కేవలం ధర్మం మీద ఆసక్తితో ధనం సంపాదించడం మానడం లేదు కదా! (మొదటి దానివల్ల లోకనింద, రెండో దానివల్ల కుటుంబాన్ని దరిద్రత పాలు చేసిన పాపమూ వస్తాయి.) సుఖం మరిగితే ధర్మమూ ఉండదు, అర్థమూ ఉండదు. అలా కాముకత్వం మరిగి ధర్మార్థాలు రెండింటినీ నాశనం చేసుకోవడం లేదు కదా!

## సత్యం విశిష్టత

*9. కం॥ సత్యమున నుండు లక్ష్మియు,*
*సత్యంబన నీశ్వరుండు జగములకెల్లన్;*
*సత్యము మూలంబంతకు,*
*సత్యంబున కంటె లేదు శాశ్వత పదమున్.*

*–శ్రీమ॥వా॥రా॥అయో. 2. 2451*

**తాత్పర్యం:** లక్ష్మి ఉండేది సత్యంలోనే. లోకాలన్నింటినీ నియమించేది సత్యమే. సత్యమంటే ఈశ్వరుడే. ఈ సకలానికీ మూలమై ఉండేదీ సత్యమే. సత్యం కంటే శాశ్వతమైనది ఏదీ లేదు. (సత్యమే మోక్షాన్నిస్తుంది).

## పుణ్యకర్మఫలం ఉన్నతస్థానం

*10. ఆ॥వె॥కర్మభూమి దీనఁ గావింపవలయును*
*బుణ్యకర్మములను బురుషు లెపుడు;*
*వాయు వగ్ని శశియు స్వకృతకర్మంబుల*
*ఫలముచేత వారి పదము గనిరి.*

*–శ్రీమ॥వా॥రా॥ అయో. 2. 2461*

(జాబాలితో శ్రీరాముడు)

**తాత్పర్యం:** ఇది కర్మభూమి. అందువల్ల ఇక్కడివారు ఎప్పుడూ పుణ్య కర్మలు చేసి తీరాలి. అలా చెయ్యడంవల్లనే వాయువు, అగ్ని, చంద్రుడు–పుణ్యఫలాలను పొంది ఆయా (ఉన్నత) స్థానాలను పొందారు.

## ధర్మమహిమ

*11. కం॥ ధర్మంబున నర్థంబగు,*
*ధర్మంబున సుఖము గలుగు, ధర్మముచే స*
*త్కర్మంబులు ఫలియించెడి*
*శర్మకరా! జగము ధర్మసారంబె కదా!*

*–శ్రీమ॥వా॥రా॥ అరణ్య. 123*

**తాత్పర్యం:** శుభకరా! ధర్మంవల్ల ధనం సిద్ధిస్తుంది, ధర్మంవల్ల సుఖం లభిస్తుంది. ధర్మం వల్లనే మనం చేసే మంచి పనులూ ఫలిస్తాయి. ఈ జగత్తుకు సారం ధర్మమే. (ధర్మం చెడిపోతే ప్రపంచమూ చెడిపోతుంది.)

## మాటే మంత్రం

*12. చ॥ కొతుకులు లేక, విస్తరము గూడక, శంకకు సందునీక, య*
*ద్రుత మవిళంబితంబు నయి, తొస్సులు పోవ కురోగళైకసు*
*స్థితమయి మధ్యమస్వరముచే నలరారెడి వీని వాక్కు సం*
*స్కృతమును సక్రమంబు శుభమెంతయు హృద్యమునై రహించెడిన్.*

*–శ్రీమ॥వా॥రా॥కిష్కింధ. 126*

(శ్రీరాముడు లక్ష్మణుడితో హనుమంతుని మాటలపొందికను గూర్చి)

ఇతని మాటలు–

**తాత్పర్యం:**

1. కొన్ని అక్షరాలు మ్రింగేసి, కొన్నింటినే పలికి, పదం స్పష్టంగా చెప్పకుండా ఉండడం–కొతుకు. అలాంటి కొతుకులు ఏమీలేకుండా ఉన్నాయి.
2. చెప్పవలసిన విషయాన్ని అనవసరంగా సాగదీయకుండా ఉన్నాయి.
3. అర్థం అదా? ఇదా? అనే సందేహాలు లేకుండా ఉన్నాయి.
4. గబగబ పరుగు లెత్తకుండా ఉన్నాయి.
5. మాటకు మాటకు చాల విరామం ఇచ్చి నీళ్ళునమలినట్లు లేవు.
6. తొస్సులు–ఉచ్చారణలో లోపాలు లేకుండా ఉన్నాయి.
7. మనస్సునుండి కంఠమునుండి ఒకే విధమయిన భావమును వ్యక్తం చేయునదిగా నున్నది.
8. మరీ గట్టిగాను కాకుండా, మరీ మెల్లగాను కాకుండా ఉన్నాయి.
9. వ్యాకరణబద్ధంగా సంస్కరింపబడి ఉన్నాయి.
10. ఏ మాటను ముందు చెప్పాలో, ఏది తరువాత చెప్పాలో–ఇలా క్రమబద్ధంగా ఉన్నాయి.
11. మంగళకరంగా ఉన్నాయి.
12. వినే కొద్దీ ఇంకా వినాలనేటట్లు హృదయాన్ని ఆకర్షిస్తూ ఉన్నాయి.

## మిత్రుని పని అవశ్యకర్తవ్యం

*13. కం॥ ధనములు పోయిన గానీ*
*ఘనసుఖములు నాశమైన గానీ తనకున్*
*దనువే పోయిన గానీ*
*తన మిత్రుని కార్యమునను దగు వర్తింపన్.*

*–శ్రీమ॥వా॥రా॥కిష్కింధ. 210*

(సుగ్రీవుడు శ్రీరామునితో)

**తాత్పర్యం:** ధనం పోయినా, గొప్పగొప్ప సుఖాలుపోయినా, తన శరీరమే పోయినా (మరణించినా), తన స్నేహితుడి పనిని చేసి తీరాలి.

## రాజదండనం పాపహరం

14. *కం॥ జనములు పాపముఁ జేసియు*
*జననాథులచేతఁ దాము శాసితు లగుచున్*
*ఘన సుకృతాత్ములరీతిని*
*జనుచుందురు నాకవిభుని సదనంబునకున్.*

*–శ్రీమ॥వా॥రా॥ కిష్కింధ. 479*

(శ్రీరాముడు వాలితో)

**తాత్పర్యం:** పాపము చేసిన జనులు కూడ రాజదండనను పొంది (చేసిన పాపమును తొలగించుకొని), గొప్పగా పుణ్యము చేసికొన్నవారివలె స్వర్గమునకు పోవుచుందురు.

## మధ్యేమార్గం

15. *అతిస్నేహమున, నస్నేహమున*
*రెంటఁ గీడె; యా రెంటలఁ బడక, స*
*మంగీకృత మధ్యమమార్గుఁడవై*
*మెలఁగిన సేమము మేకొనెడున్.*

*–జనప్రియరామా॥ కిష్కింధ. 2వభాగం*

(వాలి అంగదుడితో)

**తాత్పర్యం:** ఎవరితోను మరీ ఎక్కువగా స్నేహం చేయకు. బొత్తిగా స్నేహం చేయకుండానూ ఉండకు. నచ్చుబాటుగా మధ్యమార్గంలో నడుచుకొంటే నీకు క్షేమంగా ఉంటుంది.

## మాటకు కట్టుబడితే మాన్యుడౌతాడు

16. *పాపమొ పుణ్యమొ పలికిన మాటకుఁ*
*గట్టువడుచు, నాల్కలు రెండుగ నా*
*డని వీరుండగు మనుజుఁడు పురుషో*
*త్తముడని జగములు కీర్తించున్.*

*–జనప్రియ రామా॥కిష్కింధ. 3వభాగం*

(సుగ్రీవుణ్ణి గురించి శ్రీరాముడు లక్ష్మణుడితో)

**తాత్పర్యం:** పాపంకానీ, పుణ్యంకానీ చెప్పిన మాటకు కట్టుబడి తీరాలి. రెండు నాల్కల ధోరణి పనికిరాదు. అలా తానాడిన మాటకు బద్ధుడైన వీర పురుషుణ్ణి ప్రజలు పురుషోత్తముడని కీర్తిస్తారు.

## కృతఘ్నుని గతి

*17. కం॥ తన పనులు చక్కఁ బఱిచిన*
*తన మిత్రుల మఱచు నా కృతఘ్నుఁడు చావన్*
*విను మాతని పీనుంగును*
*గన నైనను గనవు శునక కంక శివాదుల్.*

*–శ్రీమ॥వా॥రా॥కిష్కింధ. 842*

**తాత్పర్యం:** తన పనుల్ని చక్కగా చేయించుకొని, అలా తనకు ఉపకారం చేసిన మిత్రుల్ని మరచిపోయే కృతఘ్నుడు చచ్చినా వాడి పీనుగుని కుక్కలు, గ్రద్దలు, నక్కలు మొదలైనవి కూడా కనీసం కళ్ళతోనైనా చూడవు.

## కోపంవల్ల అనర్థాలు

*18. కం॥ కోపులు గురువధ కోడరు;*
*కోపులు పరనింద సేయఁ గొంకరు; కోపం*
*బాపదల కెల్ల మూలము;*
*కోపము పాపంబు పొత్తు; కోపానలమున్.*

*– భాస్కరరామాయణము (భాస్కరుడు) సుందర. 416*

**తాత్పర్యం:** కోపంతో ఉన్నవాడు గురువుల్ని చంపడానికి కూడా వెనుకాడడు, మరొకరిని నిందించడానికీ భయపడడు; ఆపదలు వచ్చిపడడానికంతటికీ కోపమే మూలకారణం. కోపం ఉందీ అంటే పాపం ఉన్నదనే అర్థం. కోపమే అగ్ని.

## శరణాగతరక్షణకు సాటిలేదు

*19. ఆ॥వె॥అభయదానమునకు నశ్వమేధాదులు*
*వేయు నీడు కావు; విశదకీర్తు*
*లఖిల దిశల నెసగు నార్తు రక్షించిన;*
*నట్లగాన, సందియంబు వలదు. –భాస్కరరామా॥యుద్ధ. 104*

(శ్రీరాముడు లక్ష్మణుడితో విభీషణశరణాగతిలో)

**తాత్పర్యం:** వెయ్యి అశ్వమేధాదియాగాలు చేసినా అభయమివ్వడంతో సమానం కాదు. ఆర్తుణ్ణి కాపాడడం వల్ల దశదిశలా నిర్మల మైన కీర్తి వ్యాపిస్తుంది. ఇందులో సందేహం లేదు.

## పాపఫలం తగిన సమయంలో తగిలి తీరుతుంది

*20. కం॥ పాపం బొనర్చు నాతఁడు*
*పాపముల ఫలంబు కాలపక్వం బగుడున్*
*జేపడఁగ ననుభవించును*
*ద్రో పాడినఁ బోదు నిజము దోషాటవరా!*

*–శ్రీమ॥వా॥రా॥యుద్ధ. 2539*

(రావణమరణం తరువాత మండోదరి విలాపం)

**తాత్పర్యం:** రాక్షసరాజా! విత్తనం నాటిన వెంటనే ఫలం నోటికిరాదు– కాలం పండితేకాని. అలానే పాపం చేసిన వాడికి పాపఫలం వెంటనే – నిప్పును తాకిన వెంటనే కాలినట్లు – అనుభవంలోకి రాదు. కాలం పూర్తయి, పాపఫలం అనుభవించే రోజు వచ్చినప్పుడు ఏమిచేసినా ఆ ఫలం అనుభవించక తప్పదు.

## ఆశ్రమవాసులకు ధన సంచయం కూడదు

*21. కం॥ ధనకాంక్ష కొంచెమైనను*
*గొనకుడు, లోభంబు దగదు గుణయుతులారా!*
*ధనమేల యాశ్రమస్థుల*
*కును ఫలమూలోపజీవి కూటంబులకున్?*

*–శ్రీమ॥వా॥రా॥ ఉ.కాం॥ 1461*

(వాల్మీకిమహర్షి కుశలవులతో)

**తాత్పర్యం:** గుణవంతులారా! ధనం మీద ఏమాత్రమూ కోరిక పెట్టుకోవద్దు. ఆశ పనికిరాదు. పళ్ళు, దుంపలు, వేళ్ళు తిని బ్రతుకుతూ ఆశ్రమాలలో ఉండే వాళ్ళకు ధనం ఎందుకు?

## స్నేహితుడు పరమగతి

*22. కం. అతిధనికుడొ, నిఱుపేదయొ,*
*తతదుఃఖితుడో, సుఖైకతత్పరుడో, నిం*
*దిత దోషుడొ, నిర్దోషియొ,*
*హితుఁడొక్కడె పరమగతి యహీనగుణాఢ్యా! – కిష్కింధా. 209*

(సుగ్రీవుడు శ్రీరామునితో తనకు కలిగిన మైత్రిని కొనియాడుతూ అన్న మాటలు)

**తాత్పర్యం:** సుగ్రీవుడు శ్రీరామునితో అన్న మాటలు – ఎన్నో గొప్ప గుణాలున్న శ్రీరామచంద్రా! తన మేలుకోరే స్నేహితుడు బాగా సంపన్నుడు కానీ, నిరుపేద కానీ, దుఃఖించేవాడు కానీ, సుఖంగా ఉన్నవాడు కానీ, దోషి కానీ, నిర్దోషి కానీ–ఎవడైనాసరే వాడే గతి.

## మహాత్ముల్ని నిందించటమే కాదు ఆ నింద వినటమూ దోషమే

*23. కం. చలమునఁ బెద్దల దూఱెడు*
*తులువ దొకఁడు గాదు తప్పు; తోనద్దెస వీ*
*నులనిడ నూల్కొను చెనటిది*
*బలుతప్పని చక్కఁ దెలియఁ బలుకుదు రార్యుల్.*
*శ్రీరామ కథామృతము. బాల. 4. 100*

(వేదవతి రావణాసురుడితో అన్న మాటలు.)

**తాత్పర్యం:** అసూయవల్ల కావాలని పెద్దల్ని నిందించేటపుడు నిందించిన వాడిదే దోషం కాదు; పెద్దల దోషాల్ని కొంతమంది దుష్టులు పనిగట్టుకొని వింటారు. ఇలాంటి నీచులైన శ్రోతలకు ఆపాపం మరీ ఎక్కువ సంక్రమిస్తుందని జ్ఞానులు చెప్పారు.

## శోకాన్ని మించిన శత్రువు లేదు.

*24. కం॥. శోకము ధైర్యముఁ బాపును;*
*శోకము ధర్మాపహంబు; శోకమడంచుం*
*గాకెంత యోర్మికల్మిని*
*శోకంబును మించు శత్రుఁ జూడమటంచున్.*
*శ్రీహనుమద్రామాయణము – అయోధ్యా 231*

(కౌసల్యాదేవి దశరథుడితో అన్న మాటలు.)

**తాత్పర్యం:** శోకంవల్ల ధైర్యం నశిస్తుంది. శోకం ధర్మాన్నీ దెబ్బగొడుతుంది. శోకం వల్ల ఎంత ఓర్పైనా చెడిపోతుంది. శోకాన్ని మించిన శత్రువును ఎక్కడా చూడము.

## నిరుత్సాహి పనులు పాడవుతాయి

*25. కం॥ దీనుండై యుత్సాహ వి*
*హీనుండై శోకమునను గృశియించెడి య*
*మ్మానవు కార్యములుం జెడు*
*మానని వ్యసనముల నతఁడు మఱగుచు నుండున్.*

*–శ్రీమ॥వా॥రా॥యుద్ధ. 12*

(సుగ్రీవుడు శ్రీరామునితో)

**తాత్పర్యం:** శోకించడానికి ఏదైన కారణం ఉంటే ఉండుగాక. అంత మాత్రంచేత దీనంగా, ఉత్సాహం విడిచిపెట్టి ఏడుస్తూ కూర్చుంటే వాడి పనులూ చెడిపోతాయి. వాడు ఎప్పుడూ కష్టాలపాలై బాధపడుతూ ఉంటాడు.

## శ్రీరామనామ వైభవం

*26. కం॥ మంతనములు సద్గతులకు,*
*పొంతనములు ఘనములైన పుణ్యముల కిదా*
*నీంతనపూర్వమహోఘ ని*
*కృంతనములు రామనామకృతిచింతనముల్*

*–భాగవతము 9 స్కం. 362*

**తాత్పర్యం:** శ్రీరామాయణ కావ్యచింతనలు (అంటే రాయడం, చదవడం, పారాయణ చేయడం, ఆచరించడం మొదలైనవి)– ఉత్తమగతుల్ని అందించే మంతనాలు–రహస్యపుటాలోచనలు. గొప్ప పుణ్యాలకు పొంతనలు– సాటియైనవి. అలాగే ఇప్పుడూ, పూర్వమూ చేసిన అన్ని జన్మలలోని పాపాలన్నింటినీ నాశనం చేసేవి.

కాబట్టి శ్రీరామాయణకావ్య చింతనమే ఉత్తమమైన మార్గం.